ఈనాడు




విజయవాడ 14-11-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 94

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




Mankind
Serving Life
GAS-O-FAST®
SACHETS
భారతదేశం
యొక్క ఎసిడిటీకి
అసలైన భారతీయ
పరిష్కారం
Mankind
Ayurvedic
GAS-O-FAST®
Active
Jeera
QUICK RELIEF FROM
ACIDITY & GAS
అసలైన జీలకర్రతో
Visit us at www.gasofast.com | Toll free No.: 18001034400 | Follow us on: YouTube

ఈనాడు

విజయవాడ 14-11-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 94
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్ మేమే అందిస్తాం





ఇండియా-యూరప్ బిజినెస్ పార్ట్‌నర్‌షిప్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, ఎస్‌డీజీ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, లీడర్‌షిప్ ప్రొఫెసర్ డాక్టర్ బెర్‌ట్రామ్ లోముల్లర్, సీఐఐ ఎండీ, సీఈఓ ముకుందన్, రిపబ్లిక్ ఆఫ్ ఆర్మేనియా ఆర్థిక మంత్రి గెవార్గ్ పపాయన్, ఎఫ్‌వైఆర్‌ఎస్‌టీ జెన్ హోల్డింగ్స్ లిమిటెడ్ చీఫ్ ఇంపాక్ట్ ఆఫీసర్ క్లిమెన్స్ కొపైకిన్, భారత్ ఫోర్జ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ కళ్యాణి

- రెండేళ్లలోనే ఆ స్థాయికి చేరాలన్నది లక్ష్యం
- ఏపీలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు..
- శరవేగంగా అనుమతులు
- 'ఇండియా-యూరప్' రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, విశాఖపట్నం

'ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్ మేమే అందిస్తాం.. రెండేళ్లలో వాటిని తయారు చేసే స్థాయికి చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'ఇండియా-యూరప్ వ్యాపార భాగస్వామ్యం'పై విశాఖలో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం మాట్లాడారు. 'యూరప్ పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఏపీలో అంతులేని అవకాశాలు ఉన్నాయి. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు మైక్రోసాఫ్ట్, గూగుల్‌కు భారత్‌కు చెందినవారే నేతృత్వం వహిస్తున్నారు. మేం ఏఐ సాంకేతికత అందిపుచ్చుకుంటున్నాం. దానికి అనుబంధంగా డేటా సెంటర్, స్పేస్, డ్రోన్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, సెమీకండక్టర్ లాంటి రంగాల్లో ఇక్కడ పెట్టుబడులకు అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. త్వరలో అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్ రాబోతోంది. ఆర్మేనియా ఆర్థిక వ్యవహారాల మంత్రి గెవార్గ్ పపాయన్‌తో మాట్లాడాను. మా ఇద్దరి ఆలోచనలూ ఒకేలా ఉన్నాయి. యూరప్ సాంకేతికంగా అత్యుత్తమ విధానాలు అమలు చేస్తోంది. ఏపీతో కలిసి పనిచేయడానికి (మిగతా 3లో)

నేడు విశాఖలో భాగస్వామ్య సదస్సు ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి లోపలి పేజీలో

నాడు వెళ్లిపోయిన వారు... నేడు తిరిగి వస్తున్నారు


రూ.82 వేల కోట్లతో రెన్యూ పవర్ ప్రాజెక్టులు

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమక్షంలో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలు

ఆరేళ్ల తర్వాత మళ్లీ ఏపీలో అడుగుపెడుతున్నాం

రెన్యూ పవర్ ఛైర్మన్ సుమంత్ సిన్హా

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు... ఇప్పుడు భారీ పెట్టుబడులతో తిరిగి వస్తున్నాయి. విశాఖలో శుక్ర, శనివారాల్లో జరగనున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూలు కుదుర్చుకుంటున్నాయి. పునరుత్పాదక విద్యుత్తు రంగంలో దేశంలోనే ప్రముఖ సంస్థ 'రెన్యూ పవర్'.. రాష్ట్రంలో రూ.82 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు (మిగతా 3లో)



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయు కుదుర్చుకున్న రెన్యూ పవర్ సంస్థ ఫౌండర్, ఛైర్మన్ సుమంత్ సిన్హా, ప్రభుత్వాధికారులు



దిల్లీ ఎర్రకోట సమీపంలో పేలుడు చోటుచేసుకున్న ప్రాంతంలో ఆధారాల కోసం అన్వేషిస్తున్న పోలీసులు

4 నగరాల్లో బాంబులు పెట్టేందుకు 32 పాత వాహనాలు

కొనుగోలు చేసిన ఉగ్ర ముఠా

బాంబుల తయారీకి రూ.26 లక్షల నగదు సేకరణ

పేలిన కారు నడిపింది ఉమరే.. డీఎన్‌ఏ పరీక్షల్లో నిర్ధారణ

ఒక ప్రొఫెసరు, మరో కార్డియాలజీ విద్యార్థి అరెస్టు

అనుమానిత మూడో కారు ఫరీదాబాద్ వర్సిటీలో లభ్యం

దిల్లీ పేలుడు క్షతగాత్రుల్లో మరొకరి మృతి

దిల్లీ, ఇంటర్నెట్ డెస్క్: దిల్లీలో పేలుడుకు కారణమైన ముష్కరులు.. దేశంలోని నాలుగు నగరాల్లో భారీ విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నాలుగు ప్రధాన నగరాల్లో బాంబు పేలుళ్ల కోసం వైద్యులైన ఉమర్, ముజమ్మిల్, ఆదిల్, షాహీన్ ప్రణాళిక వేశారని దర్యాప్తు అధికారులు గుర్తించారు. వారంతా కలిసి రూ.26 లక్షల నగదు సమకూర్చుకొని, బాంబులు అమర్చేందుకు 32 పాత వాహనాలను కొన్నట్లు వెల్లడైంది. నాలుగు నగరాల్లో ఐఈడీలతో దాడులు చేసేందుకు 8 మంది ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. నిందితులకు గతంలో ఏమైనా ఉగ్ర దాడులతో సంబంధాలు ఉన్నాయా అనేది తెలుసుకునే (మిగతా 14లో)

కుట్ర సందేశాల చేరవేతకు త్రీమా!

స్విస్ యాప్‌ను వాడిన నిందితులు • అందులో అంతా నిగూఢమే

కెమెరాలకు దొరక్కుండా ఉమర్ జాగ్రత్తలు

గజిబిజి రోడ్లపై ప్రయాణం లోపలి పేజీలో

నేడే బిహార్ కౌంటింగ్

లోపలి పేజీల్లో జూబ్లీహిల్స్‌సహా ఉప ఎన్నికల ఫలితాలూ..

పార్టీల్లో తీవ్ర ఉత్కంఠ

అమెరికన్లకు శిక్షణ కోసమే హెచ్1బీ వీసాలు

నైపుణ్యాలు నేర్పించాక వీసాదారులు స్వదేశాలకు వెళ్లాలన్నదే ట్రంప్ ప్రణాళిక

యూఎస్ ఆర్థిక మంత్రి బెసెంట్ వ్యాఖ్య

బెంగాల్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేపై హైకోర్టు అనర్హత వేటు

భాజపా టికెట్‌పై గెలిచి తృణమూల్‌లో చేరిన ముకుల్‌రాయ్ సభ్యత్వం రద్దు

వివేకా హత్య విషయంలో జగన్‌కు సమాచారంపై దర్యాప్తు జరగలేదు

లోతైన దర్యాప్తు జరిపితేనే అసలు విషయాలు వెల్లడి

సీబీఐ కోర్టులో సునీతారెడ్డి వాదనలు

చాంపియన్స్

జ్యోతి పసిడి 'డబుల్'

వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో అగ్రస్థానం


జ్యోతి సురేఖ

ఢాకా: జ్యోతి సురేఖ అదరగొట్టింది. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ ఆర్చరీలో స్థిరంగా రాణిస్తున్న ఈ తెలుగమ్మాయి.. మరోసారి మెరిసింది. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పసిడి 'డబుల్' సాధించింది. గురువారం మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ఫైనల్లో జ్యోతి 147-145తో మరో భారత ఆర్చర్ ప్రీతిక ప్రదీప్‌ను ఓడించింది. అంతకుముందు సెమీస్‌లో జ్యోతి 149-143తో సి యు చెన్ (చైనీస్ తైపీ)పై నెగ్గింది. తొలి మూడు సెట్లలో (30-29, 59-58, 88-87) ఒక్కో పాయింట్ ఆధిక్యం సాధించిన జ్యోతి.. నాలుగో సెట్లో మూడు పర్‌ఫెక్ట్ టెన్‌లు సంధించి 118-116తో నిలిచింది. చివరి సెట్‌లోనూ రెండుసార్లు పది స్కోరు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. మహిళల టీమ్ తుదిపోరులో జ్యోతి, దీప్షిక, ప్రీతికలతో కూడిన భారత బృందం 236-234తో కొరియా (పార్క్ యెరిన్, యా హుయున్, జంగ్‌యూన్)ను కంగుతినిపించింది. మిక్స్‌డ్ టీమ్‌లో అభిషేక్ వర్మ, దీప్షిక జంట స్వర్ణంతో మెరిసింది. అభిషేక్ ద్వయం 153-151తో జొన్నా అక్తర్-హిము బచార్ (బంగ్లాదేశ్) జంటను ఓడించింది. పురుషుల కాంపౌండ్ టీమ్‌లో భారత్‌కు చుక్కెదురైంది. అభిషేక్ వర్మ, సాహిల్ జాదవ్, ప్రథమేశ్‌లతో కూడిన భారత జట్టు 229-230తో కజకిస్థాన్ (ముసా, మిర్జామెటోవ్, టూటూన్) బృందం చేతిలో ఓడింది.

- జ్యోతి ఇప్పటిదాకా 90 అంతర్జాతీయ పతకాలు గెలిచింది. ఇందులో 33 స్వర్ణాలు, 33 రజతాలు, 24 కాంస్యాలు ఉన్నాయి. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో గెలిచిన వ్యక్తిగత పసిడి ఆమె కెరీర్‌లో 90వ పతకం.

14 ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో జ్యోతి నెగ్గిన పతకాలు. ఇందులో 7 స్వర్ణాలు, 5 రజతాలు, 2 కాంస్యాలున్నాయి. 2021, 2015, 2025లో ఆమె ఈ పోటీల్లో వ్యక్తిగత స్వర్ణాలు సాధించింది.

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

నేటి నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి శుక్రవారం నుంచే దరఖాస్తు ప్రక్రియ మొదలవుతుంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్‌లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

Organised By ఈనాడు

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్స్, అబ్డామెన్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్,
విజయవాడ రూరల్ మండలం,
ఎన్టీఆర్ జిల్లా-521104
వివరాలకు: 9121170928, 91549 91113
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.


గిల్ సాయి సుదర్శన్

రసవత్తర టెస్టు సమరానికి వేళైంది. దక్షిణాఫ్రికాతో టీమ్‌ఇండియా తొలి టెస్టు నేటి నుంచే. స్వదేశంలో సఫారీ జట్టుపై భారత్ ఇప్పటివరకు తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. గత రెండు సిరీస్‌లనూ 3-0తో సొంతం చేసుకుంది. కానీ నిరుడు న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురికావడం భారత్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. పైగా దక్షిణాఫ్రికా.. ప్రపంచ ఛాంపియన్ హోదాలో ఎప్పుడూ లేనంత ధీమాతో పోటీకి సిద్ధమైంది. మరి ఈసారి టీమ్‌ఇండియాకు ఎలాంటి పోటీ ఎదురుకాబోతోంది! ఆ జట్టు ఎప్పటిలా అలవోకగా పైచేయి సాధించగలదా..! ఈడెన్ గార్డెన్స్‌లో ఏం జరుగుతుందో?

ఉదయం 9.30 నుంచి

సఫారీ సవాల్

దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టెస్టు నేటి నుంచే

కోల్‌కతా


బవుమా

సొంతగడ్డపై టీమ్‌ఇండియాకు పరీక్ష. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఆరంభమయ్యే మొదటి టెస్టులో ఆ జట్టు.. బవుమా నేతృత్వంలోని దక్షిణాఫ్రికాను ఢీకొంటుంది. దాదాపు సమవుజ్జీలుగా ఉన్న జట్ల మధ్య సమరం ఆసక్తికరంగా సాగడం ఖాయం. ఎప్పుడూ లేని విధంగా భారత బ్యాటర్లు స్పిన్ బౌలింగ్‌లో పరీక్షను ఎదుర్కొంటున్నారు.

స్పిన్‌లో ఎలా ఆడతారో..: సొంతగడ్డపై ఎప్పుడూ తిరుగులేని ఫేవరెట్‌గా బరిలోకి దిగే టీమ్‌ఇండియా. . ఈసారి కాస్త భిన్న పరిస్థితిని ఎదుర్కొంటోంది. అందరి దృష్టీ ఆ జట్టు స్పిన్నర్లను ఎలా ఎదుర్కొంటుంది అన్నదానిపైనే. గత ఏడాది న్యూజిలాండ్ చేతిలో పరాభవం భారత్‌ను ఇంకా వెంటాడుతూనే ఉంది. స్పిన్నర్లు అజాజ్ పటేల్, మిచెల్ శాంట్నర్, గ్లెన్ ఫిలిప్స్ 36 వికెట్లు చేజిక్కించుకోవడంతో ఆ సిరీస్‌లో భారత్ 0-3తో ఊహించని పరాజయాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలోనే ఈడెన్‌లో గిర్రున తిరిగే పిచ్ కావాలని జట్టు మేనేజ్‌మెంట్ కోరలేదు. అయితే పదునైన పేస్ బౌలర్ల జట్టుగా పేరున్న దక్షిణాఫ్రికాలో ఇప్పుడు నాణ్యమైన స్పిన్నర్లు ఉండడంతో భారత్‌కు గట్టి సవాలు తప్పకపోవచ్చని భావిస్తున్నారు. ఇటీవలే పాకిస్థాన్‌లో టెస్టు సిరీస్‌ను 1-1తో డ్రాగా ముగించిన సఫారీ జట్టు రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ఆ సిరీస్‌లో దక్షిణాఫ్రికా స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, హార్మర్, సెనురాన్ ముత్తుసామి విశేషంగా రాణించారు. సిరీస్‌లో ఆ జట్టు బౌలర్లు మొత్తం 39 వికెట్లు పడగొడితే అందులో 34 ఈ స్పిన్ త్రయానికే దక్కడం గమనార్హం. వాళ్లు పాకిస్థాన్ (27 వికెట్లు) స్పిన్నర్ల కన్నా ఎక్కువ వికెట్లు పడగొట్టారు. భారత్‌పై అదే స్పిన్ ఆయుధాన్ని ప్రయోగించాలని సఫారీ జట్టు భావిస్తోంది. "వాళ్లకు నలుగురు స్పిన్నర్లున్నారు. తుది జట్టులో ముగ్గురిని ఆడించే అవకాశముంది. ఒకరకంగా ఇది ఉపఖండ జట్టుతో తలపడడమే" అని భారత సహాయ కోచ్ టెన్ డస్కాటె చెప్పాడు.

తుది జట్టులో జురెల్: ఇంగ్లాండ్‌లో గాయపడి విండీస్‌తో సిరీస్‌కు దూరమైన వికెట్‌కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఈ మ్యాచ్‌తో పునరాగమనం చేయనుండడం భారత్‌కు సానుకూలాంశమే. భారత్-ఎ తరఫున విశేషంగా రాణించిన మరో వికెట్‌కీపర్ ధ్రువ్ జురెల్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడనున్నాడు. వీళ్లిద్దరితో మిడిల్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ శుభారంభాన్నివ్వాలని జట్టు కోరుకుంటోంది. సాయి సుదర్శన్ ఈసారైనా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరుగుల వరద పారిస్తాడేమో చూడాలి. భారత బ్యాటర్లు పరిస్థితులకు తమను తాము అన్వయించుకుని, స్పిన్నర్లను సహనంతో ఎదుర్కోవడం కీలకం. భారీ స్కోరు సాధిస్తే సఫారీ జట్టును ఒత్తిడిలోకి నెట్టొచ్చు. ఇక భారత్ స్పిన్ భారాన్ని జడేజా, సుందర్, కుల్‌దీప్ పంచుకుంటారు. వీళ్లను ఎదుర్కోవడం దక్షిణాఫ్రికా బ్యాటర్లకు సవాలే. ఈడెన్‌లో బంతి విపరీతంగా తిరిగే పిచ్‌ను తయారు చేయలేదని బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు గంగూలీ చెప్పాడు. ఇది బుమ్రాకు సంతోషాన్నిచ్చే విషయమే. ఆరంభంలో పరిస్థితులను అతడు ఉపయోగించుకుంటే ప్రత్యర్థి బ్యాటర్లకు కష్టాలు తప్పవు. తర్వాత రివర్స్ స్వింగ్ కూడా లభిస్తుంది. బుమ్రాతో కలిసి సిరాజ్ భారత పేస్ బాధ్యతలు మోస్తాడు.

దక్షిణాఫ్రికా హుషారుగా..: భారత్‌లో రికార్డు గొప్పగా లేనప్పటికీ ఫామ్‌లో ఉన్న దక్షిణాఫ్రికా.. ఉత్సాహంగా పోరుకు సిద్ధమైంది. బలమైన స్పిన్ విభాగం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. అదే సమయంలో రబాడ, యాన్సెన్ రూపంలో పదునైన పేసర్లూ ఆ జట్టుకు ఉన్నారు. బ్యాటర్లు మార్‌క్రమ్, రికిల్టన్, స్టబ్స్, టోని జోర్జి, బవుమాలు భారత స్పిన్నర్లను ఎలా ఎదుర్కొంటారన్నదానిపైనే సిరీస్‌లో దక్షిణాఫ్రికా అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, గిల్, పంత్, ధ్రువ్ జురెల్, జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్, బుమ్రా, సిరాజ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, రికిల్టన్, స్టబ్స్, టోని జోర్జి, బవుమా, వెరీన్, సెనురాన్ ముత్తుసామి, హార్మర్, యాన్సెన్, కేశవ్ మహరాజ్, రబాడ.

పిచ్ ఎలా ఉందంటే..

ఈడెన్ గార్డెన్స్‌లో పిచ్ నుంచి ఆరంభంలో పేసర్లకు కాస్త సహకారం అందనుంది. తొలి గంటలో కాస్త స్వింగ్, మూమెంట్ లభించవచ్చు. ఆ తర్వాత బ్యాటింగ్ తేలికవుతుంది. బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడొచ్చు. మూడో రోజు నుంచి బంతి తిరగడం మొదలవుతుంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవచ్చు. మ్యాచ్‌కు ఎలాంటి వర్షం ముప్పు లేదు.

"నేను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు బ్యాటర్‌గా మాత్రమే ఆలోచిస్తా.. కెప్టెన్‌గా కాదు. కొన్నిసార్లు సారథిగా మరీ ఎక్కువగా ఆలోచిస్తే అనవసరంగా ఒత్తిడి పెంచుకున్నట్లే. అప్పుడు చిన్నచిన్న సాహసాలు కూడా చేయలేం" - గిల్

జాతీయ పికిల్‌బాల్ షురూ



ఓపెన్ విభాగం విజేతలు

ఈనాడు, బెంగళూరు: జాతీయ పికిల్‌బాల్ పోటీలు గురువారం బెంగళూరులో ప్రారంభమయ్యాయి. భారత పికిల్‌బాల్ సమాఖ్య, కర్ణాటక పికిల్‌బాల్ సమాఖ్య సంయుక్తంగా నిర్వహిస్తోన్న ఈ టోర్నీకి ఆరోగ్యకర జీవనశైలి ఉత్పత్తుల సంస్థ ప్రియా 'సబల మిల్లెట్స్' టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. తొలి రోజు నేషనల్ విభాగం డబుల్స్, సింగిల్స్‌లో కర్ణాటక ఆటగాళ్లు విజేతలుగా నిలిచారు. ఓపెన్ విభాగం డబుల్స్‌లో బెంగాల్ జోడీ నెగ్గింది. విజేతలకు 'ఈనాడు' కర్ణాటక ఏజీఎం (మార్కెటింగ్) ప్రకాశ్ ధార్వాడ్ పతకాలను అందజేశారు. ఓపెన్ విభాగంలో ఈనెల 16 వరకు పోటీలు జరుగుతాయి.


సబల స్టాల్ వద్ద ప్రేక్షకులు

'సబల' రుచులు..: పికిల్‌బాల్ పోటీల సందర్భంగా క్రీడాకారులు ప్రియా సబల మిల్లెట్ ఉత్పత్తులను ఉత్సాహంతో రుచి చూశారు. కుకీస్, పానీపూరీ పప్స్, చిరుధాన్యాల స్నాక్స్ వంటి 45 రకాల ఉత్పత్తులను ఇక్కడి స్టాల్స్‌లో ఉంచారు. ప్రేక్షకులు సబల ఉత్పత్తులను ఆసక్తిగా కొనుగోలు చేశారు. "ఇంత రుచికరమైన కుకీస్‌ను ఇంతకుముందెప్పుడూ తినలేదు. చిరు ధాన్యాలతో చేసిన స్నాక్స్ అంత రుచిగా ఉండవనుకునేవాణ్ని. కానీ సబల ఉత్పత్తులు బాగున్నాయి" అని ఓ ఆటగాడు వ్యాఖ్యానించాడు.

"మేము క్రీడాకారులకు నిత్యం పోషకాల గురించి చెబుతుంటాం. మంచి తిండితోనే శక్తి వస్తుంది. సబల ఉత్పత్తులు క్రీడాకారులు అవసరాలకు సరిపోయేట్లు ఉన్నాయి. రాగి, జొన్న, అరికెలతో తయారు చేసిన రెడీ టు కుక్ ఉత్పత్తులు ఆధునిక సమాజానికి అలనాటి ఆహార శైలిని పరిచయం చేస్తున్నాయి"

- జయప్రకాశ్, టీమ్ మేనేజర్ కేరళ

ప్రపంచ బాక్సింగ్ కప్ బరిలో నిఖత్


నిఖత్ జరీన్

నిజామాబాద్ క్రీడలు, న్యూస్‌టుడే: దిల్లీలోని నోయిడాలో శుక్రవారం మొదలయ్యే ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ టోర్నీలో భారత స్టార్ నిఖత్ జరీన్ పోటీపడనుంది. 51 కిలోల విభాగంలో నిజామాబాద్ అమ్మాయి బరిలో దిగనుంది. ఆమె కోచ్‌గా నగరానికే చెందిన ఎత్తేసాముద్దీన్ ఈ పోటీలకు వెళ్తున్నారు. పటియాలాలోని సాయ్ కేంద్రంలో జరిగిన 45 రోజుల శిక్షణ శిబిరంలో పాల్గొన్న నిఖత్.. ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ టోర్నీలో స్వర్ణం గెలవాలనే పట్టుదలతో ఉంది. ఇటీవల లివర్‌పూల్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌లోనే ఓడిన నిఖత్.. ఈ కప్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. "సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ బరిలో దిగబోతున్నా. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఓడినా చాలా పాఠాలు నేర్చుకున్నా. ఇప్పుడు నా దృష్టంతా ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ టోర్నీపైనే ఉంది. 2023లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ తర్వాత భారత్‌లో ఆడుతున్న తొలి టోర్నీ ఇదే. ఈ కప్‌లో స్వర్ణం గెలిచి ఫామ్ చాటుకోవాలనుకుంటున్నా" అని నిఖత్ చెప్పింది. నిఖత్‌తో పాటు ఈ కప్‌లో 19 మంది భారత బాక్సర్లు బరిలో ఉన్నారు. ప్రపంచ ఛాంపియన్ మీనాక్షి హుుడా (48 కేజీ), రజత పతక విజేత నుపుర్ షెరోన్ (80 కేజీల పైన), పూజ రాణి (80 కేజీ), పర్వీన్ (60 కేజీ), జైస్మీన్ లాంబోరియా (57 కేజీ), జాదుమణి సింగ్ (50 కేజీ), అభినాష్ (65 కేజీ), లక్ష్య చాహర్ (80 కేజీ), సుమిత్ (75 కేజీ) తదితరులు ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. 18 దేశాల నుంచి 140 మంది బాక్సర్లకు పైగా కప్ బరిలో ఉన్నారు.

నంబర్‌వన్‌గా శివ్


శివ్

ఈనాడు, హైదరాబాద్: తెలుగు కుర్రాడు తుమ్మల శివ్ అదరగొట్టాడు. ఎఫ్ఐఏ కార్టింగ్ ర్యాంకింగ్స్‌లో మైక్రో కేటగిరీ విభాగంలో భారత నంబర్‌వన్‌గా నిలిచాడు. తొమ్మిదేళ్ల వయసులోనే శివ్ ఈ ఘనత సాధించడం విశేషం. హైదరాబాద్‌లోని ఆగా ఖాన్ అకాడమీలో నాలుగో తరగతి చదువుతున్న శివ్.. 2025 మెకో మెరిటస్ కప్‌లో టైటిల్ సొంతం చేసుకున్నాడు.

ప్రీక్వార్టర్స్‌లో అర్జున్, హరి

- ప్రజ్ఞానంద ఔట్
- చెస్ ప్రపంచకప్


అర్జున్

పంజిమ్: చెస్ ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేశి, హరికృష్ణ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. నాలుగో రౌండ్ టైబ్రేకర్‌లో అర్జున్ 3-1తో హంగేరికి చెందిన పీటర్ లెకోపై విజయం సాధించాడు. హరి 2.5-1.5తో నిల్స్ గ్రాండెలియస్ (స్వీడన్)ను ఓడించాడు. ప్రజ్ఞానందకు మాత్రం నిరాశ తప్పలేదు. అతడు టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ప్రజ్ఞానంద 1.5-2.5తో డానిల్ దుబోవ్ (రష్యా) చేతిలో పరాజయం పాలయ్యాడు. ప్రీక్వార్టర్స్‌లో అరోనియన్ (అమెరికా)తో అర్జున్, మార్టినెజ్ అల్కాంతరా (పెరూ)తో హరికృష్ణ తలపడతారు.


హరికృష్ణ

ప్రపంచ స్నూకర్ ఛాంప్ అనుపమ


అనుపమ

దోహా: భారత అమ్మాయి అనుపమ రామచంద్రన్ సత్తా చాటింది. అదిరే ప్రదర్శనతో మహిళల ప్రపంచ స్నూకర్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 23 ఏళ్ల ఈ చెన్నై అమ్మాయి ఫైనల్లో 3-2తో మూడుసార్లు ఛాంపియన్ ఆన్ యీ (హాంకాంగ్)ను కంగుతినిపించింది. తుదిపోరులో ప్రత్యర్థి నుంచి అనుపమకు గట్టి పోటీ ఎదురైంది. అయినా ఒత్తిడికి నిలిచి ట్రోఫీ నెగ్గింది. ప్రపంచ స్నూకర్ టైటిల్ (15-రెడ్) సాధించిన తొలి భారత మహిళా క్రీడాకారిణిగా అనుపమ ఘనత సాధించింది. గతేడాది ఆమె ఆసియా స్నూకర్ టైటిల్ గెలిచింది.

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

కుమామోటో (జపాన్): జపాన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత స్టార్ ఆటగాళ్లలో లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టగా.. హెచ్.ఎస్.ప్రణయ్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21-13, 21-11తో హెంగ్ జేసన్ (సింగపూర్)పై విజయం సాధించాడు. 39 నిమిషాల్లో ప్రత్యర్థిని చిత్తుచేసిన లక్ష్యసేన్.. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో లో కీన్ యూ (సింగపూర్)తో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో ప్రణయ్ 18-21, 15-21తో రస్‌ముస్ గెమ్కీ (డెన్మార్క్) చేతిలో పరాజయం చవిచూశాడు.

రుతురాజ్ శతకం

దక్షిణాఫ్రికా-ఎపై భారత్-ఎ గెలుపు

రాజ్‌కోట్: దక్షిణాఫ్రికా-ఎతో మూడు మ్యాచ్‌ల అనధికార వన్డే సిరీస్‌లో భారత్-ఎ బోణీ కొట్టింది. గురువారం తొలి వన్డేలో 4 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 285 పరుగులు చేసింది. డెలానో (90; 105 బంతుల్లో 10×4, 1×6) కొద్దిలో సెంచరీ కోల్పోయాడు. ఫోర్‌స్టర్ (77), ఫోర్టుయిన్ (59) కూడా రాణించారు. అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా చెరో రెండు వికెట్లు తీశారు. రుతురాజ్ గైక్వాడ్ (117 బంతుల్లో 129 బంతుల్లో 12×4) సెంచరీతో భారత్-ఎ లక్ష్యాన్ని 49.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి అందుకుంది. కెప్టెన్ తిలక్ వర్మ (39 నాటౌట్), నితీశ్‌కుమార్ రెడ్డి (37), అభిషేక్ శర్మ (31), నిశాంత్ (29 నాటౌట్) విజయంలో తమ వంతు పాత్ర పోషించారు.

లంక.. పాక్‌లోనే

వన్డే సిరీస్‌లో కొనసాగాలని నిర్ణయం

రావల్పిండి: ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి బాంబు దాడి నేపథ్యంలో ఒకవైపు భద్రతాపరమైన ఆందోళన నెలకొన్నా.. పాకిస్థాన్‌తో వన్డే సిరీస్‌లో కొనసాగేందుకు శ్రీలంక అంగీకరించింది. పాక్‌తో వన్డే సిరీస్‌ను మధ్యలోనే వదిలి ఎనిమిది మంది లంక క్రికెటర్లు స్వదేశానికి పయనమవనున్నట్లు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో లంక బోర్డు అధికారులతో చర్చించిన పీసీబీ అధ్యక్షుడు మోసిన్ నక్వీ, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఆ జట్టు భద్రతకు భరోసా ఇచ్చారు. "శ్రీలంక రక్షణ శాఖ అధికారులతో మా ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ మాట్లాడారు. లంక క్రికెటర్ల భద్రతకు భరోసా ఇచ్చారు. ఆ జట్టు సిరీస్‌లో కొనసాగేందుకు అంగీకరించింది' అని మోసిన్ తెలిపారు. దీంతో పాక్-లంక మూడు వన్డేల సిరీస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. గురువారం జరగాల్సిన రెండో వన్డే.. శుక్రవారం నిర్వహించనున్నారు. శనివారం షెడ్యూల్ అయిన మూడో వన్డే.. ఆదివారం జరుగుతుంది. మరోవైపు శ్రీలంక, జింబాబ్వేతో ముక్కోణపు టీ20 సిరీస్ షెడ్యూల్‌లోనూ మార్పులు జరిగాయి. ఈ సిరీస్ నవంబర్ 17న కాకుండా 18న ఆరంభం కానుంది. రెండో మ్యాచ్ 19 నుంచి 20కి మారింది. ఈ సిరీస్‌లో తొలి అయిదు మ్యాచ్‌లకు లాహోర్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. కానీ మ్యాచ్‌లన్నిటినీ రావల్పిండిలోనే నిర్వహిస్తున్నట్లు పీసీబీ తెలిపింది.

క్వాలిఫయర్స్‌పై భారత్ గురి

బిల్లీ జీన్ కింగ్ కప్

బెంగళూరు: భారత మహిళల టెన్నిస్ జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. శుక్రవారం సొంతగడ్డపై ఆరంభమయ్యే బిల్లీ జీన్ కింగ్ కప్‌లో క్వాలిఫయర్స్ బెర్తు సాధించడంపై గురి పెట్టింది. ప్లేఆఫ్స్‌లో గ్రూప్-జిలో ఉన్న భారత్.. బలమైన నెదర్లాండ్స్, స్లొవేనియాతో తలపడనుంది. శనివారం స్లొవేనియాతో ఆదివారం నెదర్లాండ్స్‌తో భారత్ ఆడనుంది. గ్రూప్‌లో విజేతగా నిలిచే జట్టు 2026 క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తుంది. భారత జట్టులో తెలుగమ్మాయిలు శ్రీవల్లి రష్మిక, సహజ యమలపల్లి, అంకిత రైనా, రియా భాటియా, ప్రార్థన ఉన్నారు.

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 14-11-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 94

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఏపీ వైపు గ్లోబల్ సంస్థల చూపు

ఈ నెలలోనే 'గూగుల్' ప్రాజెక్టుకు శంకుస్థాపన ● విశాఖను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దుతాం

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ● ఒకేరోజు 6 కంపెనీలకు భూమి పూజ



విశాఖపట్నంలో ఐస్పేస్ భవనానికి భూమిపూజ చేస్తున్న మంత్రి లోకేశ్

ఈనాడు డిజిటల్-అనకాపల్లి, న్యూస్‌టుడే- మధురవాడ: 'పారదర్శక పాలనతోనే రాష్ట్రానికి భారీస్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయి. ఈ నెలాఖరుకు గూగుల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తాం. ఈ రోజు మేం చేసిన శంకుస్థాపనలు ఏపీ డిజిటల్, ఐటీ భవిష్యత్తుకు అంకురార్పణ' అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి గురువారం ఐటీ హిల్స్, ఎండాడ ప్రాంతాల్లో 6 కంపెనీలకు భూమిపూజ చేశారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందని, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

రాబోయే మూడేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు

'త్వరలో విశాఖకు టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి భారీ సంస్థలు రానున్నాయి. మరికొన్ని ఐటీ కంపెనీలు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. క్లస్టరైజేషన్ ద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 20 క్లస్టర్ల ద్వారా అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నాం. రాబోయే మూడేళ్లలో విశాఖలో ఐదు లక్షల ఐటీ ఉద్యోగాలు రాబోతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 16 నెలల్లో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించింది. ఇది గత ప్రభుత్వంలో ఐదేళ్లలో వచ్చిన పెట్టుబడుల కంటే అధికం. కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఇన్నోవేషన్ సంస్థల పెట్టుబడుల కోసం రాష్ట్రాన్ని అత్యంత అనువైన ప్రాంతంగా తయారుచేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. 2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయం పూర్తయి అంతర్జాతీయ అనుసంధానం ప్రారంభం కాబోతోంది. విశాఖను ఏఐ క్యాపిటల్, డేటా సెంటర్ క్యాపిటల్, ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. కేవలం టెక్నాలజీ పార్కులు, ఆఫీస్ స్పేస్ నిర్మించడమే కాదు.. విశాఖలో భవిష్యత్తు నగరాన్ని తీర్చిదిద్దుతున్నాం' అని మంత్రి పేర్కొన్నారు.

30 వేల మందికి ఉపాధి కల్పించే ప్రాజెక్టులకు..

సదస్సులో పాల్గొనేందుకు విశాఖకు వచ్చిన లోకేశ్ గురువారం ఒకేరోజు.. సెయిల్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్, రహేజా ఐటీ స్పేస్ అండ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, కపిల్ గ్రూప్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లకు భూమి పూజ చేశారు. రూ.3,800 కోట్లతో ఏర్పాటుచేసే ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 30 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.



విశాఖపట్నంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, లోకం మాధవి, అధికారులు





వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సమావేశానికి హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

అడవిలో అక్రమ సామ్రాజ్యం.. నిజం

32 ఎకరాలను కబ్జా చేసిన పెద్దిరెడ్డి కుటుంబీకులు

మిథున్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి, ఇందిరమ్మలు దురాక్రమణదారులు

తాజాగా అభియోగపత్రం దాఖలు

ఈనాడు, అమరావతి: అడవిలో అక్రమ సామ్రాజ్యం.. అక్షరాలా నిజమని నిగ్గు తేలింది. వైకాపా ప్రభుత్వంలో నంబరు-2గా అపరిమిత అధికారం చలాయించిన ప్రస్తుత పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబీకులు కలిసి 32.63 ఎకరాల అటవీ భూమిని కబ్జా చేసినట్లు నిర్ధారణైంది. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలం మంగళంపేట రక్షిత అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున భూమిని ఆక్రమించుకుని దాని చుట్టూ ఇనుప కంచె వేసుకుని సొంత ఎస్టేట్‌గా మార్చుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆక్రమిత అటవీ భూమిలో చట్టవిరుద్ధంగా బోరుబావి తవ్వడమే కాకుండా, ఉద్యాన పంటలు(533 మామిడి, 26 నేరేడు, 1 కొబ్బరిచెట్టు) సాగు చేసి ఆదాయం పొందినట్లు తేలింది. రాజంపేట వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి(ఏ-1), పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి(ఏ-2), తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి(ఏ-3), పెద్దిరెడ్డి ఇందిరమ్మ(ఏ-4) కలిసి దురాక్రమణకు పాల్పడినట్లు తేలింది. ఈ మేరకు తమ దర్యాప్తులో వెల్లడైన వివరాలతో చిత్తూరు జిల్లా పాకాల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో అటవీశాఖ అధికారులు ఈ నెల 7న అభియోగపత్రం దాఖలు చేశారు. అది గురువారం వెలుగులోకి వచ్చింది. పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు ఈ వివరాలను వెల్లడించారు.

103.98 ఎకరాలను గుప్పిట్లో పెట్టుకున్నారు: మంగళంపేట రక్షిత అటవీ ప్రాంతంలోని భూముల్ని కబ్జా చేసి.. విశాలమైన వ్యవసాయ క్షేత్రాన్ని పెద్దిరెడ్డి కుటుంబీకులు ఏర్పాటు చేసుకున్న తీరుపై 'అడవిలో అక్రమ సామ్రాజ్యం' శీర్షికన జనవరి 29న ఈనాడులో కథనం ప్రచురితమైంది. దానిపై అటవీ, రెవెన్యూ అధికారులతో సంయుక్త కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1968 గెజిట్ ప్రకారం మంగళంపేట అటవీ ప్రాంతంలో 75.74 ఎకరాల భూమికి పట్టాలు ఉండగా.. పెద్దిరెడ్డి కుటుంబం 103.98 ఎకరాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నట్లు సంయుక్త కమిటీ గుర్తించింది. 32.63 ఎకరాల అటవీ భూమిని పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించుకున్నట్లు తేల్చింది. ఆ భూమిని ఆధీనంలోకి తీసుకుని.. చుట్టూ ఉన్న కంచెను తొలగించి.. సరిహద్దు రాళ్లు పాతింది. కబ్జా వ్యవహారంపై మే 4న కేసు నమోదు చేసి.. మిథున్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి, ఇందిరమ్మలను నిందితులుగా చేర్చింది. రూ.1.26 కోట్ల మేర ఆస్తి నష్టానికి, విధ్వంసానికి పాల్పడ్డారని, అనధికారికంగా అటవీ భూముల్లో బోరు తవ్వారని గుర్తించింది. ఈ వివరాలతో అభియోగపత్రం దాఖలు చేసింది.

భూమి ఆక్రమించి.. వనరులు దుర్వినియోగం చేశారు

'పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబీకులు అటవీ భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా, అటవీ వనరులను దుర్వినియోగం చేశారు. వారి ఆక్రమణలో ఉన్న 32.63 ఎకరాల అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నాం. ఆ భూమికి సంబంధించి వారివద్ద ఏవైనా చట్టబద్ధమైన పత్రాలు ఉంటే సమర్పించాలని అడిగితే ఇవ్వలేకపోయారు' అని పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు పేర్కొన్నారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో గురువారం సాయంత్రం విలేకరులతో ఆయన మాట్లాడారు. 'అటవీ భూములను ఆక్రమించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారికి సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకుంటాం. అటవీ భూముల అన్యాక్రాంతంపై విచారణకు రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు చేశాం. అన్యాక్రాంతమైన భూములన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాం. అటవీ భూముల వివరాలను వెబ్‌సైట్లో పెట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ సర్వే మొత్తం పూర్తిచేసి స్థలాల వివరాలు వెబ్‌సైట్లో పెడతాం' అని పేర్కొన్నారు.



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబీకులు అటవీ భూమిని ఆక్రమించుకోగా... వారి చెర నుంచి విడిపించామంటూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన వీడియోలో చూపించారిలా...

పెద్దిరెడ్డి ఆక్రమించుకున్న భూమి వీడియోను విడుదల చేసిన పవన్‌కల్యాణ్

మంగళంపేట రక్షిత అటవీ ప్రాంతంలో పెద్దిరెడ్డి కుటుంబీకులు కబ్జా చేసిన అటవీ భూములకు సంబంధించిన ఏరియల్ వ్యూతో కూడిన వీడియోను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం విడుదల చేశారు. దాదాపు 1.30 నిమిషాల నిడివితో ఉన్న ఈ వీడియోలో... పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమణల నుంచి అధికారులు విడిపించిన 32.63 ఎకరాల భూమిని మార్కింగ్ చేసి చూపించారు.



హెలికాప్టర్ నుంచి వీడియో తీస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

---

14 నుంచి సదరం స్లాట్ల బుకింగ్ పునఃప్రారంభం

● ఉచిత సేవలకు శ్రీకారం

● జనవరి నుంచి పునఃపరిశీలనకు సన్నాహాలు

ఈనాడు, అమరావతి: 'సదరం' స్లాట్ల బుకింగ్‌ను ఈ నెల 14 నుంచి పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైకల్య ధ్రువపత్రాల జారీకి నిర్దేశించిన ఈ ప్రక్రియ డిసెంబరు నెలాఖరు వరకు కొనసాగనుంది. గతంలో స్లాట్ బుకింగ్‌కు, జారీచేసిన ధ్రువపత్రం ముద్రణకు రూ.40 చొప్పున వసూలు చేసేవారు. దివ్యాంగుల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎలాంటి రుసుము లేకుండా, ఇకపై ఉచిత సేవలను అందించనున్నారు. నిరీక్షణ జాబితాలో ఉన్న సుమారు 10 వేల మందికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆ తర్వాత కొత్త దరఖాస్తుదారులకు తేదీ, సమయం ఖరారుచేస్తారు. గతంలో వైకల్యం తక్కువగా నిర్ధారించారని 1.04 లక్షల మంది అప్పీలు చేసుకున్నారు. వీరిలో ఇప్పటివరకు 19,235 మందికి మళ్లీ పరీక్షలు చేశారు. మిగిలినవారికీ ఆయా శిబిరాల్లో నిర్వహించనున్నారు. పింఛను పొందే వారిలో మిగిలిన 1.87 లక్షల మందికి పునఃపరిశీలన పరీక్షలను జనవరి నుంచి నిర్వహించేలా కసరత్తు చేస్తున్నారు.

డిసెంబరు నెలాఖరుకు 31,050 మందికి పరీక్షలు: మంత్రి సత్యకుమార్



సదరం కింద సీహెచ్‌సీల్లో ప్రతి సోమవారం, ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రుల్లో ప్రతి మంగళవారం వైకల్య నిర్ధారణ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు నెలాఖరు నాటికి 31,050 మందికి పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. వైకల్య పరీక్షలకు గతంలో 112 ఆసుపత్రులు కేటాయించగా, అదనంగా మరో ఆరు వైద్యశాలలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు.

హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితులపై నేరం రుజువు కావడంతో ఏడుగురికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జడ్జి జి.గోపి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం గొల్లగూడేనికి చెందిన కాగిత రామ్మోహనరావుకు అదే ప్రాంతానికి చెందిన నిందితుల మధ్య పాత కక్షలు ఉన్నాయి. 2013 ఫిబ్రవరి 28న రాత్రి రామ్మోహనరావు గడ్డివాము వద్ద ఉన్న సమయంలో నిందితులు శొంఠివీరబాబు, శొంఠి పెదవైడేశ్వరరావు, బొర్రా శ్రీనివాసరావు, బొర్రా స్వయంకృష్ణ, కాగిత సోమయ్య, శొంఠి వీరవెంకటేశ్వరరావు, శొంఠి వీరాంజనేయులు, శొంఠి ముసలయ్య, కాగిత ఆంజనేయులు కత్తులు, కర్రలతో దాడి చేసి ఆయనను హత్య చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం నిందితులు నేరం చేశారని రుజువు కావడంతో ఒక్కొక్కరికీ జీవితఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. మొత్తం తొమ్మిది మంది నిందితుల్లో కేసు విచారణలో ఉండగా వీరబాబు, ఆంజనేయులు మృతి చెందారు.

విత్తన బిల్లు-2025 ముసాయిదా విడుదల

ప్రజాభిప్రాయాలకు ఆహ్వానం

ఈనాడు, దిల్లీ: కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ.. విత్తన బిల్లు-2025 ముసాయిదాను విడుదల చేసింది. అందులోని అంశాలపై ప్రజాభిప్రాయాలను ఆహ్వానించింది. విత్తన చట్టం-1966, విత్తన నియంత్రణ ఉత్తర్వు-1983ల స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త బిల్లును తీసుకొస్తోంది. కేంద్రవ్యవసాయశాఖ వెబ్‌సైట్‌లో ఉంచిన ఈ ముసాయిదా ప్రతిపై ఆసక్తి ఉన్నవారు అభిప్రాయాలు చెప్పొచ్చని పేర్కొంది. jsseeds-agri@gov.in ఈ మెయిల్ ద్వారా డిసెంబరు 11లోపు అభిప్రాయాలు చెప్పాలని సూచించింది.

నెయ్యి కల్తీని అప్పట్లోనే గుర్తించిన పోటు కార్మికులు

దుర్వాసన వస్తోందంటూ నాటి ఈవో ధర్మారెడ్డికి ఫిర్యాదు

ఆ ఫిర్యాదును విస్మరించి.. ఆర్గానిక్ అంటూ బుకాయింపు

ఈనాడు డిజిటల్, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుమల: లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అవుతోందంటూ తితిదే పోటు కార్మికులు వైకాపా ప్రభుత్వహయాంలోనే గుర్తించారు. నెయ్యి దుర్వాసన రావడం, లడ్డూ తయారీకి అనువుగా లేకపోవడం గమనించిన కార్మికులు అప్పటి తితిదే ఈవో ధర్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. అయితే.. ధర్మారెడ్డి ఆ ఫిర్యాదును ఏమాత్రం పట్టించుకోలేదు. శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీనెయ్యి సరఫరా కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తున్న విషయం తెలిసిందే. విచారణకు అప్పట్లో ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డి హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ధర్మారెడ్డికి గతంలో పోటు కార్మికులు చేసిన ఫిర్యాదు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

లడ్డూలు త్వరగా చెడిపోతున్నాయ్

నాణ్యతలేని నెయ్యిపై 2023లో పోటు కార్మికులు ఈవో ధర్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. లడ్డూ తయారీకి సరఫరా అవుతున్న నెయ్యి దుర్వాసన వస్తోందని, గట్టిపడటం లేదని, నూనెలా జారిపోతోందని తెలిపారు. ఈ నెయ్యితో చేసిన లడ్డూలు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం లేదని వివరించారు. ఇవేవీ పట్టించుకోని ధర్మారెడ్డి.. అది ఆర్గానిక్ నెయ్యి అని, అలాగే ఉంటుందని కార్మికులకు చెప్పినట్లు తెలిసింది. పైగా దానితోనే లడ్డూలు చేయండని ఆదేశించి, ఆ తర్వాత కూడా ఆయన పోటును పరిశీలించలేదని సమాచారం.

నాడు నామమాత్రపు ల్యాబ్‌లో పరీక్షలు

శ్రీవారి భక్తుల కోసం నిత్యం 4 లక్షల లడ్డూలను తితిదే పోటులో తయారుచేస్తారు. పర్వదినాల్లో 3 లక్షల బఫర్‌స్టాక్ నిర్వహిస్తుంటారు. లడ్డూల తయారీకి రోజూ 13-18వేల కిలోల నెయ్యి అవసరం. ఇంత భారీ పరిమాణంలో వాడే నెయ్యి నాణ్యతను పరీక్షించేందుకు కేవలం రూ. 50వేల విలువైన పరికరాలున్న ల్యాబ్‌నే వినియోగించడం గమనార్హం.



గతేడాది నెయ్యిని పరిశీలిస్తున్న తితిదే అప్పటి ఈవో జె.శ్యామలరావు

కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన సరకులపై దృష్టి

కూటమి అధికారంలోకి వచ్చాక తితిదేలో లడ్డూ తయారీకి నాణ్యమైన సరకులు వచ్చేలా చూస్తున్నారు. గతేడాది ఈవోగా శ్యామలరావు బాధ్యతలు తీసుకున్నాక.. పోటు కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంలో నెయ్యి నాణ్యత సరిగా లేదని, శనగ పిండి, యాలకుల నాణ్యత అంతంతమాత్రంగానే ఉందంటూ కార్మికులు ఫిర్యాదు చేశారు. దీంతో శ్యామలరావు పోటుకు వెళ్లి సరకుల నాణ్యత పరిశీలించారు. నెయ్యి, ఇతర ముడి సరకులను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ల్యాబ్‌కు పంపారు. ఆ తర్వాతే కల్తీ నెయ్యి వ్యవహారం బయటకొచ్చింది.

చిన్నారులు, టీనేజర్లలో పెరుగుతున్న రక్తపోటు

- రెండు దశాబ్దాల్లో రెట్టింపైన సంఖ్య



దిల్లీ: గత రెండు దశాబ్దాల్లో అధిక రక్తపోటు బారిన పడిన చిన్నారులు, టీనేజర్ల సంఖ్య రెండింతలు అయిందని ఓ అధ్యయనం పేర్కొంది. 2000 సంవత్సరంలో మొత్తం చిన్నారులు, టీనేజర్లలో రక్తపోటుతో ఇబ్బంది పడేవారు 3.2 శాతం ఉండగా 2020కి అది 6 శాతానికి చేరింది. యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బరో శాస్త్రవేత్తలు చేసిన ఈ అధ్యయనం వివరాలు తాజాగా ద లాన్సెట్ చైల్డ్ అండ్ అడాలసెంట్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధన కోసం వారు 21 దేశాలకు చెందిన 4,43,000 చిన్నారుల వైద్య నివేదికలను క్షుణ్నంగా పరిశీలించారు. "చిన్న వయసులో రక్తపోటు వచ్చిన వారికి చికిత్స అందించకపోతే భవిష్యత్తులో వారికి తీవ్రమైన గుండె, కిడ్నీ సమస్యలు వచ్చే ముప్పుంది. ప్రస్తుతం బీపీ వచ్చిన చిన్నారుల సంఖ్య పెరగడానికి ఊబకాయమే ప్రధాన కారణం. ఊబకాయంతో ఇబ్బంది పడే ప్రతి ఐదుగురు చిన్నారుల్లో ఒకరు రక్తపోటు బారిన పడుతున్నారు" అని నివేదికలో పేర్కొన్నారు. టీనేజర్లకు ఎప్పటికప్పుడు బీపీ పరీక్షలు చేయిస్తూ ఉండాలని సూచించారు.

హిమాచల్‌లో స్మార్ట్ గ్రామం థానేధార్!

ఈటీవీ భారత్

హిమాచల్ ప్రదేశ్ రాజధాని శిమ్లాకు 86 కి.మీ.ల దూరాన ఉన్న థానేధార్ స్మార్ట్ గ్రామంగా ఎదుగుతోంది. రాష్ట్రంలో యాపిల్ తోటల వృద్ధికి ఆద్యుడైన సత్యానంద్ స్టోక్స్ తొలి యాపిల్ మొక్కను 1916లో ఈ గ్రామంలోనే నాటారు. నేడు చుట్టూ పచ్చని యాపిల్ తోటలున్న థానేధార్ గ్రామం సమష్టి కృషితో మోడల్ విలేజిగా గుర్తింపు సాధించింది. వీధుల్లో 550 సోలార్ దీపాలు, ప్రతి మలుపులోనూ ఒకటి చొప్పున 28 సీసీటీవీ కెమెరాలు, గడప గడపకూ తిరిగి చెత్త సేకరణ, యువతకు ఆధునిక వసతులతో జిమ్, విద్యార్థులకు గ్రంథాలయం, పర్యాటకుల కోసం అతిథిగృహం, సొంత వెబ్‌సైటు ఈ గ్రామ ప్రత్యేకతలు. 2021లో గ్రామ బాధ్యతలు చేపట్టిన పంచాయత్ ప్రధాన్ (సర్పంచి) సందీప్ షరోల్ ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా సమాజ ఆధారిత పరిష్కారాలపై దృష్టి సారించి విజయం సాధించారు. చెత్తతో ఎరువు తయారుచేసే ప్లాంటును సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కృషికి గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా 'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సశక్తీకరణ్' పురస్కారాన్ని సందీప్ అందుకున్నారు.



నేడే బిహార్ ఫలితాలు

పట్నా, దిల్లీ: బిహార్ అసెంబ్లీతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. కౌంటింగ్ నేపథ్యంలో పార్టీల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మరికొద్ది గంటల్లో ఐదోసారి నీతీశ్ కుమార్ గెలుస్తారా.. సుదీర్ఘ కాలం బిహార్‌ను పాలించిన ముఖ్యమంత్రిగా నిలుస్తారా అనేది తేలనుంది. అటు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ భవిష్యత్తూ తేలిపోనుంది. బిహార్‌లోని 243 అసెంబ్లీ సీట్లకు ఈ నెల 6, 11 తేదీల్లో పోలింగ్ జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 67.13 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో మహిళల్లో ఓట్ల శాతం 71.78. పురుషుల్లో ఓట్ల శాతం 62.98.

- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. 9 గంటల నుంచి ఫలితాల సరళి తెలిసే అవకాశముంది.
- రాష్ట్రంలో మొత్తం 46 కౌంటింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 4,372 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటయ్యాయి.
- తొలుత పోస్టల్ ఓట్లను లెక్కిస్తారు. 8.30 నుంచి ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుంది.
- ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఎన్డీయేదే ఆధిక్యమని స్పష్టం చేశాయి.



విలువ పెరిగే కానుకలు ఇవ్వండి

బంధుమిత్రులకు, ముఖ్యంగా పిల్లలకు ప్రత్యేక సందర్భాల్లో ఖరీదైన గాడ్జెట్లు, దుస్తుల్లాంటివి కానుకలుగా ఇస్తుంటాం. వాటి విలువ కాలం గడిచేకొద్దీ తరిగిపోతుంటుంది. వాటి బదులు కాలక్రమంలో విలువ పెరిగే బహుమతులు ఇస్తే వారికి ప్రయోజనకరం. అందుకే వారి పేరు మీద స్టాక్ మార్కెట్లో కంపెనీల షేర్లు, మ్యూచువల్ ఫండ్లలో మదుపును కానుకగా ఇవ్వండి.

– అనుష్కా సోహం బత్వాల్, అంత్రప్రెన్యూర్

కుట్ర సందేశాల చేరవేతకు త్రీమా!

- స్విస్ యాప్‌ను వాడిన దిల్లీ పేలుడు కేసు నిందితులు

దిల్లీ: ఎర్రకోట సమీపాన పేలుడుకు తెగబడినవారు సాంకేతికంగా తమ ఆనుపానులు తెలియకుండా తీసుకున్న జాగ్రత్తలు దర్యాప్తు సంస్థలను ఆశ్చర్యపరుస్తున్నాయి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వాడినప్పుడు వాటిలోని వివరాలు మూడో కంటికి తెలియకుండా వారు ఆచితూచి వ్యవహరించినట్లు తాజాగా బయటపడుతోంది. ప్రధాన నిందితులైన డాక్టర్ ఉమర్ నబీ, డాక్టర్ ముజమ్మిల్ గనాయి, డాక్టర్ షాహీన్ షాహిద్‌లు సమాచారాన్ని, మ్యాపులను పంచుకునేందుకు స్విస్ కమ్యూనికేషన్ యాప్ 'త్రీమా'ను వాడినట్లు పోలీసులు గురువారం తెలిపారు. ఈ యాప్‌ను వాడాలనుకునేవారు దానికోసం ఫోన్ నంబరు లేదా ఈ-మెయిల్ ఐడీ ఇవ్వాల్సిన అవసరం ఉండదు. అందువల్ల దీన్ని ఎవరు వాడుతున్నారో గుర్తించడం కష్టమని పోలీసు అధికారులు చెబుతున్నారు. ప్రతిఒక్కరికీ ఒక విశిష్ట గుర్తింపును యాప్ తనంతతానుగా కేటాయించి, రహస్యంగా సమాచారాన్ని ప్రైవేటు సర్వర్ల ద్వారా అందిస్తుంది. నిందితులైన వైద్యులు దీనినే వాడి, మూడోకంటికి తెలియకుండా సమాచారాన్ని ఇచ్చుకుని ఉంటారని భావిస్తున్నారు. పత్రాలు, వాయిస్ మెసేజ్‌లు, ప్రణాళికలు పంపించాక ఇరువర్గాలూ దానిని తొలగించుకునేందుకు దీనిలో వీలుంది. అది ఎక్కడా నిక్షిప్తం కాదు. అందువల్ల ఫోరెన్సిక్ నిపుణులకు దొరకదు. దీనిని ఇంకా ఎంతమంది వాడి ఉంటారు, సర్వర్ నిర్వహణను మన దేశం నుంచే చేశారా, వేరే దేశంలోనా అనేది తేలాలి.

హైవే.. ఆ తర్వాత రద్దీ రోడ్లు

హరియాణా నుంచి దిల్లీకి ఉమర్ ఎలా వచ్చాడో తెలుసుకునేందుకు దాదాపు 50 సీసీటీవీల దృశ్యాలను దర్యాప్తు అధికారులు పరిశీలించారు. ప్రధానంగా జాతీయ రహదారులపై ప్రయాణించి, దిల్లీకి వచ్చాక మాత్రం గజిబిజి మార్గాలనే ఎంచుకున్నట్లు స్పష్టమైంది. ముంబయి-దిల్లీ ఎక్స్‌ప్రెస్ హైవే మీదుగా రాజధానికి చేరుకున్నట్లు గుర్తించారు. సోమవారం ఉదయం ఫరీదాబాద్ నుంచి కారులో బయలుదేరిన ఉమర్.. టీ తాగడానికి ఓ దాబా దగ్గర ఆగడం, ఇంకోచోట ఆగి తన మొబైల్ ఫోన్‌ను చూసుకోవడం సీసీటీవీ దృశ్యాల్లో కనిపించింది. దిల్లీలోకి ప్రవేశించిన తర్వాత ఆగ్నేయ దిల్లీలోని ఓఖ్లా, పారిశ్రామిక ప్రాంతం సహా అనేక ప్రాంతాల మీదుగా ప్రయాణించి కన్నాట్‌ప్లేస్ దాటి సెంట్రల్ దిల్లీలోని రింగ్‌రోడ్డులో ఉమర్ కారు కనిపించింది. ఉద్దేశపూర్వకంగానే ప్రధాన రహదారులను తప్పించుకుని రద్దీగా ఉండే మార్గాలను ఉమర్ ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

పంజాబ్‌లో ఉగ్ర కుట్ర భగ్నం

10 మంది అరెస్టు

చండీగఢ్: పంజాబ్‌లో ఉగ్ర కుట్రను పోలీసులు ఛేదించారు. పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)తో సంబంధమున్న గ్రనేడ్ దాడి మాడ్యూల్‌ను కనుగొన్నారు. విదేశీ సంస్థలకు చెందిన 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. నిందితులు మలేసియాకు చెందిన ముగ్గురి ద్వారా పాక్ హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరిపి గ్రనేడ్ పంపకాలు జరిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. రాష్ట్రంలో జనావాస ప్రాంతాల్లో గ్రనేడ్ దాడి జరిగేలా వారు ప్రణాళికలు రచించినట్లు డీజీపీ వివరించారు.

బెంగాల్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేపై హైకోర్టు అనర్హత వేటు

భాజపా టికెట్‌పై గెలిచి తృణమూల్‌లో చేరిన ముకుల్‌రాయ్ సభ్యత్వం రద్దు



కోల్‌కతా: ఫిరాయింపుల నిరోధక చట్టానికి సంబంధించిన కేసులో కలకత్తా హైకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పశ్చిమ బెంగాల్‌లో సీనియర్ నాయకుడు ముకుల్ రాయ్ అసెంబ్లీ సభ్యత్వాన్ని రద్దు చేసింది. కృష్ణానగర్ ఉత్తర్ స్థానం నుంచి భాజపా టికెట్‌పై 2021లో ఎమ్మెల్యేగా ఎన్నికైన ముకుల్‌రాయ్ అదే ఏడాది జూన్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. ఆ వెంటనే ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) ఛైర్మన్‌గా ఆయనను తృణమూల్ ప్రభుత్వం నియమించింది. విపక్ష నేత సువేందు అధికారి, భాజపా ఎమ్మెల్యే అంబికా రాయ్ విడివిడిగా దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ దేబాంగ్సు బసాక్, జస్టిస్ షబ్బర్ రష్దీ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో స్పీకర్ బిమన్ బెనర్జీ అనుసరించిన వైఖరిని తీవ్రంగా తప్పుబట్టింది. ముకుల్ రాయ్‌పై విధించిన అనర్హత 2021 జూన్ 11 నుంచే వర్తిస్తుందని పేర్కొంది. పీఏసీ ఛైర్మన్‌గా నియామకాన్నీ రద్దు చేసింది. పార్టీ ఫిరాయింపునకు సంబంధించిన అన్ని ఆధారాలు స్పీకర్ ముందు ఉన్నప్పటికీ ఆయన సక్రమంగా వ్యవహరించలేదని ఆక్షేపించింది. హైకోర్టు తీర్పును రాజ్యాంగ విజయంగా భాజపా సీనియర్ నేత సువేందు అధికారి అభివర్ణించారు. 2021లో మమతా బెనర్జీ మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 54 మంది విపక్ష ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించారని ఆరోపించారు.

పుణెలో రెండు ట్రక్కుల మధ్య కారు నుజ్జు

8 మంది మృతి.. 14 మందికి గాయాలు

పుణె: మహారాష్ట్రలోని పుణెలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు భారీ కంటైనర్ ట్రక్కుల మధ్య నలిగి నుజ్జయిన కారు సహా మూడు వాహనాలు మంటల్లో చిక్కుకున్నాయి. ఈ దుర్ఘటనలో 8 మంది దుర్మరణం పాలయ్యారు. 14 మంది గాయపడ్డారు. ముంబయి-బెంగళూరు హైవేలో నవాలే వంతెనపై ఈ దుర్ఘటన సంభవించింది.

అమెరికాలో ముగిసిన షట్‌డౌన్

నిధుల బిల్లులపై ట్రంప్ సంతకం



షట్‌డౌన్ ముగింపు బిల్లుపై సంతకం చేస్తున్న ట్రంప్

వాషింగ్టన్: అమెరికా చరిత్రలో సుదీర్ఘ కాలం (43 రోజులు)పాటు కొనసాగిన ప్రభుత్వ మూసివేతకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముగింపు పలికారు. షట్‌డౌన్‌ను ముగించే నిధుల బిల్లుపై బుధవారం ఆయన సంతకం చేశారు. అంతకుముందు షట్‌డౌన్ ముగింపు బిల్లును 222-209 ఓట్ల తేడాతో అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించింది. బిల్లుపై ట్రంప్ సంతకం చేయడంతో జనవరి 30 వరకు నిధుల కేటాయింపులకు అడ్డంకులు తొలగనున్నాయి. "43 రోజులుగా కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు అక్రమ వలసదారుల కోసం ప్రభుత్వాన్ని మూసివేశారు. అక్రమ వలసదారుల కోసం అమెరికన్ పన్ను చెల్లింపుదారుల నుంచి వందల బిలియన్ డాలర్లను వసూలు చేసే ప్రయత్నంలో ఇలా చేశారు. దోపిడీకి ఎప్పటికీ లొంగబోమనే స్పష్టమైన సందేశాన్ని మా ప్రభుత్వం పంపుతోంది. ఈ షట్‌డౌన్ ప్రజా సేవలకు, మిలియన్ల మంది అమెరికన్ల జీవితాలకు భారీ నష్టం కలిగించింది. ఈ సంతకంతో ప్రభుత్వం ఇప్పుడు సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభిస్తుంది. జీవన వ్యయాన్ని తగ్గించడానికి, ప్రజా భద్రతను పునరుద్ధరించడానికి ప్రభుత్వం పనిచేస్తోంది" అని ట్రంప్ పేర్కొన్నారు. షట్‌డౌన్ కారణంగా అక్టోబరు 1 నుంచి ఫెడరల్ ఉద్యోగులకు జీతాలు నిలిచిపోయాయి. అల్పాదాయ వర్గాలకు అందే ఆహార సదుపాయాలు నిలిచిపోయాయి. వేతనాలు లభించకపోవడంతో చాలా మంది ఉద్యోగులు విధులకు హాజరు కాలేదు. దీంతో విమానయానం సహా పలు రంగాలు తీవ్రంగా ప్రభావితమైన సంగతి తెలిసిందే.

అమెరికన్లకు శిక్షణ కోసమే హెచ్1బీ వీసాలు

- నైపుణ్యాలు నేర్పించాక వీసాదారులు స్వదేశాలకు వెళ్లాలన్నదే ట్రంప్ ప్రణాళిక
- ఆర్థిక మంత్రి బెసెంట్ వ్యాఖ్యలు



న్యూయార్క్: అమెరికాలో నిపుణుల కొరత ఉందంటూ హెచ్1బీ వీసా విధానంపై అధ్యక్షుడు ట్రంప్ స్వరం మార్చిన మరుసటి రోజే ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికన్లకు శిక్షణ ఇచ్చిన అనంతరం వీసాదారులను వారి స్వదేశాలకు పంపించి వేయాలన్నదే ట్రంప్ ప్రణాళిక అని వెల్లడించారు. హెచ్1బీ వీసా విధానంపై ట్రంప్ వ్యాఖ్యల గురించి అడిగిన ప్రశ్నకు బెసెంట్ ఈ సమాధానమిచ్చారు. "నైపుణ్యం ఉన్నవారికే అమెరికాలో ఉద్యోగాలు వస్తాయి. విదేశీ కార్మికులను ఇక్కడకు తీసుకువచ్చి వారితో అమెరికన్లకు శిక్షణ ఇప్పించాలి. మూడు నుంచి ఏడేళ్ల తర్వాత వారు తిరిగి స్వదేశానికి వెళ్లిపోవాలి. అప్పుడు అమెరికన్లకు ఉద్యోగాలు దొరుకుతాయి. 20-30 ఏళ్లుగా అమెరికాలో తయారీరంగం మందకొడిగా సాగుతోంది. కొన్నేళ్లుగా ఇక్కడ నౌకలను నిర్మించడంలేదు. సెమీకండక్టర్ పరిశ్రమనూ అమెరికాకు తీసుకురావాలని అనుకుంటున్నాం" అని బెసెంట్ తెలిపారు.

- మరోవైపు, దేశంలో వీసా కార్యక్రమాలు కొనసాగుతాయని అమెరికా అంతర్గత భద్రతా విభాగం కార్యదర్శి క్రిస్తీ నియోమ్ తెలిపారు.

ఫిబ్రవరి 12 నుంచి సీఐఎస్‌సీఈ పరీక్షలు

దిల్లీ: కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ (సీఐఎస్‌సీఈ) బోర్డు పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 12 నుంచి ఏప్రిల్ 6 వరకూ 12వ తరగతి, ఫిబ్రవరి 17 నుంచి మార్చి 30 వరకూ 10వ తరగతి పరీక్షలు జరుగుతాయి. 2.6 లక్షల మంది విద్యార్థులు ఐసీఎస్ఈ (10వ తరగతి), 1.5 లక్షల మంది విద్యార్థులు ఐఎస్‌సీ (12వ తరగతి) పరీక్షలకు హాజరవుతారు.

ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్ మేమే అందిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

విస్తృత అవకాశాలు ఉన్నాయి. ప్రతిపాదనలతో వస్తే ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై చర్చించుకుందాం. వచ్చే ఏడాది భాగస్వామ్య సదస్సుకు రావాలని ఇప్పుడే మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం' అని సీఎం పేర్కొన్నారు. సమావేశంలో ఆర్మేనియా ఆర్థిక వ్యవహారాల మంత్రి గివార్గ్, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల ప్రతినిధులు, భారత్ ఫోర్జ్ వైస్ ఛైర్మన్ అమిత్ కళ్యాణి, వివిధ కంపెనీల ఛైర్మన్లు, సీఈవోలు, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇండియా-యూరప్ బిజినెస్ పార్టనర్‌షిప్ రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన ప్రముఖులు

సురక్షిత నగరం విశాఖ

'విశాఖ శుభ్రమైన, సురక్షితమైన నగరం. మహిళలకు రక్షణ కల్పించే నగరాల్లో దేశంలోనే మొదటిస్థానంలో ఉంది. రాబోయే నాలుగేళ్లలో ఇక్కడ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుచేస్తుంది. ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి స్వర్గధామంలా నగరాన్ని అభివృద్ధి చేస్తాం. డ్రోన్ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు డ్రోన్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. ప్రైవేట్ రంగంలో స్పేస్ అప్లికేషన్లను ప్రోత్సహించేందుకు స్పేస్ సిటీ ఏర్పాటుచేస్తున్నాం. ఉపగ్రహాలను ప్రయోగించే ప్రైవేటు కంపెనీలకు ఏపీలో అవకాశాలున్నాయి. ప్రయోగాలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలూ సిద్ధంగా ఉన్నాయి' అని వివరించారు.

లాజిస్టిక్ ఖర్చులు తగ్గించేలా..

'లాజిస్టిక్స్ అభివృద్ధికి మాకు దార్శనిక ప్రణాళిక ఉంది. తూర్పుతీరంలో పోర్టులు మాకున్న అదనపు బలం. హబ్ అండ్ స్పోక్ విధానంలో ప్రతి 50 కి.మీ.లకు ఒక పోర్టు, హార్బర్, ఇతర మారిటైమ్ కార్యకలాపాల యూనిట్లను అభివృద్ధి చేస్తాం. మూడు పెద్ద విమానాశ్రయాలు ఉన్నాయి. గంట వ్యవధిలో జాతీయ, అంతర్జాతీయ ప్రాంతాలకు కనెక్టివిటీ కల్పించేలా సేవలు అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. రైల్వే, ఎయిర్ పోర్టులతో పాటు దేశంలోని ప్రధాన నగరాలకు ఏపీలోని పోర్టులను అనుసంధానించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. వాటితోపాటు లాజిస్టిక్స్ పార్కులు అభివృద్ధి చేస్తాం. దేశంలో నౌకా నిర్మాణ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు అవకాశం ఉంది. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించాలన్నది మా లక్ష్యం. ఏపీలో సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయి. వాటిని ప్రోత్సహించేలా పాలసీలు తీసుకొచ్చాం. రాబోయే ఆరేడేళ్లలో దేశ లక్ష్యానికి అనుగుణంగా ఏపీలో 160 గిగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. హరిత ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని భావిస్తున్నాం. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రంలో ఏర్పాటయ్యే డేటా సెంటర్లకు అవసరమైన 6,000 మెగావాట్ల విద్యుత్‌ను గ్రీన్ ఎనర్జీ రూపంలోనే అందిస్తాం' అని చెప్పారు.

మమ్మల్ని ఎవరూ అందుకోలేరు


- ✦ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎవరూ మమ్మల్ని అందుకోలేరు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి మేలు జరిగేలా దరఖాస్తు చేసుకున్న వెంటనే అన్ని అనుమతులు ఇస్తాం. పెట్టుబడులు కార్యరూపంలోకి తెచ్చే వరకు ఒక నోడల్ అధికారిని నియమిస్తాం.
- ✦ ప్రీమియర్ ఎనర్జీస్‌కు ఒక్క ఫోన్‌కాల్, ఒక్కటే సమావేశంతో 45 రోజుల్లో అన్ని అనుమతులూ ఇచ్చేశాం. ఆ సంస్థ రూ.6 వేల కోట్ల పెట్టుబడితో తయారీ యూనిట్‌ను ఏపీలో ఏర్పాటు చేస్తోంది. దీంతో 3,500 మందికి ఉపాధి లభిస్తుంది.
- ✦ రిలయన్స్ సంస్థ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బెవరేజస్ యూనిట్‌ను ఏపీలోని కర్నూలులో ఏర్పాటు చేస్తోంది. సెప్టెంబర్‌లో దరఖాస్తు చేస్తే వెంటనే అనుమతులిచ్చాం. పనులు ప్రారంభించారు. వచ్చే ఫిబ్రవరి నాటికి ఉత్పత్తిలోకి వస్తుంది.
- ✦ గూగుల్ సంస్థకూ రోజుల వ్యవధిలోనే అనుమతుల ప్రక్రియ పూర్తి చేశాం. త్వరలో భూమిపూజ నిర్వహించబోతున్నాం.
- ✦ ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు ఏపీలో రూ.1.30 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఇది దేశంలోనే అతిపెద్ద పెట్టుబడి. త్వరలోనే ఈ పరిశ్రమకు భూమిపూజ చేయబోతున్నాం. మా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఇవీ సాక్ష్యాలు.

నేను మార్కెటింగ్ చేయడం లేదు

'నేనేదో మార్కెటింగ్ చేసుకునే ఉద్దేశంతో ఇవన్నీ చెప్పడం లేదు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి విస్తృత అవకాశాలతో ఏపీ గేట్‌వేగా ఉంది. పారిశ్రామిక ఉత్పత్తులు, విద్య, వైద్యం, పర్యాటకం, ఆహారశుద్ధి రంగాల్లో పెట్టుబడులు పెట్టొచ్చు. 10 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం. అరకు కాఫీ ఇప్పుడు గ్లోబల్ బ్రాండ్‌గా మారింది. భారత్‌లో ఉత్పత్తి అయ్యే ఆక్వా ఉత్పత్తుల్లో 50 శాతం ఏపీ నుంచే వస్తున్నాయి. రెండు, మూడు రోజులు మీరు ఇక్కడే ఉండి.. ఏదో ఒక పెట్టుబడి పెట్టేందుకు ఆలోచన చేయండి. మీరు ముందుకొస్తే మిగిలినవారూ పెట్టుబడులపై దృష్టి పెడతారు' అని సీఎం పేర్కొన్నారు.

అమరావతిలో అత్యాధునిక కార్-టి క్యాన్సర్ చికిత్స

- కార్-టి సెల్స్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయనున్న హీలిక్స్ సెల్
- విశాఖ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ



డాక్టర్ మురళీకృష్ణ

ఈనాడు, అమరావతి: అత్యాధునిక క్యాన్సర్ చికిత్సా విధానమైన 'కైమెరిక్ యాంటీజెన్ రిసెప్టర్ టి-సెల్ (కార్ టి) థెరపీ'లో వినియోగించే కార్-టి సెల్స్ తయారీ, శిక్షణ కేంద్రాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటుచేసేందుకు 'హీలిక్స్ సెల్' అనే సంస్థ ముందుకొచ్చింది. విశాఖలో నేడు ప్రారంభంకానున్న పెట్టుబడిదారుల సదస్సులో ఏపీ ఎన్‌ఆర్‌టీ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకోనుంది. అమెరికాలోని ప్రఖ్యాత 'ఎండి ఆండర్సన్ క్యాన్సర్ సెంటర్'లో సెల్ థెరపీ, ట్రాన్స్‌ప్లాంటేషన్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ కొడాలి మురళీకృష్ణ కార్-టి సెల్ జీన్ టెక్నాలజీని అభివృద్ధి చేసి, ఈ కంపెనీని ప్రారంభించారు. విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుకున్న మురళీకృష్ణ 2000 సంవత్సరంలో అమెరికా వెళ్లి సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీలో మాస్టర్స్, షికాగోలో ఇంటర్నల్ మెడిసిన్‌లో రెసిడెన్సీ, వాషింగ్టన్ యూనివర్సిటీలో ఆంకాలజీ, హెమటాలజీలో ఫెలోషిప్, స్టాన్‌ఫర్డ్‌లో సెల్ థెరపీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్ చేశారు. అమరావతిలో కార్-టి సెల్ తయారీ కేంద్రం నెలకొల్పి ఈ చికిత్స ఖర్చును తగ్గించి సామాన్యులకు అందుబాటులోకి తేవడం తమ లక్ష్యమని మురళీకృష్ణ చెబుతున్నారు.

గ్రహం అనుగ్రహం 14-11-2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం

దశమి: తె. 3-34 తదుపరి ఏకాదశి; పుబ్బ: రా. 12-57 తదుపరి ఉత్తర
వర్జ్యం: ఉ. 8-34 నుంచి 10-13 వరకు; **అమృత ఘడియలు:** సా. 6-24 నుంచి 8-02 వరకు; **దుర్ముహూర్తం:** ఉ. 8-22 నుంచి 9-07 వరకు; తిరిగి మ. 12-06 నుంచి 12-51 వరకు; **రాహుకాలం:** ఉ. 10-30 నుంచి 12-00 వరకు; **సూర్యోదయం:** ఉ.6.08; **సూర్యాస్తమయం:** సా.5.21

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	14.4	30.2
విశాఖపట్నం	19.0	29.0
శ్రీకాకుళం	19.0	30.0
కడప	19.0	31.0
అనంతపురం	19.7	33.0
విజయనగరం	20.0	29.0
కర్నూలు	20.2	33.4
రాజమహేంద్రవరం	21.0	35.5
నరసాపురం	22.4	32.6
విజయవాడ	23.0	29.6
ఒంగోలు	23.6	31.1
గుంటూరు	24.0	31.0
నెల్లూరు	25.5	30.8

రూ.82 వేల కోట్లతో రెన్యూ పవర్ ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

ముందుకొచ్చింది. విశాఖలో సీఎం చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో గురువారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. చంద్రబాబుతో రెన్యూ పవర్ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా సమావేశమయ్యారు. పునరుత్పాదకత, ఇంధన రంగంలో ఏపీ ముందంజలో ఉందని, పర్యావరణ పరిరక్షణతో పాటు వినియోగదారులకు విద్యుత్తును తక్కువ ధరకు అందించడమే తమ లక్ష్యమన్నారు. పెట్టుబడుల విషయంలో ఏపీ ప్రభుత్వం అత్యుత్తమ విధానాల్ని అనుసరిస్తోందని, వేగంగా అనుమతులిస్తూ ప్రోత్సహిస్తోందని సుమంత్ సిన్హా కొనియాడారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖకు వస్తున్న నేపథ్యంలో... విద్యుత్తు డిమాండ్‌ను తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని వదిలి వెళ్లిన పెద్ద సంస్థ తిరిగి పెట్టుబడులు పెట్టడానికి వస్తోంది... అంటూ మంత్రి లోకేశ్ బుధవారం 'ఎక్స్'లో ముందుగానే ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన రెన్యూ పవర్ తిరిగి ఇంధన రంగంలో భారీ పెట్టుబడులతో వచ్చింది. రూ.60 వేల కోట్ల విలువైన నాలుగు ఎంఓయూలు కుదుర్చుకుంది. గతంలో రూ. 22 వేల కోట్లను పెట్టేందుకు సిద్ధమైన రెన్యూ సంస్థ పెట్టుబడులు తాజా ఒప్పందాలతో కలిపి రూ.82 వేల కోట్లకు చేరాయని లోకేశ్ పేర్కొన్నారు. ఒప్పందంలో భాగంగా 6 గిగావాట్ల ఇంగాట్-వేఫర్ ప్లాంట్, 2 గిగావాట్ల పంప్డ్ హైడ్రో ప్రాజెక్టు, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా సామర్థ్యం, 5 గిగావాట్ల విండ్-సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం, హైబ్రిడ్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. తాజా ఎంఓయూల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేలకు పైగా ఉద్యోగాలు రాష్ట్ర యువతకు లభిస్తాయి. రెన్యూ పవర్ ఇప్పటికే అనంతపురం జిల్లాలో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఒకటైన 2.8 గిగావాట్ల విద్యుత్తు ప్లాంటును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో 1.8 గిగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్ ఉన్నాయి. దీంతోపాటు 2 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టంను ఏర్పాటు చేయనుంది.

రైతులతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు యోచన

వ్యవసాయయోగ్యం కాని భూములు, బీడు భూముల్లో రైతులు... సోలార్, విండ్ విద్యుత్తును ఉత్పత్తిచేస్తే ఎంత మేర లాభదాయకంగా ఉంటుంది? ఎకరానికి ఎంత ఆదాయం వస్తుంది? అనే అంశాలపై సుమంత్ సిన్హాతో సీఎం చర్చించారు. సోలార్ ప్యానెళ్ల ధరలు అధికంగా ఉన్నందున వాటి తయారీ యూనిట్లను రాష్ట్రంలో పెద్దఎత్తున నెలకొల్పేందుకు ప్రోత్సహిస్తామని చంద్రబాబు చెప్పారు.

ఇది ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు

ఎంఓయూ తర్వాత సుమంత్ సిన్హా మాట్లాడుతూ... 'ఆరు సంవత్సరాల తర్వాత మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెడుతున్నామని రెన్యూ గర్వంగా ప్రకటిస్తోంది. ఈ ప్రాజెక్టు ప్రతిష్ఠాత్మకమైనది. ప్రముఖ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థలు మళ్లీ ఏపీకి తిరిగి వస్తున్నాయి. రాష్ట్ర విద్యుత్తు రంగ శ్వేతపత్రం ప్రకారం.. 2019 నుంచి 2024 మధ్య కొత్త పునరుత్పాదక సంస్థలు ఏపీ రాలేదు. కానీ నేడు కొత్త అధ్యాయం మొదలైంది. ఏపీలో అమలవుతున్న నూతన విధానం, దార్శనిక నాయకత్వం కారణంగా పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులొస్తున్నాయి' అని చెప్పారు.


ఈనాడు

సురక్షిత బాల్యమే దేశానికి పెన్నిధి

'పూలమొగ్గల వంటివారు పిల్లలు. ప్రేమగా కంటికి రెప్పలా వారిని కాచుకోవాలి' అని జాతికి ఉద్బోధించారు చాచా నెహ్రూ. అలా నిరంతరం కనిపెట్టుకుని ఉండే అమ్మానాన్నల ఆప్యాయతానురాగాల నడుమ ఆటపాటలూ చదువులతో సాగే బాల్యం మధుర జ్ఞాపకాలెన్నింటినో మూటకట్టిస్తుంది. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరడానికి, సమాజంలో ఉత్తమ పౌరులుగా మెలగడానికి అదే తోవ చూపిస్తుంది. మన చిన్నారులందరూ అంతటి అదృష్టానికి నోచుకుంటున్నారా అంటే, 'లేదు' అని చెప్పుకోవాల్సి రావడమే దురదృష్టకరం! 2024-25 యూడైస్ ప్లస్ నివేదిక ప్రకారం దేశీయంగా మాధ్యమిక స్థాయిలో డ్రాపౌట్ల రేటు 3.5 అయితే- సెకండరీలో అది 8.2గా నమోదైంది. దుర్భర పేదరికంతో మధ్యలోనే బడి మానేస్తున్న పిల్లలెందరో వెట్టిచాకిరిలో మగ్గిపోతున్నారు. నానాటికీ మరోవైపు- కాస్తంత ఆటవిడుపునకూ అవకాశం లేని బట్టీ చదువులు, తల్లిదండ్రుల ఆకాంక్షల బరువును భరించలేక ఎంతోమంది విద్యార్థులు మానసికంగా నలిగిపోతున్నారు. బలవన్మరణాలకూ పాల్పడుతున్నారు. గడచిన దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా లక్ష మందికిపైగా అలా కడతేరిపోయారు. ఇక స్కూళ్లకూ చేరుతున్న మాదకద్రవ్యాలు నవతరాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. అలా ఎన్ని విధాలుగా బాల్యం బలిపీఠంపైకి నెట్టుకుపోతున్నారు!

మంచి పోషకాహారం లభిస్తే, అదే బాలబాలికలను శారీరకంగా, మానసికంగా బలంగా తీర్చిదిద్దుతుంది. కానీ, 'పోషణ్ ట్రాకర్' డేటాను పరిశీలిస్తే- ఆసేతు హిమాచలం అయిదేళ్లలోపు చిన్నారుల్లో 37శాతం మంది గిడసబారిపోయిన చేదునిజం కళ్ల ముందు నిలుస్తుంది. ఈ దుర్భరత్వం ఎన్నో రోగాలకు అంటుకడుతోంది. మన దేశంలో అయిదేళ్లలోపే ప్రాణాలు పోగొట్టుకుంటున్న పసివారిలో 69శాతం మంది మరణాలకు పోషకాహార లోపమే ప్రధాన కారణం! ఒకపక్క చిన్నారులెందరో సరైన తిండి లేక అల్లాడుతుంటే- ఇంకోపక్క విపరీతమైన జంక్‌ఫుడ్ వినియోగంతో మరెందరి బాల్యమో బరువెక్కిపోతోంది. మధుమేహం, బీపీ, గుండెజబ్బులకు అది ఆవాహన పలుకుతోంది. ఇండియాలో 3.3 కోట్ల మంది పిల్లలు అధిక బీఎంఐ పరిధిలో ఉన్నారని, తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే 2030 నాటికి వారి సంఖ్య అంతకు రెండున్నర రెట్లకు పైగా చేరే ప్రమాదముందని యునిసెఫ్ ఇటీవలే హెచ్చరించింది. పోషకాహారం అందుబాటులో అసమానతల నివారణపై ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోతే... వ్యాయామ విద్యకు ప్రాధాన్యమివ్వకపోతే దేశ ప్రగతే దెబ్బతినిపోతుంది!

చిన్నారులపై నేరాలకు సంబంధించి 2023లో దేశీయంగా 1.77 లక్షల కేసులు నమోదయ్యాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఆ అకృత్యాలు తొమ్మిది శాతం పెరిగాయి. మొత్తం కేసుల్లో 45శాతం అపహరణలే ప్రమేయమున్నవే! ఇండియాలో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక చిన్నారి అదృశ్యమవుతున్నట్లు అంచనా. వారిలో చాలామంది మళ్లీ తిరిగి ఇంటికి చేరట్లేదు. జనసమ్మర్ద ప్రాంతాల్లో మాటువేస్తున్న నేరముఠాలు అన్నెంపున్నెం ఎరగని పిల్లలను ఎత్తుకుపోయి తమ స్వార్థానికి వాడుకుంటున్నాయి. ఒక పట్టాన తేలని పోక్సో కేసులు కిరాతకులకు అయాచిత వరాలవుతున్నాయి. ఇప్పటికే కొనసాగుతున్న బాల్యవివాహాలు చిట్టితల్లుల జీవితాల్లో నిప్పులు పోస్తున్నాయి. ఇదే సమయంలో ఇంటర్నెట్, ఓటీటీల్లో పోటెత్తుతున్న అశ్లీల, హింసాత్మక చిత్రాలకు ఆకర్షితులవుతున్న కొందరు పిల్లలు దారుణ నేరాలకు ఒడిగడుతున్నారు. సమాజ సమష్టి వైఫల్యానికి ఇవన్నీ నిదర్శనాలు. సురక్షిత బాల్యమే ఏ దేశానికైనా పెన్నిధి. కాబట్టి, ఆరోగ్యకర వాతావరణంలో పిల్లలు స్వేచ్ఛగా ఎదిగేలా చూడాలన్న రాజ్యాంగ నిర్దేశాన్ని ప్రభుత్వాలు శిరసావహించాలి. బాలల దినోత్సవం సందర్భంగా నేడు అవి ఆ మేరకు సంకల్ప దీక్ష బూనాలి!



విద్య ప్రధానోద్దేశం- నేర్చుకున్న జ్ఞానాన్ని వ్యక్తిగత ప్రయోజనంతో పాటు సంఘానికి పనికొచ్చేలా ఉపయోగించడం. ఇవాళ్టి పిల్లలే రేపటి పౌరులు. వాళ్లను మనం పెంచే తీరు, నేర్పే విద్యపై రేపటి దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

– జవహర్‌లాల్ నెహ్రూ

పుత్రధర్మం

తల్లిదండ్రులపట్ల దయగల సంతానాన్ని పొందేందుకు పూర్వం యజ్ఞయాగాదుల వంటివి నిర్వహించేవారు. పరమ పవిత్రమైన భావనతో కార్యం చేపడితే తప్పక ఫలిస్తుంది. అందుకే లోక కల్యాణ కారకుడైన బిడ్డకోసం దశరథుడు పుత్ర కామేష్టి యాగం నిర్వహించాడు. అటువంటి సత్సంతాన భాగ్యం కలిగిన తల్లిదండ్రుల జీవితాలు ధన్యం.

నాన్నంటే ఆకాశం. అమ్మంటే భూమి. ఆ రెండింటి మధ్య అనంత సృష్టి రహస్యాలకు వారధులు పిల్లలు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా వారిపట్ల బాధ్యతగా ఉండటం బిడ్డల ధర్మం. అమ్మానాన్నల మాట పెడచెవిన పెట్టిన రావణుడి అంతిమ ఘడియలు ఎటువంటివో రామాయణ మహాకావ్యం చెబుతుంది. గీతామృత ప్రదాత శ్రీకృష్ణుడి కుమారుడైన సాంబుడు తండ్రి మాటను వ్యతిరేకించడం వల్ల యాదవ వంశానికి ముప్పు వాటిల్లింది. జైన గ్రంథాలలో కూడా కన్నవారి మాట వినని పిల్లల పనుల పర్యవసానాలు ఎలా ఉంటాయో విశదంగా చెప్పారు. తల్లిదండ్రులను దేవతల స్థానంలో ఉంచి కొలవడం భారతీయ సంస్కృతిలో భాగం. వారి పట్ల కృతజ్ఞతతో కూడిన సేవను 'పుత్రధర్మం'గా భావిస్తారు. ఈ ధర్మాన్ని నిర్వర్తించడం బాధ్యత మాత్రమే కాదు. అదో ఆధ్యాత్మిక సాధన. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మశాస్త్రాలు, పురాణాలు అన్నీ ఈ విషయాన్ని చెబుతాయి.



అంతర్యామి

తైత్తిరీయ ఉపనిషత్తులోని 'మాతృ దేవోభవ, పితృ దేవోభవ' అనే వాక్యం అర్థం చేసుకునే స్థాయిని మించి అనుభవించే స్థాయిలో ఉంటుంది. తల్లిదండ్రుల పట్ల ప్రేమగా వ్యవహరించడం సంతానం కర్తవ్యం. దాన్ని సదా గుర్తుచేసేందుకే మనుస్మృతిలో, గౌతమ ధర్మసూత్రాల్లో, భరత, భీష్మ వంటి మహానుభావుల ఉపదేశాల్లో తల్లిదండ్రుల సేవకు అత్యున్నత స్థానం ఇచ్చారు. అలా సేవ చేసిన శ్రవణ కుమారుణ్ని ఎప్పటికీ మరచిపోలేం. ఇది కేవలం కర్తవ్య నిబద్ధత కాదు, భక్తి సంపత్తి. భారతంలో భీష్ముడు తల్లి గంగకు విధేయత చూపిన విధానం కూడా పుత్రధర్మానికి ప్రత్యక్ష ఉదాహరణ.

ఆధ్యాత్మికంగా చూస్తే, మాతృమూర్తి శక్తి స్వరూపిణి. తల్లి ప్రేమలో దయ కనిపిస్తుంది. తండ్రి దండనలో బాధ్యత ఉంటుంది. ఈ ఇద్దరిలో భగవద్గుణాలు ప్రతిఫలిస్తాయి. వారికి సేవ చేయడం ద్వారా భగవంతుడికి సేవ చేసిన ఫలితం లభిస్తుంది. తల్లిదండ్రుల ఆశీస్సులు లేకుండా గురువు, దేవతల అనుగ్రహాన్ని పొందలేం. వారి ఆశీర్వాదమే సద్గతి దిశగా నడిపించే దీపం. తల్లిదండ్రులను సేవించడమంటే కేవలం భౌతిక అవసరాలు తీర్చడం కాదు. మానసికంగానూ చేరువవ్వాలి. ఒంటరితనాన్ని దూరం చేయాలి. వృద్ధాప్యంలో వారు ఎదుర్కొనే సమస్యలన్నిటికీ సాంత్వననివ్వగలిగితే... అదే నిజమైన పుత్రధర్మం. దీన్ని ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. జీవితాంతం కొనసాగించాలి. ఆ సేవలో కన్నవారి రుణం తీర్చుకునే భాగ్యమే కాదు, మన సొంత ఆత్మనెరిగే మార్గం కూడా దాగి ఉంది. తల్లిదండ్రుల ఆశీర్వాదం మన జీవితానికి లోకోత్తరమైన అర్థాన్ని అందిస్తుంది. పారమార్థిక జీవితానికి దారిచూపుతుంది.

– గొర్తి వాణీ శ్రీనివాస్



మన నేలలో అరుదైన సిరులు

నేడు ప్రపంచాన్ని డిజిటలీకరణ, హరిత ఇంధనాలు రూపాంతరం చెందిస్తున్నాయి. ఈ నిశ్శబ్ద విప్లవానికి అరుదైన లోహాలే(రేర్ ఎర్త్ మెటల్స్) చోదక శక్తులు. ఇరవయ్యో శతాబ్దపు అభివృద్ధిని చమురూ సహజ వాయువు శాసిస్తే, 21వ శతాబ్దాన్ని రేర్ ఎర్త్‌లు తీర్చిదిద్దబోతున్నాయి. ఈ విషయంలో భారత్‌ను ముందుకు నడిపించగల అరుదైన నిక్షేపాలు తెలుగు రాష్ట్రాల్లో ఉండటం విశేషం. వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడమే ఇప్పుడు చేయాల్సింది!

నేడు ఎన్నో రంగాల మనుగడకు అరుదైన లోహాలు తప్పనిసరిగా మారాయి. ముఖ్యంగా అంతరిక్ష, వైమానిక, రక్షణ, హైటెక్ పరిశ్రమలు... బయో మెడికల్, స్మార్ట్‌ఫోన్లు, 5జీ, 6జీ కమ్యూనికేషన్లు, ఎలక్ట్రిక్ వాహనాలకు అరుదైన లోహాలు, కీలక ఖనిజాలే ఆయువుపట్టు. ఈ అరుదైన లోహాలు మొత్తం 17 కాగా, వాటితోపాటు నికెల్, కోబాల్ట్, మాంగనీస్ వంటి వాటినీ కీలక ఖనిజాలుగా పరిగణిస్తున్నారు. వీటిపై పైచేయి సాధించిన దేశాలే 21వ శతాబ్దిలో అభివృద్ధినీ, రక్షణ వ్యూహాలనూ అదుపు చేయగలుగుతాయి. అరుదైన లోహాలు అయస్కాంత తత్వాన్నీ, ప్రకాశించే గుణాన్నీ, ఉత్ప్రేరక లక్షణాలనూ కలిగి ఉంటాయి. నింగిలోకి తొంగి చూసే రాడార్లు మొదలు... రోదసిని పరిశీలించే టెలిస్కోపుల వరకు అన్నింటా రేర్ ఎర్త్‌లను వాడతారు. రాకెట్ ఇంజిన్లు, శత్రు రాడార్లకు చిక్కకుండా దూసుకుపోయే స్టెల్త్ యుద్ధ విమానాలు, కచ్చితత్వంతో దాడులు చేసే డ్రోన్లు, క్షిపణులు, జలాంతర్గాముల నిర్దేశక వ్యవస్థలు... ఎలక్ట్రిక్ వాహనాలను(ఈవీలను) నడిపే మాగ్నెట్ల వరకు అన్నింటికీ అరుదైన లోహాలు అవసరం. ఒక్క ఈవీకి 3-5 కిలోల మాగ్నెట్లు కావాలి. అవి నియోడైమియం అనే అరుదైన లోహం, ఇనుము, బోరాన్‌ల మిశ్రమంతో తయారవుతాయి. ఒక ఎంఆర్ఐ యంత్రానికి రెండు వేల కిలోల రేర్ ఎర్త్ లోహాలు కావాలి. ఒక ఎఫ్-35 ఫైటర్ జెట్ 400 కిలోలు, ఒక అణు జలాంతర్గామి నాలుగు టన్నుల అరుదైన లోహాలను వినియోగించుకుంటాయి. రేర్ ఎర్త్ మెటల్స్ లేకపోతే ఆధునిక యుద్ధ యంత్రాంగం స్తంభించిపోతుంది.



ఆధిపత్యం చాటుతున్న చైనా

ఇవాళ ప్రపంచంలో 70శాతం అరుదైన లోహాల తవ్వకాలు చైనా చేతుల మీదుగానే జరుగుతున్నాయి. ఆ ముడి ఖనిజాలను శుద్ధిచేసి లోహాలను తయారుచేసే సామర్థ్యంలో 83శాతం, మాగ్నెట్ల ఉత్పత్తిలో 92శాతం డ్రాగన్ గుప్పిట్లోనే ఉన్నాయి. నేడు ఆర్థిక, రాజకీయ, వ్యూహపరమైన ఆధిక్యత సాధించడానికి రేర్ ఎర్త్ లోహాలే కీలకమవుతున్నాయి. ఈ లోహాల ఎగుమతులపై చైనా నియంత్రణ విధించినప్పుడు అమెరికా, ఐరోపాలలోని రక్షణ, హైటెక్ పరిశ్రమలు కలవరపాటుకు గురయ్యాయి. స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. తరవాత చైనా వాటి ఎగుమతులకు అంగీకరించినా... ఆధునిక సాంకేతికతలు, సరఫరా గొలుసులపై ఆ దేశ ఆధిపత్యమెంతో ప్రపంచానికి తెలిసొచ్చింది. అరుదైన లోహాల ప్రాధాన్యాన్ని గుర్తించిన భారత్ 2028 కల్లా ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ) కింద ఆరువేల టన్నుల రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీకి రూ.7,300 కోట్లు కేటాయించింది. 2023లో ఇండియా 26వేల టన్నుల మేర ఈ మాగ్నెట్లను దిగుమతి చేసుకుంది. మరో అయిదేళ్లలో ఈ దిగుమతులు రెట్టింపవుతాయని అంచనా.

భారతదేశంలో వచ్చే జనవరి నుంచి 500 టన్నుల రేర్ ఎర్త్ మాగ్నెట్లను తయారు చేయబోతున్న ఏకైక సంస్థగా హైదరాబాద్‌కు చెందిన 'మిడ్ వెస్ట్ ఎడ్వాన్స్‌డ్ మెటీరియల్స్' సంస్థ రికార్డు సృష్టించనుంది. ప్రస్తుత డిమాండ్‌లో ఇది కేవలం రెండు శాతాన్నే తీర్చగలిగినా, దీన్ని ఆశావహమైన ముందడుగుగానే చెప్పాలి. ఇక నుంచి సొంత గడ్డ మీదే అరుదైన లోహాలను కనుగొని, తవ్వితీసి, శుద్ధి చేయాలని భారత్ సంకల్పించింది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో అరుదైన, కీలక లోహ నిక్షేపాలు అపారంగా ఉండటం దేశానికి శుభకరం. భారత్‌లో మోనజైట్, బాస్ట్‌నెసైట్, అలానైట్ అనే రేర్ ఎర్త్ లోహాలు ఉండగా, వాటిలో మోనజైట్ ఇసుక అత్యంత ప్రధానమైనది. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో దాదాపు 37లక్షల టన్నుల మోనజైట్ ఇసుక ఉంది. ఒడిశాలో 30లక్షల టన్నులు, తమిళనాడులో 24.6లక్షల టన్నులు, కేరళ తీరంలో 18.4లక్షల టన్నుల వరకు మోనజైట్ నిక్షేపాలున్నాయి. కేరళ తన దగ్గర తక్కువ నిక్షేపాలే ఉన్నా, వాటిని వినియోగించడానికి మొట్టమొదటి పైలట్ ప్రాజెక్టును చేపట్టడం విశేషం. తెలుగు రాష్ట్రాలూ ఆ దిశగా అడుగులు వేయాల్సి ఉంది.

ఏపీ, తెలంగాణల్లో నిక్షేపాలు...

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఏడు అరుదైన లోహాలు ఉన్నాయని భారత భూగర్భ సర్వే సంస్థ(జీఎస్ఐ) కనుగొంది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వరకు సముద్ర తీర ఇసుకలో మోనజైట్, జిర్కోనియం ఉంటే... ప్రకాశం, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల్లో బాస్ట్‌నెసైట్, అలానైట్ నిక్షేపాలు పుష్కలంగా లభ్యమవుతున్నాయి. అనంతపురం-కర్నూలు బెల్ట్‌లో లిథియం; నెల్లూరు మైకా క్షేత్రాలు, అనంతపురంలో గ్రానైట్లలో బెరిలియంతో పాటు తగరం, టైటానియం ఉన్నట్లు తెలియవచ్చింది. ప్రకాశం జిల్లాలో నియోబియం, టాంటలం నిక్షేపాలున్నాయి. తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనుల మట్టి పొరల్లో డైస్ప్రోసియం, స్కాండియం అనే అరుదైన లోహాలున్నాయి. రాగి, గ్రాఫైట్, మాలిబ్డినం, టంగ్‌స్టన్ కూడా లభ్యమవుతున్నాయి. కాబట్టి, తెలుగు రాష్ట్రాల్లోని మట్టిలో మాణిక్యాల వంటి అరుదైన లోహాలు భారతదేశ స్వావలంబనకూ, ప్రగతికీ చోదకశక్తులు కాగలవు. ఇక్కడి అరుదైన ముడి ఖనిజాలను తవ్వితీసి, శుద్ధిచేసి, పరిశ్రమలకు అందించడానికి హైదరాబాద్‌లోని నాన్ ఫెరస్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ సేవలు కీలకం. ఆంధ్రప్రదేశ్‌లో విరివిగా లభ్యమయ్యే ఈ నిక్షేపాలను తవ్వితీసి, తుది ఉత్పత్తులుగా మార్చి, రేవుల ద్వారా ఎగుమతి చేయవచ్చు. తెలంగాణలోని పారిశ్రామిక, పరిశోధన-అభివృద్ధి, ఐటీ వసతులు అరుదైన లోహాల వినియోగానికి మేలిమి బాటలు వేయగలవు. కాబట్టి ఏపీ, తెలంగాణలు చేతులు కలిపి దక్కను ప్రాంతాన్ని అరుదైన లోహాలకు సిలికాన్ వ్యాలీగా మార్చేందుకు పూనుకోవాలి. తమ అరుదైన లోహ వనరులతో దేశ రక్షణను మరింత పటిష్ఠం చేయాలి.



డాక్టర్ బి.బాలభాస్కర్
మాజీ దౌత్యవేత్త, ఆర్థిక నిపుణులు

'ఈ కంపెనీ షేరు పెరుగుతుందనుకున్నా. సమయానికి డబ్బుల్లేవు. అంతలోనే మూడింతలైంది. నేను అనుకున్నప్పుడే అప్పోసొప్పో చేసి కొని ఉంటే ఎంత లాభం వచ్చేది ఇప్పటికి...'

షేర్లలో పెట్టుబడులు పెట్టేవాళ్ల నుంచి తరచు ఇలాంటి మాటలు వింటూనే ఉంటాం. నిజంగా స్టాక్ మార్కెట్‌లో ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకోవడం అందరికీ సాధ్యమేనా? ఒక ఇంటర్వ్యూలో వారెన్ బఫెట్‌ను పెట్టుబడుల్లో మీరు చేసిన తప్పులేవైనా ఉన్నాయా అని అడిగారు. దానికి ఆయన- 'నేను చేసిన పెద్ద తప్పిదాల్లో పెట్టుబడులు లేవు కానీ పోగొట్టుకున్న అవకాశాలు ఉన్నాయి' అని చెప్పారు. 'పెట్టుబడి పెడితే బాగుంటుందనుకునీ పెట్టకపోవడం వల్ల పది బిలియన్ డాలర్లకు పైగా లాభాలను కోల్పోయాను

అదీ మన మంచికే..!



అన్నారు. ప్రపంచంలోనే గొప్ప మదుపరిగా పేరొందిన ఆయనే అలా అన్నప్పుడు ఇక చిన్న ఇన్వెస్టర్లు ఎంత? ఆయన అనుభవం మనకు చెబుతున్న పాఠం ఏంటి? ఏ అవకాశాన్నీ వదులుకోకూడదనా? కానే కాదు!

బఫెట్ కానీ ఆయన స్నేహితుడు చార్లీ ముంగర్ కానీ చాలా కాలం టెక్నాలజీ స్టాక్స్‌కి దూరంగా ఉన్నారు. ఆఖరికి గూగుల్‌తో సహా. ఆయా సంస్థల ప్రభావాన్ని తమ సొంత వ్యాపారాల మీద చూశాక కూడా వాళ్లు ఒక నిర్ణయానికి రాలేకపోయారు. 'మేం నోట్లో వేలేసుకుని చూస్తూ కూర్చున్నాం' అని చెప్పారు ఒక సందర్భంలో ముంగర్. టెక్ సంస్థ నుంచి వినియోగ బ్రాండ్‌గా మారాకే వాళ్లు యాపిల్ షేర్లు కొన్నారు. టెక్ సంస్థల్ని వాళ్లు అధ్యయనం చేయకపోలేదు. నిజానికి కాస్త లోతుగా వెళ్తే కానీ అసలు విషయం అర్థం కాదు. 'సర్కిల్ ఆఫ్ కాంపిటెన్స్ ఇన్వెస్టింగ్' అని బఫెట్ ద్వారా పాపులర్ అయిన వ్యూహం గురించి ఇక్కడ తెలుసుకోవాలి. అంటే... మనకు బాగా తెలిసిన రంగాలకే పరిమితమవ్వాలి, తెలియని వ్యాపారాలకు దూరంగా ఉండాలీ అని అర్థం. ఈ సర్కిల్ ఆఫ్ కాంపిటెన్స్‌కి బయట ఉండేదాన్ని 'డోనట్ ఆఫ్ ఇన్‌కాంపిటెన్స్' అంటారు.


టెక్నాలజీ రంగం గతాన్ని పరిశీలిస్తే యాపిల్, గూగుల్ లాంటి సంపద సృష్టించిన సంస్థలు వేళ్లమీద లెక్కబెట్టే అన్ని ఉంటే, విఫలమై నష్టాల్లో కూరుకుపోయినవి వందల్లో ఉన్నాయి. ఛాన్స్ వదులుకోకూడదని అలాంటి ఏదో ఒక కంపెనీలో పెడితే నష్టమేగా. ఇంటినీ ఉద్యోగాన్నీ చూసుకుంటూ ఇలా పెట్టుబడుల పోర్టుఫోలియోని మేనేజ్ చేసే ఇన్వెస్టర్లు ప్రతి ఐడియా వెంట పరుగెత్తడం అసాధ్యం. లాంగ్‌టర్మ్ సక్సెస్ అనేది తెలివైన నిర్ణయాల వల్ల వస్తుంది కానీ ట్రెండ్స్ వెంట పరుగెత్తడం వల్ల రాదు. బఫెట్ అనుభవాల నుంచి నేర్చుకోవాల్సింది ఏంటంటే... అవకాశాన్ని కోల్పోతామేమోనన్న భయంతో కాకుండా మన సర్కిల్ ఆఫ్ కాంపిటెన్స్‌ని బట్టి ఇన్వెస్ట్ చేయాలి. అందుకే ముంగర్... 'అవకాశాల్ని కోల్పోవడం మనసులో గుచ్చుకుంటుంది కానీ, తెలియని బిజినెస్‌లలో పెట్టడం అంతకన్నా బాధాకరమైన రిస్క్' అనేవారు. ఆ మాత్రం క్రమశిక్షణను పాటించగలిగిన వారే లాంగ్‌టర్మ్ ఇన్వెస్టర్లుగా రాణించగలరు.

– విస్మయ



మొబైల్ ఉండాల్సిందే!

ఇంటర్నెట్‌లో శోధన, ఓటీటీల వీక్షణ, సోషల్ మీడియాలో విహారం ఇలా ఎన్నింటికో మొబైల్ ఫోన్ ఉపయోగపడుతోంది. ఈ క్రమంలో చాలా మంది చేతుల్లో సొంత సెల్‌ఫోన్లు కనిపిస్తున్నాయి. అయితే, పల్లెలతో పోలిస్తే పట్టణాల్లోని నవతరంలోనే మొబైల్ వినియోగం ఎక్కువగా ఉంది. దేశీయంగా 15-29 ఏళ్ల వయసు జనాభాలో మొబైల్ వాడుతున్నవారు... (శాతాల్లో)



(ఆధారం: కాంప్రహెన్సివ్ మాడ్యులర్ సర్వే-2025)

పిల్లల కోసం కొత్తగా రాయలేమా?

పుస్తకాలు పిల్లలకు బంగారు నేస్తాలు. ఒక్కొక్క దశలో ఒక్కో రకమైన సాహిత్యం చదువుకుంటూ పిల్లలు సహజంగా, సజావుగా ఎదగాలి. అలా ఎదగడానికి ఇరవై ఒకటో శతాబ్దపు బాలబాలికలకు తెలుగులో ఎలాంటి సాహిత్యం లభ్యమవుతోందని ప్రశ్నించుకుంటే ఆవేదనే మిగులుతుంది. పాత రోజుల్లో చందమామ, బొమ్మరిల్లు, బుజ్జాయి, బాలమిత్ర లాంటి ఎన్నో పత్రికలుండేవి. వాటితో పాటు భైరవ ద్వీపం, నేపాళ మాంత్రికుడు తరహా పాకెట్ సైజు పుస్తకాలు వచ్చేవి. వాటిని క్లాసులో పాఠ్యపుస్తకాల మధ్యలో దాచుకుని దొంగతనంగా చదివేవాళ్లం. ఆ పుస్తకాలు ఎప్పుడో మాయమైపోయాయి. అసలు బాలసాహిత్యం అంటేనే.. 'అబద్ధాలు ఆడకూడదు, పెద్దలను గౌరవించాలి, తల్లిదండ్రులను సేవించాలి' ఇలాంటి ఏదో ఒక నీతి ఉండాలనే భావన మన సమాజంలో నెలకొంది. కేవలం ఇలాంటి సంప్రదాయ అంశాలకే పరిమితం కాకుండా, ఇంగ్లిష్‌లో మాదిరిగా విస్తారమైన బాలసాహిత్యాన్ని తెలుగులోనూ సృష్టించాలి.

తెలుగులో ఆ రచనలేవీ?

ఇంగ్లిష్‌లో ఊహ లేదా ఫాంటసీ రచనలు, అన్వేషకుల గాథలు, సైన్స్, సైన్స్ ఫిక్షన్ సాహిత్యం, అపరాధ పరిశోధన, సాహసగాథలు.. ఇలా ఎన్నో సాహితీ విభాగాలు కనిపిస్తాయి. ఈ రకమైన వర్గీకరణ తెలుగు బాలసాహిత్యంలో పెద్దగా లేదు. పిల్లల మానసిక వికాసానికి ఊహే ఊపిరి. ఆ ఊహని పెంచే రచనలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. 2000 దశకంలో ఇంగ్లిష్‌లో బాలసాహిత్యానికి కొత్త ఊపిరి పోసిన పుస్తకమాల 'హారీ పాటర్'. టీవీ ప్రభావానికి లోనవుతున్న బాలలను మళ్లీ పుస్తక పఠనం వైపునకు తిప్పాయి జె.కె.రౌలింగ్ రచనలు. అలాంటి ఊహాప్రపంచపు పుస్తకాలు మన తెలుగులోనూ విరివిగా రావాలి. ఇక మానవ ప్రగతికి కారణం సాహసంతో కూడిన అన్వేషణ. అన్వేషుల కథలు పిల్లల మనసుల్లో గాఢమైన ముద్ర వేస్తాయి. మార్కోపోలో, కొలంబస్, వాస్కో డి గామా, జేమ్స్ కుక్ వంటివారు భూమిపై దిశదిశలా పర్యటించి కొత్త ప్రాంతాలను కనుగొన్నారు. వారిపై ఇంగ్లిష్‌లో కుప్పలు తెప్పలుగా పుస్తకాలు ఉన్నాయి. మన దగ్గర చోళులు వంటివారు కూడా విదేశీ ప్రాంతాలను జయించారు. జావా, సుమత్రా మొదలైన దీవులను కనుగొన్నారు. ఆ వివరాలన్నీ ప్రస్తుతం లభ్యమైతే చదువుకోవడానికి ఆసక్తికరంగా, తెలుసుకోవడానికి గర్వంగా ఉంటుంది. ఆ విశేషాలను పిల్లలకు అర్థమయ్యే రీతిలో భారతీయ భాషల్లోకి తెస్తే బాగుంటుంది.

ఇంగ్లిష్‌లో మూడేళ్ల బుడతల దగ్గర్నుంచి, పదిహేనేళ్ల పిల్లల వరకు చదువుకోవడానికి విస్తారమైన సాహిత్యం ఉంది. జపనీస్, కొరియన్ భాషల్లోనూ యాభై ఏళ్లుగా విస్తారమైన బాలసాహిత్యం వస్తోంది. కానీ, తెలుగులో గత రెండు మూడు దశకాల నుంచి బాలసాహిత్యం క్రమంగా క్షీణిస్తున్నట్లు కనిపిస్తోంది. పంచతంత్రం, జాతక కథలు, బీర్బల్, తెనాలి రామలింగడి కథలు.. లేకుంటే- పురాణ, ఇతిహాస గాథలు.. ఇవే బాల సాహిత్యం పేరిట పునర్ముద్రితం అవుతున్నాయి.



ఇంగ్లిష్‌లో పిల్లలకు సైన్స్ సాహిత్య సముద్రమే ఉంది. 1857లో ఇంగ్లాండ్‌లో మైకెల్ ఫారడే రసాయన శాస్త్రం గురించి పిల్లలకు సరదాగా చెప్పిన కథలు 'ఎ కెమికల్ హిస్టరీ ఆఫ్ క్యాండిల్' అన్న పేరుతో చిరస్మరణీయ పుస్తకంగా వెలువడ్డాయి. సోవియట్‌కి చెందిన మీర్ ప్రచురణల తెలుగు అనువాద పుస్తకాలు ఒక తరాన్ని ప్రభావితం చేసి సైన్స్ వృత్తుల దిశగా నడిపించాయి. యాకొవ్ పెరెల్‌మాన్ రాసిన 'ఫిజిక్స్ ఫర్ ఎంటర్‌టైన్‌మెంట్' పుస్తకం 'నిత్యజీవితంలో భౌతిక శాస్త్రంగా' అనువాదమైంది. ప్రస్తుత కాలంలో తెలుగులో అలాంటివి రాని లోటు స్పష్టంగా తెలుస్తోంది. బాలల కాల్పనిక విజ్ఞాన సాహిత్యం (సైన్స్ ఫిక్షన్) అనగానే ఆ రంగపు త్రిమూర్తులు ఐజాక్ అసిమోవ్, ఆర్థర్ క్లార్క్, రాబర్ట్ హైన్‌లైన్ గుర్తొస్తారు. వారి రచనలు చాలావరకు ప్రత్యేకంగా పిల్లల కోసం రాసినవి కావు. కానీ, వాటి స్ఫూర్తిగా పలు చిత్రాలు, పుస్తకాలు వచ్చాయి. తెలుగులో అలాంటివి తగ్గిపోవడం విచారకరం.

ఊహాశక్తికి పదును పెట్టాలి

చిన్నతనంలో ఏవో కలల లోకాల్లో తేలాడిన పిల్లలు, కాస్త పెద్దయ్యాక వాస్తవ ప్రపంచంతో తలపడటానికి సిద్ధమవుతుంటారు. తాము అంతవరకు చూసిన సాహితీ ప్రపంచంలోలాగా కాకుండా నిజ జీవితం అనుక్షణం ఓ పోరాటంలా కనిపిస్తుంది. పిల్లల్లో అలాంటి పోరాటాన్ని పరిచయం చేసేది అపరాధ పరిశోధనా సాహిత్యం. ఊహా (ఫాంటసీ) సాహిత్యంలోనూ సాహసం ఉన్నా, సాహసగాథా రచనకు, దానికీ మధ్య ఉన్న తేడా వాస్తవికత. సాహసగాథా సాహిత్యంలో దేవతలు, రాక్షసులు ఉండరు. ప్రకృతి సహజమైన ఉపద్రవాలు, క్రూరమృగాలు, దొంగలు మొదలైన సవాళ్లని ఎదుర్కొని లక్ష్యం దిశగా సాగే కథలివి. తెలుగులో ఊహాసాహిత్యం బాగానే ఉన్నా, ఈ రకమైన వాస్తవికతగల సాహసగాథా సాహిత్యం తక్కువగానే వస్తోంది. ఇంగ్లిష్‌లో బాలల చారిత్రక సాహిత్యం, భయపెట్టే రచనలు లాంటివీ ఉన్నాయి. తెలుగులోనూ భూత ప్రేతాలు, బ్రహ్మరాక్షసుల కథలున్నా అందులో భయం పాళ్లు తక్కువ. భయానక భూతాలు, జీవులను ఎదిరించి అనుకున్నది సాధించిన పాత్రలను చెప్పి పిల్లల్లో గుండె ధైర్యం నింపడం భయపెట్టే రచనల లక్ష్యం. ఇలాంటివన్నీ విస్తారంగా తెలుగులో వస్తే బాలసాహిత్యానికి కొత్త ఊపిరి పోసినట్లవుతుంది.



ప్రొఫెసర్ వి.శ్రీనివాస చక్రవర్తి
ఐఐటీ- మద్రాస్‌లో ఆచార్యులు

హాయ్! బుజ్జీ!!

ముందుగా అందరికీ 'హ్యాపీ చిల్డ్రన్స్ డే!' ఇది మా రోజు. ఈరోజు మాకు నచ్చినట్లుగా ఉంటాం. ఇవాళ అందరూ మమ్మల్ని చాలా స్పెషల్‌గా ట్రీట్ చేస్తారు కూడా! ఇంట్లో వాళ్లతో మాకు నచ్చినవి కొనిపించుకుంటాం. ఈసారి వాటన్నింటితో పాటు అమ్మానాన్నలకు, ఇంట్లో వాళ్లందరికీ కొన్ని విషయాలు చెప్పాలని అనుకుంటున్నాం.. వింటారు కదూ!

- **పోల్చొద్దు:** ఇంట్లో రోజూ మీరు చేస్తున్న పనులన్నీ చూస్తుంటాం కదా! మేం కూడా అలాగే మెల్లమెల్లగా కష్టపడటం అలవాటు చేసుకుంటాం.

మాకేం కావాలంటే..!



మీరు చెప్పినట్లు వింటాం. ఫోన్‌లో ఆటలు మానేసి చక్కగా అందరం కలిసి గ్రౌండ్‌లో ఆడుకుంటాం. మీరు మాత్రం మమ్మల్ని వేరే వాళ్లతో పోల్చి చూడకండి. అలా పోల్చి ఏదో ఒకటి అంటుంటే చాలా బాధగా అనిపిస్తుంది. ఇంకోసారి అలా చేయకండేం.

- **బలవంతం చేయొద్దు!:** ఏదైనా పని మాకు నచ్చితే మీరు చెప్పకుండానే చేసేస్తాం. కానీ మీరు ప్రతిసారీ ఆ పని ఎందుకు చేయట్లేదు.. ఇది ఎందుకు పట్టించుకోవట్లేదని గదమాయించొద్దు ప్లీజ్. దాంతో మేం చేయాలనుకుంది కూడా మర్చిపోతాం.
- **చెప్పండి.. కొట్టొద్దు..!:** మేం ఏదైనా పొరపాటు చేస్తే.. అలా చేయొద్దని నెమ్మదిగా చెప్పండి. అందులోని తప్పొప్పులను వివరించండి. అంతేగానీ కొట్టకండి. అలా చేస్తే మాకు చాలా భయమేస్తుంది.
- **తక్కువ చేయొద్దు..!:** ఒక పని చేయకపోతే లేదంటే పొరపాటుగా చేస్తే.. నీకు అసలు ఏ పనీ రాదంటూ తక్కువ చేసి మాట్లాడొద్దు. అందరికీ అన్ని పనులు రావాలనేం లేదు కదా!

మీరు మాకు కొత్త అలవాట్లు నేర్పించాలనుకోవడం మా మంచికేనని తెలుసు! కానీ, అవన్నీ అలవాటు కావడానికి కాస్త సమయం పడుతుంది.. అది మీకూ తెలుసు కదా! మా రిక్వెస్ట్‌ని అర్థం చేసుకుంటారుగా!

– మీ పిల్లలు



వసుంధర

vasundhara@eenadu.in

నేడు బాలల దినోత్సవం



పిల్లలకు... మీరే మార్గదర్శి!

నడక మొదలుపెట్టినప్పటి నుంచి నడత నేర్చేవరకూ తల్లిదండ్రులే పిల్లలకు మార్గనిర్దేశకులు కావాలి. వృత్తి, వ్యక్తిగత జీవితాల్లో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా, పిల్లల విషయంలో ఉదాహరణగా నిలవాలి తప్ప, ఉదాసీనత పనికిరాదు. పిల్లల వయసును బట్టి మీ బాధ్యతలూ మారతాయి! అవి తెలుసుకుంటూ వాళ్లకు బంగారు భవిష్యత్తు ఇవ్వడమే చిన్నారులకు మీరిచ్చే బహుమతి.

2-6 సంవత్సరాలు

పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలకు తొలి అడుగులు పడే కాలం ఇది. ఆడుకుంటూనే... తల్లిదండ్రులు ఏం చేస్తున్నారనేదానిపైన ఒక కన్నేసి ఉంచుతారు పిల్లలు. కాబట్టి వాళ్లకి మనమే మంచి నమూనా కావాలి.

- నచ్చిన పదార్థాలనే పదేపదే తినాలనుకుంటారు. కుదరకపోతే మారాం, హఠం చేస్తారు. నచ్చజెప్పే ఓపిక లేక అడిగినవి పెట్టేస్తున్నారా? అలా చేయకండి. పిల్లలు నూడుల్స్ అడిగితే వాళ్లతో పాటుగా మీరూ అవే తినండి. తర్వాత మీరేది తింటారో వాళ్లనీ అది తినమనండి.
- కచ్చితమైన ప్రవర్తనా నియమావళిని పాటించడానికి ఇష్టపడరు. అలాగని వదిలేస్తే ఇంకెప్పుడూ పాటించలేరు. కాబట్టి రోజూ నిర్దేశిత సమయానికే మేల్కోవడం, భోజనం చేయడం, చదువుకోవడం, నిద్రపోవడం లాంటివి... కుటుంబమంతా పాటించాలి.
- వీరిలో అబ్జర్వేషనల్ లర్నింగ్ ఉంటుంది. స్నేహితులూ, చుట్టాలూ ఎదురుగా ఉన్నప్పుడు ఆదరాభిమానాలు చూపి, పక్కకి వెళ్లగానే వారిపై విమర్శలు గుప్పించడం లాంటివి పిల్లలపై ప్రభావాన్ని చూపిస్తాయని మర్చిపోకండి.

6- 12 సంవత్సరాలు

ఈ వయసు పిల్లలపై కుటుంబ సభ్యులే కాకుండా ఇరుగుపొరుగు, స్కూల్లో టీచర్లు, తోటివారి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి పిల్లల ప్రవర్తనని తల్లిదండ్రులు గమనిస్తూనే ఉండాలి.

- స్కూల్లో, బయట రకరకాల వ్యక్తులు, వాళ్ల మనస్తత్వాలతో సర్దుబాటు చేసుకోవడంలో పిల్లలు ఇబ్బంది పడుతుంటారు. అకారణ విచారం, కోపం, ద్వేషం ప్రదర్శిస్తారు. ఎవరితో ఏ రకంగా సర్దుబాటు చేసుకోవాలో చెబుతూనే, ఉద్వేగాలను నియంత్రించుకోవడమూ నేర్పాలి.
- ఆడ-మగ వ్యత్యాసం, ఆర్థిక పరిస్థితులు, సాంఘికంగా వారిని చూసే విధానంపై అవగాహన ఏర్పడుతుంది. ఇది వారిలో ఆత్మన్యూనతకు లేదా అతి విశ్వాసానికి దారితీస్తుంది. పదిమందిలో అతిగా ప్రవర్తించడం లేదా కుంచించుకుపోవడం చేస్తుంటారు. ఈ సమయంలోనే సమాజ కట్టుబాట్లను, వాటి వెనక కారణాలను వివరిస్తూ సద్భావనను కలగజేయాలి.
- స్వీయ నైతికతను అభివృద్ధి చేసుకునే స్థితిలో ఉండరు, ఉండలేరు. చుట్టూ ఉన్న వాళ్లు, స్నేహితుల్ని అనుకరిస్తారు. స్నేహితులు, వాళ్ల భాష, సామాజిక స్థితి, ప్రవర్తన విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. అబద్ధాలాడే స్నేహితుడి గురించి మీ పిల్లవాడు చెబుతుంటే... ఖండిస్తూ అది ఎందుకు మంచిది కాదో వివరించాలి.

12-18 సంవత్సరాలు

ఎన్నో రకాల శారీరక, మానసిక మార్పులకు, వాటి ప్రభావాలకు గురవుతారు. తల్లిదండ్రుల ఓర్పుకి, పిల్లలపట్ల వారి ప్రేమకి పరీక్ష సమయం.

- తన ప్రవర్తనకు, ఇతరులు తన నుంచి ఆశించే ప్రవర్తనకు మధ్య తేడాను అర్థం చేసుకోవడంలో సంఘర్షణకు గురవుతారు. చదువు, భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో తమ సామర్థ్యంపట్ల అనుమానాలు వీళ్లలో భయాన్ని కలిగిస్తాయి. ఆ క్రమంలోనే అసహనానికి గురవుతారు. శారీరక మార్పుల వేగాన్ని అందుకోవడంలో మానసికంగా వెనక పడతారు. పిల్లలను అర్థం చేసుకుంటూ వారిలో వచ్చే మార్పులకు గల కారణాలను తెలుసుకుంటూ వాటిని ఎదుర్కోవడంలో సాయపడాలి.
- సినిమాల్లో చూపించే పాత్రల్ని అనుకరించడానికి ప్రయత్నిస్తారు. దానికి అడ్డుచెప్పే అమ్మానాన్నలపట్ల విముఖత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు తిట్టడం, కొట్టడం లాంటి చర్యలవల్ల పిల్లల్లో మార్పు రాదు. వాళ్లతో స్నేహంగా ఉంటూ మంచి, చెడులపట్ల అవగాహన కలిగించాలి.
- తల్లిదండ్రులు అర్థం చేసుకోరని పిల్లలు భావిస్తే... పిల్లలు తమ మాట వినటం లేదనీ, చేయి దాటిపోయారనీ అమ్మానాన్నలు ఆందోళన చెందుతారు. ఈ పరిస్థితిని సరిచేయాల్సింది తల్లిదండ్రులే. స్నేహితుల్ని కలవనిస్తూనే, టైమ్‌కి ఇంటికి చేరమని సూచించాలి. వచ్చాక ఏం చేశారో స్నేహపూర్వకంగానే తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. ఇలాంటి చర్యలు ఇద్దరి మధ్యా నమ్మకం ఏర్పడడానికి దోహదపడతాయి.

ప్రతి వ్యక్తిలో ఒక ప్రత్యేకత ఉంటుంది. దీన్ని తల్లిదండ్రులు గ్రహించి పిల్లలకు తోడ్పాటుని అందించడానికి ఈ బాలల దినోత్సవమే ప్రేరణ కావాలి.



- శ్రీదేవి శ్రీపాద, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

మందులు కొనసాగించాల్సిందేనా?

నాకు 35 ఏళ్లు. పీసీఓడీ ఉంది. మూణ్నెళ్ల క్రితం వరకూ మందులు కూడా వాడా. కానీ ఈ మధ్య నాకు విపరీతంగా మొటిమలు వస్తున్నాయి. హార్మోనుల్లో అసమతుల్యతే కారణమా? తగ్గాలంటే మందులు కొనసాగించడమే మార్గమా? - ఓ సోదరి

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర, గైనకాలజిస్ట్

మొటిమలు, జుట్టు రాలడం, అధిక బరువు, అవాంఛిత రోమాలు, పిగ్మెంటేషన్... ఇలా హార్మోనుల్లో అసమతుల్యత చాలా రకాలుగా కనిపిస్తుంటుంది. అయితే మొటిమలు, పిగ్మెంటేషన్ వంటివి కేవలం హార్మోనుల్లో తేడా కారణంగానే రావు. వంశ పారంపర్యం, చర్మసమస్యల వల్లా రావొచ్చు. ఓసారి చర్మ నిపుణులను కలవండి. వాళ్ల సలహా తీసుకోండి. అప్పటికీ తగ్గకపోతే అసమతుల్యతే కారణమా అన్నది నిర్ధారించుకోండి. పీసీఓడీ, నెలసరిలో ఇబ్బందులు అదుపులోకి రావడానికి మందులు, హార్మోనల్ థెరపీ వంటివి ఇవ్వడం సాధారణమే. అయితే అవి కొంత కాలానికే పరిమితమవ్వాలి కానీ దీర్ఘకాలం కొనసాగకూడదు. వాటిపైనే పూర్తిగా ఆధారపడితే శరీరంలో రక్తం గడ్డలు కట్టడం, మగత, బరువు పెరగడం వంటి దుష్ఫలితాలు వచ్చే ఆస్కారమూ ఉంది. కాబట్టి, ముందు నిపుణుల సలహాతో వ్యాయామాలు చేయడం, నూనెలేని ఆహారపదార్థాలు తినడం, మైల్డ్ సోప్‌లు లేదా క్రీములు వాడటం వంటివి చేయండి. జీవనశైలిలో మార్పులు చేసుకుని చూడండి. అంతేకానీ పూర్తిగా మందుల మీదే ఆధారపడతా అనుకోవడం మంచిది కాదు. ముందు ఎందుకు వచ్చాయో కనుక్కోండి. దాని ప్రకారం చికిత్స తీసుకోండి తప్ప... మీ అంతట మీరు నిర్ణయం తీసుకోవద్దు.

అమ్మ తోడుగా... అమ్మాయి స్టార్టప్!





బాలీవుడ్ నటిగానే కాదు... వ్యాపారవేత్తగానూ పేరు తెచ్చుకున్నారు సన్నీ లియోని. ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఆమెను 'మీ పిల్లల్ని కుటుంబ వ్యాపారంలో ప్రోత్సహిస్తారా?' అని అడిగారట. దానికామె 'తప్పకుండా! అయితే ఇదే చేయాలని మాత్రం నిర్దేశించను. వాళ్లు ఏది చేయాలనుకుంటే దానిలో ప్రోత్సహిస్తా'నని సమాధానమిచ్చారు. తాజాగా తన కూతురు నిషా కౌర్ వీబర్‌కి ఓ ఆలోచన వచ్చింది. సాధారణంగా టిష్యూ పేపర్‌ని ఉపయోగించాక చెత్తబుట్ట కోసం వెతకడం, దొరకనప్పుడు చేతిలోనో బ్యాగులోనో పెట్టుకుని బయట పడేయడం గమనించిందట ఆ తొమ్మిదేళ్ల అమ్మాయి. టిష్యూ బాక్సుకే డస్ట్‌బిన్ జత అయ్యి ఉంటే రోడ్లమీదకు ఇలా చెత్త చేరదు కదా అందట. తన ఆలోచనకే రూపమిచ్చి చెత్తబుట్ట కూడా అంతర్లీనంగా ఉండేలా తనతోనే టిష్యూ బాక్సుని డిజైన్ చేయించారట సన్నీ. 'బూ బాక్స్' పేరుతో దాన్ని మార్కెట్‌లోకీ తీసుకొచ్చారు. అలా కూతురి ఆలోచనని చిన్న స్టార్టప్‌గా తీసుకురావడమే కాదు... సంస్థ సోషల్‌మీడియా హ్యాండిల్‌నీ స్వయంగా నిర్వహిస్తున్నారు. బూ బాక్స్‌ని తన 'స్టార్ స్టక్' వెబ్‌సైట్‌లో అందుబాటులో కూడా ఉంచారు. 'పిల్లల చదువు పూర్తవ్వాలి, ఆ తరవాతే కెరియర్ నిర్మించుకోవాలన్న తీరుకు భిన్నంగా... ఆలోచనేదైనా ప్రోత్సహించాలి. అప్పుడే వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. భవిష్యత్‌లో మరిన్ని ప్రయోగాలు చేయగలుగుతా'రంటున్న సన్నీ ఆలోచనని అభినందించాల్సిందే కదూ!



"పిల్లలు... వీళ్లకేం తెలియదు అనుకుంటాం కానీ వాళ్లకీ బోలెడు అభిప్రాయాలు ఉంటాయి. మనం ఓపిగ్గా వినాలంతే. ఏదైనా చెప్పగలిగే స్వేచ్ఛ ఇచ్చి చూడండి. వాళ్లలో సృజనాత్మకత ఎంతుందో బయటపడుతుంది. అంతేకాదు, మన మీద వాళ్లకంటూ భరోసా ఏర్పడుతుంది. దీంతో వాళ్ల జీవితంలో జరిగే చిన్నా పెద్ద విషయాలు, సందేహాలు అన్నీ మనతో నిర్భయంగా పంచుకుంటారు. ఇది పిల్లలతో మన అనుబంధాన్ని పెంచడమే కాదు, వాళ్లూ జీవితంలో ఉత్తమ నిర్ణయాలు తీసుకోవడానికి సాయపడుతుంది. అందుకే ఎప్పుడూ మీరే మాట్లాడొద్దు. పిల్లలేం చెబుతున్నారో కూడా వినండి."

- ట్వింకిల్ ఖన్నా, నటి, రచయిత్రి

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

బంగారం - వెండి

13న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,30,510	1,17,550	1,66,668
విజయవాడ	1,26,535	1,17,150	1,68,600
ప్రొద్దుటూరు	1,26,400	1,16,290	1,67,500
రాజమహేంద్రవరం	1,27,800	1,17,150	1,82,000
విశాఖపట్నం	1,27,340	1,17,150	1,57,000
తమిళనాడు	-----	1,19,000	1,83,000

సులువుగా పనిచేసేలా!



ఒత్తిడితో చేసే పనులు, గంటల తరబడి కూర్చుని చేసే ఉద్యోగాలు, జంక్‌ఫుడ్... కారణం ఏదైతేనేం అధికబరువు, చిన్న పనికే అలసట వేధిస్తున్నాయి. దీంతో క్రమంగా శరీరమూ ఫ్లెక్సిబిలిటీని కోల్పోతుంది. అలాకాకుండా ఉండాలంటే...

- ఎంత తీరిక లేకున్నా సరే... ఉదయం సాయంత్రం కనీసం పదినిమిషాల పాటు స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయండి. ఉదాహరణకు హామ్ స్ట్రింగ్ స్ట్రెచ్, క్వాడ్రిసెప్స్, షోల్డర్ స్ట్రెచ్ వంటివి శరీర భాగాల కదలికను మెరుగుపరుస్తాయి. రోజువారీ పనులు సౌకర్యంగా చేసుకోగలుగుతారు.
- సూర్యనమస్కారాలతో పాటు తాడాసనం, త్రికోణాసనం, భుజంగాసన వంటి యోగ ప్రక్రియలు శరీరాన్ని సౌకర్యవంతంగా చేస్తాయి. రోజూ వీటికోసం కనీసం అరగంటైనా సమయం కేటాయించుకుంటే సరి.
- పిలాటీస్ కీలకమైన కండరాలను బలోపేతం చేయడంతోపాటు శరీరానికి చక్కటి వ్యాయామాన్ని అందిస్తాయి. అంతేకాదు, ఆర్మ్‌సర్కిల్స్, లెగ్‌స్వింగ్స్, టోర్సో ట్విస్ట్స్ వంటివి రక్తప్రసరణ మెరుగుపరుస్తాయి. శారీరక సౌలభ్యాన్ని పెంచుతాయి.

వీటన్నింటితోపాటు పోషకాహారం తీసుకోవడంపైనా దృష్టిపెట్టాలి. ముఖ్యంగా పాలు, గుడ్లు, పప్పు ధాన్యాలు, పండ్లు వంటివి డైట్‌లో చేర్చుకోవాలి. రోజూ 2-3 లీటర్ల నీరు తాగాలి.

ఆమె పాట... వాళ్ల గుండెచప్పుడు!



మధ్యతరగతి కుటుంబ నేపథ్యం. తండ్రి ఓ ప్రైవేట్ ఉద్యోగి. తల్లి గృహిణి. ఇలాంటి కుటుంబంలో పుట్టి పెరిగిన వారెవరైనా... సంపాదనే ధ్యేయంగా అడుగులు వేస్తారు కదా! కానీ గాయని **పలక్ ముచ్చల్** దీనికి అతీతంగా సేవే శ్వాసగా సాగిపోతున్నారు. ఈ సేవా ప్రస్థానం మొదలవ్వడానికి కారణం ఓ ఘటన అంటారీమె. అదేంటంటే... ఏడేళ్ల పలక్ స్టేజ్ షోలు చేసి బాధితులకు సహాయం చేస్తోందని తెలుసుకుని... తనని ఓ స్కూల్ యాజమాన్యం ఆశ్రయించింది. 'వాళ్ల స్కూల్లో చదువుతోన్న విద్యార్థి లోకేశ్ గుండె జబ్బుతో బాధపడుతున్నాడనీ... తన కోసం నిధులు సేకరించమనీ అడిగారు. నేనూ ఒప్పుకొన్నా. ఓ రద్దీ మార్కెట్‌లో షో నిర్వహించి రూ.51వేలు పోగుచేశా. ఆ విషయం తెలిసిన డాక్టర్ ఉచితంగానే సర్జరీ చేశారు. ఆ మొత్తం వేరేవాళ్లకి ఉపయోగపడాలని పత్రికలో ప్రకటన ఇచ్చాం. దాన్ని చూసి 33 మంది హృద్రోగులు మమ్మల్ని సంప్రదించారు. అప్పుడే నిర్ణయించుకున్నా వీలైనంత వరకూ ఇలాంటి వారందరికీ సర్జరీలు చేయించాలని. అందుకే నా తమ్ముడు పలాశ్‌తో కలిసి 'పలక్-పలాశ్ ఛారిటబుల్ ఫౌండేషన్', 'పలక్ ముచ్చల్ హార్ట్ ఫౌండేషన్' స్థాపించా' అంటారు పలక్. అది మొదలు రెండున్నర దశాబ్దాలుగా 3800లకు పైగానే గుండె సర్జరీలు చేయించారీమె. ఆ సేవలకుగానూ తాజాగా గిన్నిస్, లిమ్కా వరల్డ్ రికార్డ్స్ ఆమెను వరించాయి. దాచుకోవడమే లక్ష్యంగా సంపాదించే వాళ్లు పెరుగుతున్న ఈరోజుల్లో, సేవకే తన కెరియర్‌ను అంకితం చేసిన పలక్ ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!



పలక్

చీరకి తోడు... వెచ్చని బ్లవుజు!







ఉన్నపళంగా చలి చుట్టు ముట్టేసింది. చలికోటులోనో, వెచ్చగా దుప్పటిలోనో దాక్కోవాలి అనిపిస్తోంది కదూ! ఓవైపు వేడుకలు, మరోవైపు పెళ్లి పిలుపులు... కొన్నింటిని దాటవేసినా తప్పనిసరివి అంటూ కొన్ని ఉంటాయిగా! అక్కడికీ ఏ స్వెటర్‌లోనో శాలువా కప్పుకొనో ఏం వెళతాం? పైగా ముఖ్యమైన వేడుకలంటే చీర కట్టేయాల్సిందే! అబ్బబ్బా ఎన్ని తిప్పలో. అందుకే శీతకాలంలో వేడుకలు మనకి పెద్ద సవాలులా తోస్తాయి. స్టైలిష్ లుక్ ఇస్తూనే మేనికి వెచ్చదనాన్నీ ఇచ్చే వీలుంటే ఎంత బాగుంటుందో కదా! అయితే 'ఉలెన్ బ్లవుజు'లకు ఓటేయండి. లంగాఓణీ, లెహెంగా, చీర... వేటికైనా ఇవి చక్కగా నప్పుతాయి. పైగా సంప్రదాయ వస్త్రాలకు కొత్త లుక్‌నీ తెచ్చిపెడతాయి. వీటిలోనూ ఫుల్‌స్లీవ్, హైనెక్, కాలర్, బోట్‌నెక్, లాంగ్ బ్లవుజు... ఇలా బోలెడు రకాలున్నాయి. ప్రత్యేకంగా షిమ్మర్‌వీ, జ్యూయెల్, డిజైనర్ రకాలూ దొరికేస్తున్నాయి. బటన్, జిప్, టీషర్ట్ మోడల్ రకాల గురించైతే చెప్పనక్కర్లే లేదు. ప్రతిదీ స్మార్ట్‌గా ఆలోచించే అమ్మాయిలకు వేడుకల వేళ ఈ బ్లవుజులు స్మార్ట్ ఎంపికే కదూ! పైగా సిల్క్, నెట్, పట్టు, నేత ఏ రకమైన చీరకైనా ఇవి నప్పేస్తాయి. సౌకర్యం అదనం. చలి నుంచి కాపాడటంతోపాటు మీ సంప్రదాయ వస్త్రధారణకు అదనపు హంగు. ఇంకేం అప్‌గ్రేడ్ అయిపోండి. మెచ్చిన రంగులో ఉలెన్ బ్లవుజ్ తెచ్చి పెట్టుకోండి. మీదైన పర్‌ఫెక్ట్ లుక్‌ని రూపొందించుకోండి. వేడుకేదైనా వెచ్చగా సిద్ధమైపోండి. ఇంతకీ వీటిలో మీ ఎంపికేది మరి?

సాగు 'బడి'

బడిని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్ది, పచ్చని కలను సాకారం చేస్తున్నారు నంబూరి మనోజ. నేల విలువ తెలిసిన ఈమె రైతు కష్టం అందరికీ తెలియాలనుకున్నారు. పాఠశాల విద్యార్థులకి విద్యతోపాటు తోటపనీ నేర్పిస్తున్నారు. ఇందుకుగానూ ఏపీ విద్యాశాఖ మంత్రి అభినందనలు పొందారు. ఆమె గురించి తెలియాలంటే...

తనకీ, తన విద్యార్థులకూ వ్యవసాయం ఎంతో ఇష్టమంటారు మనోజ. సాధారణంగా పిల్లలు ఇంట్లో తల్లిదండ్రుల తర్వాత ఎక్కువ సమయం గడిపేది గురువులతోనే. అందుకే తన విద్యార్థులకి నైతిక పాఠాలూ నేర్పాలనుకున్నారు మనోజ. ఈమె విజయవాడలోని మంగళాపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని. 28ఏళ్లుగా చిన్నారులకు వ్యవసాయం నేర్పిస్తున్నారు. ఆ అంశాలనే మనబడి విద్యా మాస పత్రికలో 'మా తోట' పేరుతో కథగా రాసి ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మన్ననలూ పొందారు. ఈమె తండ్రి ఉద్యోగంతో పాటు వ్యవసాయం కూడా చేసేవారు. చిన్నప్పటి నుంచి అన్నదాతల కష్టాలను దగ్గర నుంచి చూసి తనూ వ్యవసాయం చేయాలనుకున్నారట. అందుకే చిన్నవయసులోనే నాన్నని అనుసరిస్తూ దొండ, మొక్కజొన్న, వంగ వంటివి పండించేవారీమె. ఇప్పటివరకూ విశాఖలోని రావికమతం, కృష్ణాలోని అగిరిపల్లి, గూడవల్లి ప్రాంతాల్లో ఉద్యోగం చేశారు మనోజ. ప్రతి చోటా విద్యార్థులకు కిచెన్ గార్డెనింగ్ అలవాటు చేస్తున్నారు. ఈ పనిని పాఠాలు మాన్పించి కాదు, తరగతులు అయ్యాక ఖాళీ సమయాల్లోనే చేయిస్తుంటారు. ఎక్కువగా వంగ, బెండ, అరటి, పాలకూర వంటి వాటిని సేంద్రియ పద్ధతిలో సాగు చేయిస్తారు. వీటిని మధ్యాహ్న భోజనంలో వాడతారు. 'నేను వెళ్లిన ప్రతిచోటా స్థలం దొరకడం నా అదృష్టం. ఇందుకు పిల్లల ఆసక్తీ తోడయ్యింది. అందుకే ఇన్నేళ్ల నుంచీ ఈ పని చేయగలుగుతున్నా. ప్రభుత్వం కిచెన్‌గార్డెన్‌కు నిధులను కొనసాగించాలి. ఇది ఎంతో మంది విద్యార్థులకి రైతుల కష్టాలు తెలుసుకునేలా చేస్తోంది' అంటున్నారీమె.



మనోజ

టర్ల్ జాబితాలో మంగళాపురం పాఠశాల...

రెండేళ్ల క్రితం టర్ల్ కార్యక్రమంలో భాగంగా పరిశీలన నిమిత్తం నైజీరియన్లు మంగళాపురం వచ్చారు. 'టర్ల్' (టీచింగ్ ఎట్ రైట్ లెవల్) ఇది ఒక ఎన్జీవో. ప్రపంచవ్యాప్తంగా వెనకబడిన పిల్లలకు ఫండింగ్ ఇస్తుంటుంది. విద్యార్థుల్ని రైతుల్ని చేయాలనుకునే ఈమె ఆలోచన వారికి నచ్చి ఈ స్కూలుకి నిధులు ఇస్తున్నారు. అంతేకాదు, మనోజ విధానాలు నచ్చి వాళ్ల దగ్గరి స్కూళ్లలోనూ అమలుచేస్తున్నారు.

- విజయ్‌కుమార్ అల్లాడ, నున్న

శీతకాలంలో మొక్కలు ఆరోగ్యంగా...

కాలంతో వచ్చే మార్పుల వల్ల మనమే కాదు... మొక్కలూ ఇబ్బంది పడతాయి. వాటిని గుర్తించి సమస్యను నివారించడం మీద దృష్టిపెడితే... ఇంటి తోట అందంగా, ఆరోగ్యంగా ఉంటుంది.




- చలికాలంలో గులాబీ, జినియా, బెగోనియా, మందారంతో పాటు టొమాటో, దోస వంటి మొక్కల్లో బూడిద తెగులు ఎక్కువగా కనిపిస్తుంది. దీన్ని నివారించడానికి 1 టీస్పూన్ బేకింగ్ సోడా, అర టీస్పూన్ డిష్ సోప్, లీటరు నీరు కలిపి వారానికి రెండు సార్లు మొక్క తడిచేలా స్ప్రే చేస్తే సరి.
- ఇంటితోటలో పెంచే ఆకుకూరలతోపాటు ముల్లంగి, క్యారెట్, పూల మొక్కలైన మందారం, గులాబీ... వంటి వాటిపైనా ఆకుతొలుచు పురుగు ఆశిస్తుంది. ఇండోర్ ప్లాంట్స్ కూడా వీటి ప్రభావానికి గురవుతాయి. వెల్లుల్లి కషాయం చల్లడం ద్వారా దీన్ని నివారించవచ్చు.
- బయటి చలి వాతావరణాన్ని తట్టుకోలేవంటూ కొన్ని మొక్కల్ని ఇంటిలోపల పెడతాం. ముఖ్యంగా టొమాటో, మెంతికూర, గులాబీ, మందార, మల్లె...వంటి వాటిని ఏసీ వార్మ్ మోడ్, హీటర్ ఉన్న గదుల్లో కానీ, తక్కువ వెంటిలేషన్ ఉన్నా, గాలి ప్రసరించనంత దగ్గరగా పెట్టినా ఈ ఎర్రనల్లి సమస్య వస్తుంది. ఈ ఇబ్బందిని తగ్గించడానికి మొక్కల అడుగు భాగంలో ఉండే ట్రేలో గులకరాళ్లు వేయాలి. నీళ్లను గాల్లోకి స్ప్రే చేసి ఆ వాతావరణంలో తేమ పెంచాలి. ఆకుల వెనక భాగంలో ఉన్న గుడ్లను... ఆకు తీసేసి పారేయడం ద్వారా లేదా గోరువెచ్చని నీళ్లల్లో కాస్త లిక్విడ్ సోప్, వేపనూనె కలిపి స్ప్రే చేయడం ద్వారా పోగొట్టొచ్చు. మొక్క ఆరోగ్యంగా ఎదుగుతుంది.

దేశ ఆర్థిక ప్రగతికి దిక్సూచిగా

విశాఖ ఎకనమిక్ రీజియన్

- ముంబయి కన్నా ముందుండేలా అభివృద్ధి చేయాలి
- నీతి ఆయోగ్ సీఈవోతో కలిసి ముసాయిదా విడుదల చేసిన సీఎం



విశాఖ ఎకనమిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యంతో కలిసి ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, సీఎస్ విజయానంద్

ఈనాడు, విశాఖపట్నం: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, రాజమహేంద్రవరం, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలతో కలిపి విశాఖ కేంద్రంగా ఏర్పాటుచేసిన విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) భవిష్యత్తులో దేశ ఆర్థిక ప్రగతికి ఒక దిక్సూచిగా మారబోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖను ఒక పెట్టుబడుల వేదికగా, సుస్థిరాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో రూపొందించిన వీఈఆర్ ప్రణాళిక రాష్ట్రానికి ఒక గేమ్‌ఛేంజర్ అవుతుందన్నారు. దానికి సంబంధించిన ప్రగతి పనులను అథారిటీ ఛైర్మన్‌గా ఎప్పటికప్పుడు తానే పర్యవేక్షిస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. గురువారం ఆయన విశాఖలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంతో కలిసి వీఈఆర్ ముసాయిదా విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఈ తొమ్మిది జిల్లాల్లోని పలు అభివృద్ధి అంశాలతో ముందుకువెళతాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలోని ఏరోసిటీ అభివృద్ధి చేస్తాం. ఆ ప్రాంతంలో ఆక్వా, ఇతర పరిశ్రమలను ఆకర్షిస్తాం. పర్యాటక, ఆరోగ్య సంరక్షణ రంగాల్లోనూ విశాఖపట్నం కేంద్రంగా ప్రణాళికలు ఉన్నాయి. పోర్టులు, పారిశ్రామిక నడవాలు, సరకు రవాణా, నౌకా, రక్షణ పరిశ్రమలన్నింటినీ సమన్వయం చేసి సుస్థిర అభివృద్ధికి ప్రణాళిక చేస్తున్నాం. వీటి ఆధారంగా వేలసంఖ్యలో యువతకు ఉపాధి లభిస్తుంది. విశాఖ-శ్రీకాకుళం కారిడార్‌ను నౌకా నిర్మాణ హబ్‌గా తీర్చిదిద్దుతాం. అవసరమైతే శ్రీకాకుళం, అనకాపల్లిలో చిన్న విమానాశ్రయాలు నిర్మిస్తాం. ప్రాథమికంగా చేసిన ఆలోచనలు కాకుండా త్వరలోనే మొత్తం ఏరియాను అభివృద్ధి చేసేలా ముందుకువెళతా" అని తెలిపారు.

ముంబయి కన్నా ముందుండాలి

'విశాఖ ఎకనమిక్ రీజియన్ ముంబయి రీజియన్ కన్నా ముందుండేలా పరిగెత్తించాలి. ఆ పర్యవేక్షణ బాధ్యత పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌కు అప్పగిస్తున్నా. రాష్ట్రానికి పెట్టుబడులు రావడంలో ఆయన బాగా పనిచేశారు. కలెక్టర్లను సమన్వయం చేసుకొని అధికార యంత్రాంగాన్ని పరిగెత్తించాలి. ఆరు నెలలకోసారి నీతి ఆయోగ్ సమీక్షలు జరపాలి. ఛైర్మన్ హోదాలో ప్రతి నెలా ఏదో ఒక జిల్లాలో ఒక గంటపాటు సమీక్షిస్తా. కలెక్టర్లకు పరుగు పందెం మొదలైంది. వీఈఆర్ ముసాయిదా తెప్పించుకొని ఎవరికి వారు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలి. దాన్ని అమలుచేయాలి. ఎంత పెట్టుబడులు తెచ్చారు, వచ్చిన కొత్త వనరులేంటో చెప్పాలి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూస్తా. ఏ పోటీ పెట్టినా ఏపీ ముందుండగా అందులో విశాఖ ముందువరుసలో ఉంటుంది. ఏ జిల్లా ఎక్కడ బలంగా ఉంది, ఎక్కడ బలహీనంగా ఉందో లెక్కలు వేసుకొని మెరుగుపరచుకోవాలి. వీఈఆర్ విజన్ లక్ష్యాలను సాధించే బాధ్యత ప్రజల మీద ఆధారపడి ఉంది. ప్రతి ఇంటికీ విజన్ డాక్యుమెంట్ కరపుస్తకం ఇచ్చి చైతన్యం చేస్తాం' అని సీఎం వివరించారు. వారణాసి, సూరత్, ముంబయిలకు గ్రోత్ హబ్ ప్రణాళికలు తయారుచేయగా ఇప్పటికే ముంబయి ముసాయిదాను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో వీఈఆర్ ప్రణాళిక అమలును వేగవంతం చేయాలని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు.

రూ.2 వేల కోట్లతో 'కోరమండల్' విస్తరణ



ఒప్పందం కుదుర్చుకుంటున్న కోరమండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అరుణ్ అలగప్పన్, ఆ సంస్థ ఎండీ, సీఈఓ శంకర సుబ్రమణియన్

ఈనాడు, విశాఖపట్నం: ప్రముఖ ఎరువుల తయారీ సంస్థ 'కోరమండల్ ఇంటర్నేషనల్' ప్రతినిధులు చంద్రబాబుతో గురువారం విశాఖలో సమావేశమయ్యారు. రూ.2వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్, ఎరువుల ఉత్పత్తి విస్తరణ సహా మరికొన్ని ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మురుగప్ప గ్రూప్‌నకు చెందిన ఈ సంస్థకు విశాఖ, కాకినాడలో ఎరువుల తయారీ యూనిట్లు ఉన్నాయి. వాటికి కొనసాగింపుగా ఈ పెట్టుబడి పెడుతున్నట్లు పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్లకు రూ.కోటి 'బాలాజీ యాక్షన్' విరాళం



ప్రముఖ పర్టికల్ సంస్థ బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ఛైర్మన్ ఎన్‌కే అగర్వాల్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కలప ఆధారిత ఇంజినీర్డ్ ప్యానెల్ తయారీ యూనిట్ ఏర్పాటుపై చర్చించారు. అనంతరం అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.కోటి విరాళాన్ని సీఎంకు అందించారు.

రూ. 25 వేల కోట్ల ప్రాజెక్టులు నెల రోజుల్లో పూర్తి

'యాక్సిస్ ఎనర్జీ' సీఈవో రమేశ్ వెల్లడి

విశాఖ నుంచి ఈనాడు ప్రతినిధి

ఏటీసీ క్లీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్(ఎవెన్), యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా రూ.1,10,250 కోట్ల పెట్టుబడితో 7,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో రమేశ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 'ఎవెన్‌లో బ్రూక్‌ఫీల్డ్ రెన్యూవబుల్స్‌కు 51 శాతం, యాక్సిస్‌కు 49 శాతం వాటా ఉంది. సౌర, పవన, బ్యాటరీ విద్యుత్ స్టోరేజ్ సిస్టం (బెస్) ఏర్పాటు చేస్తున్నాం. ఆయా ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన 90 శాతం భూములను ఇప్పటికే సేకరించాం. ఇక నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. రాబోయే నెల రోజుల్లోనే రూ. 25,000 కోట్ల విలువైన పెట్టుబడులతో విద్యుత్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నది మా లక్ష్యం. 18-24 నెలల వ్యవధిలో మిగిలిన ప్రాజెక్టులు పూర్తవుతాయి. బ్రూక్‌ఫీల్డ్ 5 దేశాల్లో నిర్వహించే ప్రాజెక్టుల ద్వారా 2.40 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుంది. దేశంలో 45 గిగావాట్ల పవన, సౌర విద్యుత్ సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతోంది. పునరుత్పాదక ప్రాజెక్టుల రంగంలో 15 ఏళ్ల అనుభవం ఉంది. దేశంలో 8,000 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నాం' అని వెల్లడించారు.



ఇటలీ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలీతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఇటలీ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా చూడాలి

ఆ దేశ రాయబారితో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇటాలియన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చూడాలని ఆ దేశ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. విశాఖపట్నంలోని సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా వివిధ దేశాల రాయబారులతో ఆయన భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా గురువారం భారత్‌లోని ఇటలీ రాయబారితో సమావేశమయ్యారు. ఆటోమోటివ్, యంత్రాల తయారీ, ఇంధనం, ఫ్యాషన్, ఆహార శుద్ధి, పునరుత్పాదక విద్యుత్ రంగం, నౌకా నిర్మాణం తదితర రంగాల్లో పెట్టుబడులపై భేటీలో చర్చ జరిగింది. రాష్ట్రంలో ఒక ఇటాలియన్ ఇండస్ట్రియల్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసే అంశంపైనా ఇరువురూ మాట్లాడుకున్నారు.

విశాఖ సమీపంలో సోలార్ వేఫర్ల తయారీ

- ఏదైనా పోర్టుకు సమీపంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు
- రాష్ట్రంలో నాలుగైదేళ్లలో రూ.82 వేల కోట్ల పెట్టుబడులు

'ఈనాడు' ముఖాముఖిలో రెన్యూ పవర్ వ్యవస్థాపక ఛైర్మన్, సీఈఓ సుమంత్‌సిన్హా

విశాఖపట్నం నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి



సుమంత్ సిన్హాకు జ్ఞాపిక అందజేస్తున్న చంద్రబాబు

రాష్ట్రంలో వచ్చే నాలుగైదేళ్లలో వివిధ రకాల హరిత ఇంధన ప్రాజెక్టుల్లో రూ.82 వేల కోట్ల పెట్టుబడులు పెడతామని రెన్యూ ఎనర్జీ వ్యవస్థాపక ఛైర్మన్, సీఈఓ సుమంత్ సిన్హా తెలిపారు. ఏపీ ప్రభుత్వంతో గురువారం రూ.60వేల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు చేసుకున్న తర్వాత ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'అనంతపురం జిల్లాలో పీక్ డిమాండ్‌లో 5 గిగావాట్ల సౌర, పవన, బ్యాటరీ విద్యుత్ ప్రాజెక్టు ఇటీవలే ప్రారంభించాం. దానిపై రూ.22వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నాం. ఇప్పుడు ఒప్పందాలు చేసుకున్న రూ.60వేల కోట్ల పెట్టుబడుల్లో భాగంగా విశాఖకు సమీపంలో వేఫర్‌ల (సౌర విద్యుత్ ఫలకాల తయారీలో వాడే పలుచటి సిలికాన్ పొర) తయారీ ప్రాజెక్టు ఏర్పాటుచేస్తాం. ఏదైనా పోర్టుకు సమీపంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు పెడతాం. దీన్ని ఎక్కడ పెట్టాలన్న అంశంపై ప్రభుత్వంతో సంప్రదిస్తున్నాం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో హరిత ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులు ఏర్పాటుచేస్తాం. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు రెండు ప్రాంతాలను గుర్తించాం' అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల ఏర్పాటుకు అన్ని అనుమతులు అత్యంత వేగంగా, సింగిల్‌విండో విధానంలో ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. భూమి కేటాయింపు, ప్రోత్సాహకాలకు స్పష్టమైన హామీ లభించడంతో ఏపీని ఎంచుకున్నామని ఆయన చెప్పారు. 'ఈ ప్రాజెక్టులకు ఎంత భూమి కావాలో ఇప్పుడే చెప్పలేం. ఒక్కో తరహా ప్రాజెక్టుకు ఒక్కో రకం భూములు కావాలి. త్వరలో వాటిపై స్పష్టత వస్తుంది' అని తెలిపారు.

డేటా సెంటర్లతో గ్రీన్ ఎనర్జీకి మార్కెట్


విశాఖలో గూగుల్ ఒక గిగావాట్ డేటా సెంటర్ ఏర్పాటుచేయడం, మరిన్ని సంస్థలు రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ఆసక్తిగా ఉండటంతో సహజంగానే గ్రీన్ ఎనర్జీకి కొంత మార్కెట్ ఏర్పడుతుంది. అయితే వారికి ఎప్పటికి, ఎలాంటి క్వాలిటీ పవర్, ఎంత కావాలో చూడాలి. వాళ్లతో సంప్రదింపులు జరుపుతాం. ఆంధ్రప్రదేశ్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఇంకా విస్తృతం కాలేదు. రాష్ట్రంలో ఆ రంగం అభివృద్ధికి ఇంకా చాలా అవకాశాలున్నాయి.

రెండు, మూడేళ్ల తర్వాత చైనా వైపు చూడక్కర్లేదు

దేశంలో ప్రస్తుతం సోలార్ మాడ్యూళ్ల తయారీ సామర్థ్యం అవసరాని కంటే చాలా ఎక్కువ ఉంది. మనకు 50 గిగావాట్ల మాడ్యూళ్లు అవసరమైతే 100 గిగావాట్ల సామర్థ్యం ఉంది. వచ్చే జూన్ నుంచి సోలార్ సెల్స్ దిగుమతుల్నీ ప్రభుత్వం నిలిపేస్తోంది. 2028 నుంచి వేఫర్స్ దిగుమతి ఆపేస్తున్నారు. వచ్చే రెండు, మూడేళ్లలో చైనాపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా.. సౌర విద్యుత్ సప్లై చైన్ మొత్తం దేశీయ పరిశ్రమపైనే ఆధారపడుతుంది. అప్పుడు చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్ వైపు చూస్తారు.

భవిష్యత్ పెట్టుబడుల గురించి ఇప్పుడే చెప్పలేం

భవిష్యత్తులో ఏపీ సహా ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడుల ప్రణాళికలు ఉన్నాయి. కానీ, వాటిని ఇప్పుడే బయటపెట్టలేం. మేం 8 గిగావాట్ల ప్రాజెక్టులకు పీపీఏలు కుదుర్చుకున్నాం. 6.5 గిగావాట్ల ప్రాజెక్టులకు ఎల్‌ఓఏలపై సంతకాలు పెట్టాం. ఏపీలో రూ.82వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాం. ముందు ఇవన్నీ కొలిక్కి తీసుకొస్తాం.



ఉత్తుత్తి ఒప్పందాలు కావు.. సిద్ధమైన ప్రాజెక్టులే

- రూ.9.08 లక్షల కోట్లతో 412 ఎంవోయూలు
- ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కూ అనుమతులు తెచ్చేశాం
- ప్రతి ఇంట్లో ఏఐ ఎన్నో అవకాశాలు కల్పిస్తుంది
- అనకాపల్లి నుంచి విజయనగరం వరకు స్టీల్‌సిటీ

ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో సీఎం చంద్రబాబు

ఈనాడు – అమరావతి

'విశాఖలో రూ.9.08 లక్షల కోట్లతో కుదుర్చుకుంటున్న 412 ఎంవోయూలు ఉత్తుత్తి ఒప్పందాలు కావు.. ఇవి సాకారానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టులు. ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టులపైనే సంతకాలు చేస్తున్నాం. ఒకసారి ఎంవోయూ కుదిరితే వెంటనే వాటి పనులు ప్రారంభమవుతాయి. పెట్టుబడిదారులు ఆసక్తిగా, ఉత్సాహంతో వస్తున్నారు. వేగం చాలా ముఖ్యం. మేం రికార్డు సమయంలో ప్రాసెస్ చేస్తున్నాం. ఆ ప్రాజెక్టులు త్వరగా ప్రారంభమవుతున్నాయి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. విశాఖలో సీఐఐ సదస్సు సందర్భంగా ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఈ ఒప్పందాల్లో వాస్తవంగా ఎన్ని సాకారమయ్యే అవకాశం ఉందని ప్రశ్నిస్తే ఆయన పై విషయం చెప్పారు. ఉదాహరణగా ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌లో రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ బెవరేజెస్ ప్లాంట్ పనులు ఎంత వేగంగా ప్రారంభమయ్యాయో వివరించారు. విశాఖలో ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ కర్మాగారం ఏర్పాటుకు కేంద్రప్రభుత్వ అనుమతులు వచ్చాయని, పర్యావరణ అనుమతులూ పూర్తయ్యాయని, తాము భూములూ ఇచ్చామని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభం కాబోతున్నాయని వెల్లడించారు. ముఖాముఖిలో సీఎం చెప్పిన కీలకాంశాలివీ..

- 30 ఏళ్ల కిందట ఐటీ ఎలాగో ఇప్పుడు ఏఐ అలా. ఇది ప్రపంచంలోనూ, మన ఐటీ నిపుణుల్లోనూ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతోంది.
- మేం 30 ఏళ్ల కిందట ఉమ్మడి రాష్ట్రంలో ఐటీని ప్రోత్సహించే సమయానికి ఎన్నో సమస్యలు ఉండేవి. ఈరోజు ప్రధాని ఎంతో సహకరిస్తున్నారు. అర్థం చేసుకోవడమే కాదు సలహాలిచ్చి మమ్మల్ని నడిపిస్తున్నారు.
- 1998లో బిల్‌గేట్స్‌తో ఎంవోయూ చేసుకునే సమయానికి గూగుల్ అప్పుడే ప్రారంభమైన ఒక చిన్న కంపెనీ. ఈ రోజు అది ఇన్నోవేటివ్, క్రియేటివ్. అమెరికా బయట 15 బిలియన్ల డాలర్ల అతి పెద్ద పెట్టుబడిని విశాఖలో పెడుతోంది.
- రాబోయే 15 ఏళ్లలో వచ్చే అద్భుత అవకాశాలను యువశక్తి అందిపుచ్చుకుంటుంది. ఇప్పుడు ఎక్కడో మారుమూల ప్రాంతంలో కూర్చుని కూడా ఒక కంపెనీ ప్రారంభించవచ్చు. అక్కడి నుంచే కంపెనీని ప్రపంచమంతా నడిపించొచ్చు.
- గూగుల్ వల్ల ఉద్యోగాలు అంటారా.. గూగుల్ ఒక పెద్ద కదలిక తీసుకొచ్చింది. దీనికి అనుబంధంగా అనేక పెట్టుబడులు రాబోతున్నాయి. అందువల్ల అనేక ఇతర రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఇప్పుడు కష్టపడి పనిచేస్తున్నాం. ఏఐ వల్ల మరింత స్మార్ట్‌గా పని చేయబోతున్నాం. భవిష్యత్తులో ప్రతి కుటుంబం ఏఐపై పనిచేస్తుంది. ఉద్యోగాలు రావడమే కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి మనం ఎదుగుతాం.

విశాఖ కొత్త స్టీల్ నగరంగా మారుతోంది

- అమలాపురం నుంచి శ్రీకాకుళం వరకు విశాఖ ఎకనామిక్ రీజియన్‌గా అభివృద్ధి చేసే ప్రాజెక్టుపై పని చేస్తున్నాం. అనకాపల్లి నుంచి విశాఖ వరకు ఒక సిటీగా అభివృద్ధి చెందుతుంది. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ కంపెనీతో పాటు మెటల్, మైనింగ్‌లో పెద్ద పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం. స్టీల్ రంగానికి అనుసంధానంగా అనేక పరిశ్రమలు అభివృద్ధి చేస్తాం. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో నిర్మాణ రంగం ఎంతో ప్రధానం కాబోతోంది. అందుకు ఇది ఎంతో ఉపయుక్తమవుతుంది.
- ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రభుత్వ నిర్మాణాలన్నీ మూడేళ్లలో పూర్తవుతాయి. రూ. 40-50 వేల కోట్ల పెట్టుబడులతో పనులన్నీ పూర్తి చేస్తాం.

రూ.15 వేల కోట్లతో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్

4 గిగావాట్ల పునరుత్పాదకత విద్యుత్తు ఉత్పత్తికి ఒప్పందం



సీఎం సమక్షంలో అధికారులతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ప్రతినిధి. చిత్రంలో ఆ సంస్థ సీఎండీ రాహుల్ ముంజాల్

ఈనాడు, విశాఖపట్నం-వన్‌టౌన్, న్యూస్‌టుడే: పునరుత్పాదకత విద్యుత్తు రంగంలో 4 గిగావాట్ల సామర్థ్యంతో పెట్టుబడులు పెట్టేందుకు 'హీరో ఫ్యూచర్ ఎనర్జీస్' సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రూ.15 వేల కోట్ల పెట్టుబడితో అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల్లో విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఈ సంస్థ ముందుకు వచ్చింది. సంస్థ సీఎండీ రాహుల్ ముంజాల్ గురువారం సీఎం చంద్రబాబుతో విశాఖలో భేటీ అయ్యారు. సీఎం సమక్షంలో ఆయా పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలను హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ, ఈడీబీ (ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు) ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని, డెడికేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ పార్కు ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ ఆట బొమ్మల తయారీ సంస్థ 'పాల్స్‌ప్లష్' అధ్యక్షులు అజయ్ సిన్హా ముఖ్యమంత్రిని కలిసి అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద టాయ్‌పార్కు ఏర్పాటుపై చర్చించారు. చంద్రబాబు మాట్లాడుతూ.. బొమ్మల తయారీలో స్థానికంగా ఉన్న మహిళలకు ఉపాధి కల్పించాలని సంస్థ ప్రతినిధులను కోరారు.

తిరుపతిలో జీపీసీకి అదనంగా రూ.170 కోట్లు: హీరో మోటోకార్ప్

తిరుపతిలో గ్లోబల్ పార్ట్స్ సెంటర్ (జీపీసీ) 2.0 ఏర్పాటుకు అదనంగా రూ.170 కోట్ల వరకు హీరో మోటోకార్ప్ పెట్టుబడి పెడుతోంది. జీపీసీ 2.0 వాణిజ్య కార్యకలాపాలు 2027-28లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని కంపెనీ వెల్లడించింది. ● జులై- సెప్టెంబరు త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన హీరో మోటోకార్ప్ రూ.1,309 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,064 కోట్ల కంటే ఇది 23% అధికం.

రూ. 10వేల కోట్లతో విద్యుత్ ప్రాజెక్టులు

'పునరుత్పాదక ప్రాజెక్టులకు గుజరాత్ కేంద్రం. సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనువైనది. గుజరాత్‌లాగే ఏపీలోనూ అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. ఇక్కడి ప్రభుత్వం పెట్టుబడి పెట్టేందుకు సానుకూల ధోరణితో వ్యవహరిస్తోంది. పారిశ్రామికవేత్తల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోంది. ఏపీలో పునరుత్పాదక ప్రాజెక్టుల ఏర్పాటుకు మంచి అవకాశాలు ఉన్నాయి. అందుకే గుజరాత్‌లో విద్యుత్ ప్రాజెక్టులు నిర్మిస్తున్న మేము.. ఏపీలోనూ రూ.10,205 కోట్ల పెట్టుబడులతో ప్రాజెక్టులు ఏర్పాటుచేస్తున్నాం. ఈ రోజు సీఎం వద్ద ఒప్పందపత్రాలపై సంతకాలు చేశాం. విండ్, సోలార్, హైబ్రిడ్ ప్రాజెక్టులతో పాటు, గ్రీన్ మెథనాల్ ప్లాంటు, 2,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం (బెస్) ఏర్పాటు చేస్తున్నాం. యువ పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇచ్చేందుకు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తాం. ఏపీ అవసరాలకు అనుగుణంగా మేం ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం. ఒక్క పునరుత్పాదక విద్యుత్ రంగంలోనే కాదు.. సోలార్ మాడ్యూల్స్, ఈవీ రంగానికి చెందిన గుజరాత్ కంపెనీలు ఏపీకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాయి. గత నెలలో ఏపీ ప్రభుత్వం ముంబయిలో నిర్వహించిన రోడ్‌షోలో ఏపీకి చెందిన మంత్రి లోకేశ్‌ను కలిసి మాట్లాడాను. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించాలన్న తపన ఆయన మాటల్లో కనిపించింది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, లోకేశ్ తపనపడుతున్నారు'.

– ఫోర్‌స్క్వేర్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సందీపన్

40 సెకన్లలో 'చిట్టి' కాఫీ రెడీ!



భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో విశాఖపట్నం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో పలు స్టాళ్లు ఏర్పాటు చేశారు. అందులో 'రోబోటిక్ కెఫే' ఆకట్టుకుంటోంది. కాఫీ తయారుచేసేందుకు మనుషులతో పనిలేకుండా రోబోనే మనకు నచ్చిన విధంగా నాలుగు రకాల కాఫీలను తయారుచేసి ఇస్తుందని నిర్వాహకులు వై.ఐజాక్ వివరించారు. ఈ రోబో స్టాళ్లను విమానాశ్రయాలు, ఐటీ పార్కులు, మాల్స్, పర్యాటక ప్రదేశాల్లో కేవలం 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసుకోవచ్చంటున్నారు. కోరుకున్న కాఫీని 40 సెకన్లలో తయారుచేసి ఇచ్చేలా రష్యన్ కంపెనీ సహకారంతో దీన్ని తయారు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు దీని గురించి వివరించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామన్నారు. – ఈనాడు, విశాఖపట్నం

ఓర్వకల్లులో సాలిడ్ స్టేట్ బ్యాటరీ పరిశ్రమ

కుప్పంలో పాదరక్షల తయారీ యూనిట్ ● సీఎం సమక్షంలో ఒప్పందం చేసుకున్న తైవాన్ సంస్థలు

ఈనాడు, విశాఖపట్నం: కర్నూలు జిల్లా ఓర్వకల్లు సమీపంలో జాయింట్ వెంచర్ ద్వారా ఎడ్వాన్స్‌డ్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఈ-జౌల్ ఇండియా ముందుకు వచ్చింది. రూ.19,500 కోట్ల (2.2 బిలియన్ డాలర్ల) పెట్టుబడితో 23 గిగావాట్ల సామర్థ్యంతో సాలిడ్ స్టేట్ బ్యాటరీ, క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆర్థిక అభివృద్ధి బోర్డు(ఈడీబీ)తో గురువారం ఒప్పందం చేసుకుంది. పెట్టుబడుల సదస్సులో భాగంగా భారత్‌లోని తైపీ ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్‌చెన్ నేతృత్వంలోని తైవాన్ ప్రతినిధుల బృందం.. ముఖ్యమంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించింది. కుప్పంలో రూ.400 కోట్లతో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు అలీజియన్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. పాదరక్షల తయారీ సంస్థ పౌ చెన్ గ్రూప్ ఓ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఓర్వకల్లులో ఇమేజ్ సెన్సర్ యూనిట్ల ఉత్పత్తికి క్రియేటివ్ సెన్సర్ ఇంక్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సెమీకండక్టర్ మిషన్ కింద ప్రోత్సాహకాలు అందించాలని కోరింది.

భూములిస్తాం..

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రికల్ వాహన తయారీ, ఈవీ బ్యాటరీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని తైవాన్ సంస్థల్ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. 'తైవాన్ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల్ని తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. తైవాన్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలి' అని కోరారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో భారత్‌లోని తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్‌చెన్ నేతృత్వంలోని తైవాన్ ప్రతినిధి బృందం



సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో ఆకట్టుకుంటున్న ఏపీ రాజధాని ప్రాంతం నమూనా



భాగస్వామ్య సదస్సుకు వచ్చే ముఖ్య అతిథుల కోసం తీర్చిదిద్దిన డైనింగ్ ప్రాంగణం



సర్వాంగ సుందరంగా ముస్తాబైన ప్రధాన వేదిక

పెట్టుబడుల జాతర

- నేడు భాగస్వామ్య సదస్సును ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి
- హాజరుకానున్న 2,500 మంది దేశ, విదేశీ ప్రతినిధులు

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే: విశాఖ భాగస్వామ్య సదస్సు వేదికగా పెట్టుబడుల జాతర మొదలైంది. వివిధ దేశాల నుంచి అధికసంఖ్యలో పారిశ్రామికవేత్తలు గురువారమే నగరానికి చేరుకున్నారు. విశాఖలో ఎటు చూసినా సదస్సు సందడే కనిపిస్తోంది. ఒకరోజు ముందే నగరంలో పండగ మొదలైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో నోవోటెల్ వేదికగా గురువారం కీలక ఒప్పందాలు జరిగాయి. శుక్ర, శనివారాల్లో మరిన్ని ఒప్పందాలు జరగనున్నాయి.

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో కలిసి రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సదస్సును ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నారు. దేశ, విదేశాల నుంచి 2,500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. భాగస్వామ్య సదస్సుతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తరలిరానున్నాయి. గురువారం సాయంత్రానికి 40 దేశాల నుంచి ప్రతినిధులు విశాఖకు చేరుకున్నారు. అందులో తైవాన్, ఇటలీ తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు సదస్సుకు ముందే సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి 15 సమావేశాల్లో పాల్గొని ప్రతినిధులతో చర్చించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. సదస్సుకు ముందుగానే రూ.3.65 లక్షల కోట్ల విలువైన 35 అవగాహన ఒప్పందాలు జరిగాయి.



అతిథులకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా రోబోలు

రెండురోజుల పాటు పండుగ

ప్రధాన హాల్‌లో నిర్వహించే సదస్సు వేదికపై 21 మంది అతిథులు ఆశీనులు కానున్నారు. ఉపరాష్ట్రపతి, గవర్నర్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి లోకేశ్, పారిశ్రామిక దిగ్గజాలు సుచిత్ర ఎల్ల, సంజీవ్ బజాజ్, జీఎం రావు, బాబా కల్యాణి, కిరణ్ అదానీ, సుదర్శన్ వేణు, ఎం.ఎ.యూసఫ్, సీఐఐ అధ్యక్షుడు రాజీవ్, డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ తదితరులు వేదికపై ఉంటారు. రెండు రోజులపాటు నాలుగు హాళ్లలో 32 సెషన్లు జరగనున్నాయి.

కీలక నగరాల్లో హోర్డింగులు

ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి చాటిచెప్పే ప్రక్రియలో భాగంగా ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో పెద్ద ఎత్తున హోర్డింగులు ఏర్పాటుచేశారు. వివిధ ప్రసారమాధ్యమాల ద్వారా సీఐఐ సదస్సుపై ఇప్పటికే విస్తృతమైన ప్రచారం చేశారు.

రూ.1,234 కోట్లతో అనకాపల్లిలో డోజ్‌కో కంపెనీ

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా మక్కవారిపాలెంలో డోజ్‌కో (ఇండియా) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటుకు రెండు దశల్లో 150 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.1,234 కోట్ల ఈ ప్రాజెక్టుతో 1,454 మందికి ఉపాధి లభించనుంది. ఇక్కడ హెవీ ఎర్త్ మూవింగ్ యంత్రాలు, విడిభాగాలను తయారు చేయనున్నారు.



సదస్సు ప్రాంగణంలో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టాల్

రాష్ట్రానికి పారిశ్రామికోత్సాహం

విశాఖపట్నంలో ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ గురువారం పలు పరిశ్రమలకు భూమిపూజ చేశారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు



సెయిల్స్ కంపెనీ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్



ఫినోమ్ కంపెనీ భవనానికి భూమిపూజ చేస్తున్న మంత్రి లోకేశ్, కంపెనీ ప్రతినిధులు




రహేజా కంపెనీ ఐటీ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తూ...

అభివృద్ధిలో పోటీ పడటం నాకు అలవాటే!

ఈయూ ప్రతినిధి ప్రశ్నకు సీఎం చంద్రబాబు ఆసక్తికర సమాధానం

విశాఖ నుంచి ఈనాడు ప్రతినిధి

సహకార వ్యవస్థలో రాష్ట్రాలు ఒకదాంతో ఒకటి పోటీపడటం సహజమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సవాళ్లు ఎదుర్కోవడం తనకు కొత్త కాదన్నారు. బిజినెస్ పార్టనర్‌షిప్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈయూ ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సీఎం చంద్రబాబు ఆసక్తికర సమాధానమిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను సభలో ఉన్న వారికి వివరించారు.



ఈయూ ప్రతినిధి: మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో ఇప్పటికే ఈయూ కంపెనీల క్లస్టర్లు ఉన్నాయి. ఏపీకి వాటిని తీసుకురావడానికి మీరు వారికి ఏం చెబుతారు? ఇప్పటికే ప్రాజెక్టులున్న రాష్ట్రాలు కాకుండా.. ఏపీని ఎందుకు ఎంచుకోవాలి? వారికి మీరు ఎలా భరోసా ఇస్తారు?

చంద్రబాబు: "ఇది అద్భుతమైన ప్రశ్న. మేం సహకార వ్యవస్థలో ఉన్నాం. ఇక్కడ రాష్ట్రాలు ఒకదాంతో ఒకటి పోటీపడాలి. గతంలోనూ ఇలాగే పోటీపడేవాడిని. ప్రతికూల పరిస్థితులనూ అవకాశాలుగా మలచుకోవాలి. ఒకప్పుడు బెంగళూరు దేశానికి ఐటీ రాజధానిగా ఉండేది. అప్పుడు నేను పోటీపడి హైదరాబాద్‌కు దాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేశా. సైబర్ సిటీ నిర్మించాను. ఆ పోటీ కారణంగానే హైదరాబాద్.. బెంగళూరు కంటే మెరుగైన రేటింగ్ పొందింది. దావోస్‌లోనూ మేము ఇలాగే పోటీపడేవాళ్లం. ఒకానొక దశలో నేనిక నీతో పోటీపడలేనని.. ఇద్దరం కలిసి పనిచేద్దామని అప్పటి కర్ణాటక సీఎం ఎస్ఎం కృష్ణ నాతో అన్నారు. దేశం కోసం అలాగే పనిచేద్దామని నేను అన్నా. నాకు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. నాలుగుసార్లు సీఎంగా పనిచేశా. ఆర్థిక సంస్కరణలు మొదలు.. టెక్నాలజీ వరకూ ప్రతిదీ చూశా. మనం ఇప్పుడు చాలా స్ఫూర్తిదాయకమైన సమయంలో ఉన్నామన్న విషయాన్ని మాత్రం చెప్పగలను" అని చంద్రబాబు జవాబు ఇవ్వడంతో సమావేశంలో సానుకూల స్పందన వ్యక్తమైంది.

సదస్సుకు ఒకరోజు ముందుగానే భారీగా ఎంఓయూలు

- వివిధ రంగాల్లో రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులు
- 1.26 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- 15కు పైగా సమావేశాల్లో పాల్గొన్న సీఎం

ఈనాడు, విశాఖపట్నం: సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఒకరోజు ముందే పెట్టుబడులు వెల్లువలా వచ్చాయి. ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సంస్థల ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిసి రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. గురువారం వివిధ రంగాల్లో 35 సంస్థలు రూ.3,65,304 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సీఎం సమక్షంలో ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేవరకు 15కు పైగా సమావేశాల్లో సీఎం పాల్గొన్నారు. తైవాన్, ఇటలీ రాయబారులతో సమావేశమై ఏపీలో అవకాశాలను వివరించారు. 'ఒప్పందం చేసుకున్న ప్రతి సంస్థకూ భూములు కేటాయించి, వేగంగా అనుమతులిస్తున్నాం. సదస్సులో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అనుకుంటే.. అంతకు ముందుగానే రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకున్న నమ్మకానికి నిదర్శనం' అని సీఎం అన్నారు.

ఇంధన రంగంలో దూకుడు..

పెట్టుబడుల సదస్సుకు ముందురోజు జరిగిన ఒప్పందాల్లో ఇంధన రంగంలో ఏడు ఎంఓయూలు జరిగాయి. రూ.2,64,787 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటితో 49,400 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఏపీ సీఆర్డీఏ పరిధిలో 8 ఒప్పందాలు ద్వారా రూ.32,300 కోట్ల పెట్టుబడులు, 7,800 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. ఆహారశుద్ధి రంగంలో నాలుగు ఒప్పందాల ద్వారా రూ.2,319 కోట్లు పెట్టుబడులు.. తద్వారా 8,166 మందికి ఉద్యోగాలు రానున్నాయి. పరిశ్రమలు వాణిజ్య, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల రంగాల్లో ఆరు ఎంఓయూలు జరిగాయి. వీటి ద్వారా రూ.64,398 కోట్ల పెట్టుబడులు రానున్నాయి.



కంపెనీలు ఎనర్జీ రంగం	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి పొందేవారి సంఖ్య
ఏబీసీ క్లీన్‌టెక్, యాక్సిస్ ఎనర్జీ	1,10,250	13,500
రెన్యూ పవర్	25,000	10,000
రెన్యూ ఇ-ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్	17,000	1,100
రెన్యూ ప్రైవేట్ లిమిటెడ్	12,500	3,250
నవయుగ ఇంజినీరింగ్	23,427	6,300
చింతా గ్రీన్ ఎనర్జీ	27,955	6,600
ఫోర్ స్క్వేర్ ఎనర్జీ	10,205	1,750
ఇండోసోల్	23,450	6,900
షిర్డీసాయి	15,000	15,400
పరిశ్రమలు, వాణిజ్య రంగంలో		
రెన్యూ ఫోటోవాల్టైక్స్	5,451	3,600
ఇండోసోల్	2,200	500
షిర్డీసాయి	5,000	5,000
వైజాగ్ ప్రొఫైల్స్ లాజిస్టిక్స్	6,000	5,250
స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా	4,650	5,400
విరూపాక్ష ఆర్గానిక్స్	1,189	2,000
అనంత్ టెక్నాలజీస్	1,000	1,000
ఏటీఆర్ వేర్ హౌసింగ్	1,100	6,200
లారస్ ల్యాబ్స్	1,000	500
మారుతి ఇస్పాత్ పైప్స్	1,000	1,800
ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్	1,000	500
మల్లాది ఫార్మా	353	355
ఈ జౌల్	19,000	1,800
కోరమండల్	2,000	500
తైవాన్ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్	1,200	10,000
జూల్	1,500	1,000
ఏపీ సీఆర్డీఏ పరిధిలో..		
మణిపాల్ గ్రూప్	15,000	1,000
బెర్జాయ గ్రూప్	8,300	-
అమరావతి లైఫ్‌సైన్సెస్	2,000	5,000
మై సిటీ, మలేషియా	2,000	-
వివెన్స్ గ్రూప్	2,000	5,000
ఫ్యాషన్ ఆంత్రప్రెన్యూర్ ఫండ్	1,200	1,200
ఏస్ అర్బన్ డెవలపర్స్	1,800	600
ఆహారశుద్ధి రంగంలో..		
ఉమెన్ ఓవా ఆగ్రోఫుడ్ పార్క్	1,440	7,000
ఐటీసీ ఫుడ్స్	400	500
గోద్రెజ్ ఆగ్రో వెట్	279	66
బిస్లరీ	200	500
ఇన్వెస్ట్‌మెంట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో		
క్రౌన్ ఎల్ఎన్జీ	10,640	-
ఆర్సీఆర్టీ	1,615	1,300

బాపట్ల జిల్లాలో వెయ్యి ఎకరాల్లో పునరుత్పాదక విద్యుత్ తయారీ జోన్

ఈనాడు, అమరావతి: బాపట్ల జిల్లాలో వెయ్యి ఎకరాల్లో ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్.. పునరుత్పాదక ఇంధన తయారీ జోన్ (ఆర్ఈఎంజెడ్) ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. సంతమాగులూరు మండలం కుందూరు (తూర్పు) గ్రామం, బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం గ్రామాల్లో ఆర్ఈఎంజెడ్ ఏర్పాటు చేయనున్నారు.

నవయుగ పీఎస్పీ ప్రాజెక్ట్ సామర్థ్యం పెంపునకు అనుమతి

అల్లూరి సీతారామరాజు జిల్లా చిట్టంవలసలో నవయుగ ఇంజినీరింగ్ కంపెనీకి చెందిన పంప్డ్‌స్టోరేజ్ ప్రాజెక్ట్ (పీఎస్పీ) సామర్థ్యం 800 నుంచి 1,800 మెగావాట్లకు పెంచేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

- కర్నూలు జిల్లా హొళగుంద, ఆలూరు మండలాల్లోని చిన్నహుల్తి, లింగదళ్లి, నెరణికి, ఎల్లార్తి గ్రామాల్లో 250 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఎస్ఏఈఎల్ సోలార్ పీ12 లిమిటెడ్‌కు అనుమతించింది.

మడకశిరలో రక్షణ ఛత్రం

- రూ.2 వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నాం
- ఇది ఆరంభం మాత్రమే... ఏపీతో అనుబంధం కొనసాగుతుంది
- 'ఈనాడు' ముఖాముఖిలో భారత్ ఫోర్జ్ వైస్ ఛైర్మన్, జేఎండీ అమిత్ కల్యాణి వెల్లడి



(విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి) శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో భారత్ ఫోర్జ్ నెలకొల్పుతున్న రక్షణరంగ ఉత్పత్తుల తయారీ కేంద్రంలో దశలవారీగా రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెడతామని భారత్ ఫోర్జ్ వైస్‌ఛైర్మన్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, సీఐఐ ఐరోపా కౌన్సిల్ ఛైర్మన్ అమిత్ కల్యాణి తెలిపారు. ఇది ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో ఏపీతో అనుబంధం కొనసాగుతుందని, వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడతామన్నారు. "మా కంపెనీ ఉత్పత్తులు మార్కెట్‌లోని మిగతా కంపెనీల ఉత్పత్తులకంటే నాణ్యంగా, చౌకగా ఉండాలని, సమయానికి అందజేయాలని మా వినియోగదారుడు కోరుకుంటాడు. మాతో విశ్వసనీయ సంబంధాలు ఆశిస్తాడు. ఒక పరిశ్రమ యజమానిగా ప్రపంచంలో ఎక్కడ పెట్టుబడులు పెట్టాలన్నా నేనూ అవన్నీ చూస్తా. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఆ లక్షణాలన్నీ ఉన్నాయి.. అందుకే ఇక్కడ పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నాం" అని తెలిపారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో మిగతా రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ ముందుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో విశాఖకు డిజిటల్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడానికి గూగుల్ డేటా సెంటర్ దోహదం చేస్తుందన్నారు. విశాఖలో జరుగుతున్న పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

మార్చి నెలాఖరుకు పనులు ప్రారంభిస్తాం

"మడకశిరలో సైన్యానికి అవసరమయ్యే ఎనర్జిటిక్స్, ప్రొపెల్లెంట్స్ తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం భూమి కేటాయించింది. అనుమతుల ప్రక్రియలన్నీ పూర్తిచేసుకొని, వచ్చే మార్చి చివరినాటికి పనులు ప్రారంభిస్తాం. చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఉండగానే మాంబట్టులో ఒక పరిశ్రమ ఏర్పాటు చేశాం. దాన్ని విస్తరిస్తాం. మడకశిర ప్లాంట్‌లో తొలి దశలో రూ.750-800 కోట్ల పెట్టుబడులు పెడతాం. ప్రాజెక్టు అన్ని దశలూ పూర్తయ్యేసరికి మొత్తం రూ.2000 కోట్ల వరకు పెడతాం.

విశాఖ మారిటైమ్ క్లస్టర్‌గా మారుతుంది

మా కంపెనీ 10-12 ఏళ్లుగా ఆత్మనిర్భర భారత్ స్ఫూర్తితోనే పనిచేస్తోంది. మా సొంత టెక్నాలజీతో రక్షణ రంగానికి అవసరమైన ల్యాండ్ సిస్టమ్స్, ఫిరంగులు, మౌంటెడ్ గన్స్, ఆర్మర్డ్ వెహికిల్స్, మానవ రహిత వాహనాలు తయారు చేస్తున్నాం. నౌకాదళ ఉత్పత్తులకు ఎక్కువ డిమాండు ఉంది. విశాఖ రాబోయే రోజుల్లో మారిటైమ్ క్లస్టర్‌గా అభివృద్ధి చెందబోతోంది. వాణిజ్య, నౌకాదళానికి అవసరమైన నౌకల తయారీపై దృష్టి పెడతాం.

ఐరోపాకు భారత్ అది పెద్ద మార్కెట్

ఐరోపా దేశాలకు భారత్ అతిపెద్ద మార్కెట్. వారికి చైనా మార్కెట్ క్లోజ్ అయిపోయింది. అమెరికా సంతృప్తస్థాయికి వచ్చేసింది. ఐరోపా మార్కెట్ కుచించుకుపోతోంది. ఇప్పుడు ఐరోపాకు భారత్, భారత్‌కు ఐరోపా కావాలి. భారత్ టెక్నాలజీ, సమర్థత ఆ దేశాలను ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా అక్కడి నుంచి యువత ఎక్కువగా రావడం సానుకూల పరిణామం. వారిని ఆకర్షించడంలో డిజిటల్ ఇండియా కీలకపాత్ర పోషిస్తోంది. డిజిటల్ టెక్నాలజీలో ఆ దేశాల కంటే భారత్ ముందుండటం సానుకూల అంశం. మనకున్న డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని చూసి పెట్టుబడిదారులు ముందుకొస్తున్నారు. ఆ విషయంలో ఏపీ ఇంకా ముందుంది" అని అమిత్ కల్యాణి వివరించారు.

ఇళ్లు నిర్మించి ఎగుమతి చేస్తాం

- రామాయపట్నంలో ప్రీ ఫ్యాబ్రికేటెడ్ గృహాల తయారీ పరిశ్రమ
- 'ఈనాడు'తో జూల్ గ్రూప్ సీఈఓ టామ్ ఓలాండర్, జోవో సీఓఓ సందీప్



'విశాఖపట్నం' నుంచి 'ఈనాడు' ప్రతినిధి

చెక్కతో తయారుచేసిన ఇళ్లకు యూరప్, ఆస్ట్రేలియాల్లో మంచి డిమాండ్ ఉంటుందని.. మన కార్మికులకు శిక్షణనిచ్చి, పరిశ్రమలు ఏర్పాటుచేస్తే పెద్దఎత్తున ఎగుమతి చేయవచ్చని జూల్ గ్రూప్ సీఈఓ టామ్ ఓలాండర్, జోవో సంస్థ సీఓఓ సందీప్ జక్కంపూడి పేర్కొన్నారు. స్వీడన్‌కు చెందిన జూల్ గ్రూప్ తన భాగస్వామ్య సంస్థ జోవో ఆధ్వర్యంలో రామాయపట్నం వద్ద 50 ఎకరాల్లో రూ.300 కోట్లతో అత్యాధునిక తయారీ ప్లాంట్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా వారు 'ఈనాడు'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 'రామాయపట్నం ఫర్నిచర్ సిటీలో ప్రీ ఫ్యాబ్రికేటెడ్ ఇళ్లు (చెక్కతో ముందే నిర్మించినవి) తయారు చేసి నౌకల్లో ఎగుమతి చేస్తాం. ఇందుకోసం నార్వే, స్వీడన్ తదితర రాష్ట్రాల నుంచి భారీ దుంగల్ని దిగుమతి చేసుకుంటాం. ఒక్కో నౌకలో 20-30 ఇళ్ల విడిభాగాలను పంపవచ్చు. వాటిని అక్కడ ఇల్లుగా బిగిస్తారు. భారత్‌లోనూ కలపతో కంటెయినర్ తరహా ఇళ్లు చేయొచ్చు. తలుపులు, కిటికీలు, సోఫా, కుర్చీలు, మంచాలు, టేబుల్స్, ప్యాకింగ్ మెటీరియల్ తదితరాలూ తయారుచేస్తాం. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20-30 వేల మందికి ఉపాధి కల్పించవచ్చు. 2027 మే నాటికి ఉత్పత్తి ప్రారంభించాలని ఆలోచిస్తున్నాం' అని పేర్కొన్నారు.

ప్రస్తుతం వివిధ దేశాల నుంచి దిగుమతి అయ్యే కలపలో అధిక వాటా ముంద్రా, కాండ్లా నౌకాశ్రయాలదే. ముంద్రా పోర్టుకు నెలకు 10 నౌకల కలప వస్తే అందులో 40% నుంచి 50% దక్షిణాది రాష్ట్రాలకే వెళుతుంది. అదే రామాయపట్నంలోనే కలప దిగుమతి చేసుకుని ఫర్నిచర్ తయారుచేస్తే వాటి రేట్లు తగ్గుతాయి.

సరుగుడుతో విలువ ఆధారిత ఉత్పత్తులు

ప్రకాశం జిల్లాలో సరుగుడు తోటలు ఎక్కువ. వీటితో తయారుచేసే ఉత్పత్తులకు యూరప్‌లో ఎక్కువ డిమాండ్ ఉంది. రైతుల నుంచి సరుగుడు కర్ర కొనుగోలు చేసి విలువ జోడించి ఎగుమతి చేస్తాం. రామాయపట్నంలో ఫర్నిచర్ హబ్ రూపుదిద్దుకునేలోగా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. సోలార్ ప్యానెల్స్, పెద్దపెద్ద యంత్రాలు, ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి చేయాలంటే ప్యాకింగ్‌కు చెక్క కావాలి. తొలుత ఫార్మా ప్యాకింగ్‌కు ప్రత్యేకించి విశాఖపట్నంలో ఒక పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నాం' అని వివరించారు.

నౌకాదళ కార్యకలాపాలకు సంపూర్ణ సహకారం అందిస్తాం

వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాతో సీఎం చంద్రబాబు



సంజయ్ భల్లాను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం చేపట్టే వివిధ ప్రాజెక్టులకు, కార్యకలాపాలకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేవీ కార్యకలాపాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈస్టర్న్ నేవల్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సంజయ్ భల్లా.. విశాఖలో సీఎం చంద్రబాబును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నౌకాదళ కార్యకలాపాలను వైస్ అడ్మిరల్ సీఎంకు వివరించారు. రక్షణ వ్యవస్థలో కీలకమైన భారత నౌకాదళానికి సేవలు అందించే కంపెనీలు, స్టార్టప్‌లను రాష్ట్రానికి ఆహ్వానించే అంశంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వదేశీ నౌకల నిర్మాణం, నౌకా సాంకేతికతకు తోడ్పాటును అందించేలా ప్రయత్నం చేస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎం తెలిపారు. ఏపీలో రక్షణ రంగంలో చేరేందుకు యువత చూపుతున్న ఆసక్తి ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు.

సిట్ విచారణకు వైవీ సుబ్బారెడ్డి గైర్హాజరు

ఈనాడు, తిరుపతి: తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి గురువారం తిరుపతిలో జరిగిన సిట్ విచారణకు హాజరు కాలేదు. ఈనెల 13న హాజరు కావాలని మూడు రోజుల కిందట అధికారులు ఆయనకు నోటీసులు పంపారు. లఖ్‌నవూలో పార్లమెంట్ ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ సమావేశం నేపథ్యంలో ఈనెల 15 వరకూ రాలేనని ఆయన సమాచారం ఇచ్చారు. త్వరలో మరోసారి నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ★ మరోవైపు వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్న కస్టడీ పిటిషన్‌పై శుక్రవారం నెల్లూరులోని అనిశా కోర్టు నిర్ణయం వెలువరించే అవకాశం ఉంది.

నన్ను నెయ్యి కొనుగోలు ప్రక్రియపై ప్రశ్నించారు

తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డి

ఈనాడు, తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే)లో కొనుగోళ్ల విధానం వివరాలు, ఆ ప్రక్రియ గురించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తనను ప్రశ్నించారని తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వాటన్నింటికీ వివరంగా జవాబిచ్చానని పేర్కొన్నారు. ఈ కేసులో కేవలం సాక్షిగానే తనను పిలిచారన్నారు. అంతకుముందు పని చేసిన అధికారులనూ ప్రశ్నించారని.. ఈ క్రమంలో తననూ హాజరుకావాలని కోరడంతో వచ్చినట్లు తెలిపారు. సిట్ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఇతర అంశాలను బహిర్గతం చేయడం బాధ్యతారాహిత్యం అవుతుందన్నారు.

వివేకా హత్య విషయంలో

జగన్‌కు సమాచారంపై దర్యాప్తు జరగలేదు

- అవినాష్‌రెడ్డి-సునీల్‌యాదవ్‌ల సీడీఆర్ పరిశీలించాలి
- ఎంవీ కృష్ణారెడ్డి పాత్రపై లోతైన దర్యాప్తు జరపలేదు
- హత్యకు వినియోగించిన ఆయుధాన్ని విస్మరించింది
- సీబీఐ కోర్టులో సునీతారెడ్డి వాదనలు

ఈనాడు, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య సమాచారాన్ని ఎం.వి. కృష్ణారెడ్డి వెల్లడించడానికి ముందే మరికొందరికి తెలిసిందని, ఈ విషయాన్ని సీబీఐ దాఖలుచేసిన అభియోగపత్రంలో పేర్కొన్నా ఆ కోణంలో లోతైన దర్యాప్తు జరపలేదని సునీతారెడ్డి తరపు న్యాయవాది సీబీఐ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హత్య జరిగిన రోజు అవినాష్‌రెడ్డి ఫోన్ వాడుకలోనే ఉందని, ఆయన వైకాపా అధినేత జగన్‌కు చెప్పి ఉండవచ్చన్న సందేహం వ్యక్తం చేసి వదిలేసిందని, జగన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారా లేదా అన్న కోణంలో దర్యాప్తు జరగలేదన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి అజేయ కల్లం ఇచ్చిన వాంగ్మూలంలో 5 గంటలకు మ్యానిఫెస్టోపై చర్చ జరుగుతుండగా ఫోన్ వచ్చిందని వైఎస్ భారతి మనిషిని పంపడంతో జగన్ లోపలికి వెళ్లి వచ్చి.. వివేకా చనిపోయినట్లు చెప్పారన్నారు. సమాచారం ఎలా వచ్చిందన్న దానిపై దర్యాప్తు కొనసాగించలేదని వాదనలు వినిపించారు. వివేకా హత్యపై లోతైన దర్యాప్తు కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం గురువారం విచారణ చేపట్టారు. సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, న్యాయవాది ఎస్.గౌతం వాదనలు వినిపిస్తూ వైఎస్ భాస్కరరెడ్డి తమ్ముడి కుమారుడు అర్జున్‌రెడ్డికి సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్‌యాదవ్ ముందుగా హత్య సమాచారాన్ని ఇచ్చారని, వీరిమధ్య ఉన్న సంబంధంపై దర్యాప్తు జరగలేదన్నారు. సునీల్ యాదవ్ సీడీఆర్‌ను పరిశీలిస్తే అవినాష్‌రెడ్డితో మాట్లాడినట్లు తేలుతోందన్నారు. సునీల్‌యాదవ్ స్నేహితుడు భరత్‌యాదవ్ పరస్పర విరుద్ధమైన వాంగ్మూలాలు ఇచ్చారని తెలిపారు. మొదట వజ్రాల వ్యాపారంలో డబ్బు రాగానే ఇస్తానంటూ రూ.16 లక్షలు తీసుకున్నట్లు చెప్పి తరవాత సునీత, ఆమె భర్త డబ్బులు ఇచ్చారని మరోరకంగా వాంగ్మూలం ఇచ్చారన్నారు. రూ.16 లక్షలు సహా భరత్‌యాదవ్ పాత్రతోపాటు దస్తగిరితో ఆర్థిక వ్యవహారాలున్న న్యాయవాది ఓబుళరెడ్డి పాత్రపై దర్యాప్తు కొనసాగించలేదన్నారు. హత్య జరిగిన రోజు, తరవాత అవినాష్‌రెడ్డి, సునీల్‌యాదవ్‌ల మధ్య సంభాషణలు, వారి కదలికలపై దర్యాప్తు జరగాలని చెప్పారు. 2019 మార్చి 19న అవినాష్‌రెడ్డి ఎక్కడ ఉన్నారో ఆరాతీయాల్సి ఉందన్నారు.

ఎంవీ కృష్ణారెడ్డి పాత్ర సందేహాస్పదం

వివేకా హత్య వ్యవహారంలో ఆయన వ్యక్తిగత సహాయకుడు ఎం.వి.కృష్ణారెడ్డి పాత్రపై సందేహాలున్నాయని, వాటిపై లోతైన దర్యాప్తు జరపాల్సి ఉందన్నారు. వివేకాతో ఉన్న సుదీర్ఘ సాన్నిహిత్యం వల్ల ఇంట్లోకి వెళ్లడానికి అనుమతులు అవసరం లేకపోయినా, హత్య జరిగిన తర్వాత ఉదయం వివేకాను నిద్ర లేపడానికి ఆయన భార్య సౌభాగ్యమ్మ అనుమతి కోరడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఇంటి పక్కద్వారం తెరిచి ఉండటంతో వాచ్‌మన్ రంగన్నను ఇంట్లోకి వెళ్లి చూడాలని కృష్ణారెడ్డి చెప్పారని, రంగన్నను సాధారణంగా ఇంట్లోకి అనుమతించరని చెప్పారు. రంగన్నను ఇంట్లోకి వెళ్లాలని చెప్పేముందు వివేకాకు కృష్ణారెడ్డి ఫోన్ చేయలేదని తేలిందన్నారు. అదేరోజు శశికళ అనే మహిళ వస్తే వివేకా తిరుపతి వెళ్లారని చెప్పి ఆమెను వెనక్కి పంపారని పేర్కొన్నారు. వివేకా హత్యరోజు కృష్ణారెడ్డి వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నా.. ఆ కోణంలో దర్యాప్తు కొనసాగించలేదని వివరించారు. ఘటనా స్థలంలో కృష్ణారెడ్డి సోదరుడు మనోహర్‌రెడ్డి ఉన్నారని, సాక్ష్యాల చెరిపివేతలో ఎవరెవరి పాత్ర ఉందన్నది దర్యాప్తు చేయలేదన్నారు. ఘటనాస్థలంలో తీసిన ఫొటోల్లో పాదముద్రలు కనిపిస్తున్నాయని అవి ఎవరివన్న కోణంలో దర్యాప్తు సాగలేదన్నారు. గజ్జల ఉమాశంకర్‌రెడ్డికి చెందిన రెండు వీడియోల్లో ఒకదాన్ని పరిశీలించిన ఫోరెన్సిక్ బృందం ఆయనతో పోలికలు ఉన్నట్లు చెప్పిందన్నారు. హత్య జరిగిన తర్వాత వివేకా ఇంటి సమీపంలో ఉమాశంకర్‌రెడ్డి పరిగెడుతున్నట్లు ఉందని, అలాంటిదే ముందురోజు వీడియో ఉందని.. వీటిని పరిశీలించలేదని తెలిపారు. భాస్కరరెడ్డి, అవినాష్‌రెడ్డిలను రక్షించేందుకు నేరాన్ని అంగీకరిస్తే రూ.10 కోట్లు ఇస్తామంటూ గంగాధర్‌రెడ్డి వాంగ్మూలం ఇచ్చారన్నారు. హత్యకు వినియోగించిన ఆయుధంతోపాటు ఈ వ్యవహారంలో జరిగిన రూ.4 కోట్ల లావాదేవీలపై దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు.

కోర్టు ఆదేశిస్తే కొనసాగిస్తాం: సీబీఐ

వివేకా హత్యపై కోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీబీఐ తరపు న్యాయవాది తెలిపారు. నిందితులకు ఇచ్చిన హార్డ్‌డిస్క్‌లు దాదాపు అన్నీ ఓపెన్ అయ్యాయని, కొన్ని కాలేదన్నారు. ఈ దశలో పిటిషనర్ తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుంటూ అభియోగపత్రంలో లేని విషయాలపై దర్యాప్తు జరపాలని కోరుతున్నామని, అందువల్ల డాక్యుమెంట్లు ఓపెన్ కాలేదన్న అంశం తదుపరి దర్యాప్తుపై ప్రభావం చూపదన్నారు. నిందితుల తరపు వాదనల నిమిత్తం న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

పరకామణిలో చోరీ కేసులో

రెండు పిటిషన్లూ ఒకే ధర్మాసనానికి..

- తన ఆస్తులపై విచారణకు వీల్లేదని నిందితుడు రవికుమార్ వ్యాజ్యం
- దీన్ని సుమోటో కేసుకు జత చేయాలని రిజిస్ట్రీకి కోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: శ్రీవారి పరకామణిలో చోరీ కేసును లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై సీఐడీ విచారణకు ఆదేశించడంతో పాటు, తనతో పాటు, తన కుటుంబసభ్యుల ఆస్తులపై ఏసీబీతో విచారణ జరిపించాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ నిందితుడు సీవీ రవికుమార్ వేసిన అప్పీల్‌పై సీజే నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. చోరీ కేసు రాజీకి అనుమతిస్తూ లోక్‌అదాలత్ జారీ చేసిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు నమోదైన సుమోటో వ్యాజ్యంపై మరో ధర్మాసనం విచారణ జరుపుతోందని గుర్తు చేసింది. ఒకే అంశంతో ముడిపడి ఉన్న వ్యవహారంలో వేర్వేరు ధర్మాసనాలు విచారించడం సరికాదని అభిప్రాయపడింది. పరస్పర భిన్న ఉత్తర్వులు వెలువడకుండా ఉండేందుకు.. ప్రస్తుత అప్పీల్‌తోపాటు మరో బెంచ్ వద్ద ఉన్న సుమోటో పిటిషన్‌ను కలిపి తామే విచారణ జరుపుతామని పేర్కొంది. సుమోటో వ్యాజ్యాన్ని ప్రస్తుత అప్పీల్‌కు జతచేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. సీవీ రవికుమార్‌ను వేధిస్తున్నారని, సింగిల్ జడ్జి ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని ఆయన తరపు సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఓ తేదీని నిర్ణయించి ఆ రోజు విచారణ జరపాలని కోరారు. త్వరగా విచారణ జరిపే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం గురువారం ఈ ఉత్తర్వులిచ్చింది.

చోరీ కేసు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారంలో తితిదే బోర్డు, అధికారులు, దర్యాప్తు అధికారి, ఫిర్యాదుదారు/అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి (ఏవీఎస్‌వో) వై.సతీష్‌కుమార్ పాత్ర, నిందితుడు, ఆయన కుటుంబసభ్యులు శ్రీవారికి రూ.14.5 కోట్ల విలువ చేసే ఆస్తులను గిఫ్ట్‌గా ఇచ్చే విషయంలో చోటుచేసుకున్న పరిణామాలు, వారు కూడబెట్టిన ఆస్తులపై విచారణ జరపాలని హైకోర్టు సింగిల్ జడ్జి గత నెల 27న ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ నిందితుడు సీవీ రవికుమార్ ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలుచేశారు. తాను తితిదే ఉద్యోగిని కాదన్నారు. ప్రైవేటుదయిన పెద్ద జీయర్ మఠంలో గుమస్తాగా పనిచేస్తున్నందున తాను ప్రభుత్వ ఉద్యోగి (పబ్లిక్ సర్వెంట్) నిర్వచనం పరిధిలోకి రానన్నారు. అందువల్ల తన ఆస్తులపై ఏసీబీ విచారణకు ఆదేశించడానికి వీల్లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని కోరారు.

పట్టపగలు.. పదిమందీ చూస్తుండగా..

గొంతుకోసి భార్య హత్య

- అనుమానపు జబ్బుతో ఓ భర్త ఘాతుకం
- విజయవాడ సూర్యారావుపేటలో దారుణం



సరస్వతి మృతదేహం వద్ద కత్తితో విజయ్, భయంతో దూరంగా నిలుచున్న జనం



కుమారుడితో సరస్వతి

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే: పట్టపగలు.. అందరూ చూస్తుండగానే.. ఓ వ్యక్తి కత్తితో భార్య గొంతు కోసేశాడు. విచక్షణారహితంగా దాడిచేసి చంపేశాడు. అడ్డుకోబోయిన జనాలను బెదిరించాడు. ముందుకొస్తే చంపేస్తానని హెచ్చరించేసరికి వారంతా చేష్టలు డిగి చూస్తుండిపోయారు. గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ హత్యతో విజయవాడ ఉలిక్కిపడింది. స్థానిక దుర్గా అగ్రహారానికి చెందిన దీపాల విజయ్ (40) నూజివీడుకు చెందిన మట్టకొయ్య సరస్వతి (30)ని ప్రేమించి 2022లో వివాహం చేసుకున్నాడు. భర్త భవానీపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో టెక్నీషియన్‌గా, భార్య సూర్యారావుపేటలోని ఒక ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. విభేదాల కారణంగా ఏడాదిన్నరగా విడిగా ఉంటున్నారు. సరస్వతి రోజూ నూజివీడు నుంచి ఆసుపత్రికి వచ్చి వెళ్తున్నారు. రోజూలాగే గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విధులకు హాజరయ్యారు. 2.15 గంటలకు ఆసుపత్రి నుంచి బయటకు రాగానే.. అక్కడే మాటు వేసిన విజయ్ ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాడు. కత్తితో మెడపై, గొంతుపై పొడిచాడు. తీవ్రగాయాలతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. అక్కడే ఉన్న జనం.. అతడిని నిలువరించేందుకు ప్రయత్నించగా కత్తితో బెదిరించాడు. రక్తపు మడుగులో పడిన భార్య విలవిల్లాడుతుండగా.. ప్రాణాలు విడిచేవరకూ విజయ్ కత్తితో అక్కడే నిలుచున్నాడు. ఇంతలో అక్కడకు చేరుకున్న సూర్యారావుపేట సీఐ అహ్మద్ అలీ, ఇతర పోలీసు సిబ్బంది విజయ్‌ను మాటల్లో పెట్టి ఒక్కసారిగా చుట్టుముట్టారు. స్థానికుల సాయంతో చాకచక్యంగా కత్తిని లాక్కుని నిందితుడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లైన తర్వాత సరస్వతిపై అనుమానంతో విజయ్ తరచూ గొడవకు దిగేవాడని, దీంతో ఆమె నూజివీడులో పోలీసులకు భర్తపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

భవానీ ద్వీపంలో అడ్వెంచర్ థ్రిల్ సిటీ

ఈనాడు, అమరావతి: విజయవాడలోని భవానీ ద్వీపంలో 'అడ్వెంచర్ థ్రిల్ సిటీ' ఏర్పాటుకు విశ్వనాథ్ ఎవెన్యూ సంస్థకు పది ఎకరాల భూమి కేటాయింపుతోపాటు రాష్ట్ర పర్యాటక విధానంలో భాగంగా ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఈనెల 7న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో నిర్ణయించిన మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని గురువారం పర్యాటక శాఖను ఆదేశించింది. పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రాజెక్టు ఏర్పాటుకు రూ.51.48 కోట్లు వెచ్చించనున్నారు. దీంతో 250 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది.

తాళ్లపాలెంలో వినోదాల ఉద్యానం

కృష్ణా జిల్లా మచిలీపట్నం వద్ద తాళ్లపాలెంలో రూ.157.53 కోట్లతో వినోదాల ఉద్యానం, రిసార్ట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన మైరా బేసైడ్ రిసార్ట్స్‌కు 20 ఎకరాల భూమి కేటాయించడంతో పాటు పలు రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు ఏర్పాటుతో 380 మందికి ఉపాధి లభించనుంది. ఈమేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పర్యాటక సంస్థను ఆదేశిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీకి రూ.400 కోట్లు

ఈనాడు, అమరావతి: మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న స్త్రీశక్తి పథకానికి సంబంధించి.. ప్రభుత్వం ఏపీఎస్ఆర్టీసీకి రూ.400 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వు జారీచేసింది. పథకం మొదలైన ఆగస్టు 15 నుంచి అక్టోబరు నెలాఖరు వరకు రీయింబర్స్ చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఓఎంసీ గనుల సరిహద్దుల నిర్ధారణ కమిటీ పునర్నియామకం

ఈనాడు, అమరావతి: ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి చెందిన గనుల హద్దులను క్షేత్రస్థాయిలో ఖరారుచేసేందుకు సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటుచేసిన కమిటీని పునర్నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. తొలుత ఈ కమిటీలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధులియా ఛైర్మన్‌గా, కేంద్ర సాధికార కమిటీ తరపున చంద్రప్రకాశ్ గోయల్, గనులశాఖ సంయుక్త సంచాలకుడు డి.శ్రీనివాసరావు, అనంతపురం డీఎఫ్‌వో గురుప్రభాకర్, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ తరపున డాక్టర్ జి.త్రినాథ్‌కుమార్ సభ్యులుగా, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ సంచాలకుడిని కన్వీనర్‌గా నియమించారు. వీరితోపాటు అనంతపురం కలెక్టర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖకు చెందిన కర్నూలు ఆర్‌జేడీ, గనుల శాఖ డీడీ కమిటీకి సహకారం అందిస్తారని గతంలో ఇచ్చిన ఉత్తర్వులో పేర్కొన్నారు. తాజాగా వీరిని కమిటీ నుంచి తొలగించి, సుప్రీంకోర్టు సూచించిన శాఖల అధికారులనే సభ్యులుగా కొనసాగేలా ఉత్తర్వులో పేర్కొన్నారు.

నేటి సమ్మేటివ్-1 పరీక్ష వాయిదా

ఈనాడు, అమరావతి: సమ్మేటివ్-1 పరీక్షల నిర్వహణలో భాగంగా శుక్రవారం నిర్వహించాల్సిన పరీక్షను బాలల దినోత్సవం సందర్భంగా వాయిదా వేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. 1-5 తరగతులకు సంబంధించిన పరీక్షను తిరిగి ఈ నెల 17న, 6-10 తరగతులకు తిరిగి ఈ నెల 20న నిర్వహిస్తామని తెలిపింది.

నేడు 'జూబ్లీహిల్స్' ఓట్ల లెక్కింపు

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లో తేలనుంది. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్‌రూంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవనుంది. లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఈ ఉప ఎన్నికల్లో నోటాతో కలిపి 59 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున... ఒక్కో రౌండు ఫలితానికి కనీసం 40 నిమిషాలు పడుతుందని అధికారుల అంచనా. ఆ లెక్కన మధ్యాహ్నం 2గంటలకల్లా తుది ఫలితం వచ్చేస్తుందని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లపై ఆయన గురువారం స్ట్రాంగ్‌రూం వద్ద మాట్లాడారు.

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. **ఎంట్రీ పాసులు ఒక రోజు ముందుగా అంటే శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం** వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చొగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

– గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం



నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

సమయం: ఈ నెల 15న (శనివారం) సాయంత్రం 5.30 గంటలకు

స్థలం: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం, గన్నవరం

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 15న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life


భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు పూర్తి చేయండి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఇంద్రకీలాద్రిపై డిసెంబరు 11 నుంచి 15 వరకు నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై ఛైర్మన్, ఈవో గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దీక్షాధారుల రద్దీని దృష్టిలో ఉంచుకొని గిరిప్రదక్షిణ మార్గం, స్నానఘాట్లు, ఆలయ పరిసరాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా.. క్లోక్ రూమ్, చరవాణులు భద్రపరిచే ప్రదేశాలు, ప్రసాదాలు, అన్న ప్రసాద పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. యాగశాల, మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్య శివప్రసాద శర్మ, ఈఈ రాంబాబు, ఏఈవోలు పాల్గొన్నారు.

ఈనాడు అమరావతి
ఎన్టీఆర్

శుక్రవారం నవంబరు 14, 2025

బాల భారతం.. భళీ చరితం..



వారంతా బుడుగులు.. ప్రతిభలో చిచ్చర పిడుగులు.. తల్లిదండ్రుల ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని గురువుల మార్గదర్శనంలో అద్వితీయ విజయాలు సొంతం చేసుకున్నారు. చదువుతో పాటు ఎంచుకున్న రంగంలో తమ ప్రత్యేకత చాటేందుకు తపన పడుతున్నారు. 8 ఏళ్ల కే ఫ్యాషన్‌వీక్ పోటీలో గెలిచి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచి ఓ చిన్నారి ఔరా అనిపిస్తే.. వీణావాదనంలో కచేరీలతో అక్కాచెల్లెళ్లు మైమరిపిస్తున్నారు.. బ్యాడ్మింటన్‌లో మరొకరు సత్తాచాటితే.. జ్ఞాపకశక్తితో అబ్బురపరిచే చిన్నోడు ఇంకొకరు.. **నేడు బాలల దినోత్సవం** సందర్భంగా ప్రత్యేక కథనం.

బ్రాండ్ అంబాసిడర్‌గా ..



కానూరుకు చెందిన **పి.డోలిక నాగ సాయి** ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు నాగరాజు, భవానీలు. ఇద్దరూ ఉద్యోగులే. నాగసాయి ఫ్యాషన్, మోడలింగ్ రంగాల్లో రాణిస్తోంది. 2025 మార్చిలో విజయవాడకు చెందిన శుభశ్రీ క్రియేషన్స్ నిర్వహించిన కిడ్స్ రన్‌వే ఫ్యాషన్‌వీక్-2025 పోటీలో పాల్గొని జూనియర్ మోడల్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు సొంతం చేసుకుంది. దీంతో శుభశ్రీ సంస్థ వారు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నారు. ఆగస్టు 2న నగరంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బాలీవుడ్ నటి మధుమితగుప్తా చేతుల మీదుగా బ్రాండ్ అంబాసిడర్ కిరీటం అందుకుంది. 8 ఏళ్ల వయసులోనే ఈ ఘనత సాధించడంతో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌వారు గుర్తించి, అవార్డు పంపి అభినందించారు.

అక్కాచెల్లెళ్లు అదుర్స్..



సత్యనారాయణపురానికి చెందిన వీరుబొట్ల రవికుమార్, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తెలు **లిఖిత, సాత్విక.** 10, 8వ తరగతులు చదువుతున్నారు. ఐదేళ్లుగా చిట్టా కార్తిక్, రామలక్ష్మిల వద్ద వీణావాదనంలో పట్టుసాధించారు. ఇద్దరూ దేశ వ్యాప్తంగా 50కి పైగా కచేరీలు చేశారు. 2024లో షణ్ముఖానంద సంస్థ ముంబయిలో నిర్వహించిన సభా పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగంలో లిఖితకు ప్రథమ బహుమతి లభించింది. నవ్యనాటక సమితి రాష్ట్ర స్థాయి శాస్త్రీయ సంగీత పోటీల్లో అక్క ప్రథమ, చెల్లి ద్వితీయ బహుమతులు గెలిచి అబ్బురపరిచారు. 2025 జులైలో బ్రాహ్మణ సంక్షేమ సభ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలో లిఖిత మొదటి, సాత్విక రెండో బహుమతి గెలిచారు. వీణా ప్రావీణ్యంలో అత్యున్నత స్థాయికి ఎదగడమే తమ లక్ష్యమని వారు చెబుతున్నారు.

పసిడి పతకం సాధించాలని..



మహాత్మాగాంధీ రోడ్డులో నివసించే శ్రీరామ్ వెంకట్, సుజిని దంపతుల కుమార్తె **కావ్య శ్రీరామ్..** వచ్చే నెలలో నిర్వహించే జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించే దిశగా సాధన చేస్తోంది. ఎనిమిదో తరగతి చదువుతోంది. తండ్రి స్వతహాగా షట్లర్ కావడంతో ప్రోత్సహించారు. గత నెలలో కోల్‌కతాలో నిర్వహించిన జాతీయ జూనియర్ (అండర్-13) బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నీలో డబుల్స్‌లో విజేతగా నిలిచింది. రాష్ట్ర స్థాయిలో మూడు పసిడి, రెండు రజత పతకాలు సాధించింది.

జ్ఞాపకశక్తి మిన్న...



మధురానగర్‌కు చెందిన రెడ్డి **జైవీర్ అహ్వాన్** (6) జ్ఞాపకశక్తి విభాగంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించాడు. రెండో తరగతి చదువుతున్నాడు. చిన్ననాటి నుంచి జ్ఞాపకశక్తి ఎక్కువ. ఇది గుర్తించిన తల్లిదండ్రులు దేవిహేమ, చంద్రకాంత్‌లు ప్రోత్సహించారు. 153 దేశాలు, వాటి రాజధానులతో పాటు దేశంలోని రాష్ట్రాల పేర్లు వాటి రాజధానులు చెబుతున్నాడు. జెండాలు చూపిస్తే.. అవి ఏ దేశానికి చెందినవో ఇట్టే గుర్తిస్తాడు. చిన్నారి ప్రతిభను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు వారు.. పతకం, ప్రశంసాపత్రం పంపించారని తల్లి దేవి హేమ తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయవాడ సాంస్కృతికం, కానూరు, మధురానగర్, విజయవాడ క్రీడలు

కనుపాపకు వెలుగవుదాం..

చరవాణి వద్దు.. వికాసమే ముద్దు



☛ **విజయవాడ గ్రామీణ పరిధి**లోని గొల్లపల్లికి చెందిన ప్రణీత్ పదేళ్లు. రోజులో దాదాపు ఆరు గంటల పాటు ఫోన్‌లో రీల్స్, కార్టూన్లు చూస్తూ ఉంటాడు. తరచూ తలనొప్పి అనడంతో వైద్యుడిని సంప్రదించగా.. రేడియేషన్ కారణంగా కంటి నరాలు, రెటీనా దెబ్బతిన్నాయని చెప్పారు.

పిల్లలు మారాం చేయకుండా ఉండేందుకు చేతికిస్తున్న ఫోన్ వారి కంటి చూపును కబళించేస్తోంది. శారీరక, మానసిక ఎదుగుదల, ఏకాగ్రతకు గొడ్డలిపెట్టుగా మారుతోంది. చరవాణి వాడకం పెచ్చుమీరడం వల్ల ఉమ్మడి జిల్లాలో వందల మంది చిన్నారులు కంటి రుగ్మతల బారిన పడుతున్నారు. తల్లిదండ్రుల అలసత్వమే పిల్లల పాలిట శాపంగా మారుతున్న నేపథ్యంలో నేటి బాలల దినోత్సవం సాక్షిగా తల్లిదండ్రులు చరవాణి వినియోగం తగ్గించేందుకు పూనుకోవాల్సిన తరుణమిది.

ఉమ్మడి జిల్లా చిన్నారుల్లో కంటి పరీక్షలు..

అంశం	కృష్ణా	ఎన్టీఆర్
ఎన్ని పాఠశాలలు	374	483
విద్యార్థులు:	31,547	49,220
దృష్టిలోపం :	3,205	2,600
కళ్లద్దాలు అవసరం:	3,200	2600

మితి మీరితే అంతే: ✦ ఫోన్ వాడడం ఎక్కువైతే పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. ✦ రాత్రిళ్లు స్క్రీన్‌ను చూడటం, వీడియో గేమ్స్ ఆడడంతో నేత్ర సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. ✦ కంటి నుంచి నీళ్లు కారడంతో పాటు పొడిబారి చూపు మందగిస్తుంది **ఈ మార్పులు చేయండి:** ✦ ఫోన్ వినియోగం తగ్గించేందుకు ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ తదితర శరీరక ఆటలు ఆడే దిశగా దృష్టి మరల్చండి.

తల్లిదండ్రులే శ్రద్ధ తీసుకోవాలి



ఫోన్ల వల్ల సమయాన్ని వృథా చేసుకుంటూనే.. ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. తల్లిదండ్రులే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. చదువుకునేందుకు పిల్లలకు ఫోన్ ఇస్తే పది నిమిషాలకోసారి కాసేపు కళ్లు మూసి ఉంచమని సూచించండి. దృష్టి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే నయం చేయొచ్చు

-డాక్టర్ జి.భానుమూర్తి, జిల్లా అంధత్వ నివారణాధికారి

– ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

ఆపద... దరిచేరదిక..!

1098కు ఫోన్ చేయండి

అభంశుభం తెలియని పిల్లలపై కొందరు కర్కశంగా వ్యవహరిస్తుంటారు. వివిధ రకాలుగా వేధిస్తుంటారు. వెట్టిచాకిరి చేయిస్తుంటారు. ఇలాంటి వాటిపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా బాలల హెల్ప్‌లైన్ ఉంది. వారి సంరక్షణకు ఉచిత, అత్యవసర ఫోన్ నంబరును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే ఛైల్డ్‌లైన్ 1098. పిల్లలకు సహాయం, సేవల కోసం ఎవరైనా ఈ నంబరుకు ఫోన్ చేయవచ్చు. ఫిర్యాదులు చేయవచ్చు. సమాచారం అందించవచ్చు. ఏడాది పొడవునా 24×7 అందుబాటులో ఉంటుంది.

తక్షణం స్పందిస్తారు...

మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 1098 టోల్ ఫ్రీ నంబరు పనిచేస్తుంది. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తుంటాయి. ఫోన్ చేసి సమాచారం అందిస్తే.. తక్షణం స్పందిస్తారు. ఘటనాస్థలానికి చేరుకుని ఆపదలో ఉన్న బాలలను కాపాడతారు. వారిని సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారు.

CHILD LINE 1098 NIGHT & DAY

ఈ కింది తరహా సమాచారం ఇవ్వొచ్చు..

- ఆపదలో ఉంటే..
- లైంగిక వేధింపులపై..
- బాల్య వివాహాలు..
- భిక్షాటన, పనులు..
- రోడ్లపై వదిలేయడం..
- పారిపోయిన బాలలపై
- కౌన్సెలింగ్ కావాలంటే..
- సంరక్షణ అవసరమైతే..



ఎన్టీఆర్ జిల్లాలో..

ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అక్టోబరు 24 వరకు '1098' హెల్ప్‌లైన్‌కు మొత్తం 113 కాల్స్ వచ్చాయి. అత్యధికంగా బాల్య వివాహాలపైనే ఉండడం విశేషం.

ఫిర్యాదు వివరం	కాల్స్
బాల్య వివాహాలు	48
భిక్షాటన	15
లైంగిక వేధింపులు	4
షెల్టర్ రిక్వెస్ట్	13
కౌన్సెలింగ్	18
బాల కార్మికులు	8
బాలల పరారీ	4
అదృశ్యం	2
వదిలేయడం	1

విచారించి చర్యలు తీసుకుంటాం..

ఛైల్డ్‌లైన్‌కు ఫిర్యాదు వస్తే నిశితంగా పరిశీలిస్తాం. కూలంకషంగా దర్యాప్తు చేస్తాం. నివేదిక తయారు చేసి జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపిస్తాం. వారు తగిన చర్యలు తీసుకుంటారు. బాలల రక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటాం.

- ఎం.రాజేశ్వరరావు, బాలల పరిరక్షణ అధికారి, ఎన్టీఆర్ జిల్లా



- గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

కొలిక్కి వస్తున్న ప్యాకేజీ-4

వడివడిగా పశ్చిమ బైపాస్ తుది దశ పనులు

ఈనాడు, అమరావతి

పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-4 పనులు కొలిక్కి వస్తున్నాయి. తుది దశ పనులు వేగంగా పూర్తి చేసి సంక్రాంతి నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆగస్టులో కొండవీటి వాగుకు వరద పోటెత్తిన వేళ.. ప్రమాదాల నివారణకు మంగళగిరి మండలం కురగల్లు పరిధిలో రహదారిని ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులు 40 మీటర్ల మేర తొలగించారు. ఆ రోడ్డు పునర్నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని ఏడీసీఎల్ (ఎన్వోసీ) రాతపూర్వకంగా ఇవ్వాలని కోరుతూ ఎన్‌హెచ్ఏఐ గురువారం ప్రతిపాదన లేఖ పంపింది. వారి నుంచి ఎన్వోసీ రాగానే పనులు మొదలుపెట్టి 30 రోజుల్లో రోడ్డు పూర్తి చేయనున్నారు.

సంక్రాంతికి సిద్ధం...: పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-4లో గొల్లపూడి-కాజ వరకు వరకు 17.6 కి.మీ మేర నిర్మిస్తున్నారు. గొల్లపూడి నుంచి వెంకటాయపాలెం వరకు 6.5 కి.మీ. మేర ప్రస్తుతం రాకపోకలు జరుగుతున్నాయి. వరదల నేపథ్యంలో తొలగించిన 40 మీటర్ల రహదారి నిర్మాణం పూర్తయితే వెంకటాయపాలెం నుంచి హాయ్‌ల్యాండ్ వరకు 10.5 కి.మీ వరకు రాకపోకలకు మార్గం సుగమమైనట్లే. ఇక మిగిలింది కాజ దగ్గర ఎన్‌హెచ్-16తో అనుసంధానమే. పనులు మొదలై చాలా రోజులవుతున్నా.. వర్షాల వల్ల ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. ఇక్కడ సర్వీస్ రోడ్లను వేరు చేస్తూ 230 మీటర్ల మేర రక్షణ గోడ, బైపాస్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు యూటర్న్ తిరిగేందుకు అనువుగా ప్రమాదాలకు తావు లేకుండా మరో రెండు వరుసల రహదారి నిర్మించాల్సి ఉంది. త్వరలో ఈ పనులు కొలిక్కి రానున్నాయి. సంక్రాంతికి ఇంకా రెండు నెలలు ఉన్నందున అప్పటిలోగా పనులు పూర్తి చేసేలా అడుగులు పడుతున్నాయి.



వరదల వేళ.. కొండవీటి వాగు దగ్గర బైపాస్ తొలగింపు

అధిక డబ్బు ఇవ్వడంతో ఆశపడి ఒప్పుకొన్నా..

- దిల్‌సుఖ్‌నగర్‌లో నకిలీ లేబుళ్ల తయారీ
- సిట్, ఎక్సైజ్ విచారణలో సతీష్ వెల్లడి

ఈనాడు, అమరావతి: 'నకిలీ లేబుళ్ల డిజైన్, ప్రింటింగ్ కోసం నన్ను 2022 చివరలో తిరుమలశెట్టి శ్రీనివాసరావు సంప్రదించాడు. నేను తొలుత అంగీకరించలేదు. రిస్కుతో కూడుకున్న వ్యవహారం కావడంతో భయపడ్డా. సాధారణంగా మేం లేబుల్ డిజైనింగ్, ముద్రణకు రూ.30 తీసుకుంటాం. జనార్దనరావు, శ్రీనివాసరావులు నాకు రూ.45 ఇస్తామని ఆశ చూపించారు. అధిక మొత్తం కావడంతో నేను కాదనలేక అంగీకరించా' అని నకిలీ మద్యం కేసులో నిందితుడు చెక్కా సతీష్ (ఏ17) విచారణలో వెల్లడించాడు. కస్టడీలో భాగంగా తొలి రోజైన గురువారం సిట్, ఎక్సైజ్ అధికారులు అతడిని విజయవాడ కారాగారం నుంచి తీసుకుని.. తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ సిట్, ఎక్సైజ్ అధికారులు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. ఈ వ్యవహారంలో అతని పాత్ర, మిగిలిన వారితో పరిచయం, తదితర అంశాల గురించి ప్రశ్నించినట్లు తెలిసింది.

2024 నవంబరు వరకు సరఫరా... తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడికి చెందిన సతీష్.. పలు బ్రాండ్లకు సంబంధించి లేబుళ్లను తయారు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. దీనిపై అధికారులు ఇంటరాగేషన్‌లో వివరాలు అడిగారు. ఇదే కేసులో నిందితుడిగా ఉండి.. అజ్ఞాతంలో ఉన్న తలారి రంగయ్యతో ఎలా పరిచయమైందని ప్రశ్నించగా.. ఆయన తనకు సమీప బంధువని చెప్పాడు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అతనికి చెందిన ఆర్జే డిజైనర్స్ అండ్ ప్రింటింగ్ ప్రెస్‌లో గ్రాఫిక్ పని నేర్చుకున్నానని వివరించాడు. ప్రెస్‌లో తనకు వాటా కూడా ఉందని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చాడు. తిరుమలశెట్టి శ్రీనివాసరావుకు తాను 2024, నవంబరు వరకు నకిలీ లేబుళ్లను ప్రింట్ చేసి సరఫరా చేశానని అంగీకరించాడు. హైదరాబాద్‌లోని మరికొన్ని ప్రింటింగ్ ప్రెస్‌ల్లోనూ లేబుళ్లను శ్రీనివాసరావు తయారు చేయించినట్లు సిట్ అధికారులకు చెప్పాడు. తొలి రోజు విచారణ ముగిసిన అనంతరం సాయంత్రం తిరిగి కారాగారంలో అప్పగించారు.

సరిచూస్తున్నారా.. సరిపెడుతున్నారా?!

- ✦ పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆర్వో ప్లాంట్లు
- ✦ నీరు, క్యాన్ల శుభ్రత, శుద్ధిలో తీవ్ర నిర్లక్ష్యం

ఈనాడు, అమరావతి

"విజయవాడలో 20 లీటర్ల మంచినీటి క్యాన్ ఇంటికి తెచ్చి.. రూ.20-25 తీసుకుంటున్నారు. ఈ నీటిలో స్వచ్ఛత ఎంతనేది ప్రశ్నార్థకమే. కుప్పలుగా పుట్టుకొచ్చిన ఆర్వో ప్లాంట్లు.. సరఫరా చేసే వాటిలో నాణ్యత పరిశీలించే వ్యవస్థ లేదు. చాలాప్రాంతాల్లో వీధికొళాయిల వద్ద క్యాన్లలో నీళ్లు పట్టేసి ఇళ్లకు పంపిణీ చేస్తున్నారు."

"న్యూరాజరాజేశ్వరి పేటలో అతిసారం వ్యాప్తికి.. ఈ ఆర్వో ప్లాంట్ల నుంచి సరఫరా చేసిన నీళ్లే కారణమని తేల్చారు. ఈ ప్రాంతంలోని ఐదు ప్లాంట్లకు తాళాలు వేశారు. బ్యాక్టీరియాలజీ, బయాలాజికల్ పరీక్షలను చేశారు. కనీస శుభ్రత లేకుండా, సరిగా నీటిని శుద్ధి చేయకుండా ఇళ్లకు పంపిణీ చేశారని గుర్తించారు."

విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో నీటిలో టీడీఎస్ 1500కు పైగానే దాటుతోంది. వెయ్యి టీడీఎస్ దాటితే ఆ నీళ్లు తాగడానికి పనికి రావు. లీటరు నీటిలో 1,500 పైచిలుకు టీడీఎస్‌ను శుద్ధి చేయాలంటే.. దానికి రెండు రెట్లు నీరు వృథాగా పోతుంది. ఆ నీటిని భూగర్భంలోకి, కాలువల్లోకి పంపకూడదు. డ్రై బెడ్స్‌లో కేక్‌గా మార్చాలి. ఇలా చేయాలంటే ప్లాంట్లు విశాలంగా ఉండాలి. కానీ.. విజయవాడలో ఇరుకైన గదుల్లోనే అధికంగా నడుస్తున్నాయి. వృథా నీటిని కాలువలు, భూగర్భంలోకి పంపిస్తున్నారు.



2,500పైగా ఉండగా..

● ఉమ్మడి కృష్ణాలో 2,500పైగా నీటి శుద్ధి కేంద్రాలున్నా అనుమతి ఉన్నవి 500 కూడా లేవు. ● నీరు శుద్ధి చేశాక వ్యర్థ జలాన్ని డ్రై బెడ్స్‌లోకి పంపి కేక్‌గా మార్చే ప్లాంట్లు కనీసం వంద కూడా లేవు. ● 20 లీటర్ల నీటి శుద్ధికి ఖర్చు.. రూ.5 లోపే. సరఫరాకు బాటిల్‌కు రూ.5 కలిపినా.. మరో రూ.10 మిగులుతుంది. ● బెజవాడలో కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల్లో 2500కు పైగా టీడీఎస్ ఉంది. ఆవాసాల మధ్య ఆర్వో ప్లాంట్లతో భూగర్భ జలాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ● ఈ నీటి వినియోగంతో.. కిడ్నీలు పాడవడం, జీర్ణ వ్యవస్థ దెబ్బతినడం.. పలు రోగాలు పెరుగుతున్నాయి.

టీడీఎస్ పరికరంతో కనిపెట్టేయొచ్చు..

● నీటి నల్లాల వద్ద పట్టేసి.. క్యాన్లలో నింపి అమ్ముతున్నారు. నీటి రుచిని మార్చే టాబ్లెట్లను కలుపుతున్నారు. ● నీటి క్యాన్లను వాడే ప్రతి ఇంటిలోనూ టీడీఎస్‌ను కొలిచే పరికరం ఉండాలి. దీని ధర రూ.300. ఆన్‌లైన్‌లో దొరుకుతుంది. కేవలం ఓ పెన్‌లా ఉండే ఈ పరికరం చిన్న బ్యాటరీతో పనిచేస్తుంది. నీటిలో ఉండే టీడీఎస్ శాతాన్ని క్షణంలో గుర్తించొచ్చు. తాగే ఏ నీటినైనా దీంతో కొలవవచ్చు. ● 200 దాటి టీడీఎస్ ఉంటే.. అవి శుద్ధి చేయని నీళ్లే.

ఈ-పంట నమోదు ముసాయిదా జాబితాలు సిద్ధం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: 2025 ఖరీఫ్ కాలంలో జిల్లాలో ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలు, పూల తోటలకు సంబంధించి వ్యవసాయ, ఉద్యానాధికారులు నమోదు చేసిన ఈ-పంట ముసాయిదా జాబితాలపై శుక్రవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహిస్తారు. ఈ నెల 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు చేసిన జాబితాలు రైతులకు అందుబాటులో ఉంటాయి. సాగుదారులు ఆ జాబితాలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే అక్కడి వీఏఏకు లిఖిత పూర్వకంగా సమాచారం అందించాలి. వ్యవసాయ, ఉద్యానాధికారులు రైతులు తెలిపిన అభ్యంతరాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించి సవరణ చేస్తారు. ఈ ప్రక్రియ అంతా ఈ నెల 17వ తేదీ లోపు పూర్తవుతుంది. తదుపరి ఈ పంట నమోదైన పంటల వివరాల తుది జాబితాను వ్యవసాయాధికారులు ప్రకటిస్తారు. తుది జాబితా విడుదలయ్యాక మార్పులు, చేర్పులకు అభ్యంతరాలు ఉన్నా సవరించేందుకు అవకాశం ఉండదని అధికారులు తెలిపారు. ఈ పంట జాబితాల ఆధారంగానే ప్రభుత్వ కేంద్రాల్లో పంటలు విక్రయించడం, నష్టం అంచనాలు, రాయితీలు, పరిహారం లభిస్తాయన్నారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల ముసాయిదా జాబితాల్లో రైతు పేరు, పంట రకం, విత్తిన తేదీ, నీటి వసతి తదితర వివరాలు ఉంటాయి.


జిల్లాలో ఈ పంట వివరాలు ఎకరాల్లో : వరి 1,42,201, పత్తి 86,763, మొక్కజొన్న 9,383, పెసర 10,083, మినుము 9,153, మిరప 21,300, మామిడి 51,285, ఇతర పండ్ల తోటలు 2500, ఆయిల్‌పామ్ 10,250, కూరగాయలు 2,400, పూలతోటలు 570.

అమ్మా.. ఎక్కడి వరకు వచ్చారు?

- తిరుమలకు వెళ్లొస్తుండగా ప్రమాదానికి గురైన కారు
- తల్లిదండ్రుల దుర్మరణంతో గుండె పగిలిన కుమార్తె

జి.కొండూరు, న్యూస్‌టుడే: అమ్మా ఎక్కడి వరకు వచ్చారు.. అని తన తల్లికి ఫోన్ చేయగా అవతలివైపు పోలీసులు మాట్లాడుతూ.. మీ అమ్మా నాన్న వస్తున్న కారు ప్రమాదానికి గురైంది.. గాయాలయ్యాయి.. అని చెప్పడంతో ఒక్కసారిగా షాక్ గురైంది..అప్పటిదాకా కలిసి ఆనందంగా గడిపిన క్షణాలను గుర్తు చేసుకుంటూ.. ఏమైందోనని ఆందోళనతో కాసేపటికి బంధువులకు ఫోన్ చేయగా..అమ్మానాన్న ఇక లేరమ్మా అనే వార్త వినేసరికి అక్కడికక్కడే కుప్పకూలిందా కుమార్తె..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . జి.కొండూరు మండలం చెవుటూరుకు చెందిన గుమ్మడపు మురళీకృష్ణ(64), మాధవీలత(56) దంపతులకు వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం వారి చిన్నకుమార్తె నిఖితతో కలిసి కారులో తిరుపతి బయలుదేరి వెళ్లారు. పెద్ద కుమార్తె బొబ్బిలిలో ఉంటూ రైలులో తన కుమారుడితో కలిసి బుధవారం తల్లిదండ్రులతో కలిసి దైవ దర్శనానికి వెళ్లింది. గురువారం ఉదయం దర్శనం అనంతరం పెద్ద కుమార్తె, మనువడిని బొబ్బిలి పంపించేందుకు మురళీకృష్ణ వారిని రైలు ఎక్కించారు. అనంతరం చిన్నకుమార్తె దంపతులతో కలిసి కారులో తిరుగు ప్రయాణంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలోని మోచర్ల - వీరేపల్లి వద్ద ముందున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు కాగా సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. చిన్నకుమార్తె నిఖితకు వెన్నెముకకు గాయాలయ్యాయి. దంపతులిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాదం జరిగిన విషయం రైలులో వెళ్తున్న పెద్దకుమార్తెకు విజయవాడ చేరేసరికి తెలిసి కన్నీటిపర్యంతమై తిరిగి నెల్లూరు బయలు దేరారు. కారు ప్రమాదంలో దంపతులు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



చెట్టును ఢీకొని ధ్వంసమైన కారు

ఉద్యోగం వదిలేసి.. గంజాయి స్మగ్లర్‌గా మారి..!

రూ.కోట్లు సంపాదించాలన్న దురాశతో రవాణా ● డీఆర్ఐ అరెస్టుతో కటకటాల్లోకి రాహుల్‌కుమార్



రాహుల్ వాడే ఖరీదైన కారు



పెనమలూరు - న్యూస్‌టుడే

విశాఖపట్నంలోని కేంద్ర ప్రభుత్వ రంగ చమురు సంస్థలో మేనేజర్ ఉద్యోగం.. అక్కడ ఇతర రాష్ట్రాల కూలీలతో పరిచయమైంది. వారి మాటలు విని ఉద్యోగానికి రాజీనామా చేశాడు.. త్వరగా కోటీశ్వరుడిని కావాలన్న ఆశతో గంజాయి స్మగ్లర్‌గా మారాడు.. రెండేళ్ల పాటు ఒడిశా నుంచి గంజాయిని తెప్పించి ఉత్తరాది రాష్ట్రాలకు సరఫరా చేస్తూ రూ. కోట్లలో సంపాదించాడు.. అంచెలంచెలుగా అంతర్రాష్ట్ర స్మగ్లర్‌గా ఎదిగాడు. చివరకు చట్టానికి దొరికి కటకటాలపాలయ్యాడు. ఇదీ డీఆర్ఐ అరెస్టు చేసిన రాహుల్ కుమార్ చరిత్ర.

కూలీల పరిచయంతో గాడి తప్పాడు...

రాహుల్‌కుమార్ స్వస్థలం అవనిగడ్డ.. అక్కడి నుంచి రెండున్నరేళ్ల కిందట యనమలకుదురు వచ్చాడు. అంతకు ముందు విశాఖపట్నంలో ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్)లో మేనేజర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో అక్కడ పనిచేసే ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కూలీలతో పరిచయం ఏర్పడింది. వారి ద్వారా ఒడిశాలో విరివిగా లభ్యమయ్యే గంజాయికి, యూపీలోని పలు ప్రాంతాల్లో డిమాండ్ ఉందని తెలుసుకున్నాడు. అనంతరం అనేకసార్లు ఆయా రాష్ట్రాలను సందర్శించాడు. గంజాయి స్మగ్లింగ్‌తో రూ. కోట్లు కూడబెట్టొచ్చని గ్రహించిన రాహుల్ కుమార్.. ఉద్యోగాన్ని వదిలేశాడు. దాదాపు రెండేళ్ల పాటు విచ్చలవిడిగా కానూరు కొత్త ఆటోనగర్‌లో గోదామును అద్దెకు తీసుకుని.. అక్కడే వాహనాల్లో ప్రత్యేక అరలను తయారు చేయించి.. స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహించాడు. అయితే.. స్థానికంగా గంజాయి అమ్మకాలు సాగించకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. దీంతో ఇప్పటి వరకు ఎక్కడా పోలీసుల రికార్డుల్లోకి ఎక్కలేదు. ఇక్కడ విక్రయాలు చేస్తే దొరికిపోతామనే ఆలోచనతో జాగ్రత్త పడ్డాడు. గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసి, అనంతరం సరకును ఉత్తరాది రాష్ట్రాలకు పంపించేవాడు.

యనమలకుదురులో కలకలం...

రాహుల్‌కుమార్ అంతరాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ వ్యవహారాల విషయం బయటకు రావడంతో యనమలకుదురులో కలకలం రేపింది. అతడు స్థానికంగా నివసిస్తున్నా ఎవరితోనూ పరిచయాలు పెంచుకోలేదు. ఫ్లాట్ కొనుగోలు చేసి నివాసం ఉంటున్నా. ఎవరితోనూ మాట్లాడే వాడు కాదని స్థానికులు చెబుతున్నారు. ముభావంగా ఉండటంతో పాటు గోప్యతను పాటించే వాడని తెలిసింది. రెండు ఖరీదైన కార్లు, ద్విచక్ర వాహనం వినియోగిస్తుంటాడని, వాటికి రిజిస్ట్రేషన్లు వేరైనా, నంబర్లు మాత్రం 9117గా ఉన్నాయని చెబుతున్నారు. రెండ్రోజులుగా అతడు ఉండే అపార్ట్‌మెంట్ ఆవరణలో ఓ కారు, ద్విచక్రవాహనం మాత్రమే ఉన్నట్లు గ్రామస్థులు గుర్తించారు. ద్విచక్ర వాహనంపై ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం స్టిక్కరు అతికించి ఉంది.

నిందితులకు రిమాండ్...

గంజాయి స్మగ్లింగ్ కేసులో నిందితులైన రాహుల్‌కుమార్, హుస్సేన్, సోహన్‌లాల్, ఆనంద్‌కుమార్, అబ్దుల్‌హసన్‌లను డీఆర్ఐ అధికారులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. నిందితులకు న్యాయాధికారి రిమాండ్ విధించడంతో వారిని నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

బడిలో అడుగుపెట్టనే లేదు.. రికార్డులు సాధించింది..

అమోఘం క్రితి జ్ఞాపకశక్తి

ఆ చిన్నారి వయసు రెండున్నరేళ్లు. అమోఘమైన జ్ఞాపకశక్తి.. ఏదైనా ఒక్కసారి వింటే ఇట్టే పట్టేస్తుంది. పాటలు పాడడమే కాదు.. కష్టతరమైన పద్యాలు, శ్లోకాలను తడుముకోకుండా చెప్పేస్తుంది. విజయవాడ నగరంలోని వీ అండ్ టీ కాలనీకి చెందిన వైద్యులు జైకృష్ణ, స్వాతి దంపతుల కుమార్తె క్రితి. ఓ రోజు రాత్రి పడుకోబోయే ముందు తండ్రి జైకృష్ణ నాలుగు ఎలిమెంట్స్ (మూలకాలు) చెప్పారు.. తిరిగి వాటిని క్రితి చెప్పేసింది. తర్వాత 30 ఎలిమెంట్స్ చెప్పారు.. అలవోకగా పలికేసింది. అప్పుడే ఆ చిన్నారిలోని జ్ఞాపకశక్తిని తల్లిదండ్రులు గుర్తించారు. నాయనమ్మ పద్మావతమ్మ, తాతయ్య భోగి మల్లేశ్వరరావులు కూడా పద్యాలు, జంతువులు, నంబర్లు గల కార్డులు గుర్తించేలా తర్ఫీదునిచ్చారు. ఇంటర్ చదివే విద్యార్థులకు సైతం కష్టతరమయ్యే పీడియాట్రికల్ టేబుల్‌ను వరుస క్రమంలో చెప్పేస్తోంది. ఇంకా పాఠశాలలో కూడా అడుగుపెట్టని క్రితి.. తన జ్ఞాపకశక్తితో అందరినీ అబ్బురపరుస్తోంది. భక్తి గీతాలు, అన్నమయ్య కీర్తనలతో అలరిస్తోంది. పీరియాడిక్ టేబుల్‌లోని 118 ఎలిమెంట్స్ (రసాయన శాస్త్రంలోని మూలకాలు)ను చెప్పేసిన క్రితి.. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. అంతే కాదు.. ఆసియా దేశాలు.. రాజధానుల పేర్లు, దేశంలోని రాష్ట్రాలు.. రాజధానుల పేర్లను చెప్పేస్తోంది. అంతే కాదండీ.. ఫ్రూట్స్, జంతువులు, పక్షులు, నంబర్లు.. ఇలా అన్నింటినీ చెప్పేస్తూ కార్డుల్లో ఇంచుమించు ఒకే పోలిక కలిగిన పక్షులను



సాధించిన అవార్డులతో క్రితి.. పక్కన తల్లిదండ్రులు, తాతయ్య, నాయనమ్మ

సైతం గుర్తిస్తుంది. దీనంతటికీ కారణం క్రితి చేతికి ఫోన్ (సెల్ ఫోన్) ఇవ్వకపోవడమే అంటున్నారు తల్లిదండ్రులు. మరి ప్రతి ఒక్క చిన్నారి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఫోన్ ఇవ్వకుండా రోజూ కొంత సమయం వారితో గడిపితే.. చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించవచ్చు. ఎందులో ప్రతిభ కనబరుస్తున్నారో.. గుర్తించి ఆ దిశగా సాధన చేయిస్తే.. అద్భుతాలు సృష్టిస్తారనడానికి క్రితినే ఒక నిదర్శనం. **- విజయవాడ క్రీడలు**

15న చివరి విడత కౌన్సెలింగ్ గుంటూరు: ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హానర్స్) వ్యవసాయం కోర్సులో మిగిలిపోయిన సీట్లకు ఏపీ ఈఏపీసెట్-2025 అభ్యర్థులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ఈనెల 15న నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఎం.వి.రమణ తెలిపారు.

వేదాద్రి వద్ద నది మధ్యలో ఆగిన పడవ

ప్రయాణికుల్లో కలవరం ●బ్యాటరీ సాయంతో ఆవలి ఒడ్డుకు చేర్చిన నిర్వాహకులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: 20 మంది ప్రయాణికులతో వెళుతున్న పడవ ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన వేదాద్రి వద్ద కృష్ణా నది మధ్యలో గురువారం సాయంత్రం ఆగిపోవడం కలకలం రేపింది. వేదాద్రి నుంచి ఆవలి ఒడ్డున ఉన్న పల్నాడు జిల్లా గింజుపల్లి రేవుకు 20 మంది ప్రయాణికులను తీసుకెళుతున్న ఈ పడవ ఆవలి ఒడ్డుకు చేరువలో ఉండగా ఇంజిను ఆగిపోయింది. దీంతో పడవలో ఉన్న ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. నిర్వాహకులు వెంటనే లంగర్ వేసి పడవను అక్కడే నిలిపి ఒడ్డున ఉన్న మరో పడవ సాయంతో బ్యాటరీ తెప్పించుకొని తమ ఇంజిన్ ఉపయోగంలోకి తెచ్చి క్షేమంగా గింజుపల్లి రేవుకు చేర్చారు. ఈ ప్రక్రియకు అరగంట సమయం పట్టింది. ప్రవాహం లేకపోవడం వల్ల, ఒడ్డుకు క్షేమంగా చేరడం వల్ల ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు.

కనిపించని లైఫ్ జాకెట్లు.. : విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు వెంటనే వేదాద్రికి వెళ్లి పడవ నిర్వాహకులను పిలిచి అనుమతి పత్రాలు పరిశీలించారు. దీనికి 2026 మార్చి వరకు గుంటూరు జడ్పీ సీఈవో ఇచ్చిన అనుమతి పత్రం ఉన్నట్టు సీఐ గుర్తించారు. పడవలో ద్విచక్ర వాహనాలను ఎక్కించడంతో పాటు అసలు లైఫ్ జాకెట్లు లేకపోవడం గమనార్హం. శుక్రవారం ఉదయం జగ్గయ్యపేటలో తహసీల్దార్, ఎంపీడీవోల సమక్షంలో వారికున్న అనుమతికితోడు భద్రత రీత్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు విధిగా అమలు చేసేలా ఆదేశాలిస్తామని సీఐ తెలిపారు. ఈ సంఘటపై బైండోవర్ కేసు నమోదు చేస్తామని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒకి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 246 చికెన్ స్కిన్‌లెస్ - 256.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

నేటి దుర్గగుడి సమాచారం



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువజామున 3 గంటలకు సుప్రభాత సేవ, 3.30 గంటలకు వస్త్రాలంకరణ సేవ, 4 గంటలకు దేవి ఖడ్గమాలార్చన నిర్వహిస్తారు.

ఉదయం: వేకువ జామున 5 గంటల నుంచి క్యూలైన్లో భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. యాగశాలలో ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, 7 గంటలకు రుద్ర హోమం, 7.30 గంటలకు నవగ్రహ శాంతి హోమం, 8 గంటలకు మృత్యుంజయ హోమం, 8.30 గంటలకు చండీ హోమం నిర్వహిస్తారు. ప్రాకార మండపంలో ఉదయం 7.30 గంటలకు లక్ష కుంకుమార్చన, 8 గంటలకు శ్రీచక్ర నవావరణార్చన, మల్లేశ్వరాలయ ప్రాంగణంలో 9 గంటలకు శాంతి కల్యాణం ఆర్జిత సేవలుగా చేస్తారు.

మధ్యాహ్నం: అమ్మవారికి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పంచ భోగ నివేదన చేస్తారు. అన్ని దర్శనం క్యూలైన్లు నిలిపివేస్తారు. వీఐపీ, ప్రొటోకాల్ దర్శనాలు ఈ సమయంలో ఉండవు. మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు.

సాయంత్రం: దుర్గమ్మకు సాయంత్రం 4 గంటలకు స్వర్ణపుష్పార్చన సేవ(గురువారం మాత్రమే), 6 నుంచి 7 గంటల వరకు నివేదన, వేద స్వస్తి, పంచ హారతులు నిర్వహిస్తారు. ఈ సమయంలో అన్ని దర్శనాలు నిలిపివేస్తారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

★ రోజూ రాహుకాలంలో నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో రాహుకేతు పూజలు జరుగుతాయి. ఆర్జిత సేవలకు టికెట్ రుసుము చెల్లించిన భక్తులను మాత్రమే అనుమతిస్తారు. www.kanakadurgamma.com,https:///www.aptemples.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా ఆర్జిత సేవా టికెట్లు, ఇతర సమాచారం అందుబాటులో ఉంది. వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లు బుక్ చేసుకోవచ్చు. విరాళాలు ఇచ్చేందుకు కూడా అవకాశం ఉంది.

★ ఉదయం 11 నుంచి 3 గంటల వరకు మల్లికార్జున మహా మండపం రెండో అంతస్తులో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తారు.

ప్రజల భద్రతకు ప్రాధాన్యం

పాయకాపురం, న్యూస్‌టుడే : ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ.. క్షేత్రస్థాయిలో అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... వివిధ పండగల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రత, రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పెట్రోల్ బంక్‌లు, థియేటర్లు వంటి వాటి వద్ద తనిఖీలు చేస్తుండాలని చెప్పారు. ప్రజల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె. మాధురి పాల్గొన్నారు.

వృద్ధులతో ప్రేమగా వ్యవహరించండి

పాయకాపురం, న్యూస్‌టుడే : వృద్ధులకు ప్రేమ, ఆప్యాయత పంచాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. గురువారం నగరంలోని కలెక్టరేట్‌లో వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. విజయవాడ, తిరువూరు, నందిగామ రెవెన్యూ డివిజన్లతో పాటు అప్పిలేటు ట్రిబ్యునల్‌కు వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారం, వృద్ధుల సంక్షేమంపై చర్చించారు. మొత్తం 433 క్లెయిమ్‌లకు గాను ఇప్పటికే 395 పరిష్కరించినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు వృద్ధాప్యానికి చేరువ కావాల్సిందేనని చెప్పారు. మన తల్లిదండ్రులను ఎలా చూస్తామో.. భవిష్యత్తులో మనకు అలాంటి పరిస్థితులు ఎదురవుతాయని చెప్పారు. రెవెన్యూ, పోలీసు, వృద్ధుల సంక్షేమ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పెద్దల మానసిక ఆరోగ్య పరిరక్షణకు లాఫింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని, గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో నెలలో ఒకసారి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ సరిత, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా విభిన్న ప్రతిభావంతులు-ట్రాన్స్‌జండర్స్ వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆలిండియా బార్ నమూనా పరీక్ష రేపు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఆలిండియా బార్ పరీక్షలకు హాజరయ్యే జూనియర్ న్యాయవాదులు, న్యాయ విద్యార్థులకు కానూరులోని సిద్ధార్థ న్యాయ కళాశాలలో శనివారం (రేపు) నమూనా పరీక్ష నిర్వహించనున్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ.ఎ.ఎల్), వి.డి.సిద్ధార్థ న్యాయ కళాశాల సంయుక్తంగా ఈ పరీక్ష నిర్వహిస్తోంది. దీనికి ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఐ.ఎ.ఎల్. జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పేరు, చరవాణి నంబరు, మెయిల్ ఐడీ, ఎన్‌రోల్‌మెంట్ నంబరుతో తమ వివరాలను 99662 29981 నంబరుకు వాట్సాప్ చేయాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో తల్లడిల్లిన ఎలక్ట్రీషియన్

సీపీఆర్‌తో ప్రాణాలు నిలిపిన సహచరుడు

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే : వీధి దీపాలకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఉద్యోగికి.. తోటి ఉద్యోగి సీపీఆర్ చేసి ప్రాణాలు నిలిపిన ఘటన విజయవాడలో చోటుచేసుకుంది. బాపట్ల జిల్లా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన లింగాబత్తిన ప్రభాకరరావు (53) విజయవాడ నగరపాలకసంస్థ వీధి దీపాల విభాగంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. బుధవారం న్యూరాజరాజేశ్వరీపేటలో వీధి దీపాలు మరమ్మతులు చేసేందుకు వెళ్లారు. స్తంభం ఎక్కి పని చేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై 8 అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోయారు. వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో.. అతనితో పాటు వచ్చిన మరో ఉద్యోగి ఎన్.ఎస్.ఆర్.ఆంజనేయులు తక్షణం స్పందించి సీపీఆర్ చేశారు. తరువాత గవర్నర్‌పేటలోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రభాకరరావుకు ఛాతి నుంచి పొట్ట వరకు, కుడి మోచేయి వద్ద కాలిన గాయాలయ్యాయి. ప్రభాకరరావు ఫిర్యాదుతో బుధవారం రాత్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

91.9 FM Vijayawada ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

వేడి బూడిద పడి ఎన్టీటీపీఎస్ ఉద్యోగికి గాయాలు



ఏడీఈ శరీరంపై చర్మం కాలిపోయిందిలా

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఎన్టీటీపీఎస్ బాయిలర్ వద్ద ప్రమాదం సంభవించి సంస్థ ఉద్యోగి గాయపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. సంస్థలోని మూడో దశ 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదో యూనిట్‌లో విధులు నిర్వహించే ఏడీఈ శేషుబాబు విధి నిర్వహణలో భాగంగా బాయిలర్ వద్ద పర్యవేక్షిస్తున్నారు. ఆ సందర్భంలో ఫ్లైయాష్ వెళ్లే పైప్‌లైన్ లీకై వేడి బూడిద ఆయనపై పడింది. ఈ సందర్భంలో ఆయన వీపు వైపు భాగంలో కొంత గాయాలయ్యాయి. సంఘటనను చూసిన ఒప్పంద కార్మికులు అక్కడికి చేరుకొని ఆయన చొక్కా తొలగించారు. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

డయల్ యువర్ డాక్టర్ నేడు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై ఈ నెల 14న 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు, కాలుష్యంతో వచ్చేవి, దీర్ఘకాలిక వ్యాధుల గురించి, మందుల లభ్యత, కుక్కకాటు టీకాల వివరాలు వంటివి వైద్యుల దృష్టికి తీసుకురావచ్చు. కొండపల్లి పీహెచ్‌సీ పరిధిలోని కొండపల్లి పురపాలక, ఈలప్రోలు, గొల్లపూడి ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

సమయం: శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో, ఫోన్ చేయాల్సిన చరవాణి నంబర్: 9182022206

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? విజయవాడ రోడ్డులోని బావనారుషి కల్యాణ మండపం సమీపంలో వీధి దీపాలు అప్పుడప్పుడూ వెలగడంలేదు. దోమల బెడద ఎక్కువగా ఉంది. - రాధిక, స్థానికురాలు

✔ వీధిలైట్లు బాగానే వెలుగుతున్నాయి. ఎక్కడైనా ఇబ్బందులుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. దోమల నివారణ చర్యలు చేపడతాం. - ఎండీ రఫీ, కార్యదర్శి

- న్యూస్‌టుడే, మైలవరం

స్పందనకు వందనం



◆ వెల్లటూరు ఎస్సీ ఏరియాలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 13వ తేదీన ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి మురళి స్పందించారు. సిబ్బందితో బోరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

◆ నరసాపురం ప్రధాన రహదారిలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని గ్రామ ప్రజలు మేమున్నాం మీకు తోడుగా ద్వారా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా ఈవో జి.స్వాతి స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, విస్సన్నపేట

ఆటలు ఆడేస్తాం.. ఆశయాలు సాధిస్తాం

మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, కొండపల్లి, న్యూస్‌టుడే

వారంతా పేద కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలే.. అయితేనేం ఇటు చదువులోనూ.. అటు ఆటల్లోనూ.. నాట్యంలోనూ రాణిస్తూ అందరి అభినందనలు పొందుతున్నారు. అమ్మానాన్నల ఆశలను తమ కోరికలుగా మార్చుకుని దూసుకెళ్తున్నారు.. నేడు జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా పలువురు చిన్నారుల విజయాలు.. ఆశయాలు న్యూస్‌టుడేతో పంచుకున్నారు..

'పద'నిసల పిడుగులు..!



ఉపాధ్యాయురాలు విజయలక్ష్మితో రేవంత్‌కుమార్, సింధుప్రియ

అక్షరాలు చదివేందుకు ఇబ్బంది పడ్డ దశ నుంచి పాఠశాలలో తోటి విద్యార్థులకు సందేహాలు తీర్చే స్థాయికి ఎదిగారు.. ఆంగ్ల పదాల ఉచ్చారణలో ఆరితేరి ఏ పదానికైనా అర్థాన్ని అవలీలగా చెప్పేస్తారు.. లిపిలేని మాతృభాషలో ఇబ్బందులను అధిగమించి, పుస్తకం చేతికిచ్చి, 'మీకిష్టమొచ్చిన పదాన్ని అగడమని' ఛాలెంజ్ విసురుతున్నారు. ఇదంతా..ఏ కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులనుకుంటే పొరబడినట్లే. కనీస బస్సు సౌకర్యం లేని ఒక కుగ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న అన్నాచెల్లెలైన రేవంత్‌కుమార్, సింధుప్రియల విజయగాథ

జాతీయస్థాయిలో పతకాలు : మైలవరం మండలంలోని కనిమెర్ల తండాకు చెందిన వ్యవసాయ కూలీలు బాణావతు భూపతి, దయామణి కుమారుడు రేవంత్‌కుమార్, కుమార్తె సింధుప్రియలు ఆ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ, 3వ తరగతి చదువుతున్నారు. గత విద్యా సంవత్సరంలో జాతీయస్థాయి 'వర్డ్‌పవర్ ఛాంపియన్‌షిప్' లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి ప్రతిభ చాటారు. దేశంలోనే అతి పెద్ద ఛాంపియన్‌షిప్ ఈవెంటైన ఇందులో దేశ వ్యాప్తంగా, పాఠశాల స్థాయి నుంచి లక్షలాది మంది పాల్గొని, జాతీయస్థాయికి 11 రాష్ట్రాల నుంచి 40 మంది ఎంపికవగా, అందులో వీళ్లు సత్తాచాటారు.. ఈ చిన్నారులకు అప్పట్లో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన విజయలక్ష్మి 2023 నుంచి సాధన చేయించారు.

ఆంగ్లపదాలను వల్లె వేస్తా..



జి.కొండూరు మండలం చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న మట్టకొయ అఖిల్ జ్ఞాపకశక్తితో అబ్బురపరుస్తున్నాడు. గతేడాది విభా సంస్థ నిర్వహించిన లిప్ ఫర్ వర్డ్ ఇంగ్లిష్ పదాల పోటీల్లో జిల్లా స్థాయిలో రాణించి 4వ స్థానం సాధించాడు.. ఇంగ్లిష్ పదాలను పలకడంలో తనకున్న ప్రత్యేకశైలి గుర్తించిన గురువులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆంగ్ల పదాలను వల్లె వేస్తున్న బుడతడు భవిష్యత్తులో మంచి పేరు తెస్తాడని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నాట్యం నా అభిముఖం



కొండపల్లికి చెందిన సంపాల శ్రావ్య కొండపల్లి బాలికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సంప్రదాయ నృత్యంలో రాణించి.. గుర్తింపు పొందాలన్న ఆశతో నాన్న నాగరాజు మూడేళ్ల నుంచే నాట్యంలో చేర్పించారు. అప్పటి నుంచే ఎంతో ఆసక్తిగా కూచిపూడి నేర్చుకుని పలు చోట్ల తన అభినయంతో అందరినీ ఆకట్టుకుంది. అమరావతి బాలోత్సవ్‌లో చేసిన నాట్యానికి నిర్వాహకులు మెచ్చి నాట్య దీపిక, నాట్య శ్రావ్యగా అవార్డులు అందించారు. కూచిపూడిలో ఉన్నత స్థానానికి వెళ్లాలన్నదే నా ఆశ అని చెబుతోంది. - సంపసాల శ్రావ్య

క్రీడలంటే ఇష్టంతో..



రెడ్డిగూడెం మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన బోడి మౌనిక రెడ్డిగూడెం గీతాంజలి పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. సీనియర్ విభాగంలో స్పోర్ట్ మీట్‌లో పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీల్లో ప్రథమస్థానం సాధించింది. తన అన్న ఆటలు బాగా ఆడతాడని తన స్ఫూర్తితోనే చదువుతోపాటు క్రీడల్లో పాల్గొంటున్నాని చెబుతోంది. - బోడి మౌనిక

పెరిగిన సాగర్ జలాల సరఫరా



నిదానపురం మేజర్‌లో ఇలా

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు గురువారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం వద్ద 72వ కి.మీ నియంత్రిక నుంచి 800 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 411 క్యూసెక్కులు చేరగా దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు-1కి 45, పెదకొమిర 30, మధిర 40, నిదానపురం 60 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు ఏఈ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే సర్వేలు



ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

మైలవరం, న్యూస్‌టుడే: స్వామిత్వ సర్వేతో గ్రామాల్లోని ప్రజలకు వారి స్థలాలకు సంబంధించి కచ్చితమైన హక్కులు అందుతాయని ఎంపీడీవో పి.అనురాధ, ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ డి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కీర్తిరాయునిగూడెంలో గురువారం స్వామిత్వ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలో 364 మంది గృహస్థులకు గానూ 246 మందికి నోటీసులిచ్చినట్లు తెలిపారు. వారికి సంబంధించిన సమస్యలు, ఇబ్బందులేమైనా ఉంటే గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి బి.శోభనాద్రి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు డి.రాము, కార్యదర్శి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేల ఆరోగ్యం..స్థూల పోషకాలపై అవగాహన



కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొండపల్లి, న్యూస్‌టుడే: నేల ఆరోగ్యం, స్థూల పోషకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి డీఎంఎఫ్ విజయకుమారి అన్నారు. పాఠశాల స్థాయి భూ ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించింది. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ప్రభుత్వం మినీ మట్టి ప్రయోగశాలను ఏర్పాటు చేస్తుందన్నారు. వాటిని ఉపయోగించుకొని విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన పెంచుకోవడంతో పాటు రైతులకు మంచి ఎరువులను సిఫార్సు చేయాలని సూచించారు. ఈ విధమైన కార్యక్రమాల వల్ల విద్యార్థులు సాగుపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ మాధవీలత, శాస్త్రవేత్త శివప్రసాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు, అధికారులు సురేష్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం



దీపాల వెలుగులు



ప్రత్యేక పూజలు

మైలవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మైలవరంలో కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానంలో వివిధ కార్యక్రమాల అనంతరం పూజలు చేశారు. ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్.వి సుధాకరరావు దీపోత్సవాన్ని ప్రారంభించగా, వేలాదిమంది భక్తులు కోటి దీపాలను వెలిగించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి, అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఆర్డీవో కె.మాధురి రైతులకు సూచించారు. గురువారం మద్దులపర్వ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌కేలకు గోనెసంచులు, తేమ శాతం చూసే పరికరాలు పంపినట్లు చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం నరుకుళ్లపాడులో జరుగుతున్న రీసర్వే, రుద్రవరంలో నిర్వహిస్తున్న స్వామిత్వ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఆర్‌ఐ జి.పుల్లయ్య, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లపై నిర్లక్ష్యం తగదు



గృహాలను పరిశీలిస్తున్న నాయకులు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: టిడ్కో ఇళ్లు నిర్మించి ఏడేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు లబ్ధిదారులకు అప్పగించక పోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి డోగుపర్తి శంకర్ అన్నారు. 2018లోనే ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి బ్యాంకుల్లో సొమ్ము వసూలు చేసినప్పటికీ ఆ గృహ నిర్మాణాలు పూర్తి చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. తిరువూరు పట్టణ శివారు పీటీ కొత్తూరు సమీపంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను గురువారం ఆయన పరిశీలించారు. నిర్మాణాలను ఏళ్ల తరబడి అసంపూర్తిగా వదిలేయడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయన్నారు. తిరువూరు పట్టణ పరిధిలోని అర్హులైన పేదల కోసం నిర్మించిన 1537 టిడ్కో గృహాలు అప్పగించకుండా పేదల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. సీపీఐ నాయకులు టి.కృష్ణయ్య, ఎస్‌కే.నాగుల్‌మీరా, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎం.డేవిడ్, ఎం.ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కారు..లారీ ఢీ.. తప్పిన పెనుప్రమాదం



ఘటనా స్థలంలో వాహనాలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-30పై కారు.. లారీ ఢీకొట్టుకున్నాయి. పోలీసుల సమాచారం మేరకు తిరువూరు మండలం మునుకుళ్లకు చెందిన వెంకటనారాయణ గురువారం ఉదయం తన కారులో మరో ముగ్గురితో కలిసి విజయవాడ ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం బయలుదేరారు. ఈ క్రమంలో జి.కొండూరు మండలం కట్టుబడిపాలెం వచ్చే సరికి ఎదురుగా విజయవాడ వైపు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించగా అదే సమయంలో లారీ డ్రైవర్ పక్కకు తిప్పడంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న బారికేడ్లను తప్పించబోయి లారీని ఢీకొట్టింది. లారీ డ్రైవర్ సమయస్ఫూర్తితో సమయానికి బ్రేకులు వేసి పెద్ద ప్రమాదాన్ని తప్పించాడు. దీంతో కారులో ఉన్న వారు ప్రాణహాని లేకుండా బయటపడ్డారు. కారు పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

తెదేపా మండల శాఖ అధ్యక్షుడిగా పెద్దర్ల రవి



తెదేపా మండలశాఖ అధ్యక్షుడు రవిని సత్కరిస్తున్న శాసనసభ్యులు వసంత

ఇబ్రహీంపట్నంగ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే: తెదేపా ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షుడిగా గుంటుపల్లికి చెందిన పెద్దర్ల రవి బాధ్యతలు స్వీకరించారు. తెదేపా గ్రామ కమిటీలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రకటించి వారికి బాధ్యతలను అప్పగించి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. గత ప్రభుత్వ పాలనలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గుంటుపల్లి సర్పంచిగా తెదేపా అభ్యర్థి విజయం సాధించడంలో పెద్దర్ల రవి కీలక పాత్ర పోషించారు. గతంలో గ్రామశాఖ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన ఈయన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ అందరి సహాయ సహకారాలతో గ్రామంలో తెదేపాను అగ్రస్థానంలో ఉంచేందుకు తన వంతు కృషి చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీలను కూడా తెదేపా అభ్యర్థులే విజయం సాధించే విధంగా ఎమ్మెల్యే గ్రామ మండల కమిటీలను ఎంపికచేసి వారితో ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. దాములూరు, కేతనకొండ, చిలుకూరు, కాచవరం, మూలపాడు, జూపూడి, గుంటుపల్లి గ్రామశాఖల అధ్యక్షులుగా చెరుకుమల్లి చిట్టిబాబు, కొమ్మూరి గోపాలరావు, సుబ్బారావు, భాస్కరరావు, నాగేశ్వరరావు, నరసింహాస్వామి, చెరుకూరి తిరుమలరావులను నియమించారు.

ఈలప్రోలు గ్రామ అధ్యక్షుడి ఎంపిక

కొండపల్లి, న్యూస్‌టుడే: ఈలప్రోలు తెదేపా గ్రామ అధ్యక్షుడిగా కడియాల వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ విధేయుడిగా ఏళ్లుగా గ్రామంలో పార్టీ తరపున కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో ఈయనకు పార్టీ బాధ్యతలను ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అప్పగించారు. ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సురేష్‌బాబులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని గ్రామ పార్టీ శ్రేణులు గురువారం సన్మానించాయి.

వడ్డెర్ల సమస్యలపై స్పందించాలి



రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ..

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వడ్డెర్ల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని రాష్ట్ర వడ్డెర్ల సంఘ సభ్యులు నినదించారు. ఇబ్రహీంపట్నంలోని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ కార్యాలయం వద్ద సంఘ సభ్యులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు దశాబ్దాల నుంచి వడ్డెర్లకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ జీవోల ప్రకారం వడ్డెర్లకు రావాల్సిన ఏ ఒక్క రాయితీ అందకుండా చేస్తున్నారన్నారు. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం తెల్ల క్వారీ సొసైటీ సభ్యులకు కొంతకాలంగా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. క్వారీకి వెళ్లేందుకు దారి లేకుండా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇదే విధంగా గుంటూరు, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన సమస్యలను సంఘ సభ్యులు రాష్ట్ర మైనింగ్ శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఇల్లా రవి తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనశాఖ, కళాశాల జేకేసీ, డీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహించే మేళాలో నిరుద్యోగ యువత పాల్గొనాలని కోరారు. అర్హత, ఆసక్తి గల నిరుద్యోగులు 99660 90377, 99591 08829 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ట్రాక్టర్ డ్రైవర్ బీభత్సం



పొదల్లోకి దూసుకుపోయిన ట్రాక్టర్

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట నూజివీడు రోడ్డు శ్రీశ్రీ కాలేజీ ఏరియాలో ట్రాక్టర్ డ్రైవర్ బీభత్సం సృష్టించారు. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ట్రాక్టర్‌ను నడుపుతూ ఓ కారు, ఆటోను ఢీకొట్టాడు. ట్రాక్టర్ రోడ్డుపక్కన పొదల్లోకి దూసుకుపోయింది. అదృష్టవశాత్తు ఎదురుగా వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆటోలోని నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు మత్తులో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు.

నూతన భవనాల ప్రారంభం



భోజనశాల భవనం ప్రారంభించిన ప్రవచనకర్త కోటేశ్వరరావు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాతల వితరణతో నూతనంగా నిర్మించిన పలు కట్టడాలను ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. బడిలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు పట్టణానికి చెందిన వేమూరి ప్రసాద్ రూ.25 లక్షల విరాళంతో నిర్మించిన భవనం, పూర్వ విద్యార్థులు, పట్టణ ప్రజలు అందించిన విరాళాలు రూ.7లక్షలతో నిర్మించిన సైకిల్ షెడ్‌ను ఆయన ప్రారంభించారు. దాతలు, విద్యాశాఖ అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

దారి ధ్వంసం.. వాహనదారుల ఆగ్రహం



మేడూరు-గాదెవారిగూడెం (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండల కేంద్రం నుంచి గాదెవారిగూడెం వరకు రూ.6 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును కొందరు ఇష్టానుసారంగా ధ్వంసం చేస్తున్నారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మేడూరు నుంచి గాదెవారిగూడెం వెళ్లే దారిలో తారు రోడ్డుకు జేసీబీతో గండి కొట్టి పైపులు వేశారు. దీంతో ఆ ప్రదేశంలో రహదారి రూపురేఖలు కోల్పోయింది. వర్షం పడితే మరిన్ని ఇబ్బందులు ఎదురవనున్నాయి.

మురుగు కాలువలు నిర్మించండి



ఇళ్లలోని వాడుకనీటిని రబ్బరు పైపుల ద్వారా ఖాళీ స్థలంలోకి మళ్లిస్తున్నారిలా..

కేతనకొండ గ్రామంలో నివాసాల పక్కనున్న ఖాళీ స్థలాలు మురుగునీటి తటాకాలను తలపిస్తున్నాయి. గ్రామంలో మురుగు కాలువలు లేకపోవడంతో నివాస గృహాల్లోని వాడుక నీటిని రబ్బరు పైపులతో ఖాళీ స్థలంలోకి పంపుతున్నారు. దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామపంచాయతీ స్పందించి మురుగు కాలువలు నిర్మించి, ఖాళీ స్థలాలను మెరక చేసి మురుగు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ నిధులతో సీసీ రహదారులు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయాలపై గ్రామకార్యదర్శి మౌనిక మాట్లాడుతూ.. నిధులు రాగానే సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నంగ్రామీణం

జూదరుల అరెస్టు

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే : తిరువూరు మండలం మల్లేల గ్రామంలో జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో గురువారం పోలీసులు శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4 వేలు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు.

18న మండల పరిషత్ సమావేశం

గంపలగూడెం: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండలాధ్యక్షురాలు జి.శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు. సమావేశంలో సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

రామారావుకు నివాళి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట కేంద్రంగా అనేక ప్రజా పోరాటాలు చేసి సీపీఎం ఆధ్వర్యంలో పేదలకు భూములు పంచిన చరిత్ర అమరజీవి జవాజి రామారావుది అని మండల సీపీఎం కార్యదర్శి నాగరాజు అన్నారు. సీపీఎం నాయకుడు రామారావు వర్ధంతిని స్థానిక సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వ్యాసరచన.. వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



ధ్రువపత్రాలు అందుకున్న చిన్నారులతో సీఐ లచ్చునాయుడు

నందిగామ, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ వైవీవీఎల్ నాయుడు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు. స్థానిక కేవీఆర్ కళాశాల, చైతన్య పాఠశాలల్లో పోటీలు నిర్వహించారు. ఇందిరశ్వని, ప్రేమ్‌కుమార్, మయూరి, ప్రణీత, వర్ష, చంద్రికలు విజేతలుగా నిలిచారు. ఎస్సైలు మోహనరావు, సూర్యవంశీ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిఘా పెంచండి

భవానీపురం, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిఘా పెంచాలని ఏడీసీపీ జి.రామకృష్ణ పేర్కొన్నారు. ఆ మేరకు భవానీపురం పోలీసుస్టేషన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించాలన్నారు. వివాదాలు, ఘర్షణల్లో వారి ప్రమేయం లేకుండా చూడాలన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలను అరికట్టాలని చెప్పారు. రహదారులపై మద్యం తాగే వారిని గుర్తించి కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహ వేడుకకు మాజీ సీఎం జగన్ హాజరు

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లిలోని ఓ కన్వెన్షన్‌లో గురువారం జరిగిన వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంగనూరు కొండారెడ్డి కుమార్తె వివాహ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్సై విజయలక్ష్మిలు బందోబస్తు ఏర్పాటు చేశారు.



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్

ఉర్దూ భాషకు ప్రాధాన్యం కల్పించాలి



పురస్కారాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెండ్యాల (కంచికచర్ల), న్యూస్‌టుడే: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు ఉర్దూ భాష చదివిన విద్యార్థులకు ఉన్నత పాఠశాలల్లో అదే భాషలో చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డా.డి.శ్రీను డిమాండ్ చేశారు. పెండ్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్యా సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని అన్నారు. అనంతరం వివిధ మండలాలకు చెందిన 28 మంది ఉర్దూ ఉపాధ్యాయులు, 12 మంది ప్రతిభ గల విద్యార్థులకు మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ పురస్కారాలు అందజేశారు. మండల విద్యాశాఖాధికారి బి.బాలాజీ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరి

siri@eenadu.net

సిప్.. లాభాల సూత్రమిదే

7 ఏళ్లకు మించి...

దీర్ఘకాలిక పెట్టుబడి కొనసాగించినప్పుడే మార్కెట్ అస్థిరత నుంచి రక్షణ లభిస్తుంది. పెట్టుబడులను కనీసం 7 ఏళ్లపాటు కొనసాగించినప్పుడే సానుకూల రాబడి కనిపిస్తుంది. మార్కెట్లు గమనించినా.. ఏడేళ్ల సగటు రాబడి అధికంగానే ఉంటుంది. మదుపరులు తమ డబ్బు పెరగడానికి తగినంత సమయం ఇచ్చినప్పుడే చక్రవడ్డీ ప్రయోజనం లభిస్తుంది. స్వల్పకాలిక పెట్టుబడులు వృద్ధిని పరిమితం చేస్తాయి. మార్కెట్ పతనమైనప్పుడు కోలుకోవడానికి కాస్త సమయం పడుతుంది. కాబట్టి, కచ్చితంగా 7 ఏళ్లకు మించి పెట్టుబడి కొనసాగించాలను అనుకున్నప్పుడే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేయండి.

భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనేందుకు క్రమానుగతంగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికోసం మ్యూచువల్ ఫండ్లు ఒక మార్గం. చాలామంది మదుపరులు క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా వీటిలో మదుపు చేస్తుంటారు. త్వరగా లాభాలను ఆర్జించేందుకు ఏదైనా ఒక సూత్రం ఉందా అని చూస్తుంటారు. మార్కెట్ హెచ్చుతగ్గుల మధ్య సరైన నిర్ణయం తీసుకోవడం దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు సవాలుగా మారుతోంది. మార్కెట్లను ఊహించడం కన్నా, క్రమశిక్షణతో కూడిన ఒక సులభమైన విధానాన్ని ఎంచుకొని, పెట్టుబడులను కొనసాగించడం ఎప్పుడూ మేలని నిపుణులు సూచిస్తుంటారు. సిప్ చేస్తున్న వారు దీర్ఘకాలంలో మంచి రాబడిని సాధించాలంటే 10-7-10 అనే సూత్రాన్ని పాటించాలి.



10 శాతం తగ్గినా

మార్కెట్ అంటేనే అనిశ్చితి. సూచీలు తగ్గడం, పెరగడం అనేది సహజం. కాబట్టి, మీ పెట్టుబడి విలువ ఏటా 10 శాతం వరకూ తగ్గే అవకాశం ఉందని ముందుగానే అనుకోవాలి. తాత్కాలికంగా మార్కెట్ పతనం అయినప్పుడు, ఆందోళన అవసరం. ఇది కొనుగోళ్లకు అవకాశం అని భావించాలి. గత పరిణామాలు చూసినా, మార్కెట్లో 10 శాతం దిద్దుబాటు వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కాబట్టి, దీర్ఘకాలిక సంపద కోసం పెట్టుబడి పెట్టేవారు.. స్వల్పకాలిక అస్థిరత విషయంలో సహనంతో ఉండాలి.

ఏటా 10 శాతం

ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉంటుంది. దానికి అనుగుణంగా మన పెట్టుబడులనూ పెంచుకుంటూ వెళ్లినప్పుడే, ఆర్థిక భరోసా లభిస్తుంది. సిప్ మొత్తాన్ని ఒకే విధంగా కొనసాగిస్తూ ఉంటే, దీర్ఘకాలంలో సంపద వృద్ధి చెందదు. ఉదాహరణకు నెలకు రూ.10,000 సిప్ చేస్తున్నారనుకుందాం. సగటు వార్షిక రాబడి 12 శాతం అంచనాతో 15 ఏళ్లకు రూ.47,59,314 అయ్యే వీలుంది. అదే పెట్టుబడిని ఏటా 10 శాతం చొప్పున (స్టెప్అప్) పెంచుకుంటూ వెళ్లారనుకుందాం. అప్పుడు.. రూ.82,74,718 అయ్యే అవకాశం ఉంది.

మీ ఆర్థిక లక్ష్యాలను బట్టి, మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసేందుకు సరైన పథకాన్ని ఎంచుకోండి. సంపదను పెంచుకునేందుకు క్రమశిక్షణ అనే పునాదిని ఒకటే చాలు. చిన్న మొత్తంతోనూ పెద్ద నిధిని సాధించొచ్చు.

అగ్రశ్రేణి కంపెనీల్లో

గణాంకాల ఆధారంగా పెట్టుబడి వ్యూహాలను అనుసరించే పథకాలను మల్టీ ఫ్యాక్టర్ ఫండ్లుగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వినూత్నమైన కొత్త పథకాన్ని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చింది. 'ఫ్రాంక్లిన్ ఇండియా మల్టీ ఫ్యాక్టర్ ఫండ్' అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 24. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.5,000. మల్టీ ఫ్యాక్టర్ పథకాలు.. నాణ్యత, విలువ, సెంటిమెంట్, ఆల్టర్నేటివ్స్ (క్యూవీఎస్ఏ) అనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి. మన దేశంలోని స్టాక్ మార్కెట్లలో నమోదైన కంపెనీల్లో 500 అగ్రశ్రేణి కంపెనీలను పెట్టుబడి కోసం పరిశీలిస్తారు. తద్వారా దీర్ఘకాలంలో అధిక రాబడిని ఆర్జించేందుకు ప్రయత్నిస్తాయి. ఈ పథకం విషయంలో దాదాపు 40 రకాలైన అంశాలను పరిశీలించి, పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటామని ఫ్రాంక్లిన్ ఇండియా ఫండ్ మేనేజర్ అరిహంత్ జైన్ వివరించారు. ఈ పథకం పనితీరుకు బీఎస్ఈ 200 టీఆర్ఐ సూచీ కొలమానంగా ఉంటుంది.

ఆర్థిక వ్యవస్థ పనితీరు ఎలా ఉన్నా, ఒక సురక్షితమైన పెట్టుబడి కోసం చూస్తున్న వారందరికీ ముందుగా గుర్తుకొచ్చేది బంగారమే. గత పదేళ్ల కాలాన్ని చూసుకుంటే వార్షిక సగటు రాబడి 14-15 శాతం వరకూ ఉంది. బంగారం ధర పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు చాలామంది దీనిని కొనేందుకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఫండ్లు, ఫండ్ ఆఫ్ ఫండ్లు ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి.



చిన్న మొత్తంతోనూ కొందాం బంగారం

ఏదైనా కాలంగా బంగారం ఇస్తున్న రాబడి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ నేపథ్యంలో రూ.10 తోనూ పసిడిని కొనడానికి అంటూ పలు సంస్థలు 'డిజిటల్ గోల్డ్'ను తీసుకొచ్చాయి. నిజ బంగారానికి ప్రత్యామ్నాయం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం మొదలుపెట్టాయి. కానీ, ఈ డిజిటల్ గోల్డ్ ప్రమాదకరమని, ఇది తమ నియంత్రణ పరిధిలో లేదని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ స్పష్టం చేసింది. బంగారంలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు నియంత్రణ సంస్థ పరిధిలో ఉన్న పథకాల్లో మదుపు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న పసిడి పథకాల గురించి చూద్దాం.

గోల్డ్ ఈటీఎఫ్

గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లను (ఈటీఎఫ్) కొనుగోలు చేయాలంటే డీమ్యాట్ ఖాతా ఉండాలి. సాధారణ షేర్లను కొన్నట్లే గోల్డ్ ఈటీఎఫ్‌లనూ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల నుంచి కొనుగోలు చేయొచ్చు. మీ దగ్గర డబ్బు ఉన్నప్పుడల్లా బంగారంలో మదుపు చేయాలనుకుంటే ఇదొక మంచి మార్గం. ఈ పథకాల్లో వచ్చే రాబడి బంగారం రాబడికి దాదాపు సమానంగా ఉంటుంది.

✦ లావాదేవీలన్నీ పారదర్శకంగా ఉంటాయి. మీరు ఒక యూనిట్ కొన్నారంటే ఆ మేరకు 99.5 శాతం శుద్ధతతో పసిడిని కొన్నట్లే. నేరుగా బంగారాన్ని కొన్నప్పుడు పలు ఖర్చులు ఉంటాయి. అమ్మేటప్పుడు కొంత ఇబ్బంది. గోల్డ్ ఈటీఎఫ్‌తో ఇలాంటి ఇబ్బందులేమీ ఉండవు. స్టాక్ ఎక్స్ఛేంజీలో ఉన్న రేటుకు కొనొచ్చు, అమ్మొచ్చు. పెట్టుబడిపై వచ్చిన లాభాలకు నిబంధనల మేరకు పన్ను వర్తిస్తుంది. కొనుగోలు/విక్రయం సమయంలో డీమ్యాట్ ఖర్చులు ఉంటాయి. ఇప్పుడు చాలా గోల్డ్ ఈటీఎఫ్‌లు ఒక్కో యూనిట్ విలువ రూ.100-రూ.110 మధ్య ఉంది. కొన్ని గోల్డ్ ఈటీఎఫ్‌ల ఎన్ఏవీ ఒక గ్రాము నిజ బంగారం ధరకు సమానంగానూ ఉంటుంది. అంటే, వీటిలో ఒక యూనిట్ కొంటే, ఒక గ్రాము బంగారం కొన్నట్లే. యూనిట్లు ఎలక్ట్రానిక్ రూపంలో ఉంటాయి కాబట్టి, నిజ బంగారంలాగా, వీటి రక్షణ గురించి ఏ మాత్రం ఆందోళన అవసరం లేదు.

గోల్డ్ ఫండ్లు..

డీమ్యాట్ ఖాతా అవసరం లేకుండా, నెలనెలా నిర్ణీత మొత్తం బంగారంలో మదుపు చేయాలను కునే వారికి గోల్డ్ ఫండ్లు అనుకూలం. ఇవి ప్రధానంగా 95-100 శాతం వరకూ పెట్టుబడిని గోల్డ్ ఈటీఎఫ్‌లకు కేటాయిస్తాయి. మిగతా మొత్తాన్ని నగదు లేదా డెట్ పథకాలకు మళ్లిస్తాయి. ఫండ్ మేనేజర్ పాత్ర ఎక్కువగా ఉంటుంది. చిన్న మొత్తం అంటే రూ.500లతోనూ క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో మదుపు చేయొచ్చు. కొత్తగా బంగారంలో మదుపు చేయాలనుకునే వారు గోల్డ్ ఫండ్లను ఎంచుకోవచ్చు.

గోల్డ్ ఎఫ్ఓఎఫ్

గోల్డ్ ఫండ్స్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్)లూ బంగారంలో మదుపు చేసేందుకు మరో ప్రత్యామ్నాయ మార్గాలు. ఇవి గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్లలో 95 శాతం వరకూ పెట్టుబడి పెడతాయి. రూ.500లతోనూ ఇందులో పెట్టుబడిని ప్రారంభించొచ్చు. ఏక మొత్తంలోనూ, సిప్ రూపంలోనూ మదుపు చేయొచ్చు. వైవిధ్యంగా ఉండటం దీని ప్రత్యేకత. ఇప్పుడిప్పుడే బంగారంలో మదుపు చేయాలనుకునే వారికి అనుకూలం.

మల్టీ అసెట్ ఫండ్లలో

బంగారంతోపాటు, ఈక్విటీ, డెట్, విదేశీ సంస్థల షేర్లలోనూ మదుపు చేసేందుకు అనుకూలంగా ఉండేవే మల్టీ అసెట్ ఫండ్లు. పెట్టుబడి మొత్తంలో 10-25 శాతం మేరకు ఇవి బంగారానికి కేటాయిస్తాయి. ఒకే ఫండ్‌తో వైవిధ్యమైన పెట్టుబడి కావాలనుకున్నప్పుడు వీటిని ఎంచుకోవచ్చు. వీటి నుంచి సగటున 12-15 శాతం దీర్ఘకాలిక రాబడిని ఆశించవచ్చు. కొత్త వారితోపాటు, ఇప్పటికే ఫండ్లలో మదుపు చేస్తున్న వారు వైవిధ్యం కోసం వీటిని పరిశీలించవచ్చు.

అత్యవసర నిధి జాగ్రత్తగా

జీవితం ఎప్పుడు ఎలాంటి మలుపు తిరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఆర్థిక అత్యవసర పరిస్థితులు చెప్పి రావు. ఉద్యోగం కోల్పోవడం, ఊహించని వైద్య ఖర్చులు లేదా ఇతర ఖర్చులను ఎదుర్కొనేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ఇలాంటి పరిస్థితుల్లో అప్పుల్లో కూరుకుపోకుండా ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడంలో అత్యవసర నిధి ఎంతో కీలకం.



నెలవారీ వేతనం ఆర్జించే ప్రతి వ్యక్తీ కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తాన్ని అత్యవసర నిధిగా పక్కన పెట్టాలి. అదే స్వయం ఉపాధి పొందుతున్న వారు కనీసం 12 నెలల ఖర్చులకు సరిపోయే మొత్తాన్ని జాగ్రత్త చేసుకోవాలి. మరి ఈ నిధిని ఎక్కడ జాగ్రత్త చేసుకోవాలి..

పొదుపు ఖాతా: అత్యంత తక్కువ నష్టభయం ఉంటుంది. మీ నిధిలో తక్షణమే అవసరమయ్యే మొత్తాన్ని ఈ ఖాతాలో ఉంచాలి. ఎస్‌బీఐ సహా అన్ని బ్యాంకులూ పొదుపు ఖాతాపై 2.50 శాతం వార్షిక వడ్డీని అందిస్తున్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, డిపాజిట్ల శ్లాబును బట్టి 3.50 శాతం నుంచి 5.50 శాతం వరకూ రాబడిని అందించే అవకాశం ఉంది.

లిక్విడ్ ఫండ్లు: ఇవి తక్కువ రిస్కు కలిగిన డెట్ ఫండ్లు. స్వల్పకాలిక మనీ మార్కెట్ పథకాల్లో మదుపు చేస్తాయి. ఇందులో కొన్ని పథకాలు రూ.50వేల వరకూ అదే రోజు డబ్బును అందిస్తాయి. చాలావరకూ మరుసటి పని రోజు నాడు డబ్బును వెనక్కిస్తాయి. పొదుపు ఖాతాలతో పోలిస్తే 6-7 శాతం వరకూ వార్షిక రాబడి అందుతుంది. రూ.లక్ష వరకూ పొదుపు ఖాతాలో పెట్టుకొని, మిగతా మొత్తాన్ని వీటిలో జమ చేయొచ్చు.

స్వల్పకాలిక ఎఫ్‌డీ: మీ పొదుపు ఖాతాలో డబ్బు ఉంచినా, ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రావాలంటే స్వల్పకాలిక డిపాజిట్ లేదా స్వీప్-ఇన్ ఖాతా సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు. అత్యవసరంలో ఈ ఖాతాలో నుంచి వెంటనే డబ్బు తీసుకోవచ్చు.

రికరింగ్ డిపాజిట్లు: అత్యవసర నిధి కోసం నెలనెలా కొంత డబ్బు జమ చేయాలనుకుంటే.. బ్యాంకులు అందించే రికరింగ్ డిపాజిట్లు అనుకూలంగా ఉంటాయి. నిర్ణీత మొత్తం పూర్తయిన తర్వాత దీన్ని ఎఫ్‌డీకి లేదా ఇతర పథకాలకు మళ్లించవచ్చు.

వీటిలో వద్దు..

షేర్లు: స్టాక్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులు అధికం. మీకు డబ్బు అవసరమైనప్పుడు పెట్టుబడి విలువ పడిపోతే నష్టపోతాం. కాబట్టి, అత్యవసర నిధిని షేర్లలో మదుపు చేయొద్దు.

స్థిరాస్తి: స్థిరాస్తులను వెంటనే అమ్మడం సాధ్యం కాకపోవచ్చు. ఇలాంటప్పుడు ఆర్థికంగా చిక్కులు వస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆస్తిని తక్కువ ధరకు విక్రయించాల్సి రావొచ్చు.

దీర్ఘకాలిక ఎఫ్‌డీలు: గడువు తీరకముందే డబ్బు వెనక్కి తీసుకుంటే అపరాధ రుసుములు విధిస్తాయి. కాబట్టి, తక్షణ ఆర్థిక అవసరాలకు వినియోగించే మొత్తాన్ని వీటిలో జమ చేయొద్దు.

అత్యవసర నిధి ఎప్పుడూ మీకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. దీని గురించి మీ కుటుంబ సభ్యులకూ సమాచారం ఇవ్వడం తప్పనిసరి.

తాత్కాలిక సమస్యలకు శాశ్వత నిర్ణయాలు వద్దు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: సమాజంలో ఉన్నతంగా జీవించాలంటే కచ్చితంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యాభ్యాసం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు సూచించారు. తిరువూరు శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన, జీవన విలువలు, వ్యక్తిత్వ వికాసంపై ప్రేరణాత్మక సందేశమిచ్చారు. తాత్కాలిక సమస్యలకు శాశ్వతమైన నిర్ణయాలు తీసుకుని తల్లిదండ్రులకు క్షోభ మిగల్చవద్దన్నారు. సమస్యలకు బలవన్మరణం పరిష్కారం కాదని, ప్రతి సమస్యకు పరిష్కారం కచ్చితంగా లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరిలో ధైర్యం, నమ్మకం, ఆశ ఉంటేనే జీవనం సజావుగా సాగుతుందన్నారు. ఇటీవల యువత, విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. తల్లిదండ్రుల ఆశీసులు విద్యార్థుల జీవితానికి పెద్ద బలం అని గుర్తుంచుకోవాలన్నారు. గురువులు బోధించిన, సూచించిన మార్గదర్శకంలో పయనిస్తేనే జీవితం సార్థకమవుతుందన్నారు. ఒత్తిడి సమయంలో తల్లిదండ్రులు, గురువులు, స్నేహితులతో తమ ఇబ్బందులు, సమస్యలపై మాట్లాడితే ఎంతో ఉపశమనం లభిస్తుందని హితవు పలికారు. సాత్వికమైన, శుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారమే విద్యార్థుల విజయానికి ఎంతో ముఖ్యం అన్నారు. నేర్చుకున్న సాంకేతిక విజ్ఞానాన్ని సమాజహితానికి వినియోగించాలన్నారు. కార్యక్రమం పర్యవేక్షకులు కంచి రవికిశోర్, కళాశాల ఛైర్మన్ పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నాగేంద్రబాబు, కోశాధికారి ఎం.కిషోర్ బాబు పాల్గొన్నారు.



సందేశమిస్తున్న చాగంటి

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాముతో మిగిలిన నిందితులకు కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. గురువారంతో నిందితులకు రిమాండ్ ముగియనుండడంతో విజయవాడ, నెల్లూరు కారాగారల్లో ఉన్న వీరిని వర్చువల్ విధానంలో ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. వీరికి ఈనెల 25 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జైలులో తనకు ఇచ్చే ములాఖత్ సంఖ్యను పెంచాలని జోగి రమేష్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. దీనిపై ఈనెల 20న తీర్పు ఇవ్వనున్నట్లు న్యాయాధికారి ప్రకటించారు.

☛ జోగి రమేష్, రాములను పది రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్, ఎక్సైజ్ దాఖలు చేసిన పిటిషన్‌పై.. నిందితుల తరఫు న్యాయవాదులు గురువారం కౌంటర్లు ఫైల్ చేశారు. వీటిపై వాదనల నిమిత్తం 17వ తేదీకి వాయిదా పడింది. ఈ కేసులో 11 మంది నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై వాదనల నిమిత్తం న్యాయాధికారి 20వ తేదీకి వాయిదా వేశారు.

జోగి.. సతీమణి, కుమారులకు నోటీసులిచ్చి వివరణ తీసుకోండి

మాచవరం పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో వైకాపా నేత జోగి రమేష్‌ను అరెస్టు చేసి వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే సమయంలో చోటుచేసుకున్న పరిణామాలపై నిందితుడి సతీమణి, ఆయన కుమారులపై నమోదు చేసిన కేసులో నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని మాచవరం పోలీసులను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. ☛ జోగి రమేష్‌ను వైద్యపరీక్షల నిమిత్తం పోలీసులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులను తోసేస్తూ.. వారి విధులకు ఆటంకం కలిగిస్తూ జోగి రమేష్ అనుచరులు, ఆయన సతీమణి శకుంతల, కుమారులు రాజీవ్, రోహిత్ ఆసుపత్రిలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. దీంతో అక్కడి ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో మాచవరం పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని జోగి రమేష్ సతీమణి, కుమారులు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. వారి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఎన్ఎస్‌లోని వివిధ సెక్షన్లతోపాటు ప్రజా ఆస్తుల విధ్వంస నిరోధక చట్టం కింద పిటిషనర్లపై కేసు నమోదు చేశారన్నారు. ఆ సెక్షన్లు చెల్లుబాటు కావన్నారు. తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను నిలువరించాలన్నారు. ఏపీపీ ప్రియాంక వాదనలు వినిపిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులిస్తే నిందితులు దర్యాప్తునకు సహకరించరన్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకుంటామన్నారు.

సిట్ ఎదుట హాజరులో ఎంపీ మిథున్‌రెడ్డికి మినహాయింపు

లక్నో పర్యటనకు అనుమతించిన ఏసీబీ కోర్టు

ఈనాడు - అమరావతి: లక్నో వెళ్తున్న కారణంగా సిట్ కార్యాలయంలో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి హాజరుకు ఏసీబీ కోర్టు మినహాయింపు ఇచ్చింది. 13 నుంచి 15 వరకు పర్యటన ఉన్న కారణంగా.. బెయిల్ షరతుల్లో భాగంగా శుక్రవారం సిట్ ఎదుట హాజరు విషయంలో మినహాయింపు ఇవ్వాలని ఇటీవల మిథున్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఏసీబీ కోర్టు న్యాయాధికారి.. మూడు రోజులకు మినహాయింపు ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సిట్ ఎదుట హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడుల బెయిల్ పిటిషన్లపై గురువారం సిట్ అధికారులు కౌంటర్లు దాఖలు చేశారు. వాదనల నిమిత్తం ఈనెల 17వ తేదీకి వాయిదా వేశారు. బెయిల్ షరతులను సడలించాలని నిందితుడు బాలాజీ గోవిందప్ప పిటిషన్‌పై కౌంటర్ వేసేందుకు 21వ తేదీకి వాయిదా పడింది.

అదృశ్యమైన చిన్నారులు.. 40 నిమిషాల్లో ఛేదించిన పోలీసులు

పటమట, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రం నుంచి అదృశ్యమైన చిన్నారులను ఫిర్యాదు అందిన 40 నిమిషాల్లో పటమట పోలీసులు గుర్తించారు. రామవరప్పాడు పెద్ద వంతెన ప్రాంతంలో నివసిస్తున్న వెంకటేశ్వరమ్మ తన కుమారుడు ఇస్సాకు (5), మహాలక్ష్మి తన కుమార్తె స్వాతి (4)ని వారి ఇంటి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం ఉదయం 8.30 గంటలకు విడిచిపెట్టి పనులకు వెళ్లిపోయారు. అప్పటికీ ఇంకా కేంద్రం తెరవలేదు. చిన్నారులు అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు. సాయంత్రం వరకు చూసినా ఇంటికి రాకపోవడంతో తల్లులు కేంద్రానికి వెళ్లి అడిగారు. ఉదయం నుంచి వారిద్దరూ కేంద్రానికి రాలేదని సిబ్బంది తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించక రాత్రి 8.40కి పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ కృష్ణకాంత్ పటేల్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్ కిషోర్, ఆరుగురు ఎస్సైలతో సహా 30 మంది సిబ్బందితో కలిసి 10 బృందాలుగా ఏర్పడి గాలించారు. ఆ చిన్నారులు సత్యనారాయణపురంలో తిరుగుతున్నట్లు గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారులు రామవరప్పాడులో లోకల్ రైలు ఎక్కి.. విజయవాడ స్టేషన్ సమీపంలో రైలు ఆగగా.. దిగినట్లు పోలీసులు గుర్తించారు.

ఆరోగ్య సహాయకులకు ఉద్యోగోన్నతులు కల్పించండి

విజయవాడ (పాయకాపురం), న్యూస్‌టుడే : వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, డి.వి.రమణలు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై వారు గురువారం సాయంత్రం విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలోని డైరెక్టర్ పద్మావతిని కలిసి, చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల పదోన్నతుల విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు. జోన్-3లో పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య సహాయకులకు హెల్త్ సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాల్సి ఉందన్నారు. వీటికోసం ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. పద్మావతి స్పందించి.. సాధ్యమైనంత వరకు సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి.షరీఫ్, సభ్యులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, జి.రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టర్ పద్మావతితో మాట్లాడుతున్న విద్యాసాగర్, రమణ తదితరులు

విచారించకుండానే రోజు గడిచిపోయింది..!

విజయవాడకు చేరుకున్న నిడిగుంట అరుణ

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ఉద్యోగాల పేరుతో వృద్ధుడిని మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణను విజయవాడ, సూర్యారావుపేట పోలీసులు గురువారం సాయంత్రం నగరానికి తీసుకువచ్చారు. విజయవాడకు చెందిన రమేష్‌బాబు.. తన బంధువులకు ఎస్సై, అంగన్‌వాడీ పోస్టులు ఇప్పించాలనడంతో.. అరుణ అతని నుంచి రూ.24.5 లక్షలు తీసుకుని మోసం చేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు గత నెల 13న సూర్యారావుపేట పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు పోలీసులు నాలుగు రోజుల పాటు కస్టడీ ఇవ్వాలని విజయవాడ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు ఆమెను పోలీసు కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యారావుపేట పోలీసులు ఇక్కడి నుంచి వెళ్లి నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను తమ కస్టడీకి తీసుకున్నారు. అక్కడ వైద్యపరీక్షలు అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడకు తీసుకొచ్చారు. అప్పటికే విచారణ సమయం ముగిసిపోయింది. ఎలాంటి విచారణ జరగకుండానే తొలి రోజు గడిచిపోయింది.

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

అరుణను సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఉంచి విచారించాల్సి ఉంది. అయితే గురువారం మధ్యాహ్నం సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణహత్య ఘటన చోటు చేసుకోవడంతో.. పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది ఆ హడావుడిలో ఉన్నారు. సిబ్బంది ఎక్కువ మంది లేకపోవడంతో అరుణను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం (నేడు) ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆమెను విచారిస్తారు. తర్వాత విజయవాడలో వైద్య పరీక్షలు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి నెల్లూరు తరలిస్తారు.

అద్విక కేసులో పోలీసు కస్టడీకి నిందితులు

పటమట, న్యూస్‌టుడే : అద్విక ట్రేడింగ్ మార్కెటింగ్ కంపెనీ మోసం కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితులైన తాడేపలి ఆదిత్య, అతడి భార్య సుజాత, ఏజెంట్ బాలకృష్ణమూర్తిని విజయవాడ పోలీసుల కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు నిందితులను ఈ నెల 15 నుంచి 18 వరకు కస్టడీకి తీసుకుని విచారించేందుకు అనుమతించింది. ఈ ముగ్గురు ప్రస్తుతం విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. మరోవైపు అద్విక కంపెనీకి ఏజెంట్‌గా ఉన్న ఒంగోలుకు చెందిన గుంజి సురేష్‌ను గురువారం సిట్ పోలీసులు అరెస్ట్ చేశారు. సురేష్ 30 మంది నుంచి అద్విక కంపెనీలో పెట్టుబడి పెట్టించారు. వీటి నిమిత్తం రూ.3 కోట్లు అదనంగా లబ్ధి పొందినట్లు గుర్తించి ఇప్పటికే పోలీసులు నోటీసులు జారీ చేశారు. వాటికి సంబంధించి గురువారం అతన్ని అరెస్టు చేశారు.

ఆంధ్రా అండర్- 23 జట్టు శుభారంభం

బ్యాటింగ్‌లో రాణించిన ఓపెనర్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : బరోడాలో గురువారం ప్రారంభమైన బీసీసీఐ అండర్- 23 వన్డే క్రికెట్ టోర్నీలో ఆంధ్రా జట్టు శుభారంభం చేసింది. ఆంధ్రా జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో జమ్ము-కశ్మీర్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఆంధ్రా జట్టు ఫీల్డింగ్‌ను ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన జమ్ము- కశ్మీర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. జట్టులో బాసిత్ నజీర్ 79, అర్నా గుప్తా 52 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్లు జి.సుమిత్ మూడు వికెట్లు కూల్చాడు. బదులుగా 285 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 46.3 ఓవర్లలో ఒక వికెట్‌ను కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టు ఓపెనర్లు రేవంత్‌రెడ్డి, రాహుల్ భాగస్వామ్యంలో 219 పరుగులు స్కోర్ సాధించారు. రేవంత్‌రెడ్డి 139 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ఎస్వీ రాహుల్ 103 పరుగులు జోడించాడు. 219 పరుగుల భాగస్వామ్యంతో రాణించిన రేవంత్‌రెడ్డి, రాహుల్‌ను ఆంధ్రా క్రికెట్ సంఘం అభినందించింది.



219 పరుగుల భాగస్వామ్యంతో రేవంత్‌రెడ్డి, రాహుల్

పైరవీలు షురూ...

హెల్త్‌వర్సిటీ కీలక పోస్టులపై మంతనాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం, న్యూస్‌టుడే : నగరంలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారి పోస్టులకు దరఖాస్తుకు గడువు గత నెల 27తో పూర్తి కాగా, ప్రస్తుతం ఉపకులపతి ఆదేశాలతో కమిటీ పరిశీలిస్తోంది. వచ్చే ఏడాది జనవరి 26తో రిజిస్ట్రార్ పోస్టు గడువు ముగియనుండగా, పరీక్షల నియంత్రణాధికారి పోస్టు ఈ ఏడాది డిసెంబరు 30తో ముగుస్తుంది. ఇప్పటికే రిజిస్ట్రార్‌గా ఉన్న డాక్టర్ రాధికారెడ్డి ఏడీఎం హోదా ఉండటంతో ప్రభుత్వం ఇచ్చే పోస్టుకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. అయితే పరీక్షల నియంత్రణాధికారిగా ఉన్న సీహెచ్ శ్రీనివాసరావు ఫిజియాలజీ విభాగానికి వెళుతున్నట్లు సమాచారం. ఆయన ఐదేళ్లుగా టీచింగ్ అలవెన్సు తీసుకోకుండా, పదోన్నతులు లేకుండా ఉన్నారు. ఇలాంటి వ్యక్తికి సీనియారిటీ ప్రొఫెసర్ హోదా కల్పించి, విద్యార్థులకు పాఠాలు చెప్పించడం ఎంత వరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు బదిలీ కాకుండా విజయవాడ నగరంలోనే ఉండేందుకు రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల స్వీకరణ

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ వి.నీలిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు www.apprenticeshipindia.gov.in లో జిల్లాల వారీగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఐటీఐ మార్కులు, సీనియారిటీ మేరకు ఎంపిక ఉంటుందన్నారు.

జనవరి 12 నుంచి నరసాపురానికి వందేభారత్

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ, చెన్నై సెంట్రల్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును వచ్చే ఏడాది జనవరి 12 నుంచి నరసాపురం వరకు పొడిగిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 20677/20678 ఉదయం 5.30కి చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి 7.05కి రేణిగుంట, 8.29కి నెల్లూరు, 9.43కి ఒంగోలు, 11.08కి తెనాలి, 11.40కి విజయవాడ, 12.29కి గుడివాడ, 1.14కి భీమవరంటౌన్, 2.10కి నరసాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నరసాపురంలో మధ్యాహ్నం 2.50కి బయలుదేరి 3.19కి భీమవరంటౌన్, 4.04కి గుడివాడ, 4.50కి విజయవాడ, 5.19కి తెనాలి, 6.29కి ఒంగోలు, 7.39కి నెల్లూరు, 9.50కి రేణిగుంట, రాత్రి 11.45కి చెన్నై సెంట్రల్ చేరుతుంది.



తండ్రి స్వప్నం.. తనయ సాకారం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కోసం గ్రంథాలయం నిర్మించాలనే తండ్రి ఆశయాన్ని కుమార్తె నెరవేర్చింది. ఇందుకు రూ. 70 లక్షలు ఖర్చు చేసింది. నీట్, జేఈఈలాంటి పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తోంది. తమిళనాడులోని అరియలూర్ జిల్లా తిరుమళపాడికి చెందిన ఆర్ముగం విశ్రాంత ఉపాధ్యాయుడు. 45కుపైగా పుస్తకాలు రాసి 'పావెందర్ పబ్లిషింగ్ హౌస్' పేరిట ప్రచురించారు. ఇంటినే గ్రంథాలయంగా మార్చి విద్యనందించాలని ఆయన భావించినా సాధ్యపడలేదు. ఆర్ముగం కుమార్తె అల్లి ఆ బాధ్యతను భుజాలకెత్తుకున్నారు. కుంభకోణంలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె గ్రంథాలయ నిర్మాణానికి తిరుమళపాడిలో స్థలం కొన్నారు. రెండేళ్లలో పనులు పూర్తిచేసి 'పావెందర్' పేరిట గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. 7వేలకు పైగా పుస్తకాలు ఉంచారు. 'ఎవరైనా ఇక్కడికి వచ్చి చదువుకోవచ్చు. సభ్యత్వం ఉచితం. విద్యార్థుల చదువుకు ఏ సహాయం కావాలన్నా చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని అల్లి తెలిపారు. - న్యూస్‌టుడే, చెన్నై

చిచ్చర పిడుగులకు... ఫాఫో!

అనుభవైకవేద్యం... అంటారు. స్వయంగా తెలుసుకునేదేదైనా అద్భుతమైన పాఠమవుతుంది. జీవితంలో ఒడిదొడుకులను ఎదుర్కొనే సామర్థ్యాన్నిస్తుంది. తమ పిల్లల భవిష్యత్తును స్వయంగా తీర్చిదిద్దుకోవాలనుకునే తల్లిదండ్రులు ఇప్పుడు 'ఫాఫో' మంత్రాన్ని జపిస్తున్నారు. ఇంతకూ ఏంటీ ఫాఫో మంత్రం?

- నవతరం తల్లిదండ్రులు పిల్లల పెంపకానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. దీనికితగ్గట్టే పేరెంటింగ్‌లో ఎన్నో ట్రెండ్స్ వచ్చేశాయి. వాటిలో ఒకటి...'ఫాఫో పేరెంటింగ్'.
- ఫాఫో అంటే (ఫూల్ అరౌండ్ ఫైండ్ అవుట్) 'చేసి చూడు.. ఫలితం తెలుసుకో'. పిల్లలకే బాధ్యతలు అప్పగించి... ఫలితాల ఆధారంగా వారు స్వయంగా ఎదుర్కొనేలా చేయడమే ఫాఫో పేరెంటింగ్ పద్ధతి. ఈ పదం ఆఫ్రికన్ అమెరికన్ వెర్నాక్యులర్ ఇంగ్లీష్ నుంచి ఉద్భవించిందంటున్నారు.
- ఒక పిల్లవాడు ఉదయం అల్పాహారం తినడానికి ఇష్టపడకపోతే ప్రత్యామ్నాయంగా వేరే పదార్థాలు ఏమీ పెట్టరు. ఆ తర్వాత స్నాక్స్ లేదా మధ్యాహ్న భోజనం తినే సమయం వరకు ఆకలిగానే ఉన్న ఆ పిల్లాడు ఆహారం విలువను స్వయంగా తెలుసుకుంటాడు. దీనివల్ల పిల్లల్లో వాగ్వాదం, మొండితనం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.
- ఓ చిన్నారిని పుస్తకాలు స్వయంగా కొనుక్కోమని దుకాణానికి ఒంటరిగా పంపారు. అక్కడ షాప్ యజమానితో మాట్లాడి, అవసరమైతే అక్కడున్న పెద్దవాళ్ల సహకారం తీసుకుని ఆమె పుస్తకం కొనుగోలు చేస్తుంది. ఫాఫో విధానంలో చిన్నారిని పెంచాలనుకున్న తల్లిదండ్రులు ఇలా చేశారు. దీంతో క్రమంగా ఆమెకు భయం పోవడంతో పాటు స్పష్టమైన నిర్ణయాలను కూడా తీసుకుంటుంది.
- పిల్లల్ని స్వతంత్ర వ్యక్తులుగా తీర్చిదిద్దాలని భావించే తల్లిదండ్రులు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇందులో పిల్లలకు ఎలాంటి శిక్షలు ఉండవు. వారు చేసిన తప్పులను స్వయంగా సరి చేసుకోవడం నేర్చుకుంటారు. ఈ పద్ధతిలో పెరిగిన పిల్లల్లో ఒత్తిడి, భయం ఉండదు. ఆత్మస్థైర్యం ఎక్కువగా ఉంటుంది.
- ఫాఫో పిల్లల్లో బాధ్యతను పెంచుతుంది. స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తుంది.
- పిల్లలు చేసే పనులను నిరంతరం సరిదిద్దడం, ఉపన్యాసాలు ఇవ్వడం కంటే వారు చేసే పనులు, చర్యల ద్వారా నేర్చుకోవడానికి వీలు కల్పిస్తుంది.
- ఈ పద్ధతిలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య నిరంతర వాగ్వాదాలు, కోపతాపాలు, చర్చలు తగ్గుతాయి. సహనం, సామర్థ్యం పెరుగుతాయి.
- పిల్లలు వాస్తవ పరిణామాలను ఎదుర్కోవడం ద్వారా ప్రపంచం తనకు ఏదీ తేలిగ్గా ఇవ్వదని అర్థం చేసుకుంటారు.

అనుభవం ద్వారా నేర్పడంతో బాగా తెలుస్తుంది

ఏదైనా నోటి మాటగా చెప్పడం కంటే అనుభవం ద్వారా తెలుసుకోవడం పిల్లలకు బాగా ఉపయోగపడుతుంది. పిల్లవాడు పాల గ్లాసును పడేసినప్పుడు దాని ఫలితం తెలిసేలా చేస్తే మరోసారి ఆ తప్పు జరగకుండా చూసుకుంటాడు. ప్రేమ, క్రమశిక్షణ రెండు ఎక్కువగానే ఉండే విధానం వల్ల పిల్లలు బాగా అభివృద్ధిలోకి వస్తారు.

– కర్రి రామారెడ్డి, మానసిక వైద్య నిపుణులు



ఎంపిక బాధ్యత తల్లి దండ్రులదే...

పిల్లలు వారి చర్యల ఫలితాలను తట్టుకొని జీవించాలనుకుంటున్నామా? లేక మన సహాయంతో ఎదగాలని కోరుకుంటున్నామా? అనేదాన్ని తల్లిదండ్రులే నిర్ణయించుకోవాలి.

వయసుకు తగిన అంచనాలే వారిపై ఉండాలి. పిల్లల వయసు, సామర్థ్యాలను అనుసరించి వారికిచ్చే బాధ్యతలుండాలి. ఇతర పిల్లలతో పోల్చ కూడదు.

ఆప్యాయత లేకపోవడం వల్ల కొన్నిసార్లు పిల్లల్లో నిర్లిప్తత, ఒంటరితనం, శూన్యత భావన ఏర్పడవచ్చు.

పరిమితులు అవసరమే.. కానీ, వాటిని ప్రేమతో పెట్టాలి. పిల్లలపై గౌరవం, ప్రేమతో నిర్ణయాలు తీసుకోవాలి.


పిల్లలకు బాధ్యతలు అప్పగించినప్పుడు వారు దాన్ని నిర్వహించేందుకు కావాల్సిన సహాయం చేయాలి. ఉదాహరణకు మాట్లాడే పద్ధతులు, భయాలను వ్యక్తపరచడానికి సురక్షిత వాతావరణం కల్పించాలి.

- ఈనాడు, అమరావతి



వేప బొమ్మలండీ.. హాని చేయవండీ!

ఆడుకునే ప్లాస్టిక్ బొమ్మలను చిన్నారులు పొరపాటున నోటిలో పెట్టుకుంటే హానికరమైన ప్లాస్టిక్ రేణువులతో పాటు రసాయనాలతో కూడిన రంగులూ శరీరంలోకి వెళ్లే ప్రమాదముంది. అందుకే దీనికి ప్రత్యామ్నాయాన్ని ఆలోచించారు అమరావతి ప్రాంతానికి చెందిన పఠాన్ అబిదా బేగం, ఆమె కుమారుడు స్టాలిన్. చిన్నారులకు ఆటలతో పాటు ఆరోగ్యాన్ని కాపాడేలా వేప చెక్కతో బొమ్మల తయారీని వీరు ఆరంభించారు. 2023లో రాయపూడిలో ఓ చిన్న కుటీర పరిశ్రమను ప్రారంభించారు. అందులో ఐదేళ్లలోపు పిల్లలు ఆడుకునేందుకు 'నీమ్ టాయిస్' బ్రాండ్‌తో 20 రకాల బొమ్మల తయారీ మొదలెట్టారు. వీటిని పాలిష్ చేసేందుకు నూనెలు రాయడం, ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులు వేయరు. ప్రత్యేక పాలిష్ యంత్రాలతో బొమ్మలకు మంచి రూపు తెస్తున్నారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా విదేశీయులూ కొంటున్నారు. – ఈనాడు, అమరావతి



తరచూ ఫైన్ కట్టేవాడిని
- జవహర్‌లాల్ నెహ్రూ

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1905లో తన 15 ఏళ్ల వయసులో అలహాబాద్‌ను వీడి లండన్‌లోని హ్యారో కళాశాలలో చేరారు. 1907 అక్టోబరు నుంచి మూడేళ్లపాటు కేంబ్రిడ్జి ట్రినిటీ కాలేజీలో చదువుకున్నారు. "నేచురల్ సైన్స్ సబ్జెక్టు (కెమిస్ట్రీ, జియాలజీ, బోటనీ) తీసుకున్నా. అయితే నా ఆసక్తులు వీటికి అతీతంగా ఉండేవి. వర్సిటీలో, బయట, సెలవు రోజుల్లో నేను కలిసిన వారితో పుస్తకాలు, సాహిత్యం, చరిత్ర, రాజకీయాలు, ఆర్థిక అంశాల మీదే చర్చించేవాడిని. కేంబ్రిడ్జిలో చదువుతున్న సమయంలో అక్కడ భారతీయులకు మజ్లిస్ పేరుతో ఓ సంఘం ఉండేది. అక్కడ తరచూ రాజకీయ సమస్యలపై చర్చించేవాళ్లు. సబ్జెక్టుపై ఎక్కువ దృష్టి పెట్టకుండా పార్లమెంటరీ, యూనివర్సిటీ యూనియన్ విధానాలను, ప్రతినిధుల హావభావాలను కాపీకొట్టడంపై ఎక్కువ దృష్టిపెట్టేవాళ్లు. నేనూ తరచుగా మజ్లిస్‌కు వెళ్లేవాడిని. కానీ మూడేళ్లలో నేను అక్కడ మాట్లాడిందే లేదు. నాలోని సిగ్గరితనం, సంకోచాలే ఇందుకు కారణం. కళాశాల డిబేటింగ్ సొసైటీ (ద మాగపై అండ్ స్టంప్)లోనూ ఇదే సమస్య నన్ను వెంటాడింది. టర్మ్‌లో ఒక్కసారి కూడా మాట్లాడని వ్యక్తి ఫైన్ చెల్లించాలనేది అక్కడి నిబంధన. తరచుగా నేను ఆ జరిమానా చెల్లించేవాడిని' అని తన ఆత్మకథలో రాసుకున్నారు నెహ్రూ. మొదట్లో ఇలా ఇబ్బంది పడిన నెహ్రూ భారత్ తిరిగి వచ్చాక... స్వాతంత్ర్యోద్యమంలో చేరి ప్రజలను ఉద్దేశించి వేల సభల్లో అనర్గళంగా ప్రసంగించడం విశేషం. (నేడు నెహ్రూ జయంతి సందర్భంగా...) – ఈనాడు, హైదరాబాద్



నువ్విట్టా సింగారించుకుంటే మానేరు.. మా గుండె గల్లంతు!

అసలే అందమైన'నది'! సాయం సంధ్య కాంతిని.. ముఖానికి పసుపులా రాసేసుకుని మరింత సింగారించుకుంది మానేరు. ఆకాశాన్ని లీనం చేసుకొని.. అద్దంలా మెరిసిపోతున్న ఆ బింబంలో తనను చూసుకుని మురిసిపోయింది తీగల వంతెన. కరీంనగర్ జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం మంత్రముగ్ధులను చేసింది ఈ దృశ్యం. – ఈనాడు, కరీంనగర్

లండన్‌లో 'వీరాస్వామి' భక్తి



బ్రిటన్‌లోని పురాతన భారతీయ రెస్టారెంట్లలో ఒకటైన 'వీరాస్వామి'కి మద్దతుగా లండన్ నగర ప్రముఖ షెఫ్‌లు గురువారం సంఘీభావం తెలిపారు. 1926 ఏప్రిల్‌లో ప్రారంభించిన ఈ వందేళ్ల రెస్టారెంటు లీజు పొడిగింపు సమస్య కారణంగా లండన్‌లోని రీజెంట్ వీధిలో తనకున్న చారిత్రక గుర్తింపును కోల్పోయే ముప్పును ఎదుర్కొంటోంది. ఈ హోటలుకు మద్దతుగా నగరంలోని ప్రముఖ షెఫ్‌లు, రెస్టారెంట్ల యజమానులు 'ది టైమ్స్' పత్రికలో బహిరంగ అభ్యర్థన చేశారు. ప్రతిష్ఠాత్మక మెష్‌లిన్ - స్టార్ గుర్తింపు ఉన్న రెస్టారెంటు విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని 'విక్టరీ హౌస్' భవన యాజమాన్యాన్ని వీరు కోరారు. లీజు పునరుద్ధరణ సాధ్యం కాదని రెస్టారెంటు యాజమాన్యానికి గత వేసవిలో బ్రిటన్ రాజు సారథ్యంలోని క్రౌన్ ఎస్టేటు స్పష్టం చేసింది. ఇలా చేస్తే లండన్ నగర ల్యాండ్ మార్కులు కనుమరుగై పర్యాటకానికి నష్టం వాటిల్లుతుందని షెఫ్‌లు పేర్కొన్నారు. 'వారసత్వాన్ని, చరిత్రను మరోచోటుకు మార్చలేము. ప్రపంచంలో గొప్ప పర్యాటక, ఆతిథ్య నగరంగా లండన్‌కు ఉన్న పేరుకు అనుగుణంగా వీరాస్వామిని అక్కడ కొనసాగించడమే మంచిది' అని సూచించారు. భారత్‌లో తొలి గవర్నర్ జనరల్‌గా పనిచేసిన వారెన్ హేస్టింగ్స్‌కు ప్రైవేటు కార్యదర్శి అయిన జనరల్ విలియం పామర్ ముని మనవడు ఎడ్వర్డ్ పామర్ ఈ వీరాస్వామి రెస్టారెంటును ప్రారంభించారు. –లండన్

అమ్మగానే సరిపోదు... ఆపదలు చూసుకోవాలి!

- హైదరాబాద్‌కు చెందిన రాజేశ్‌కుమార్ పదేళ్ల క్రితం తన బైక్‌ను అమ్మేశారు. యాజమాన్యమార్పిడి తాను చూసుకుంటానంటూ మధ్యవర్తి తొందరపెట్టాడు. డబ్బులు చేతిలో పెట్టి రాజేశ్ నుంచి బండి తీసుకెళ్లాడు. మూడు, నాలుగేళ్ల క్రితం ఆ వాహనంపై ట్రాఫిక్ ఉల్లంఘనల చలాన్లు అరడజను వరకు రాజేశ్‌కు వచ్చాయి. ఆ మధ్యవర్తి కోసం ఆరాతీస్తే దొరకలేదు.
- దిల్లీలోని ఎర్రకోట మెట్రోస్టేషన్ దగ్గర జరిగిన కారు విస్ఫోటనంలో ఉగ్ర కుట్ర ఉందని గుర్తించారు. దర్యాప్తు సంస్థలు తొలుత దృష్టి పెట్టింది ప్రమాదానికి కారణమైన వాహనం ఎవరిది? అన్న విషయంపైనే. కారు నంబరు ఆధారంగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పాత కారును లేదంటే బైక్‌ను అమ్మడం సాధారణ విషయమే అయినా ఈ ప్రక్రియలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద సమస్యలకు దారి తీస్తుంది. చేతిలో డబ్బులు పడగానే చాలా మంది బండి తాళాలు ఇచ్చేస్తుంటారు. అక్కడితో మీ బాధ్యత అయిపోదు. కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే చలాన్ల నుంచి సంఘవిద్రోహ చర్యల వరకు బాధ్యత వహించాల్సి రావచ్చు.

ఇలా ఇరుక్కుపోవద్దు...

- నేను వాహనాన్ని ఎప్పుడో అమ్మేశా.. కేసులు, చలాన్లతో నాకేం సంబంధం అంటారా? రవాణాశాఖ రికార్డుల్లో యజమానిగా ఎవరి పేరు ఉంటే వారినే బాధ్యుల్ని చేస్తారు.
- రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ)లో కొత్త యజమాని పేరు నమోదయిన తర్వాతే వాహనాన్ని అప్పగించాలి.
- ఈ ప్రక్రియలో ఒక్క పేపర్ మిస్ అయినా కేసులు, బీమా వివాదాలు, చలాన్లు..ఇలా సమస్యలన్నీ మీ వెనకే వస్తాయి.
- కొందరు దుర్బుద్ధితోనే పాత వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. గంజాయి రవాణాకు, ఇతర నేరాలకు పాత వాహనాల్ని ఉపయోగిస్తుంటారన్న విషయం గుర్తుంచుకోవాలి.
- వాహనాన్ని బ్యాంకు రుణంతో కొనుగోలు చేస్తే ఆర్‌సీపై (హైపోథికేషన్) అని ఉంటుంది. వాహనం అమ్మాలంటే ముందు హైపోథికేషన్ టెర్మినేట్ చేయించాలి.
- మీ బండికి రుణం ఇచ్చిన బ్యాంకు నుంచి ఫారం 35, నోడ్యూస్ సర్టిఫికెట్, ఈఎంఐల చెల్లింపులు బ్యాలెన్స్ షీట్ తీసుకోవాలి. అనంతరం రవాణాశాఖలో స్లాట్ బుక్ చేసుకుని మీ బండి ఆర్‌సీలో 'హైపోథికేషన్' పదాన్ని తీయించాలి.
- తర్వాత చూద్దాంలే... అని హైపోథికేషన్ తీయించకుండా అమ్మేసినా... మిగతా బకాయిలను కొత్త యజమాని కట్టేలా మాట్లాడుకున్నా సమస్యలు తప్పవు. కొత్త యజమాని రుణవాయిదాలు కట్టకపోతే రుణం ఇచ్చిన బ్యాంకులు, ఫైనాన్షియర్లు పాత యజమానిపై న్యాయపరమైన చర్యలకు దిగుతారు.



- **వాహనం అమ్మినప్పుడు కొందరు బాండ్ పేపర్‌తో, డెలివరీ చలానాతో ముగించేస్తారు. బండిని అమ్మినట్లు, కొన్నట్లు..పాత, కొత్త యజమాని ఒప్పందపత్రం రాసుకుంటారు. కానీ దీంతో రక్షణ పాక్షికమే. రవాణాశాఖ రికార్డుల్లో పాత యజమాని పేరే ఉంటుంది.**



- **కొత్త వాహనం కొనేప్పుడు మధ్యవర్తులు, డీలర్లు మీ పాత బండికి కొంత ధర చెల్లించి ఇతరులకు విక్రయిస్తుంటారు. కొత్త కారు, కొత్త బైక్ వస్తుందన్న ఆనందంలో పాతబండికి యాజమాని పేరును మార్పించడం మరిచిపోవద్దు.**



బీమా చాలా కీలకం...

పాత యజమాని బండికి ఏడాదికి బీమా చేయిస్తారు. మూణ్నెళ్లయ్యాక బండిని మరొకరికి విక్రయించారని అనుకుందాం. మిగతా తొమ్మిది నెలలకు వర్తించే బీమా పాలసీని కొత్త యజమాని పేరుతో మార్పించుకోవాలి. బీమా పాలసీల్లో అనేక నిబంధనలుంటాయి. పాత యజమాని ఉపయోగించినప్పుడే పాలసీ వర్తిస్తుందని కొత్త యజమానికి క్లెయిమ్‌ను తిరస్కరించే అవకాశం ఉంది. అందుకే ఈ విషయంలో స్పష్టత అవసరం..

ఇప్పటికే అమ్మేస్తే..?

అమ్మిన వాహనం ఓనర్‌షిప్ ఇప్పటికీ బదిలీకాలేదు. ప్రస్తుతం ఆ వాహనం వాడుతున్న వ్యక్తి వివరాలు, కారు సమాచారం కూడా తెలియట్లేదు..: వెంటనే రవాణాశాఖలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలి. వాహనం నంబరు, ఛాసిస్ నంబరు, అమ్మిన సంవత్సరం, కొనుగోలు చేసిన వ్యక్తి పేరు, ఫోన్ నంబరు వివరాలను ఫిర్యాదులో జతచేయాలి.

అమ్మిన వాహనం నంబరు కూడా గుర్తులేదు..: ఉన్న వివరాలతో ఫిర్యాదుచేయాలి. దీనివల్ల రక్షణ లభిస్తుందన్న భరోసా తక్కువే. అయితే సమీపంలోని రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లి ఫీజు చెల్లించి, వారు అడిగిన వివరాలు ఇస్తే అధికారులు 'బి' రిజిస్టర్‌లో సెర్చ్ చేస్తారు. ఈ పద్ధతిలో మీ పాత వాహనం నంబరు తెలిసే అవకాశాలున్నాయి. మీరు పాత వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించిన ఆఫీసు పేరు చెబితే బండి నంబరు తెలుసుకోవడం మరింత సులభమవుతుంది.

- ఈనాడు, హైదరాబాద్

పాత యజమానికి రెండు రకాలుగా నష్టం



వాహనాన్ని అమ్మిన వెంటనే యాజమాన్య మార్పిడి చేయించాల్సిన బాధ్యత పాత యజమానిదే. ఏదైనా ప్రమాదం, నేరం జరిగితే పాత యజమానికే ఇబ్బందులు. ఒకరిపై రెండు వాహనాలుంటే రెండో వాహనంపై అదనంగా 2శాతం ట్యాక్స్ కట్టాలి. పాత వాహనం అమ్మినప్పుడు కొత్త యజమాని పేరు మీదకు మార్పిస్తే.. అదనపు పన్నుండదు. –చంద్రశేఖర్‌గౌడ్, సంయుక్త రవాణా కమిషనర్



గరుడ.. గరుడ.. గరుడ

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన శేషాచలం ఆద్యంతం భక్తిభావంతో నిండి ఉంటుంది. తిరుమల మొదటి ఘాట్ రోడ్డు మీదుగా కిందికి దిగే క్రమంలో మాల్వాడిగుండానికి ముందు గరుడ ఆకారంలో ఉండే పర్వత సమూహాన్ని చూడగానే భక్తులు తన్మయత్వానికి గురవుతారు. గరుడుడు తన భుజాలపై స్వామివారిని మోస్తున్నాడా అనేలా ఉన్న ఈ సహజ సిద్ధమైన ఆకృతిని తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తుంటారు. – న్యూస్‌టుడే, తిరుమల

అరుదైన రాతి చీమలు



ప్రపంచవ్యాప్తంగా 15 వేల రకాల చీమ జాతులుంటే, భారత్‌లో 1300కు పైగా ఉన్నాయి. అయినా ఎప్పటికప్పుడు కొత్త జాతులను శాస్త్రవేత్తలు కనుగొంటూనే ఉన్నారు. ఈ అన్వేషణలో భాగంగానే భారత శాస్త్రవేత్తలు మూడు కొత్త జాతుల రాతి చీమలను కనుగొన్నారు. ఈ పరిశోధనను హిమాచల్ ప్రదేశ్ యూనివర్సిటీ, పంజాబీ యూనివర్సిటీకి చెందిన మర్మికోలజిస్టులు (చీమల అధ్యయన వేత్తలు) డాక్టర్ జోగిందర్ రీల్హా, ప్రొఫెసర్ హిమేందర్ బార్తి నిర్వహించారు. అరుణాచల్ ప్రదేశ్ కేంద్రంగా 2018లో వీరు ఈ అధ్యయనాన్ని ప్రారంభించారు. వీరి పరిశోధనను తాజాగా ప్రముఖ అంతర్జాతీయ జర్నల్ 'సోషియో బయాలజీ' ప్రచురించింది. "మేం అరుణాచల్ ప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి చీమల నమూనాలను సేకరించి భద్రపరిచాం. వాటిని మైక్రోస్కోపులతో పరిశీలించాం. కొత్త జాతులను వర్గీకరించడానికి మేం శరీర నిర్మాణం, తల ఆకారం, వెన్నెముక పొడవు, రంగు, శరీర వెంట్రుకల స్థానం వంటి క్లిష్టమైన భౌతిక లక్షణాలను అధ్యయనం చేశాం. వీటి ఆధారంగా కొత్త రాతి చీమలను కనుగొన్నాం. ఇవి రాళ్ల పగుళ్లలో నివసిస్తాయి. ఎక్కువగా తేమ, అధిక ఎత్తు, చల్లని ప్రాంతాల్లో వృద్ధి చెందుతాయి" అని జోగిందర్ రీల్హా పేర్కొన్నారు. –ఈటీవీ భారత్



ఆనందాన్ని పెంచే 4 అలవాట్లు

- ధ్యానం: దీనివల్ల శరీరంలో సెరోటోనిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది కుంగుబాటును దూరం చేసి మానసికోల్లాసాన్ని కలిగిస్తుంది.
- వ్యాయామం: డోపమైన్ మరింత ఎక్కువ విడుదలై నూతన శక్తి అందడానికి ఇది దోహదం చేస్తుంది.
- తగినంత నిద్ర: దీనివల్ల శరీరంలోని అంతర్గత వ్యవస్థలు శుద్ధి అవుతాయి. ఒత్తిడి మాయమవుతుంది.
- కృతజ్ఞత, దయాగుణం: ఆత్మ సంతృప్తిని పొందడానికి మార్గాలు.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఎముక మూలుగ మార్పిడి చికిత్సతో చిన్నారుల్లో సికిల్‌సెల్ వ్యాధిని నయంచేసే వీలుందని గురుగ్రామ్‌లోని ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం తేల్చింది. దీనిని హెమోగ్లోబిన్ అనే అంతర్జాతీయ జర్నల్ ప్రచురించింది. తోబుట్టువుల నుంచే మూలకణాలు తీసుకుంటే చికిత్స విజయవంతమయ్యే అవకాశం 96% ఉంటుందని తెలిపింది. –గురుగ్రామ్

యువసాయం



విశాఖకు చెందిన ముగ్గురు స్నేహితులు చరణ్, ధనుష్, సూర్యలకు పంటలు పండించడంపై చిన్నతనం నుంచి ఆసక్తి. అంతకంటే ఆరోగ్యకర ఆహారం అంటే బాగా ఇష్టం. ఉద్యోగరీత్యా పక్క రాష్ట్రానికి వెళ్లినా వారు తమ ఆలోచనను వదిలిపెట్టలేదు. ఉద్యోగాలను వదిలి సేంద్రియ పద్ధతుల్లో కొన్ని పంటలు పండించాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ తరగతులకు హాజరై శిక్షణ పొందారు. వారి ఆలోచనలకు దగ్గరగా ఉన్న దీపిక అనే యువతి పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చారు. ఎక్కువ మంది సాగు చేసే పంటలు కాకుండా పుట్టగొడుగులు, మైక్రోగ్రీన్స్‌పై దృష్టిసారించారు. విశాఖ పెద్దరుషికొండ సమీపంలో ఓ ఆర్గానిక్ ఫామ్ ఏర్పాటు వాటిని సాగుచేస్తున్నారు. ఆయా పంటలతో పలు ఉత్పత్తులు తయారుచేసి 'ముషి క్రేట్' బ్రాండ్ పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారు.

చరణ్, సూర్యలు ముడిసరకు కొనుగోలు చేసి సేంద్రియ పద్ధతిలో పుట్టగొడుగులు, మైక్రోగ్రీన్స్ పండిస్తుంటే.. దీపిక పచ్చళ్లు, కారం పొడులు, చిరుతిళ్ల తయారీ బాధ్యతను, ధనుష్ మార్కెటింగ్ వ్యవహారాలను ఎంపిక చేసుకున్నారు. ఆయిస్టర్ పుట్టగొడుగుల్లో తెలుపు, పింక్, గ్రే రకాలను పండిస్తున్నారు. ప్రస్తుతం మిల్కీ, ఆయిస్టర్ రకాలు రోజుకు 30కిలోల దిగుబడి వస్తోంది. ఆయిస్టర్ రకంతో ఊరగాయ పచ్చడి, ఇడ్లీ, దోశల్లో వేసుకునే కారం పొడులు తయారుచేస్తున్నారు. స్టాల్స్, సంతల్లో అమ్మకాలు చేస్తున్నారు. మైక్రోగ్రీన్‌లను ట్రేలలో పెంచుతున్నారు. ముల్లంగిలో మూడు రకాలు, చియా, ఆవాలు, క్యాబేజీ, బీట్‌రూట్, మెంతి, బ్రకోలి, చిట్టి తోటకూర వంటివి ఇందులో ఉన్నాయి. వీటిని గేటెడ్ కమ్యూనిటీలకు, జిమ్‌లకు సరఫరా చేస్తున్నారు. కొన్ని స్టార్ హోటల్స్‌తోనూ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు.

- ఆదరణ నేపథ్యంలో పుట్టగొడుగుల పచ్చళ్లు, కారం పొడులతో స్నాక్‌బార్ ఏర్పాటు యోచనలో ఉన్నారు. ఇందులో పుట్టగొడుగులతో బజ్జీలు, పకోడి, మిల్కీ మష్రూమ్స్‌తో బిర్యానీ, పన్నీర్ తరహా కూరలు, మైక్రో గ్రీన్స్‌తో సూప్స్, ఆమ్లెట్స్, సలాడ్‌లు తయారు చేసి అందుబాటులో ఉంచనున్నట్లు దీపిక, చరణ్, ధనుష్, సూర్య చెబుతున్నారు.

– ఈనాడు, విశాఖపట్నం

EENADU Vol: 52, Issue: 94 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

4 నగరాల్లో బాంబులు పెట్టేందుకు 32 పాత వాహనాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నంలో దర్యాప్తు బృందాలు ఉన్నాయి. ఐఈడీ పేలుడు పదార్థాల తయారీలో ఉపయోగించడం కోసం రూ.3 లక్షల విలువైన 26 క్వింటాళ్ల ఎరువుల్ని వారు కొన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ లావాదేవీలు, సరకు అందజేత వివరాలు పోలీసుల చేతికి చిక్కాయి. డబ్బు వినియోగించే విషయంలో ఉమర్, ముజమ్మిల్ మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని, ఈ క్రమంలోనే కారులోని బాంబు పేలిందని అంటున్నారు. వారిద్దరి గొడవ వల్ల ఉగ్రవాదుల పన్నాగం మారిందా.. దాడి సమయం మారిందా.. అనేది తెలుసుకునే ప్రయత్నంలో దర్యాప్తు అధికారులు ఉన్నారు. సేకరించిన డబ్బును నిర్వహణ ఖర్చుల కోసం ఉమర్ నబీకి అందించారని నిఘా వర్గాలు గుర్తించాయి.

దేశ రాజధానిలో పేలుడుకు కారణమైన కారును నడిపింది డాక్టర్ ఉమర్ నబీ అని డీఎన్‌ఏ నమూనాలు తేల్చాయి. ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో సిగ్నల్ వద్ద సోమవారం కారుపేలి బీభత్సం జరిగిన తర్వాత ఘటనాస్థలిలో లభ్యమైన ఆధారాల ప్రకారం దానిని నడిపింది ఫరీదాబాద్ (హరియాణా)లోని అల్-ఫలా విశ్వవిద్యాలయం సహాయ ప్రొఫెసరైన నబీయేనని తేలింది. కారు స్టీరింగ్, యాక్సిలరేటర్ మధ్య లభ్యమైన కాలు భాగానికి డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించి, అతడి తల్లి డీఎన్‌ఏతో సరిపోల్చారు. రెండూ సరిపోయాయి. దీంతో పేలుడు సమయంలో వాహనంలో ఉన్నది అతడేనని నిర్ధారణ అయింది. తీవ్రంగా గాయపడిన వారిలో మరో వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మరణించడంతో మృతుల సంఖ్య 13కు చేరింది. పేలుడు జరిగిన ప్రదేశానికి సమీపంలోని ఓ దుకాణం పైకప్పు మీద.. తెగిపోయిన స్థితిలో చెయ్యి కనిపించింది. దానిని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించారు. పేలుళ్లతో సంబంధం ఉన్న తెల్లని హ్యుందాయ్ ఐ-20 కారు తునాతునకలై కాలిపోగా, ఎర్రని ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కారు వేరేచోట లభ్యమైంది. మూడోదైన మారుతి బ్రెజా కారు ఫరీదాబాద్‌లోని అల్-ఫలా విశ్వవిద్యాలయంలో కనిపించింది. హరియాణాలో రిజిస్టరైన ఈ కారును కశ్మీర్ పోలీసులు తనిఖీ చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న ఎకో స్పోర్ట్ కారును ఫోరెన్సిక్ నిపుణులు తనిఖీ చేయగా అమ్మోనియం నైట్రేట్ ఆనవాళ్లు కనుగొన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు మరో నాలుగు నగరాల్లో పేలుళ్లకు కుట్ర పన్నారని బయటపడింది. కేసుల దర్యాప్తు పురోగతిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి సమీక్షించారు.

అదుపులోకి ఇద్దరు

ఉత్తర్ ప్రదేశ్‌లోని హాపుర్‌లో జీఎస్ వైద్య కళాశాల సహాయ ఆచార్యుడు డాక్టర్ ఫారూఖ్‌ను దిల్లీ పోలీసులు, కాన్పూర్‌లో వైద్య విద్యార్థి (కార్డియాలజీ) డాక్టర్ మహ్మద్ ఆరిఫ్ మీర్ (32)ను యూపీ ఉగ్రవాద వ్యతిరేక దళం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ జమ్మూ కశ్మీర్‌కు చెందినవారు. ఫారూఖ్ వైద్య విద్య చదివింది అల్-ఫలా విశ్వవిద్యాలయంలోనే. ప్రశ్నించేందుకు ఆరిఫ్‌ను దిల్లీకి తరలించారు. కశ్మీరులోని అనంతనాగ్ వాస్తవ్యుడైన అతడు, మూడు నెలల క్రితమే కాన్పూర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో కార్డియాలజీ కోర్సులో చేరాడు. ఫరీదాబాద్ కేసులో నిందితురాలు డాక్టర్ షాహీన్ సహాయ ప్రొఫెసర్‌గా పని చేసింది ఈ కళాశాలలోనే. విచారణలో ఆరిఫ్ పేరును ఆమె వెల్లడించినట్లు సమాచారం. గురువారం తెల్లవారుజామున ఆరిఫ్ ఇంటికి ఏటీఎస్ పోలీసులు చేరుకోగా, హడావుడిగా ఫోన్లోని డేటాను తొలగించడానికి యత్నించాడు. పోలీసులు ఆ ఫోనును, లాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. కాల్ రికార్డులు, సందేశాల సారాంశాన్ని బట్టి అతడు దిల్లీ పేలుళ్ల కుట్రదారులతో సంబంధాలు కలిగిఉన్నట్లు తెలుస్తోంది. సమాచారాన్ని పంచుకునేటప్పుడు నిందితులంతా ఒకే ఈ-మెయిల్ ఐడీని వినియోగించారని గుర్తించారు. అల్-ఫలా విశ్వవిద్యాలయం వ్యవహారాలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

ఆ ఇద్దరి డైరీల్లో రహస్య సంకేతాలు

ఉమర్ నబీ, ముజమ్మిల్‌ల డైరీలను భద్రతా సంస్థలు స్వాధీనం చేసుకున్నాయి. వాటిలో నవంబరు 8 నుంచి 12 వరకు ఏం చేయాలో ప్రణాళిక రాసి ఉంది. దీంతో మరిన్ని ఉగ్రదాడులు చేయాలనే ప్లాన్‌లో వారు ఉన్నారని స్పష్టమైంది. ఆ డైరీల్లో 25 మంది పేర్లు ఉన్నాయని, వారిలో ఎక్కువ మంది జమ్మూ కశ్మీర్, ఫరీదాబాద్ వాసులేనని భద్రతా సంస్థలు తెలిపాయి. రహస్య సంకేతాల అర్థాలు ఏమిటో తెలుసుకునే దిశగా దర్యాప్తు జరుగుతోంది. ఉగ్రవాద సంస్థ ఐసిస్ అనుబంధ విభాగం అన్సార్ గజ్వతుల్ హింద్‌కు సానుభూతి పరుడిగా ముజమ్మిల్ ఉన్నాడని దర్యాప్తు వర్గాలు తెలిపాయి. సొంతంగా ఒక ఉగ్రవాద గ్రూపును ఏర్పాటు చేసేందుకు ముజమ్మిల్, ఇర్ఫాన్ సన్నాహాలు చేసినట్లు చెప్పారు. 2023, 2024 సంవత్సరాల్లో భారత దర్యాప్తు సంస్థలు, భద్రతా విభాగాలు పలుచోట్ల స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో ఈ నిందితులకు సంబంధం ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీరి మొత్తం ఉగ్ర నెట్‌వర్క్‌ను గుర్తించడంతోపాటు ఉగ్ర దాడులకు సిద్ధం చేసిన ప్రణాళికలను తెలుసుకునే యత్నాల్లో దర్యాప్తు సంస్థలు ఉన్నాయి. గుజరాత్ ఏటీఎస్ ఇటీవల అరెస్టు చేసిన ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులు యూపీలో ఒకే మదర్సాలో కలిసి చదివారని అధికారులు తెలిపారు.

ఉగ్ర గూడు.. గది నంబరు 13!

ఇంటర్నెట్ డెస్క్: దిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు చేపట్టిన అధికారులు హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉన్న అల్-ఫలా యూనివర్సిటీని జల్లెడ పడుతున్నారు. అక్కడి వైద్య కళాశాలలో పురుషుల హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు గుర్తించారు. ముజమ్మిల్‌కు చెందిన 13వ నంబరు గదిలోనే ఉగ్ర కుట్రలకు పథక రచన చేసినట్లు వెల్లడైంది. విశ్వవిద్యాలయం ప్రయోగశాల నుంచి కొన్ని రసాయనాలను తీసుకురావాలని ప్రధాన నిందితులు ఉమర్, ముజమ్మిల్ ప్రణాళిక వేసినట్లు తెలిసింది. ఈ గదిలో పోలీసులు సోదాలు జరిపి కొన్ని రసాయనాలు, డిజిటల్ పరికరాలు, డైరీలు, పెన్‌డ్రైవ్‌లు స్వాధీనం చేసుకున్నారు.



ఆ రెండు పదాలతో సమస్యలను ఆపొచ్చు

భాషతో సంబంధం లేని అత్యంత
శక్తిమంతమైన పదాలు రెండున్నాయి.
అవేంటో తెలుసా.. చిరునవ్వు.
మౌనం. ఎన్నో సమస్యలను
చిరునవ్వుతో పరిష్కరించొచ్చు.
మరెన్నో సమస్యలను మౌనంతో
నివారించొచ్చు. ఆ రెండింటి
విలువను గుర్తించినవారు ఎప్పటికీ
ప్రశాంతతను కోల్పోరు.
– విక్టోరియా రెపా, లీడర్షిప్ కోచ్

మన్యంలో గజగజ!

జి.మాడుగులలో 7.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఈనాడు, విశాఖపట్నం– చింతపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఈ సీజన్‌లో తొలిసారిగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 'సింగిల్ డిజిట్'కు పడిపోయాయి. మన్యంలో 24 గంటల్లో ఉష్ణోగ్రతలు సగానికి సగం పడిపోవడం గమనార్హం. బుధవారం రాత్రి అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 7.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడి ప్రజలు చలి తీవ్రతకు గజగజలాడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పొగమంచు కురుస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మరింత తగ్గుదల

అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, విశాఖపట్నం, అనకాపల్లి, నంద్యాల జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 7.6 డిగ్రీల నుంచి 17 డిగ్రీల లోపు నమోదవుతున్నాయి. శుక్ర, శని, ఆదివారాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రాబోయే రెండు వారాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నెల 17, 18, 19 తేదీల్లో ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 20 తర్వాత అల్పపీడనం ఏర్పడే అవకాశముందని తెలిపింది.





మళ్లీ రూ.1.30 లక్షలకు చేరిన పసిడి



ఈనాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయ కారణాలతో బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. గురువారం అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 4202 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఫలితంగా దేశీయంగానూ పసిడి ధర మరింత పెరిగింది. రాత్రి 11.30 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,30,160 వద్ద ఉంది. వెండి ధర అంతర్జాతీయంగా 53.16 డాలర్లకు చేరడంతో, హైదరాబాద్ బులియన్ విపణిలో కిలో రూ.1,66,180కి చేరింది.

✦ ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలహీన పడటం, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ముగిసినా కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వ్యవస్థలోకి మరింతగా నిధులను అమెరికా ఫెడ్ విడుదల చేస్తుందనే వార్తలు పసిడి, వెండిపైకి పెట్టుబడులు పెరిగేందుకు కారణమయ్యాయి.

అయిదేళ్లలో కేఈపీ రూ.100 కోట్ల పెట్టుబడి

రాబోయే అయిదేళ్లలో రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కేఈపీ ఇంజినీరింగ్ తెలిపింది. తయారీ సామర్థ్య విస్తరణకు, వివిధ పారిశ్రామిక రంగాల్లో వ్యర్థ జల నిర్వహణ సొల్యూషన్లు అందించడాన్ని వేగవంతం చేసేందుకు ఈ నిధులు ఉపయోగించనుంది. ఇందువల్ల అయిదేళ్లలో రూ.500 కోట్ల వార్షిక టర్నోవరును కంపెనీ సాధించే అవకాశం ఉందని కేఈపీ ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ మాలు కాంబ్లే తెలిపారు.

ఇది చాలదు.. ఇంకా పెంచుదాం



● ఉత్పత్తిని 20-40% పెంచనున్న కార్ల కంపెనీలు

● జీఎస్‌టీ కోతతో అమ్మకాలు గణనీయంగా పెరిగిన నేపథ్యం

దేశీయ దిగ్గజ కార్ల తయారీ సంస్థలైన మారుతీ సుజుకీ ఇండియా, హ్యుందాయ్ మోటర్ ఇండియా, టాటా మోటార్స్ తమ ఉత్పత్తిని 20-40% పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. జీఎస్‌టీ రేట్ల కోత నేపథ్యంలో వాహన విక్రయాలు గణనీయంగా పెరగడమే ఇందుకు నేపథ్యం. పండగ సీజను, జీఎస్‌టీ రేట్ల కోత ప్రయోజనాల బదిలీతో అక్టోబరులో రికార్డు స్థాయిలో 5,57,373 కార్లను కంపెనీలు విక్రయించాయి. గత నెలలో మారుతీ సుజుకీ విక్రయాలే 20% పెరిగి 2,42,096 వాహనాలుగా నమోదయ్యాయి.

పనివేళలకు మించి .. మారుతీ సుజుకీ

నవంబరులో 2,00,000కు పైగా కార్లు తయారు చేయాలన్నది మారుతీ ప్రణాళికగా సంబంధిత వర్గాలు చెబుతున్నారు. ఇదే జరిగితే ఒక నెలలో కంపెనీకి అత్యధిక సరఫరాలుగా ఇవి నిలిచిపోవచ్చు. సెప్టెంబరు వరకు నెలకు సగటున 1,72,000 వాహనాలను ఈ సంస్థ తయారు చేసింది. '1,04,000 కార్ల నిల్వలతో నవంబరును ప్రారంభించాం. ఇవి 19 రోజులకు సరిపోతాయి. అయినా ఇంకా 3,50,000 కార్ల ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయి. సరఫరా పెంచి, కొనుగోలుదార్ల నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు మా తయారీ బృందాలు నిర్ణీత పనివేళలకు మించి (ఓవర్‌టైం) పనిచేస్తున్నాయి. అప్పుడప్పుడు ఆదివారాలు కూడా పనిచేస్తున్నట్లు' మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (విక్రయాలు, మార్కెటింగ్) పార్థో బెనర్జీ తెలిపారు.

అధిక సరఫరాకు సిద్ధమవ్వండి టాటా మోటార్స్

నెలకు 65,000- 70,000 వాహనాలు సరఫరా చేస్తామని, అందుకు సిద్ధంగా ఉండాలని తన డీలర్లకు టాటా మోటార్స్ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో నెలకు సగటున 47,000 వాహనాలనే ఈ సంస్థ తయారు చేసింది. దీనితో పోలిస్తే తయారీని 40% పెంచే యోచనలో టాటా మోటార్స్ ఉందన్నమాట. జీఎస్‌టీ రేట్ల కోత అనంతరం, తమ రిటెయిల్ విక్రయాలు గణనీయంగా పెరిగాయని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ చీఫ్ కమర్షియల్ అధికారి అమిత్ కామత్ తెలిపారు. చేతిలో అధిక ఆర్డర్లు ఉండటం, కొత్త వాహనాల విడుదలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలోనూ ఈ విక్రయాల జోరు కొనసాగొచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రెండు షిఫ్ట్‌ల్లో.. హ్యుందాయ్

మహారాష్ట్రలోని తలేగావ్ వద్ద ఉన్న రెండో ప్లాంటులో, రెండు షిఫ్ట్‌ల్లో తమ తయారీ బృందం శ్రమిస్తోందని హ్యుందాయ్ మోటార్ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ అధికారి తరుణ్ గార్గ్ తెలిపారు. 'ఇంతకుముందు ఉత్పత్తి సామర్థ్యపరంగా కొంత ఇబ్బంది ఉండేది. పుణె ప్లాంటు అందుబాటులోకి రావడంతో, ఉత్పత్తి 20% పెరగొచ్చని అనుకుంటున్నామ'ని ఆయన వెల్లడించారు. అదనపు సామర్థ్యం, కొత్త ఉత్పత్తుల విడుదల ద్వారా తమ ఉనికిని మరింత బలోపేతం చేసుకోవడంపై కంపెనీ దృష్టి సారించిందని పేర్కొన్నారు.

వచ్చే ఏడాదీ అమ్మకాల జోరు కొనసాగొచ్చు

జీఎస్‌టీ రేట్ల కోత అమలుకు ముందు వాహన విక్రయాలు తాత్కాలికంగా నెమ్మదించినా.. తరవాత పుంజుకోవడంతో 2025 మొత్తం మీద స్థిరంగానే కొనసాగొచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ మొబిలిటీ అంచనా వేస్తోంది. 'పండగ సీజనులో గిరాకీ గణనీయంగా పెరగడంతో.. అంతకు ముందు వాహన విక్రయాలు నెమ్మదించిన ప్రభావాన్ని పరిమితం చేసింది. సానుకూల గిరాకీ పరిస్థితులు వచ్చే ఏడాదీ కొనసాగే అవకాశం ఉంద'ని విశ్లేషించింది. పన్ను కోతకు ముందు 2026లో వాహన ఉత్పత్తి 1-2% పెరగొచ్చని భావించగా.. ఇప్పుడు 6-7% పెరగొచ్చని అనుకుంటున్నామని ఎస్అండ్‌పీ గ్లోబల్ మొబిలిటీ అసోసియేట్ డైరెక్టర్ (తేలికపాటి వాహనాలు- భారత ఉపఖండం) గౌరవ్ వంగల్ తెలిపారు.

ఈనాడు బిజినెస్

జపాన్ సంస్థ టెయిజిన్‌తో బయోవరం జట్టు

ఈనాడు వాణిజ్య విభాగం: మనదేశంతో పాటు జపాన్‌లో కణజాల పునరుత్పత్తి వైద్య ఉత్పత్తులు, శరీరంలో అమర్చే వైద్య ఉపకరణాలను అందుబాటులోకి తెచ్చేందుకు జపాన్ ఫార్మా సంస్థ టెయిజిన్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు హైదరాబాద్‌కు చెందిన బయోటెక్నాలజీ సంస్థ బయోవరం తెలిపింది. బయోవరం అభివృద్ధి చేసే కణజాల పునరుత్పత్తి వైద్య ఉత్పత్తులను జపాన్‌లో విడుదల చేసేందుకూ ఈ ఒప్పందం వీలు కల్పించనుంది. యూఆర్ అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్రాండ్ పేరే బయోవరం. ఇది హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన అంకుర సంస్థ. ఇటీవల టెయిజిన్ లిమిటెడ్ మిషన్ ఎగ్జిక్యూటివ్ తకాయికి నకానో హైదరాబాద్ వచ్చినప్పుడు ఈ రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదరింది. శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి సమక్షంలో తకాయికి నకానో, యూఆర్ అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్స్ వ్యవస్థాపక సీఈఓ జగన్మోహన్ రెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కింద టెయిజిన్ మెడికల్ టెక్నాలజీస్‌కు చెందిన సిన్‌ఫోలియమ్‌కు భారత్‌లో విక్రయ, నియంత్రణపరమైన అనుమతులు పొందే మార్గాలను ఈ ఇరు సంస్థలు అన్వేషిస్తాయి. సిన్‌ఫోలియమ్ అనేది.. గుండె రక్త నాళాలకు మరమ్మతు చేసే ప్యాచ్. టెయిజిన్ గ్రూపులో భాగమైన జపాన్ టిష్యూ ఇంజినీరింగ్‌కు చెందిన కణజాల పునరుత్పత్తి ఉత్పత్తుల విక్రయాలను భారత్‌లో పెంచేందుకూ ఈ ఒప్పందం ఉపకరిస్తుందని బయోవరం తెలిపింది.

ప్రయోగానికి యూఏవీ సిద్ధం

ఎటర్నల్ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్



విద్యుత్తుతో నడిచే మానవ రహిత వైమానిక వాహనం (యూఏవీ), ప్రయోగాత్మక పరీక్షకు సిద్ధమవుతోందని ఎటర్నల్ (గతంలో జొమాటో) వ్యవస్థాపకులు దీపిందర్ గోయల్ వెల్లడించారు. 60 నిముషాల పాటు ఇది ప్రయాణించగలదని.. అంటే ముంబయి నుంచి పుణెకు వెళ్లగలదని వివరించారు. కొన్ని నెలల్లోనే ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ ఏడాది జనవరిలోనే దీపిందర్ గోయల్, సురోభిదాస్ కలిసి భవిష్యత్తరం విమానాల తయారీకి ఎల్ఏటీ ఏరోస్పేస్‌ను ప్రారంభించారు. సంప్రదాయ విమానాశ్రయాల అవసరం లేకుండా, 40 మీటర్ల దూరంలోనే టేక్ ఆఫ్ అవ్వడం, ల్యాండింగ్ అయ్యేలా ఆధునాతన విమానాలను రూపొందించడమే ఈ సంస్థ లక్ష్యంగా ప్రకటించారు. వీటికోసం గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు, హైబ్రిడ్ విద్యుత్తు ప్రొపెల్లెన్లను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఎటర్నల్‌తో ఈ సంస్థకు సంబంధం లేదు.

'అధిక వృద్ధి' అవకాశమున్న అంకురాలకు హైదరాబాద్ ఏంజెల్ ఫండ్ అండ



అధిక వృద్ధికి అవకాశాలున్న అంకుర సంస్థల్లో పెట్టుబడులు పెట్టే ఉద్దేశంతో రూ.100 కోట్లతో వెంచర్ కేపిటల్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు హైదరాబాద్ ఏంజెల్ ఫండ్ ('హెచ్‌ఏఎఫ్') తెలిపింది. వర్ధమాన, అధిక వృద్ధి రంగాల్లోని 15-20 అంకురాల్లో పెట్టుబడులు పెట్టే యోచనలో ఈ ఫండ్ ఉంది. జెనరేటివ్ కృత్రిమ మేధ, గేమింగ్, స్పేస్ టెక్, డ్రోన్లు, ఆరోగ్య సాంకేతికత (హెల్త్‌టెక్), వినియోగదారు సాంకేతికత (కన్స్యూమర్ టెక్), ఆర్థిక సాంకేతికత (ఫిన్‌టెక్), ఎంటర్‌ప్రైజ్ ఎస్ఏఏఎస్, సస్టెయినబిలిటీ లాంటి రంగాలు ఉన్నాయి. ఒక్కో అంకుర సంస్థలో రూ.2-4 కోట్ల వరకు ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. అవసరమైతే మలివిడతలోనూ ఆయా అంకురాలకు నిధుల సహకారం అందిస్తామని హైదరాబాద్ ఏంజెల్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ కల్యాణ్ శివలెంక తెలిపారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు 3 అంకురాలను గుర్తించామని, ఒక దానిలో పెట్టుబడులు పెట్టడమూ పూర్తయ్యిందని వెల్లడించారు.

కోడి గుడ్డు

14న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయలలో)

హైదరాబాద్	600
వరంగల్	602
విజయవాడ	600
తూ/ప గోదావరి	610
విశాఖపట్నం	595
చిత్తూరు	643

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లాభం రూ.35 కోట్లు

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరులో రూ.35.06 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో కంపెనీ రూ.428.77 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం రూ.2,495.46 కోట్ల నుంచి రూ.3,669.99 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ.2,598.09 కోట్ల నుంచి రూ.3,754.38 కోట్లకు పెరిగింది. వ్యయాలు రూ.1,636.29 కోట్ల నుంచి రూ.2,222.96 కోట్లకు చేరాయి. 2025-26 తొలి అర్ధ భాగం (ఏప్రిల్-సెప్టెంబరు)లో కంపెనీ మొత్తం ఆదాయం రూ.7,075.08 కోట్లకు పెరిగింది. 2024-25 ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.5,120.38 కోట్లు మాత్రమే. అరునెలల నష్టం రూ.766.34 కోట్ల నుంచి రూ.102.05 కోట్లకు పరిమితమైంది.

రాంకీ ఇన్‌ఫ్రా లాభం రూ.75.60 కోట్లు

రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జులై- సెప్టెంబరు త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిదికన రూ.75.60 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.83 కోట్ల కంటే ఇది తక్కువ. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం కూడా రూ.527.40 కోట్ల నుంచి రూ.471.60 కోట్లకు పరిమితమైంది. జులై- సెప్టెంబరులో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ నుంచి రూ.2,085 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని, దీంతో తమ చేతిలోని మొత్తం ఆర్డర్ల విలువ రూ.9,000 కోట్లకు పెరిగిందని కంపెనీ తెలిపింది.

బీమా వ్యాపారంలోకి మహీంద్రా

● కెనడా సంస్థ మనులైఫ్‌తో సంయుక్త సంస్థ ఏర్పాటు

● రూ.7,200 కోట్ల పెట్టుబడి



బీమా రంగంలోకి అడుగుపెడుతున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా గురువారం ప్రకటించింది. ఇందుకోసం కెనడాలోని టొరొంటో ప్రధాన కార్యాలయంగా పని చేస్తున్న మనులైఫ్‌తో కలిసి సంయుక్త సంస్థ (50:50 భాగస్వామ్యం) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఇరు సంస్థలు కలిసి రూ.7200 కోట్ల పెట్టుబడి పెట్టనున్నాయి. వచ్చే పదేళ్లలో రూ.18,000-30,000 కోట్ల విలువ సాధించగల వ్యాపారాన్ని సృష్టించాలన్నది ఇరు సంస్థల ప్రణాళికగా మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ అనీశ్ షా వెల్లడించారు.

త్వరలో దరఖాస్తు: బీమా నియంత్రణ సంస్థ నుంచి లైసెన్స్ కోసం 2-3 నెలల్లో దరఖాస్తు చేస్తామని, సంయుక్త సంస్థ కార్యకలాపాలు ప్రారంభం కావడానికి 15-18 నెలలు సమయం పడుతుందని పేర్కొన్నారు. రెండు సంస్థలు సంయుక్త సంస్థలో చెరో రూ.3,600 కోట్లు (400 మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టాలని నిర్ణయించాయి. ఇందులో తొలి 5 ఏళ్లలో చెరో రూ.1,250 కోట్లు (140 మి.డాలర్లు) చొప్పిస్తాయని అనీశ్ వివరించారు. సాధారణంగా కొత్త వెంచర్లకు బ్రేక్-ఈవెన్ సమయం 10-12 ఏళ్లు ఉంటుందని షా తెలిపారు.

ఫోన్ పే వినియోగదార్లకు చాట్ జీపీటీ సదుపాయాలు

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) చాట్ జీపీటీ సదుపాయాలను తన వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఓపెన్ ఏఐ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు ఫోన్ పే తెలిపింది. ఫోన్ పే కన్స్యూమర్ యాప్, ఫోన్ పే ఫర్ బిజినెస్ యాప్‌లలో ఈ ఫీచర్ అందుబాటులో ఉండనుందని వెల్లడించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రయాణ ప్రణాళికల నుంచి షాపింగ్ వరకు కావలసిన సమాచారాన్ని వినియోగదారులు పొందొచ్చని వివరించింది. 'దేశవ్యాప్తంగా ఏఐను మరింత అందుబాటులోకి తేవడానికి ఫోన్ పేతో జట్టు కట్టడం మాకు ముఖ్యమైన మైలురాయ'ని ఓపెన్ ఏఐ సంస్థ అంతర్జాతీయ వ్యూహాల మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) ఓలివర్ జే తెలిపారు.

టాటా మోటార్స్ నష్టం రూ.867 కోట్లు



ప్రస్తుతం వాణిజ్య వాహన వ్యాపారాన్ని కలిగి ఉన్న టాటా మోటార్స్ జులై-సెప్టెంబరులో రూ.867 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. టాటా క్యాపిటల్‌లో పెట్టిన పెట్టుబడులపై రూ.2,026 కోట్ల మార్క్-టు-మార్కెట్ నష్టాలు రావడమే ఇందుకు కారణమంది. స్టాక్ మార్కెట్‌లో కొత్తగా నమోదైన ఈ సంస్థ, ప్రయాణికుల వాహన విభాగంతో కలిసి 2024-25 ఇదే కాలంలో రూ.498 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కార్యకలాపాల మొత్తం ఆదాయం రూ.17,535 కోట్ల నుంచి రూ.18,585 కోట్లకు పెరిగింది. 2025 జులై 30న ప్రకటించిన ఇవెకో కొనుగోలు ప్రతిపాదన ప్రణాళిక ప్రకారం పురోగతిలోనే ఉందని, నియంత్రణ అనుమతులు రాగానే వచ్చే ఏప్రిల్‌లోపు పూర్తవుతుందని కంపెనీ తెలిపింది. ఈ కొనుగోలు తర్వాత కంపెనీ విక్రయాలు 24-25 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.12-2.21 లక్షల కోట్ల)కు చేరొచ్చని అంచనా వేసింది.

✦ టాటా మోటార్స్ విభజన 2025 అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చింది. వాణిజ్య వాహన వ్యాపారాలను విభజించి టాటా మోటార్స్ (టీఎంసీవీ) షేరును ఈ నెల 12న బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదు చేశారు.

76% తగ్గిన వోల్టాస్ లాభం

ఎయిర్ కండీషనర్ల తయారీ సంస్థ వోల్టాస్, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.31.5 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.132.83 కోట్లతో పోలిస్తే, ఇది 76.28% తక్కువ. వేసవిలో గిరాకీ అంతగా లేకపోవడం, జీఎస్‌టీ మార్పుల కారణంగా కొనుగోళ్లను ప్రజలు వాయిదా వేయడం వల్ల అమ్మకాలు తగ్గడం ఇందుకు కారణమని సంస్థ పేర్కొంది. కార్యకలాపాల ఆదాయం రూ.2619.11 కోట్ల నుంచి 10.37% తగ్గి రూ.2347.32 కోట్లకు పరిమితమైంది. ఇదే సమయంలో వ్యయాలు కూడా 6.65% తగ్గి రూ.2321.29 కోట్లుగా నమోదయ్యాయి. ఇళ్లలో వినియోగించే ఏసీల అమ్మకాలు రూ.1582.19 కోట్ల నుంచి 23.2% తగ్గి, రూ.1215.13 కోట్లకు పరిమితం అయ్యాయి. జీఎస్‌టీ రేటు 28% నుంచి 18 శాతానికి తగ్గడం, సరికొత్త స్టార్‌రేటింగ్ వల్ల రాబోయే త్రైమాసికాల్లో ఏసీల అమ్మకాలు పెరుగుతాయని వోల్టాస్ ఎండీ ముకుందన్ మేనన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐషర్ మోటార్స్ లాభం రూ.1369 కోట్లు

ఐషర్ మోటార్స్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.1369 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1100 కోట్ల కంటే ఇది 24% అధికం. కార్యకలాపాల ఆదాయం కూడా రూ.4263 కోట్ల నుంచి 45% వృద్ధితో రూ.6172 కోట్లకు పెరిగింది. గ్రూప్‌లోని రాయల్ ఎన్‌ఫీల్డ్ ఒక త్రైమాసికంలోనే అత్యధికంగా 3,27,067 బైక్‌లను విక్రయించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో అమ్మిన 2,25,317 బైక్‌లతో పోలిస్తే ఈ సంఖ్య 45% అధికం.

జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
యురేకా ఫోర్బ్స్	63	48	772	673
వారీ గ్లోబల్	10	8	28	15
జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్	195	67	2340	1955
ఆల్కెమ్ ల్యాబ్స్	779	702	4001	3415
ఏథర్ ఇండస్ట్రీస్	54	35	275	199
పటేల్ ఇంజినీరింగ్	65	73	1272	1231
ఇప్కా ల్యాబ్స్	283	229	2556	2355
ఎన్‌బీసీసీ	157	125	3017	2513
క్యుపిడ్	24	10	90	47
సెంకో గోల్డ్	49	12	1536	--
ప్రెస్టీజ్ ఎస్టేట్స్	457	235	2698	2424
పేజ్ ఇండస్ట్రీస్	195	195	1291	1246

దేశీయ ఉత్పత్తుల పోటీ సామర్థ్యం పెరుగుతుంది



ఎగుమతి ప్రోత్సాహకాలపై ప్రధాని మోదీ

దిల్లీ: ఎగుమతిదార్లకు లబ్ధి కలిగేలా రూ.45,000 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన రెండు పథకాల వల్ల, దేశీయ ఎగుమతులకు ఊతం లభిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అంతర్జాతీయ విపణుల్లో దేశీయ ఉత్పత్తుల పోటీ సామర్థ్యం పెరిగేందుకు ఉపకరిస్తుందని అన్నారు. రూ.25,060 కోట్లతో ఎగుమతుల ప్రోత్సాహక పథకం, రూ.20,000 కోట్లతో రుణ హామీ పథకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. 'ఎగుమతుల ప్రోత్సాహక పథకంతో దేశీయ ఉత్పత్తుల పోటీ సామర్థ్యం మెరుగవుతుంది. ఎంఎస్ఎంఈలు, కొత్త ఎగుమతిదార్లు, ఎక్కువ సంఖ్యలో కార్మికుల అవసరం ఉన్న రంగాలకు ప్రయోజనం కలుగుతుంద'ని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ రెండు పథకాల మద్దతుతో దేశీయ ఎగుమతి రంగం బలోపేతం అవుతుందని హోం మంత్రి అమిత్ షా అన్నారు. 'రుణ హామీ పథకంతో నిధుల లభ్యత పెరుగుతుంది. ఎంఎస్ఎంఈల సాధికారికతకు, లక్ష కోట్ల డాలర్ల (సుమారు రూ.88.50 లక్షల కోట్ల) ఎగుమతి లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేసేందుకు ఇది దోహదం చేస్తుంద'ని ఆయన తెలిపారు. దేశీయ ఎగుమతి రంగం ఇటీవల కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న సవాళ్లకు ఈ రెండు పథకాలు పరిష్కారం చూపుతాయని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఆపెరల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్, ఫిక్కీ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

111 దేశాలకు జౌళి ఎగుమతులు 10% పెరిగాయి: ఏప్రిల్- సెప్టెంబరులో 111 దేశాలకు మన జౌళి ఎగుమతులు 10% పెరిగాయని ప్రభుత్వం తెలిపింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు, సుంకాల ప్రభావాన్ని తట్టుకుని ఈ ఘనత నమోదు చేయడం విశేషమని పేర్కొంది. ఏప్రిల్- సెప్టెంబరులో 111 దేశాలకు మొత్తంగా 848.90 కోట్ల డాలర్ల (సుమారు రూ.75,000 కోట్ల) విలువైన జౌళి ఉత్పత్తులు భారత్ నుంచి ఎగుమతి అయ్యాయని జౌళి మంత్రిత్వ శాఖ తెలిపింది. కిందటేడాది ఇదే సమయంలో ఈ విలువ 771.86 కోట్ల డాలర్లు (సుమారు రూ.68,000 కోట్లు)గా ఉందని పేర్కొంది.

వైట్‌గూడ్స్ పీఎల్ఐ కింద రూ.1914 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: ఏసీలు, ఎల్ఈడీ లైట్ల వంటి ఉత్పత్తుల తయారీ కోసం, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద మరో 13 దరఖాస్తులు అందుకున్నట్లు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) ప్రకటించింది. ఈ సంస్థలు రూ.1,914 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈనెల 10తో ముగిసింది. ఇప్పటికే ఈ పథకం కింద ప్రయోజనాలు పొందుతున్న సంస్థ అదనంగా రూ.15 కోట్లు, పెట్టుబడి పెట్టనుంది. మరో 9 సంస్థలన్నీ కలిపి రూ.1,816 కోట్ల పెట్టుబడి పెట్టనున్నాయి. ఎయిర్ కండీషనర్ల విడిభాగాలు తయారు చేయడానికి ఇవి దరఖాస్తు చేసుకున్నాయి. కాపర్ ట్యూబ్స్, అల్యూమినియం స్టాక్, కంప్రెసర్లు, మోటార్లు, హీట్ ఎక్స్ఛేంజర్లు, కంట్రోల్ అసెంబుల్స్, మరిన్ని



అధిక విలువ గల విడిభాగాల తయారీపై ఈ పెట్టుబడులు పెట్టనున్నారు. మిగిలిన 4 దరఖాస్తుదార్లు, రూ.98 కోట్లను ఎల్ఈడీ విడిభాగాల తయారీ కోసం ప్రతిపాదించినట్లు పేర్కొంది. ఈ దరఖాస్తులు 6 రాష్ట్రాల నుంచి వచ్చాయి.

15 ఏళ్ల కనిష్ఠానికి ఎన్ఎస్ఈ కంపెనీల్లో ఎఫ్‌పీఐ వాటా

ఎన్ఎస్ఈ నమోదిత కంపెనీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐ) వాటా సెప్టెంబరు చివరకు 16.9 శాతానికి పరిమితమైంది. గత 15 ఏళ్లలోనే ఇది అత్యల్పం. దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థల వాటా మాత్రం వరుసగా తొమ్మిదో త్రైమాసికంలోనూ పెరిగి 10.9 శాతానికి చేరింది. క్రమానుగత పెట్టుబడులు (సిప్) ఇందుకు మద్దతుగా నిలుస్తున్నాయి. వ్యక్తిగత మదుపర్ల వాటా 22 ఏళ్ల గరిష్ఠమైన 18.75 శాతానికి పెరిగింది. ఎన్ఎస్ఈ కంపెనీల్లో ప్రమోటర్ల వాటా 50.1% వద్ద స్థిరంగా ఉంది. నిఫ్టీ 500 కంపెనీల్లో ప్రమోటర్ల వాటా 49.3 శాతంగా ఉంది. నిఫ్టీ 50 కంపెనీల్లో ప్రమోటర్ల వాటా 23 ఏళ్ల కనిష్ఠమైన 40 శాతానికి పరిమితమైంది.

✦ దేశీయుల ఈక్విటీల విలువ 2020 ఏప్రిల్ నుంచి చూస్తే, రూ.53 లక్షల కోట్లు పెరిగి రూ.84 లక్షల కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరులో మాత్రం ఇది రూ.2.6 లక్షల కోట్లు తగ్గింది.

అబాట్ నుంచి సరికొత్త ఎన్‌స్యూర్ డయాబెటిస్ కేర్

మధుమేహంతో బాధపడే వారి కోసం సరికొత్త 'ఎన్‌స్యూర్ డయాబెటిస్ కేర్'ను అమెరికా ఆరోగ్య సంరక్షణ కంపెనీ అబాట్ గురువారం భారత్‌లో విడుదల చేసింది. శాస్త్రీయ పోషకాహార విభాగంలో 30 ఏళ్ల అనుభవం గల తమ సంస్థ, 60కి పైగా క్లినికల్ ట్రయల్స్ అనంతరం ఈ ఉత్పత్తిని తీసుకొచ్చినట్లు తెలిపింది. ముఖ్యమైన పోషకాలతో కూడిన ట్రిపుల్ కేర్ వ్యవస్థ ఇందులో ఉంది. మునుపటి ఫార్ములేషన్‌తో పోలిస్తే నాలుగు రెట్లు అధికంగా మయో ఇనోసిటాల్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కార్బోహైడ్రేట్ మిశ్రమం ఇందులో ఉన్నాయి. రక్తంలో చక్కెర పెరుగుదలను తగ్గించే విధంగా దీన్ని రూపొందించారు. అధిక ప్రోటీన్లు, ఫైబర్‌తో పాటు పోషకాలు.. రక్తంలో చక్కెర నియంత్రణ, కొలెస్ట్రాల్ తగ్గింపు, బరువు నిర్వహణలో ఇది దోహదపడుతుందని అబాట్ వివరించింది. బరువు తగ్గే సమయంలో కండరాలను కాపాడటానికి కూడా ఈ ఫార్ములేషన్ ఉపయోగపడుతుంది.

ఒడుదొడుకుల్లో స్వల్ప లాభాలు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.384 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.3092 కోట్లు

సెన్సెక్స్ ▲ 12	నిఫ్టీ ▲ 03
84479	25879



రోజంతా ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో, సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ సెంటిమెంట్ స్తబ్దుగా ఉండటం, విదేశీ మదుపర్ల అమ్మకాలతో మార్కెట్ల జోరుకు కళ్లెం పడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 8 పైసలు తగ్గి 88.70 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.29% నష్టంతో 62.53 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ గురువారం రూ.49,000 కోట్లు తగ్గి రూ.473.20 లక్షల కోట్లు (5.33 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 59 పాయింట్ల (క్రితం ముగింపు 84,466.51) లాభంతో 84,525.89 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 84,253.05 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ, అనంతరం పుంజుకుని ఇంట్రాడేలో 84,919.43 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. అక్కడ లాభాల స్వీకరణ జరగడంతో, చివరకు 12.16 పాయింట్ల లాభంతో 84,478.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 3.35 పాయింట్లు పెరిగి 25,879.15 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,808.40- 26,010.70 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ గ్రో షేర్లు రెండో రోజూ లాభాలు కొనసాగించాయి. గురువారం ఇంట్రాడేలో రూ.153.50 వద్ద గరిష్ఠాన్ని తాకిన షేరు, చివరకు 5.46% లాభంతో రూ.138.09 వద్ద ముగిసింది. బీఎస్ఈలో కంపెనీ మార్కెట్ విలువ రూ.85,251.20 కోట్లుగా నమోదైంది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 12 మెరిశాయి. ఏషియన్ పెయింట్స్ 3.81%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.99%, ఎల్ అండ్ టీ 1.23%, పవర్‌గ్రిడ్ 1.10%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.99% లాభపడ్డాయి. ఎటర్నల్ 3.63%, టీఎంసీవీ 2.26%, ఎం అండ్ ఎం 1.45%, ట్రెంట్ 1.19%, టాటా స్టీల్ 1.15%, బీఈఎల్ 1.10% నష్టపోయాయి. మన్నికైన వినిమయ వస్తువులు 0.86%, టెలికాం 0.70%, స్థిరాస్తి 0.43%, లోహ 0.36% పెరిగాయి.

✦ సిడ్నీకి చెందిన శీతలపానీయాల బ్రాండ్ **లయన్** ఐటీ కార్యకలాపాలను ఏఐ ఆధారిత సొల్యూషన్ల ద్వారా మార్చేందుకు భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు **టీసీఎస్** ప్రకటించింది.

✦ బెంగళూరులో రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు **ఎరిక్సన్** వెల్లడించింది.

✦ **ఉద్యోగులకు రిలయన్స్ గ్రూప్ ఈసాప్స్:** రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ కంపెనీల ఉద్యోగులకు మొదటిసారిగా ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్ (ఈసాప్స్)ను రిలయన్స్ గ్రూప్ ప్రకటించింది. రెండు కంపెనీల్లో దాదాపు 2,500 మంది ఉద్యోగులకు ఇది అందుతుంది.

✦ రూ.14,599 కోట్ల మనీ లాండరింగ్ కేసులో స్థిరాస్తి సంస్థ **జేపీ ఇన్‌ఫ్రాటెక్** మాజీ ఎండీ మనోజ్ గౌర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం అరెస్టు చేసింది. గృహ కొనుగోలుదార్లను మోసగించారనేది ఆరోపణ.

ఇస్రోకు గోద్రేజ్ ఇంజిన్

మానవ సహిత రోదసీ యాత్రలకు అనువైన ఎల్110 స్టేజ్ వికాస్ ఇంజిన్‌ను ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్)కు అందించినట్లు గోద్రేజ్ ఏరోస్పేస్ బిజినెస్ వెల్లడించింది. 2027లో గగన్‌యాన్ ప్రాజెక్టు కోసం ఈ ఇంజిన్లను వినియోగించాలన్నది ప్రతిపాదన.

ఐపీఓ సమాచారం

✦ **ఫిజిక్స్‌వాలా** ఐపీఓ ముగిసేసరికి 1.81 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 18,62,04,143 షేర్లను ఆఫర్ చేయగా, 33,62,27,044 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 2.70 రెట్లు, రిటెయిల్ విభాగంలో 1.06 రెట్లు, ఎన్ఐఐల నుంచి 48% స్పందన లభించింది.


✦ **ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్** ఐపీఓ ముగిసేసరికి 97% స్పందనే లభించింది. ఇష్యూలో భాగంగా 7,74,27,183 షేర్లను జారీ చేయనుండగా, 7,50,44,538 షేర్లకే బిడ్లు వచ్చాయి. క్యూఐబీ విభాగంలో 1.26 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 1.10 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 30% స్పందన లభించింది.

✦ **టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా** ఐపీఓ రెండో రోజుకు 2.93 రెట్ల స్పందన వచ్చింది.

✦ **ఫుజియామా పవర్‌సిస్టమ్స్** ఐపీఓ మొదటి రోజు 9% స్పందన దక్కింది.

ఈనాడు సినిమా

మరోసారి కలిసి?


శివ కార్తికేయన్

శ్రీలీల ప్రస్తుతం శివ కార్తికేయన్ 'పరాశక్తి' చిత్రంతో తమిళంలోకి తొలి అడుగు వేసేందుకు సిద్ధమవుతోంది. సుధా కొంగర దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా థియేటర్లలోకి రానుంది. అయితే ఇదింకా తెరపైకి రాకముందే శ్రీలీల కోలీవుడ్‌లో మరో అవకాశాన్ని అందిపుచ్చుకున్నట్లు తెలుస్తోంది. శివ కార్తికేయన్ తన తర్వాతి సినిమాని సీబీ చక్రవర్తి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. 'డాన్' విజయం తర్వాత వీళ్లిద్దరి కాంబోలో రెండో చిత్రమిది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా వచ్చే నెల రెండో వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలుస్తోంది. దీంట్లో కార్తికేయన్‌కు జోడీగా రష్మిక కనిపించనున్నట్లు గతంలో ప్రచారం వినిపించింది. కానీ, ఇప్పుడా అవకాశం శ్రీలీలకు దక్కినట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు పూర్తయినట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. వినోదం ప్రధానంగా సాగే ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ వచ్చే ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రచారం వినిపిస్తోంది.


శ్రీలీల

రివాల్వర్ లోడ్ చేసింది రీటా


'రివాల్వర్ రీటా'

కథానాయిక కీర్తి సురేశ్ నటించిన మహిళా ప్రాధాన్య చిత్రం 'రివాల్వర్ రీటా'. కె.చంద్రు దర్శకత్వం వహించారు. రాధికా శరత్‌కుమార్, సునీల్, అజయ్ ఘోశ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా "రీటా ప్రపంచంలోకి స్వాగతం.. ఆమె రివాల్వర్ లోడ్ చేసింది" అనే వ్యాఖ్యతో ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో రీటా పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది కీర్తి. ఓ వ్యక్తిని హత్య చేసి దాన్ని నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్న రీటా కుటుంబం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్‌తో స్పష్టం చేసింది చిత్రబృందం.

ప్రేమకు.. ప్రేమే శాశ్వత శత్రువు!



తేజస్వి, అఖిల్

'లిటిల్ హార్ట్స్' లాంటి విజయం తర్వాత ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ నుంచి వస్తున్న మరో చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. అఖిల్, తేజస్వి రావ్ జంటగా నటించిన ఈ సినిమాని సాయిలు కంపాటి తెరకెక్కించారు. రాహుల్ మోపిదేవితో కలిసి దర్శకుడు వేణు ఊడుగుల నిర్మించారు. చైతు జొన్నలగడ్డ, అనిత చౌదరి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా ఈనెల 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో అడివి శేష్ విడుదల చేశారు. "ప్రేమకు.. ప్రేమే శాశ్వత శత్రువు.." అనే ట్యాగ్ లైన్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం మనసుల్ని హత్తుకునేలా సాగింది. 15ఏళ్లుగా బయటకు రాని ఓ నిజమైన కథకు దృశ్యరూపమిది. వరంగల్ - ఖమ్మం సరిహద్దు గ్రామంలో జరిగిన వాస్తవ ప్రేమకథతో రూపొందింది. ట్రైలర్‌లో నాయకానాయికల కెమిస్ట్రీ, వాళ్ల ప్రేమకథలోని సహజత్వం.. సంభాషణల్లోని మట్టి పరిమళాలు.. సున్నితమైన హాస్యం.. అన్నీ సినిమాపై అంచనాలు పెంచేలా ఉన్నాయి. ఈ చిత్ర క్లైమాక్స్ మదిని బరువెక్కించేలా ఉండనున్నట్లు ట్రైలర్‌ను తీర్చిదిద్దిన తీరును బట్టి అర్థమవుతోంది. ఈ సినిమాకి సురేశ్ బొబ్బిలి సంగీతమందించారు.

ట్రెండింగ్‌లో రాంబాయి నీ మీద నాకు...

'రాంబాయి నీ మీద నాకు మనసాయెనే. ఏనాడు నిను వీడిపోని సైదెనే' అంటూ ఇటీవలే 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాలో పాటని విడుదల చేసింది చిత్రబృందం. తాజాగా ఈ పాట తెలుగు వెర్షన్‌లో అన్ని ఆడియో ప్లాట్‌ఫామ్‌లలోనూ హ్యాష్‌ట్యాగ్ టాప్ ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. పల్లెటూరి హృదయానికి కొత్త ప్రేమ స్వర్గం ట్రెండింగ్‌లో ఉన్న ఈ గీతం సంగీత ప్రియుల మనసుల్లో నిత్యం మారుమోగుతోంది. ఈ పాటకి సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చగా అనురాగ్ కులకర్ణి ఆలపించారు. మిట్టపల్లి సురేందర్ సాహిత్యమందించారు.

చెన్నై లవ్ జంట


శ్రీ గౌరీ ప్రియ, కిరణ్ అబ్బవరం

ఇటీవలే 'కె-ర్యాంప్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించారు హీరో కిరణ్ అబ్బవరం. ఇప్పుడాయన నుంచి రానున్న కొత్త సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. దీన్ని దర్శకుడు సాయి రాజేశ్ అందిస్తున్న కథతో రవి నంబూరి తెరకెక్కిస్తున్నారు. ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. శ్రీ గౌరీ ప్రియ కథానాయిక. గురువారం ఆమె పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి తన కొత్త లుక్‌ని విడుదల చేశారు. గౌరీ ప్రియ ఇందులో నివి అనే పాత్రలో అలరించనున్నట్లు ఆ పోస్టర్‌తో స్పష్టత ఇచ్చారు. "యువతరం మెచ్చే వైవిధ్యభరితమైన ప్రేమకథతో రూపొందుతున్న చిత్రమిది. సంగీతానికి ఎంతో ప్రాధాన్యం ఉంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: విశ్వాస్ డేనియల్.

రజనీ - కమల్ చిత్రం నుంచి తప్పుకుంటున్నా: సుందర్.సి



రజనీకాంత్ తన 173వ చిత్రం కోసం కమల్‌హాసన్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. కమల్ సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాకి సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. అయితే ఇప్పుడీ సినిమా దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ తప్పుకున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. "భారమైన హృదయంతో ఈ ముఖ్య విషయాన్ని అందరికీ తెలియజేస్తున్నా. అనూహ్యమైన, అనివార్య కారణాల వల్ల 'తలైవర్ 173' (వర్కింగ్ టైటిల్) అనే గొప్ప ప్రాజెక్ట్ నుంచి నేను తప్పుకుంటున్నాను. సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తూ.. కమల్‌హాసన్ నిర్మిస్తున్న ఈ మహా కృతికి నన్ను పరిగణలోకి తీసుకున్నందుకు వాళ్లిద్దరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. నేనీ అవకాశం నుంచి తప్పుకున్నప్పటికీ నేనెప్పటికీ వాళ్లిద్దరి మార్గదర్శకత్వం తీసుకుంటూనే ఉంటాను. ఈ వార్త వల్ల నిరాశ చెందిన వారందరికీ మనస్ఫూర్తిగా క్షమాపణలు. మీ నిరాశను భర్తీ చేసేలా రాబోయే రోజుల్లో మరింత ఉత్తమమైన వినోదాన్ని అందించేందుకు నా వంతు కృషి చేస్తా" అని సుందర్ తన లేఖలో పేర్కొన్నారు. దీంతో ఇప్పుడీ సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టబోయేది ఎవరన్నది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది.

"కొన్ని కథలు కుటుంబ ప్రేక్షకులకు మాత్రమే నచ్చేలా ఉంటాయి. కొన్నేమో కొత్తతరం కోసమే అన్నట్లుగా ఉంటాయి. అందరినీ కలిసి మెప్పించే కథలు అరుదు. అలాంటి ఒక అరుదైన కథతో రూపొందిన సినిమానే మా 'సంతాన ప్రాప్తిరస్తు'. చిన్న పిల్లల నుంచి.. పెద్దవాళ్ల వరకూ అందరూ చూసి ఆస్వాదించే సినిమా ఇది" అంటున్నారు విక్రాంత్. ఆయన కథానాయకుడిగా... సంజీవ్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందిన సినిమానే 'సంతాన ప్రాప్తిరస్తు'. చాందినీ చౌదరి కథానాయిక. మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు కథానాయకుడు విక్రాంత్.

ఇలాంటి కథలతో ప్రయాణం చేస్తేనే అందం


విక్రాంత్

"తెలుగు ప్రేక్షకులు కొత్త రకమైన కథల్ని ఇప్పుడు బాగా ఆదరిస్తున్నారు. కొవిడ్ తర్వాత ప్రపంచ సినిమాకి అందరం బాగా అలవాటయ్యాం. ఈ దశలో నాలాంటి కొత్త హీరోలు ఫార్ములా కథలు చేస్తే ఎవ్వరికీ నచ్చదు. అందుకే ఒక మంచి కాన్సెప్ట్ ఉన్న కథని ఎంచుకుని ఈ సినిమా చేశా. సున్నితమైన సంతానలేమి అంశాన్ని... ఎంతో సహజంగా, ఆరోగ్యకరంగా, అమాయకత్వం ఉట్టిపడే పాత్రలతో దర్శకుడు సంజీవ్‌రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మూడొంతులు హాస్యం, చివర్లో మంచి సందేశం, భావోద్వేగాలతో కట్టిపడేసే చిత్రమిది. నేను చైతన్య అనే సాఫ్ట్‌వేర్ యువకుడిగా కనిపిస్తా. ఎలాంటి ఇమేజ్ లేని నాలాంటి హీరోలు ఇలాంటి కథలతో ప్రయాణం చేస్తేనే అందం. హిందీలో వచ్చాయి కానీ, తెలుగులో ఎవరూ స్పృశించని కథ ఇది".

◆ "ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంటకు వంద రోజుల్లో పిల్లల్ని కనాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఆలోపు వాళ్లు తీపి కబురు వినిపించారా? అసలు వంద రోజుల్లోనే అనే సవాల్ వాళ్లకు ఎందుకు ఎదురైందనే విషయాలు ఇందులో ఆసక్తికరం. ఇలాంటి సున్నితమైన అంశాన్ని స్పృశిస్తూ... దాని చుట్టూ హాస్యాన్ని జోడించి రూపొందించిన సినిమానే ఇది. మంచి సినిమాలు చేసి పేరు తెచ్చుకున్న చాందినీ చౌదరి ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. వెన్నెల కిశోర్, తరుణ్‌భాస్కర్, మురళీధర్ గౌడ్‌తోపాటు పలువురు హాస్యనటులు ఇందులో కీలకపాత్రల్లో కనిపిస్తారు. వాళ్లతో కలిసి నటించడం గొప్ప అనుభవం".

◆ "నేను కూడా సాఫ్ట్‌వేర్ రంగం నుంచి వచ్చినవాణ్నే. వాళ్లందరికీ ఈ సినిమా మరింతగా కనెక్ట్ అవుతుంది. నాకు వ్యక్తిగతంగా చిన్నప్పటి నుంచీ సినిమా లంటే ఇష్టం. అమెరికా వెళ్లి ఉద్యోగంలో స్థిరపడినా సినిమాపై అభిరుచి తగ్గలేదు. దాంతో కోవిడ్ సమయంలో తిరిగొచ్చి 'స్పార్క్' అనే సినిమా చేశా. అది సరైన ఫలితాన్ని ఇవ్వలేదు. తదుపరి ఇదే నిర్మాతలతో, సంజీవ్‌రెడ్డి దర్శకత్వంలోనే 'సర్పంచి' అనే సినిమా చేయబోతున్నా. ఆ తర్వాత 'మృత్యుంజయ మార్కండేయ' అనే మరో ఫాంటసీ సినిమా చేయబోతున్నా".

జిగ్రీస్‌తో వందశాతం నవ్విస్తాం!


సందీప్‌రెడ్డి వంగా, మణి వక్కా

"సినిమాలో ఏదో ఒక అంశం బలంగా నచ్చితే చాలు... ప్రేక్షకులు థియేటర్‌కి వెళ్లి చూస్తారు. హీరో, దర్శకుడు ఎవరనేది కూడా చూడరు. అదే మన తెలుగు ప్రేక్షకుల ప్రత్యేకత. 'అర్జున్ రెడ్డి' సినిమాని నేను ఎంత తపనతో తీశానో, అంతకంటే ఎక్కువ తపనతో, మరెంతో నిజాయతీగా 'జిగ్రీస్' చేశారు. థియేటర్లలో తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంద"న్నారు ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఆయన ముఖ్య అతిథిగా గురువారం హైదరాబాద్‌లో 'జిగ్రీస్' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రమిది. హరీశ్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహించారు. కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 14న రానుంది. కథానాయకుడు కృష్ణ బురుగుల మాట్లాడుతూ "ఒక నటుడిగా చాలా అవకాశాలు వచ్చాయి. అయితే ప్రేక్షకులకు నచ్చే సినిమా చేసినప్పుడే గుర్తింపు వస్తుందని నమ్మాను. మూడేళ్లుగా ఈ సినిమా కోసమే పనిచేశా. ఇది నాకు 'డీజే టిల్లు', 'జాతిరత్నాలు'తో సమానం. వంద శాతం నవ్విస్తాం" అన్నారు. అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించిన సినిమా ఇదన్నారు నిర్మాత కృష్ణ. ఈ కార్యక్రమంలో ధీరజ్, మణి తదితర చిత్రబృందం పాల్గొంది.

మై బేబీ.. ప్రెట్టీ బేబీ

బైకర్‌గా సినీప్రియుల్ని పలకరించనున్నారు హీరో శర్వానంద్. ఆయన.. మాళవిక నాయర్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని అభిలాశ్ రెడ్డి కంకర తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. రాజశేఖర్ ముఖ్య పాత్ర పోషించారు. ఈ సినిమా డిసెంబరు 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "ప్రెట్టీ బేబీ.. మై బేబీ" అంటూ సాగిన ఈ రొమాంటిక్ పాటకు జిబ్రాన్ స్వరాలు సమకూర్చగా.. కృష్ణకాంత్ సాహిత్యమందించారు. జిబ్రాన్, యాజిన్ నిజార్, సుబ్లాషిని ఆలపించారు. ఈ పాటలో శర్వా, మాళవిక కెమిస్ట్రీ, వాళ్లిద్దరి హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. "మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో సాగే భావోద్వేగాలు నిండిన యాక్షన్ కథతో రూపొందిన చిత్రమిది. ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందిస్తుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి కూర్పు: అనిల్ కుమార్, ఛాయాగ్రహణం: జె. యువరాజ్.


మాళవిక నాయర్, శర్వానంద్

కాంతార లాంటి కొరగజ్జ


భవ్య, సుధీర్, శ్రుతి

తుళునాడులో పూజించే దైవం కొరగజ్జ కథతో కన్నడ చిత్రసీమ నుంచి 'కొరగజ్జ' పేరుతో ఓ సినిమా తెరపైకి రానుంది. సందీప్ సోపర్‌కర్, భవ్య, శ్రుతి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని సుధీర్ అత్తవర్ తెరకెక్కించారు. త్రివిక్రమ్ సాఫల్య నిర్మాత. ఈ చిత్ర పాటల్ని ఇటీవలే మంగళూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సుధీర్ అత్తవర్ మాట్లాడుతూ.. "కన్నడ నుంచి ఇప్పటికే ఎన్నో గొప్ప చిత్రాలు వచ్చాయి. వాటిలో 'కాంతార' కూడా ఒకటి. ఇప్పుడలాంటి భక్తి నేపథ్య కథాంశంతోనే ఈ 'కొరగజ్జ'ను తీసుకొస్తున్నాం. ఇది కచ్చితంగా అందర్నీ మెప్పిస్తుంది, ఆశ్చర్యపరుస్తుంది" అన్నారు.

సగం మంది చంపాలనుకుంటే... సగం మంది ప్రశంసించారు


అదా శర్మ

వివాదాస్పద పాత్రలు పోషించడం కెరీర్‌కు చాలా అవసరమని, అలాంటి కథల్లో నటిస్తేనే కెరీర్‌కు విలువ అని అంటోంది నాయిక అదా శర్మ. భిన్నమైన పాత్రల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటుందీ భామ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ తార.. తను నటించిన 'ది కేరళ స్టోరీ' విడుదలైనప్పుడు దేశంలో సగం మంది తనను చంపాలని చూశారని చెప్పింది. "నేను '1920' సినిమాతో చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టాను. నా తొలి చిత్రం కోసమే నేను చాలా ధైర్యంగా ముందడుగు వేశానని అనిపిస్తుంటుంది. 'ది కేరళ స్టోరీ' విడుదలయ్యే వరకూ నాకు మంచి స్క్రిప్ట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేదాన్ని. ఆ చిత్రం తర్వాత నా కెరీర్ మారిపోయింది. దీని తదుపరి 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' చేశాను. ఈ సినిమా విడుదలైనప్పుడు ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నాను. దేశంలో సగం మంది నన్ను చంపాలని అనుకున్నారు. మిగతా సగం మంది నాపై ప్రశంసలు కురిపించారు. వారంతా నన్ను రక్షించార"ని అంది. తను నటిస్తోన్న 'రీతా సన్యాల్ 2' గురించి చెప్తూ.. "ఇదొక కల్పిత సిరీస్. ఫాంటసీ, యాక్షన్, కామెడీ లాంటి అంశాలతో దీన్ని తీర్చిదిద్దారు. త్వరలో మీ ముందుకు రాబోతుందీ సిరీస్" అని చెప్పుకొచ్చింది అదా.

చిన్న సినిమాకు అండగా...


కుటుంబమంతా కలిసి చూసే కంటెంట్ మాత్రమే 'టీబీడీ' ఓటీటీ వేదికలో ఉంటుందని, కేవలం రూ.10తో చందాదారులై నెలంతా వినోదాన్ని ఆస్వాదించవచ్చన్నారు టీబీడీ (త్రిబాణధారి) ఓటీటీ సంస్థ వ్యవస్థాపకులు, ఎండీ ధరమ్‌గుప్తా. దుబాయ్‌లో ఇటీవల ప్రారంభమైన ఈ ఓటీటీ వేదికను భారతదేశంలోని ప్రాంతీయ భాషలకూ పరిచయం చేస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల హైదరాబాద్‌లో ఈ సంస్థ లోగో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. నిర్మాత కె.కె.రాధామోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధరమ్‌గుప్తా మాట్లాడుతూ "తెలుగు పరిశ్రమ ఇప్పుడు విశ్వవ్యాప్తమైంది. నాకు హైదరాబాద్ అంటే ఎంతో ఇష్టం. మన స్వదేశీ కంటెంట్‌తో తెలుగు ప్రేక్షకులకు స్వచ్ఛమైన వినోదం అందించాలని, భారతీయ మూలాలకు టీబీడీ ఓటీటీ వేదికని విస్తరించాలనే లక్ష్యంతో స్థానిక కంటెంట్‌కి ప్రాధాన్యమిస్తున్నాం. ఈ రంగంలో ఇప్పటికే చాలా వేదికలు ఉన్నాయి. అయినా ఇంకా అవకాశాలు ఉన్నాయి. మంచి కంటెంట్‌తో వచ్చే చిన్న సినిమాలకు, నిర్మాతలకీ అండగా నిలుస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీడీ దక్షిణ భారత సీఈవోలుడీయస్‌రావు, వి.సముద్రతోపాటు, సినీ ప్రముఖులు చంద్రమహేశ్, ఇ.సత్తిబాబు, డిజిక్వెస్ట్ బసిరెడ్డి, సురేశ్ కొండేటి, చంద్ర, సతీశ్ సిరాజ్, జగదీశ్, చంద్ర, అలీషా, శివనాగు, దొరైరాజు, మల్లికార్జున్, దాసన్న తదితరులు పాల్గొన్నారు.

'బాషా'లా 'అనంత' ట్రెండ్ సెట్ చేస్తుంది: సురేశ్ కృష్ణ


గిరీశ్, తమ్మారెడ్డి భరద్వాజ, సురేశ్ కృష్ణ


"కమర్షియల్ సినిమాల్లో 'బాషా' ఎలాంటి ట్రెండ్ సెట్ చేసిందో.. ఆధ్యాత్మిక చిత్రాల్లో 'అనంత' అలాంటి ట్రెండ్ సెట్ చేస్తుంది" అన్నారు దర్శకుడు సురేశ్ కృష్ణ. "ఈ సినిమాతో బాబా ప్రేమతత్వం మరింత మందికి చేరువవుతుంద"ని తెలిపారు. ఆయన దర్శకత్వంలో జగపతిబాబు, సుహాసిని ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని గిరీశ్ కృష్ణమూర్తి నిర్మించారు. ఈ చిత్ర టీజర్, పాటల్ని గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సురేశ్ కృష్ణ మాట్లాడుతూ.. "పుట్టపర్తి సత్య సాయి బాబా జీవితంపై సినిమా చేయమని అడిగారు గిరీశ్ కృష్ణమూర్తి. బాబా శత జయంతి సందర్భంగా ఈ చిత్రం చేయాలని కోరారు" అన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, వీర శంకర్, సాయిమాధవ్ బుర్రా, రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీడ ఓ కథను దాచిపెడుతుంది


మమ్ముట్టి

మలయాళ అగ్రనటుడు మమ్ముట్టి, వినాయకన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కలాంకావల్'. జితిన్ కె.జోస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని మమ్ముట్టి కంపెనీ నిర్మిస్తోంది. తాజాగా చిత్రబృందం "ప్రతి నీడ ఒక కథను దాచి పెడుతుంది.. అలానే ప్రతి కథ ఓ అనుమానితుడిని దాచి పెడుతుంద"నే క్యాప్షన్‌తో ఇన్‌స్టాలో అధికారిక ట్రైలర్‌ను ఆవిష్కరించింది. "ఇద్దరు యువకుల మధ్య చిన్న గొడవ జరుగుతుంది. వాళ్ల స్నేహితులు కూడా చేరి దాన్ని పెద్ద ఘర్షణగా మారుస్తారు. ఆ తర్వాత అది ఆ ప్రాంతంలోనే రెండు ఆధిపత్య వర్గాల మధ్య అల్లర్లుగా మారుతుంది"లాంటి సంభాషణలతో ఆసక్తిగా సాగుతుంది ఈ ట్రైలర్. ఈ సినిమా ఈ నెల 27న థియేటర్లలో విడుదల కానుంది.

మీడియాపై సన్నీదేవోల్ ఆగ్రహం


సన్నీదేవోల్

బాలీవుడ్ అగ్రహీరో సన్నీ దేవోల్ మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన తండ్రి, సీనియర్ నటుడు ధర్మేంద్ర.. కొన్ని రోజులుగా ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇటీవలే డిశ్చార్జ్ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇంటి ముందు వేచి ఉన్న మీడియాపై తమ కుటుంబ గోప్యతకు గౌరవం ఇవ్వడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు సన్నీ దేవోల్. "మీకు కూడా ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు ఉన్నారు. మీకు సిగ్గుగా అనిపించడం లేదా" అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ధర్మేంద్రకు ముంబయిలోని ఆయన నివాసంలోనే వైద్యం అందిస్తున్నారు.

ఈనాడు ప్రతిభ
శుక్రవారం, నవంబరు 14, 2025
17 pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు



◆ యూఎన్ ఉమెన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు రెండోసారి వరుసగా పదవీబాధ్యతలు చేపట్టారు?
జ: డాక్టర్ సిమా సామి బహూస్

◆ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ - 2025 లో భారత్ ఎన్నో స్థానంలో నిలిచింది? (ప్రపంచ మేధో సంపత్తి సంస్థ - డబ్ల్యూఐపీఓ ప్రచురించిన ఈ సూచికలో స్విట్జర్లాండ్, స్వీడన్, అమెరికాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.)
జ: 38వ స్థానం

◆ ప్రపంచవ్యాప్త వృత్తుల వర్గీకరణను అభివృద్ధి చేయడానికి, నైపుణ్య గుర్తింపును మెరుగుపరచడానికి, భారతీయ కార్మికులకు ఉద్యోగ అవకాశాలను విస్తరించడానికి భారత్ అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ)తో కుదుర్చుకున్న ఒప్పందం ఏ రోజు నుంచి అధికారికంగా అమలులోకి వచ్చింది?
జ: 2025, సెప్టెంబరు 16

◆ 'డెమోగ్రఫీ, రిప్రజెంటేషన్, డీలిమిటేషన్: ది నార్త్ - సౌత్ డివైడ్ ఇన్ ఇండియా' పుస్తకాన్ని ఇటీవల ఎవరు రచించారు?
జ: రవి కె మిశ్రా

మరింత సమాచారం

◆ ఇండియా తాబేలు పరిరక్షణ కార్యక్రమం(ఐటీసీపీ) భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా ఏ నగరంలోని జూలో ఆసియా జెయింట్ తాబేళ్ల (మనోరియా ఎమిస్ ఫెయిరీ) మొదటి కృత్రిమ పొదిగే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు?
జ: మణిపూర్

దరఖాస్తు చేశారా?



☛ ఆంధ్రప్రదేశ్ ఆయూష్ డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు(107)
చివరి తేదీ: 15.11.2025

☛ ఎన్‌టీపీసీ మైనింగ్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ ఖాళీలు
చివరి తేదీ: 15.11.2025

కనిపించకుండా కబళించే శత్రువు!

జనరల్ స్టడీస్ — పర్యావరణ అంశాలు

పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువు వాయు కాలుష్యం. పీల్చే గాలి నాణ్యతతో పాటు మనుషుల జీవిత కాలాన్నీ అది హరించి వేస్తుంది. కంటికి కనిపించని హానికర సూక్ష్మకణాలు గాలి ద్వారా రక్తప్రవాహంలోకి చేరి అనేక రకాల మొండి వ్యాధులకు కారణమవుతున్నాయి. అగ్నిపర్వతాల విస్ఫోటం, కార్చిచ్చు తదితర సహజ కారకాలకు తోడు మానవ ప్రేరిత శిలాజ ఇంధనాల వినియోగం, పారిశ్రామిక వ్యర్థాలు మొదలైనవన్నీ కలిసి వాయు కాలుష్యాన్ని తీవ్రం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న ఈ ప్రమాదకర స్థితికి కారణాలు, పర్యవసానాలపై పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. గాలిలో ఉండే ప్రధాన రసాయనిక కాలుష్య కారకాలు, వాటి ప్రభావాలు, నివారణకు ఉన్న పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు దేశం అవలంబిస్తున్న వాయుకాలుష్య నియంత్రణ విధానాలు, నెలకొల్పిన ప్రమాణాలనూ తెలుసుకోవాలి.



వాయు కాలుష్యం

వాతావరణంలో వాంఛనీయ, అవాంఛనీయ కారకాలు ఉండాల్సిన సాంద్రత కంటే ఎక్కువ మోతాదులో ఉండటాన్ని 'గాలి కాలుష్యం' అంటారు. ఇవి ఘన, ద్రవ, వాయు రూపాల్లో ఉండవచ్చు. సహజసిద్ధ లేదా మానవ సంబంధ కారకాల వల్ల ఏర్పడవచ్చు. మానవ సంబంధ కారకాల ద్వారా వాతావరణంలోని గాలి కూర్పు 0.01% మార్పునకు గురవుతుంది. ఇది చాలా తక్కువ మోతాదులో ఉన్నప్పటికీ దీర్ఘకాలికంగా ఉంటుంది.

వాయు కాలుష్య కారకాలు

ఇవి రెండు రకాలు.. 1) ప్రాథమిక కాలుష్య కారకాలు, 2) ద్వితీయ కాలుష్య కారకాలు.
★ ప్రాథమిక కాలుష్య కారకాలు అంటే వాతావరణంలోకి కాలుష్య కారకాలు రసాయనాల రూపంలో విడుదలవుతాయి. **ఉదా:** CO, CO_2, N_2O, O_3 తేమ. ★ ప్రాథమిక కాలుష్య కారకాల మధ్య చర్య జరిగి కొత్త కాలుష్య కారకాలు ఏర్పడితే వాటిని 'ద్వితీయ కాలుష్య కారకాలు' అంటారు. **ఉదా:** $2SO_2 + H_2O$ కలిసి $2H_2SO_4$ ఏర్పడటం. ★ వాతావరణంలోని CO_2 సముద్ర నీటితో కలిసి కార్బోనిక్ ఆమ్లాన్ని ఏర్పరచడం. $CO_2 + H_2O \rightarrow H_2CO_3$ ★ నీరు వాతావరణంలోని N_2Oతో కలిసి నైట్రిక్ ఆమ్లాన్ని ఏర్పరచడం.
$N_2O + H_2O \rightarrow HNO_3$

గాలిలో ప్రధాన కాలుష్య కారకాలు: పర్టిక్యులేట్ మ్యాటర్, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, కర్బన కాలుష్యకాలు, కార్బన్ మోనాక్సైడ్, సీసం.

ముఖ్యమైన ద్వితీయ కాలుష్య కారకాలు

కాంతి రసాయన పొగమంచు: వాయువుల మిశ్రమాలు సూర్యకాంతితో చర్య జరిపి కాంతి రసాయన ప్రక్రియ ద్వారా కాంతి రసాయన పొగమంచును ఏర్పరుస్తాయి. దాని ద్వారా ఏర్పడే రసాయన పదార్థాలు వాతావరణంలో దీర్ఘకాలికంగా ఉంటాయి.

కార్బన్ మోనాక్సైడ్ (CO): రంగు, రుచి, వాసనలేని అత్యంత ప్రమాదకర వాయువు. 0.1 PPM వరకు దీని ప్రభావం ఉండదు. ఈ ప్రమాణం దాటితే దీనిద్వారా దీర్ఘకాలిక ప్రభావాలు ఏర్పడతాయి. విత్తనాలు మొలకెత్తేటప్పుడు, అగ్నిపర్వతాలు, సహజ వాయువుల నుంచి విడుదలవుతాయి. మానవ సంబంధ కారకాలైన రవాణా రంగం, కలపను మండించడం, పారిశ్రామికవ్యర్థాల నుంచి కూడా ఉద్భవిస్తుంది.
ప్రభావాలు: రక్తంలో O_2 స్థాయి తగ్గిపోతుంది. గుండె సంబంధ వ్యాధులు ఏర్పడే ప్రమాదం ఉంది. దృష్టి లోపం సంభవిస్తుంది.

కార్బన్ డై ఆక్సైడ్: (CO_2) ఇది సహజసిద్ధ కారకాలైన అగ్నిపర్వతాలు, మృతదేహాల నుంచి విడుదలవుతుంది. మానవప్రేరేపిత కారకాలైన శిలాజ ఇంధనాలను మండించడం, పారిశ్రామిక వ్యర్థాలు, జెట్ విమానాల నుంచి విడుదలవుతుంది.
ప్రభావాలు: తలనొప్పి, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కలుగుతాయి. 57% గ్రీన్‌హౌస్ ప్రభావానికి ఇదే కారణం. సముద్రాల్లో సముద్ర ఆమ్లీకరణ జరుగుతుంది. గ్లోబల్‌వార్మింగ్‌తో వాతావరణంలో మార్పులు సంభవిస్తాయి.



నైట్రోజన్ ఆక్సైడ్: మెరుపులు, కార్చిచ్చులు, పరిశ్రమలు, శిలాజ ఇంధనాల నుంచి వెలువడుతుంది.
ప్రభావాలు: మానవుల్లో ఊపిరితిత్తుల సంబంధిత, దీర్ఘకాలిక శ్వాసకోస సమస్యలు వస్తాయి. ఆమ్ల వర్షాలు ఏర్పడతాయి.

సల్ఫర్ ఆక్సైడ్‌లు: అగ్నిపర్వతాల పేలుళ్ల ద్వారా 67% SO_2 వాతావరణంలోకి విడుదలవుతుంది. శిలాజ ఇంధనాల దహనం, బొగ్గుని శుభ్రపరిచే దశలో, చమురుశుద్ధి కర్మాగారాల నుంచి కూడా వస్తుంది. బ్యాక్టీరియాల నుంచి చాలా తక్కువ మోతాదులో విడుదలవుతుంది.
ప్రభావాలు: శ్వాస సంబంధ సమస్యలు, మార్బుల్ క్యాన్సర్‌లు వస్తాయి. ఆమ్ల వర్షాలు, తోళ్లు, పేపర్ పరిశ్రమలు నష్టపోతాయి. SO_2 వృక్షాలపై ఎక్కువ ప్రభావం చూపుతుంది.

హైడ్రోకార్బన్స్: మీథేన్, ఈథేన్, ఇథిలీన్, టెర్పేన్ లాంటివి.

మీథేన్: జీవుల విచ్ఛిన్నం ద్వారా విడుదలయ్యే అత్యంత ప్రమాదకరమైన వాయువు. దీన్ని 'బయో సిగ్నేచర్ వాయువు' అని కూడా అంటారు. అంటే ఒక వాతావరణంలో మీథేన్ విడుదలవుతూ ఉంటే అక్కడ జీవుల ఉనికి ఉన్నట్లు. సౌర కుటుంబంలోని క్యూపర్ బెల్ట్‌లో మీథేన్ ఘన రూపంలో ఉన్నట్లు నాసా గుర్తించింది. మంగళ్‌యాన్‌లో ఉన్న MSM అనే పరికరం ద్వారా అరుణగ్రహ వాతావరణంలో మీథేన్‌ను గుర్తించారు.

హైడ్రోకార్బన్స్ విడుదలయ్యే కారకాలు: బొగ్గు గనుల నుంచి ఇంధనాల పాక్షిక దహనం వల్ల, వ్యవసాయ వ్యర్థాల నుంచి విడుదల అవుతాయి.
ప్రభావాలు: క్యాన్సర్‌ని కలిగిస్తాయి. ఓజోన్ లాంటి హానికారక వాయువులనుఏర్పరుస్తాయి. దీనివల్ల వృక్షాలకు నష్టం వాటిల్లుతుంది.

వాయుకాలుష్య నివారణకు కేంద్ర ప్రభుత్వ చర్యలు

1) వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం - 1981 2) వాయు కాలుష్య సవరణ చట్టం - 1987 3) మోటారు వాహనాల చట్టం - 1988 4) కాలుష్య నియంత్రణ చట్టం - 1983 5) పర్యావరణ పరిరక్షణ చట్టం - 1986

వాయు కాలుష్యాన్ని తగ్గించే సాంకేతిక పరిజ్ఞానం

గ్రావిటేషనల్ సెట్లింగ్ ఛాంబర్: 50 మైక్రాన్ మీటర్స్ కంటే ఎక్కువ పరిమాణం ఉన్న పదార్థాలను వేరు చేయడానికి దీనిని ఉపయోగిస్తారు. వీటిని వేరుచేయడానికి గురుత్వాకర్షణ శక్తి ఉపయోగపడుతుంది.
ఉపయోగాలు: తక్కువ పెట్టుబడి, నిర్వహణతో పనిచేస్తుంది. తడి, పొడి ఘనవ్యర్థాలను తొలగించడం ఏకకాలంలో సాధ్యమవుతుంది.
ప్రతికూలతలు: ఎక్కువ ప్రాంతాన్ని ఆక్రమిస్తుంది. చాలా తక్కువ మోతాదులో కాలుష్య కారకాలను తొలగిస్తుంది.

విద్యుత్తు స్థిర అవక్షేపకం: ఇది ప్రధానంగా కాలుష్యకారకాల ఆవేశంపై ఆధారపడి ఉంటుంది. ఈ ఛాంబర్‌లో +ve ఛార్జ్ పదార్థాలను ఉంచుతారు. వీటివల్ల విడుదలయ్యే కాలుష్య కారకాల్లో -ve ఛార్జ్ కాలుష్య కారకాలు ఆకర్షితమై తొలగిపోతాయి. 99% ప్రభావమంతమైనవి. ఇవి 0.1 మిలియన్ నుంచి ఒక మిలియన్ పరిమాణంలో ఉన్న పదార్థాలను తొలగిస్తాయి.
ఉపయోగాలు: అత్యధిక స్థాయిలో కాలుష్యకారకాల సేకరణ సామర్థ్యం. కాలుష్య కారకాలను తడి, పొడి రూపంలో సేకరించవచ్చు. అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద కూడా పనిచేస్తుంది (30°-400°C). కదిలే భాగాలు చాలా తక్కువ, మిషన్ ఆయుష్షు ఎక్కువ.
ప్రతికూలతలు: ఖర్చు ఎక్కువ. విద్యుత్తు అధికంగా కావాలి. ఎక్కువ ప్రాంతాన్ని ఆక్రమిస్తుంది. కొన్నిసార్లు వాయువుల మిశ్రమం వల్ల పేలుళ్లు సంభవించవచ్చు.

స్క్రబ్బర్స్: పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్య కారకాలను తొలగించడానికి కొన్ని రకాలైన పదార్థాలను ఉపయోగించి, వాటి ద్వారా ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా జాగ్రత్తపడతారు. దీనికోసం రంగులు, ప్లాస్టిక్ పదార్థాలను వాడతారు. దీనిలో ప్రధానంగా నీటిని పంపించడం ద్వారా అన్నిరకాలైన కాలుష్య కారకాలను తొలగించడం సాధ్యమవుతుంది.
అనుకూలతలు: ఏకకాలంలో ఘన, ద్రవ, వాయు పదార్థాలను సేకరించవచ్చు. త్వరగా చల్లార్చవచ్చు. హానికర వాయువులను తటస్థీకరించవచ్చు.
ప్రతికూలతలు: ఎక్కువ మోతాదులో నీరు వృథా అవుతుంది. శీతల దేశాల్లో నీరు గడ్డకట్టి స్క్రబ్బర్ పనిచేయకపోవచ్చు. ఎక్కువ విద్యుత్తు కావాలి. నిర్వహణ ఖర్చు పెరుగుతుంది.

ఫ్యాబ్రిక్ ఫిల్టర్స్: ఏదైనా ఒక ఫ్యాబ్రిక్ ద్వారా పర్టిక్యులేట్ మ్యాటర్‌ను తొలగించడానికి కొన్నిరసాయనాలను ఫ్యాబ్రిక్‌పై పూతగా పూస్తారు. దీనిద్వారా వాయు కాలుష్య కారకాలన్నింటినీ, ఒకమైక్రాన్ వరకు పరిమాణం ఉన్న అన్నిపదార్థాలను తొలగించవచ్చు. ప్రభావం 99%. **అనుకూలతలు:** చాలా తక్కువ విద్యుత్తుతో పనిచేస్తుంది. దీని ఫలితం కంటికి స్పష్టంగా కనిపిస్తుంది. **ప్రతికూలతలు:** వేడి వాయువులను చల్లార్చి మాత్రమే పంపించాల్సి ఉంటుంది. ప్రతిసారి ఫ్యాబ్రిక్‌ను తొలగించడానికి ఖర్చవుతుంది. కొన్నిసార్లు ఫ్యాబ్రిక్ కాలిపోవచ్చు. ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తుంది.





రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

సరిదిద్దుకో.. విజయాన్ని చేరుకో!

స్టడీ స్కిల్స్



పనిలో పొరపాట్లు చేయడం, అనుకోకుండా తప్పులు జరగడం సహజం. అది చదువుల విషయానికీ వర్తిస్తుంది. అలాంటి పొరపాట్లను సరిదిద్దుకుని ముందుకెళ్లిన వారే విజయాన్ని చేరుకుంటారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో ఒత్తిడికి గురయ్యే ఆలోచనలు, అనవసర భయాలను పెంచుకోకుండా, సరైన ప్రణాళిక, సానుకూల ఆలోచనలతో సన్నద్ధతపై దృష్టి నిలిపితే చక్కటి ప్రయోజనం ఉంటుంది. కష్టంగా అనిపించే సబ్జెక్టు విషయంలో అంతిమ ఫలితం గురించి ఆందోళన పడకూడదు. నేర్చుకునే విధానంపైనే దృష్టి పెట్టాలి. ఒత్తిడిని తగ్గించి, లక్ష్యసాధనను సులువు చేసే ఆ నైపుణ్యాన్ని ఏ విధంగా పెంపొందించుకోవాలో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అండమాన్ దీవుల్లో తెల్లగద్దల ఆవాసం!

జీవవైవిధ్యంలో సుసంపన్న ప్రాంతమైన భారత్ వన్యప్రాణి సంరక్షణను వ్యవస్థాగతంగా, బాధ్యతగా నిర్వర్తిస్తోంది. చట్టాలు చేసి జంతుజాలం ఆవాసాలకు ఆటంకాలు లేకుండా రక్షణ కల్పిస్తోంది. సురక్షిత ప్రదేశాలను ఏర్పాటు చేస్తోంది. విశిష్ట ప్రాణులను కాపాడటానికి ప్రత్యేక ప్రాజెక్టులనూ నిర్వహిస్తోంది. దేశ ప్రధాన భూభాగం సహా దీవుల్లోనూ కలిపి మొత్తం మీద అయిదు వందలకుపైగా వన్యప్రాణి సంరక్షణా కేంద్రాలు ఉన్నాయి. పులులు, ఏనుగులు, ఖడ్గమృగాలు తదితర పెద్ద జంతువులతో పాటు అరుదైన క్షీరదాలు, పక్షిజాతులు ఎన్నో వాటిలో స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని ముఖ్యమైన బయోస్పియర్ రిజర్వులు, అవి ఏర్పాటైన ప్రాంతాలు, రాష్ట్రాల వారీగా ఉన్న జాతీయ పార్కులు, జంతు సంరక్షణా కేంద్రాలు, ఆవాసం పొందుతున్న ప్రత్యేక జంతుజాలం, చిత్తడి నేలలు, వాటికి ఉన్న ప్రత్యేక గుర్తింపులపై పోటీ పరీక్షార్థులు అవగాహన కలిగి ఉండాలి.

భారత భూగోళ శాస్త్రం

వన్యప్రాణుల సంరక్షణ

1. జాతీయ పార్కులకు సంబంధించి కింది వాక్యాలను సరిచూడండి.
   - ఎ) ఓంకారేశ్వర్ జాతీయ పార్కు మధ్యప్రదేశ్‌లో, ప్రధానంగా నర్మదా నది పరీవాహక ప్రాంతంలో ఉంది.
   - బి) ఇంద్రావతి జాతీయ పార్కు ఛత్తీస్‌గఢ్‌లో ఉంది. దీన్నే 'కుత్రు జాతీయ పార్కు' అనీ పిలుస్తారు.
   - సి) ఒడిశాలోని 'భితర్‌కనిక్ జాతీయ పార్కు' ప్రధానంగా ఉప్పునీటి మొసళ్లకు ఆవాసం.
   - డి) మేఘాలయలో ఉన్న నోక్రేక్ జాతీయ పార్కు ప్రధానంగా ఆసియాటిక్ ఏనుగులకు ఆవాసం.
   1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   2) ఎ, బి, సి, డి సరికావు.
   3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

2. కింది వాటిని జతపరచండి.

వన్యప్రాణి సంరక్షణా కేంద్రాలు	రాష్ట్రం
ఎ) లావా లాంగ్	1) మేఘాలయ
బి) క్యోంగ్నాసియా	2) పశ్చిమ బెంగాల్
సి) సాఙ్గకాళి	3) ఝార్ఖండ్
డి) సిజు	4) సిక్కిం

   1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-4, సి-3, డి-2

3. బయోస్పియర్ రిజర్వులకు సంబంధించి కింది వాక్యాలను సరిచూడండి.



   - ఎ) అచనాక్మర్, అమరకంటక్ అనే బయోస్పియర్ రిజర్వ్ మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో విస్తరించి ఉంది. ఇది ప్రధానంగా నర్మదా, సోన్ నదుల పరీవాహక ప్రాంతంలో విస్తరించి ఉంది.
   - బి) సిక్కింలోని కాంచనజంగ బయోస్పియర్ రిజర్వ్ అధికంగా హిమనీనదాలకు ప్రసిద్ధి. ఇది లెప్చా తెగలకు నివాసం.
   - సి) అస్సాంలోని డిబ్రూ-సైకోవా బ్రహ్మపుత్ర, డిబ్రూ నదుల మధ్య విస్తరించి ఉంది.
   - డి) కేరళలోని అగస్త్యమలై బయోస్పియర్ రిజర్వ్ పశ్చిమ కనుమలకు దక్షిణ భాగంలో విస్తరించి ఉంది. ఇక్కడ ప్రధానంగా కనిక్కరన్స్ అనే తెగ నివసిస్తోంది.
   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.

4. కింది వాటిని జతపరచండి.

జాతీయ పార్కు/ ప్రాంతం	యునెస్కో గుర్తించిన సంవత్సరం
ఎ) కియోలాడియో	1) 2005
బి) పశ్చిమ కనుమలు	2) 1987
సి) సుందర్‌బన్స్	3) 2012
డి) వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్	4) 1985

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-4, సి-3, డి-2

5. కింది వాక్యాలను సరిచూడండి.
   - ఎ) 1971లో 'మ్యాన్ అండ్ ది బయోస్పియర్ (ఎంఏబీ)' కార్యక్రమం ప్రారంభించారు.
   - బి) బయోస్పియర్ రిజర్వ్‌ను ప్రధానంగా మూడు జోన్లుగా విభజిస్తారు.
   - సి) బయోస్పియర్ రిజర్వ్‌లోని కోర్ జోన్ ప్రధానంగా ఉంటూ ఎలాంటి మానవ సంచారం లేకుండా, జీవజాతులకు ఇబ్బంది కలగకుండా ఉంటుంది.
   - డి) 1983 లో మొదటి అంతర్జాతీయ బయోస్పియర్ కాంగ్రెస్‌ను బెలారస్ రాజధాని మిన్స్క్ నగరంలో నిర్వహించారు.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

6. కింది వాటిని జతపరచండి.

బయోస్పియర్ రిజర్వ్	యునెస్కో గుర్తించిన సంవత్సరం
ఎ) గ్రేట్ హిమాలయా	1) 2016
బి) గ్రేట్ నికోబార్	2) 2009
సి) నోక్రేక్	3) 2013
డి) అగస్త్యమలై	4) 2025

   1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-1, డి-2
   3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-4, బి-3, సి-2, డి-1

7. కింది వాక్యాలను సరిచూడండి.



   - ఎ) మన దేశంలో పులుల సంరక్షణా కేంద్రాలు మొత్తం దాదాపుగా 58 ఉండగా, 2022 లెక్కల ప్రకారం దేశంలో పులుల సంఖ్య 3,682.
   - బి) జాతీయ పులుల సంరక్షణ, సాధికార సంస్థ (ఎన్‌టీసీఏ)ను 2005లో ప్రారంభించారు.
   - సి) 58వ పులుల సంరక్షణా కేంద్రం 'మాధవ్'. ఇది మధ్యప్రదేశ్‌లో ఉంది.
   - డి) 2022 పులుల నివేదిక ప్రకారం మన దేశంలో అధికంగా పులులు మధ్యప్రదేశ్‌లో ఉండగా, తర్వాత స్థానంలో కర్ణాటక, ఉత్తరాఖండ్ ఉన్నాయి.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   4) ఎ, బి, సి, డి సరైనవి.

8. కింది వాటిని జతపరచండి.

పులుల సంరక్షణా కేంద్రం	రాష్ట్రం
ఎ) గురుగాసీదాస్ తొమూర్ పింగ్లా	1) తమిళనాడు
బి) వీరంగ దుర్గావతి	2) రాజస్థాన్
సి) దోల్పూర్ కరౌలి	3) ఛత్తీస్‌గఢ్
డి) శ్రీవల్లి పుత్తూర్ మేఘమలై	4) మధ్యప్రదేశ్

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-4, బి-1, సి-2, డి-3
   3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-1, బి-2, సి-3, డి-4

9. కింది వాటిలో ప్రాజెక్టు ఎలిఫెంటాకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
   - ఎ) ప్రాజెక్టు ఎలిఫెంటాను మన దేశంలో 1992 లో ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 33 ఏనుగుల అభయారణ్యాలను గుర్తించారు.




   - బి) అధికంగా ఏనుగుల రిజర్వ్‌లున్న రాష్ట్రం అస్సాం.
   - సి) అతిపెద్ద ఎలిఫెంటా రిజర్వ్ కర్ణాటకలోని మైసూర్ రిజర్వ్.
   - డి) మొదటి ఎలిఫెంటా రిజర్వ్ ఝార్ఖండ్‌లోని సింగ్‌భూమ్.
   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

10. కింది వాటిని జతపరచండి.

వన్యప్రాణి సంరక్షణా కేంద్రం	రాష్ట్రం
ఎ) తొరాంగ్లాంగ్	1) అస్సాం
బి) టాలీవ్యాలీ	2) నాగాలాండ్
సి) సింగ్‌ఫన్	3) మిజోరాం
డి) గరంపాని	4) అరుణాచల్‌ప్రదేశ్

   1) ఎ-4, బి-3, సి-1, డి-2 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-2, సి-3, డి-4

11. కింది వాక్యాలను సరిచూడండి.
   - ఎ) మౌంట్ హ్యారియట్ జాతీయ పార్కు అండమాన్, నికోబార్ దీవుల్లోని దక్షిణ అండమాన్‌లో ఉంది.



   - బి) అండమాన్, నికోబార్ దీవుల్లో మిడిల్‌బటన్ ఐలాండ్ జాతీయ పార్కు ఉంది. ఇది 'వైట్ బెల్లీడ్ ఈగల్' పక్షికి ప్రధాన ఆవాసం.
   - సి) కేరళలోని మతికట్టన్ షోలా జాతీయ పార్కు మచ్చల జింకలు, నక్షత్ర తాబేళ్లకు ప్రసిద్ధి.
   - డి) మహారాష్ట్రలోని నవెగావ్ జాతీయ పార్కులో ఆ రాష్ట్రంలోని దాదాపు 60% పక్షిజాతులు ఉన్నాయి.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, సి, డి సరైనవి.
   3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

12. కింది వాటిని జతపరచండి.

జాతీయ పార్కు	రాష్ట్రం
ఎ) కాలేసార్	1) రాజస్థాన్
బి) పిన్‌వ్యాలీ	2) నాగాలాండ్
సి) ఇటంకి	3) హిమాచల్‌ప్రదేశ్
డి) ముకుంద్రా హిల్స్	4) హరియాణా

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-1, డి-2
   3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2

13. కింది వాక్యాలను సరిచూడండి.
   - ఎ) 2025, అక్టోబరు నాటికి మన దేశంలో 94 రామ్‌సర్ చిత్తడినేలలు ఉన్నాయి.
   - బి) ఈ చిత్తడి నేలల విస్తీర్ణం 13,60,805.63 హెక్టార్లు.
   - సి) నక్తి పక్షి సంరక్షణా కేంద్రం బిహార్‌లో ఉంది.
   - డి) నందలేఖ్ అనేది గోవాలోని ప్రముఖ చిత్తడి ప్రాంతం.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, సి, డి సరైనవి.
   3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

14. కింది వాటిని జతపరచండి.

చిత్తడి ప్రాంతం	రాష్ట్రం
ఎ) ఖేచియోపల్లి సరస్సు	1) ఉత్తరాఖండ్
బి) సక్కరకోట్టై పక్షి సంరక్షణా కేంద్రం	2) బిహార్
సి) గోకుల్ రిజర్వాయర్	3) సిక్కిం
డి) అసన్ కన్జర్వేషన్ రిజర్వ్	4) తమిళనాడు

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-4, సి-3, డి-2
   3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-3, సి-2, డి-4

15. కింది వాక్యాలను సరిచూడండి.
   - ఎ) కర్ణాటకలోని అన్షి జాతీయ పార్కు ప్రధానంగా నల్ల చిరుత పులులకు ఆవాసంగా ఉంది.



   - బి) ఒరాంగ్ జాతీయ పార్కులో అధిక పులుల సాంద్రత ఉంది.
   - సి) త్రిపురలోని బైసన్ జాతీయ పార్కు అడవి దున్నలకు ప్రధాన ఆవాసం.
   - డి) పశ్చిమ బెంగాల్‌లోని 'సింగలీల జాతీయ పార్కు' రెడ్ పాండా, పాంగోలియన్‌లకు ప్రధాన ఆవాసం.
   1) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-2; 2-3; 3-1; 4-1; 5-3; 6-4; 7-4; 8-1; 9-1; 10-3; 11-2; 12-1; 13-2; 14-3; 15-3.

శ్వాస వ్యవస్థ

శ్వాసకోశ వ్యవస్థ ప్రాణుల జీవనానికి ముఖ్యమైన ఆధారం. ఈ వ్యవస్థ వాయు మార్పిడిని నిర్వహిస్తూ, వాతావరణానికి అనుగుణంగా మారుతుంది. జంతు రాజ్యంలో ఈ వ్యవస్థలు సరళమైన వ్యాపనం నుంచి సంక్లిష్టమైన ఊపిరితిత్తుల వరకు వైవిధ్యంగా ఉంటాయి. ప్రకృతి అనుకూలత ఆధారంగా పరిణామక్రమాన్ని చూపిస్తాయి. ఈ వ్యవస్థ అధ్యయనం జీవశాస్త్రంలో ప్రముఖమైంది. జీవ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

ప్రకృతి అనుకూలతే ఆధారం..
పరిణామక్రమంతో వైవిధ్యం!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

శ్వాసకోశ వ్యవస్థ ప్రాముఖ్యత

శ్వాసకోశ వ్యవస్థ ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఆహార పదార్థాలను ఆక్సీకరణ చేసి శక్తిని విడుదల చేస్తుంది. ఇది కణ జీవక్రియకు అవసరం. ఆక్సిజన్ లేకుండా కణాలు ఆహారాన్ని శక్తిగా మార్చలేవు.

❖ ఈ వ్యవస్థ కార్బన్ డైఆక్సైడ్‌ను తొలగించడం ద్వారా శరీరంలోని pH సమతౌల్యతను నిర్వహిస్తుంది. ఇది అసిడోసిస్ లేదా ఇతర సమస్యలను నివారిస్తుంది.

❖ మానవులు (మాట్లాడటం), ఇతర క్షీరదాల్లో ఘ్రాణం, శరీర ఉష్ణోగ్రత నియంత్రణకు సహాయపడుతుంది.

❖ శ్వాసకోశ వ్యవస్థ పర్యావరణ మార్పులకు అనుగుణంగా ప్రాణులను సర్దుబాటు చేస్తుంది.

❖ జలచరాల్లో గిల్స్ ద్వారా నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్‌ను తీసుకోవడం, భూచర జీవుల్లో ఊపిరితిత్తుల ద్వారా గాలి నుంచి ఆక్సిజన్‌ను తీసుకోవడానికి సహాయపడుతుంది.

❖ ఈ వ్యవస్థ లేకపోతే శరీర కణాలకు ఆక్సిజన్ అందక మరణిస్తాయి, వ్యర్థాలు పేరుకుపోతాయి.


శ్వాస వ్యవస్థ అనేది జీవుల్లో ఉండే అత్యంత కీలకమైన వ్యవస్థల్లో ఒకటి. ఇది ఆక్సిజన్‌ను శరీరంలోకి గ్రహించడం, కార్బన్ డైఆక్సైడ్ లాంటి వ్యర్థ వాయువులను బయటకు పంపడం ద్వారా జీవక్రియలను సమర్థవంతంగా నిర్వహిస్తుంది.

✦ జంతు రాజ్యంలో శ్వాసకోశ వ్యవస్థలు ప్రాణుల శరీర నిర్మాణం, వాతావరణం (నీరు లేదా భూమి), జీవన విధానాలపై ఆధారపడి వివిధ రకాలుగా ఉంటాయి.

శ్వాసకోశ వ్యవస్థ - రకాలు

జంతు రాజ్యంలో శ్వాసకోశ వ్యవస్థలు వివిధ వర్గాల్లో (ఫైలాలు) వైవిధ్యంగా ఉంటాయి. చిన్న జీవుల్లో ముఖ్యంగా ప్రోటోజోవా లాంటి సరళ జీవుల్లో సరళమైన వ్యాపనం ద్వారా శ్వాసక్రియ జరుగుతుంది. బహుళ కణ జీవుల్లో ప్రత్యేక అవయవాలు ఉంటాయి.

పొరిఫెరా (స్పాంజులు): ఈ వర్గానికి చెందిన జీవుల్లో శ్వాసకోశ అవయవాలు ఉండవు. శ్వాసక్రియ శరీర ఉపరితలం ద్వారా ప్రత్యక్ష వ్యాపన విధానంలో జరుగుతుంది.



▮ నీటి ప్రవాహం ద్వారా ఆక్సిజన్ శరీరంలోకి ప్రవేశిస్తుంది, వ్యర్థాలు బయటకు వెళ్తాయి. ఇలాంటి శ్వాసక్రియ చిన్న శరీరం కలిగిన ప్రాణులకు సమర్థవంతమైంది. ఎందుకంటే కణాలు బాహ్య వాతావరణానికి దగ్గరగా ఉంటాయి.

ప్లాటిహెల్మింథిస్ (ఫ్లాట్‌వార్మ్స్): ఈ జీవులు బల్లపరుపు శరీరంతో ఉంటాయి.

▮ ఈ ప్రాణుల్లో (ఉదా: ప్లానేరియా) శరీర ఉపరితలం ద్వారా వ్యాపనం జరుగుతుంది. ఈ విధంగా ఆక్సిజన్ అన్ని కణాలకు సమర్థవంతంగా సరఫరా అవుతుంది.

▮ శ్వాసక్రియ జరిగే శరీర దేహం తేమగా ఉండాలి.


అనెలిడా (వానపాము, జలగ): ఈ వర్గానికి చెందిన జీవుల్లో చర్మం ద్వారా శ్వాసక్రియ జరుగుతుంది. ఇది తేమ, కేశనాళాలతో నిండి ఉంటుంది.

▮ భూచర జీవుల్లో చర్మం తడిగా ఉండటం వల్ల వ్యాపనం జరుగుతుంది. నీటిలో ఉండే అనెలిడ్స్‌లో గిల్స్ ఉంటాయి. ఇవి ఫిలమెంట్స్, లామెల్లే సహాయంతో నీటిలోని ఆక్సిజన్‌ను తీసుకుంటాయి.

మొలస్కా (నత్తలు, ఆక్టోపస్): నీటిలో ఉండే మొలస్కా జీవుల్లో గిల్స్ (టినిడియా) ఉంటాయి.

▮ ఇవి లామెల్లేలతో కౌంటర్ కరెంట్ వినిమయం చేస్తాయి.

▮ భూమిపై ఉండే మొలస్కాల్లో పుపుస కుహరం (ఊపిరితిత్తులు) ఉంటుంది. ఇది వాయు వినిమయం కోసం నిర్దేశించిన సంకోచించిన ఉపరితలం.



ఆర్థ్రోపోడా (కీటకాలు, స్పైడర్స్, క్రస్టేషియన్స్): ఈ వర్గానికి చెందిన జీవుల్లో వివిధ రకాల శ్వాస అవయవాలు ఉంటాయి.

▮ కీటకాల్లో ట్రాకియల్ సిస్టం ఉంటుంది. ఇది స్పైరకల్స్ ద్వారా ఆక్సిజన్‌ను నాళాల ద్వారా నేరుగా కణాలకు చేరవేస్తుంది. ప్రసరణ వ్యవస్థ అవసరం లేదు.

▮ సాలీడు లేదా స్పైడర్స్‌లో బుక్ లంగ్స్, క్రస్టేషియన్స్ గిల్స్ ఉంటాయి.

కార్డేటా (చేపలు, పక్షులు, మానవులు): ఈ వర్గంలో వర్టిబ్రేట్స్ ఉంటాయి.

▮ చేపల్లో గిల్స్ లేదా మొప్పలు ఉంటాయి. ఇవి గిల్ ఆర్చెస్, ఫిలమెంట్స్, లామెల్లేలతో కౌంటర్ కరెంట్ ప్రవాహం ద్వారా ఆక్సిజన్‌ను గ్రహిస్తాయి.

▮ ఉభయచరాల్లో చర్మం, గిల్స్ (లార్వా స్టేజ్), లంగ్స్ ఉంటాయి.


▮ సరీసృపాల్లో లంగ్స్ లేదా ఊపిరితిత్తులు ఉంటాయి.

▮ పక్షుల్లో ఎయిర్ సాక్స్, ఏకమార్గ వాయు ప్రవాహం ఉంటాయి. ఇది అధిక ప్రభావవంతంగా ఉంటుంది.

▮ క్షీరదాల్లో డయాఫ్రమ్ సహాయంతో శ్వాసక్రియ జరుగుతుంది. వాయు గోణులు లేదా అల్వియోలై ద్వారా వాయు వినిమయం జరుగుతుంది.

ఇఖైనోడర్మేటా (స్టార్ ఫిష్, సముద్ర అర్చిన్స్): ఈ వర్గానికి చెందిన జీవులు వాటర్ వాస్క్యులర్ సిస్టం లేదా జల ప్రసరణ వ్యవస్థ ద్వారా శ్వాసిస్తాయి.

▮ చర్మంలో ఉండే గిల్స్ అనే భాగాలు లేదా పాపిల్లే ద్వారా వాయు విసరణ జరుగుతుంది. ఈ ప్రక్రియకు నీటి ప్రవాహం సహాయం చేస్తుంది.



నిడేరియా (జెల్లీఫిష్, కోరల్): ఈ జీవులు కూడా వ్యాపనం ద్వారా శ్వాసిస్తాయి.



▮ శరీరం సన్నగా, బల్లపరుపుగా ఉండటం వల్ల ఆక్సిజన్ సులభంగా కణాలకు చేరుతుంది.

▮ జలావాస ప్రాణులు కావడంతో నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్‌ను ఉపయోగించుకుంటాయి.

▮ వాయు వినిమయం శరీర త్వచం ద్వారా జరుగుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. శ్వాసకోశ వ్యవస్థ ప్రధాన పని ఏమిటి?
   1) ఆహారాన్ని జీర్ణం చేయడం
   2) ఆక్సిజన్ తీసుకురావడం, కార్బన్ డైఆక్సైడ్ తొలగించడం
   3) రక్త ప్రసరణ
   4) ఎముకలను బలపర్చడం
2. శ్వాసకోశ వ్యవస్థ శరీరంలో pH సమతౌల్యతను ఎలా నిర్వహిస్తుంది?
   1) ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా
   2) కార్బన్ డైఆక్సైడ్ తొలగించడం ద్వారా
   3) నీటిని నియంత్రించడం ద్వారా
   4) ఆహారాన్ని పంపడం ద్వారా
3. పొరిఫెరా వర్గంలో శ్వాసక్రియ ఎలా జరుగుతుంది?
   1) గిల్స్ ద్వారా 2) ఊపిరితిత్తుల ద్వారా
   3) శరీర ఉపరితలం ద్వారా వ్యాపనం 4) ట్రాకియా ద్వారా
4. నిడేరియా వర్గంలో శ్వాసక్రియకు సహాయపడే లక్షణం ఏమిటి?
   1) పెద్ద శరీరం 2) సన్నటి, ఫ్లాట్ శరీరం
   3) బుక్ లంగ్స్ 4) ఎయిర్ సాక్స్
5. ప్లాటిహెల్మింథిస్ వర్గంలో శ్వాసక్రియ ఎలా జరుగుతుంది?
   1) చర్మం ద్వారా
   2) గిల్స్ ద్వారా
   3) శరీర ఉపరితలం ద్వారా వ్యాపనం
   4) పల్మనరీ కావిటీ ద్వారా
6. అనెలిడా వర్గంలో భూచర జీవుల్లో శ్వాసక్రియకు అవసరమైన లక్షణం?
   1) గిల్స్ 2) తడి చర్మం
   3) ట్రాకియా 4) ఊపిరితిత్తులు

సమాధానాలు
1-2, 2-2- 3-3- 4-2, 5-3, 6-2.



రచయిత
డా.కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

Word of the Day 830

Unsparing

Telugu meaning: నిర్దయగా, దయలేని

English meaning: The word unsparing (అన్‌స్పేరింగ్) is an adjective that describes someone or something very harsh, severe, or showing no mercy or restraint.

Synonyms: Merciless, Ruthless

Antonyms: Compassionate, Gentle

Usage: 1. The critic wrote an unsparing review that exposed every flaw in the movie.

2. She was unsparing in her efforts to achieve perfection in her work.

నో టి ఫి కే ష న్స్

మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులు

మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఎస్‌టీసీ) మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 37. దరఖాస్తు ఫీజు రూ.500. అర్హులైన అభ్యర్థులు 2025 నవంబరు 15 నుంచి 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

న్యూదిల్లీలోని సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 25 నవంబరు 2025.

ఆఫీసర్ ఉద్యోగాలు

దిల్లీలోని నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. దరఖాస్తు ఫీజు రూ.850. అర్హులైన అభ్యర్థులు 2025 నవంబరు 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (నవంబరు 14) చివరి తేదీ

☛ బెల్‌లో 340 ప్రొబేషనరీ ఇంజినీర్ ఉద్యోగాలు. బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు అర్హులు.

☛ సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌లో 141 టెక్నీషియన్ పోస్టులు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ, ఎంఈ, ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఏసీఎస్ఐఆర్‌లో 16 ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ ఉద్యోగాలు. బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

☛ కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్ లిమిటెడ్‌లో జూనియర్ ఆఫీసర్ పోస్టులు. డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ, సీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

బాలల దినోత్సవం

నవంబరు 14

చరిత్రలో ఈనాడు

నేటి బాలలే రేపటి భవిష్యత్తు నిర్మాతలు. బాల్యం ఎంత మధురంగా, ఆనందమయంగా సాగుతుందో అంతే గొప్పగా వారి జీవితం కొనసాగుతుంది. చిన్నతనం నుంచి వారు అలవరుచుకునే మంచి అలవాట్లు, ఇతరుల పట్ల గౌరవం, ప్రేమ, ఆదరణ లాంటి లక్షణాలు విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి నాందిగా నిలుస్తాయి. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు పిల్లలంటే అమితమైన ఇష్టం. దేశ ప్రగతికి వారి విద్య, శ్రేయస్సు మూల స్తంభాలుగా నిలుస్తాయని ఆయన విశ్వసించారు. చిన్నారులు ఈయన్ను 'చాచా నెహ్రూ' అని పిలిచేవారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఏటా నవంబరు 14న మన దేశంలో 'బాలల దినోత్సవం'గా (Children's Day) నిర్వహిస్తారు. బాల్యం గొప్పతనాన్ని, పిల్లల హక్కులను చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

ఇతర దేశాల్లో బాలల దినోత్సవం

ఐక్యరాజ్య సమితి నవంబరు 20 ని అంతర్జాతీయ బాలల దినోత్సవంగా ప్రకటించింది. దీన్ని నిర్వహించుకుంటూనే భారత్ సహా వివిధ దేశాలు వేర్వేరు రోజుల్లో తమ బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. వాటిని పరిశీలిస్తే..


మెక్సికో: మెక్సికోలో ఏప్రిల్ 30న బాలల దినోత్సవం జరుగుతుంది.

ఆస్ట్రేలియా: ఏటా అక్టోబరు 4వ బుధవారం బాలల దినోత్సవంగా జరుపుతారు.

పెరుగ్వే: ఆగస్టు 16న పెరుగ్వేలో బాలల దినోత్సవం చేపడతారు.

థాయ్‌లాండ్: బాలల దినోత్సవాన్ని ఏటా జనవరి రెండో శనివారం రోజు నిర్వహిస్తారు.

చారిత్రక నేపథ్యం




జవహర్‌లాల్ నెహ్రూ 1889, నవంబరు 14న జన్మించారు. ఆయన ఎప్పుడూ పిల్లల విద్య, హక్కుల గురించి ఆలోచించేవారు. ఈయన పుట్టినరోజు నాడు ఏటా బాలల దినోత్సవంగా జరుపుకోవాలని 1957లో భారత ప్రభుత్వం తీర్మానించింది.

మన దేశంలో బాలల దినోత్సవాన్ని మొదటిసారి ఎప్పుడు నిర్వహించారు? ఈ అంశంపై గతంలో అడిగిన ప్రశ్నలు తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

రవాణా సౌకర్యాలు - రైలు రవాణా

భారతదేశ రవాణా రంగంలో రైల్వే వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉంది. బ్రిటిష్ వారు తమ అవసరాల కోసం దేశంలో మొదటిసారి రైల్వే మార్గం వేశారు. తొలిసారిగా ఆవిరి ఇంజిన్‌తో నడిచిన రైలు నేడు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది. రవాణా, ఆర్థిక రంగాల్లో బాసటగా నిలుస్తోంది. భారతీయ రైల్వే సుదూర ప్రాంతాలను కలుపుతూ, ప్రయాణికులను, సరకులను గమ్యస్థానాలకు చేర్చడంలో తోడ్పడుతోంది. దేశంలోని రైల్వే వ్యవస్థ, అనుబంధ సంస్థలు, జోన్లు, వంతెనలు, మార్గాలు, మెట్రో వ్యవస్థ తదితరాలపై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలి.



ప్రపంచ రైల్వే పితామహుడిగా స్టీఫెన్‌సన్‌ను అభివర్ణిస్తారు. ఈయన 1814లో రైలు ఇంజిన్‌ను కనిపెట్టారు.

✦ ప్రపంచంలో మొదటి రైలుమార్గాన్ని 1825లో ఇంగ్లండ్‌లోని స్టాక్టన్, డార్లింగ్‌టన్ పట్టణాల మధ్య సుమారు 9 మైళ్ల దూరం వేశారు. మొదటి రైలు వేగం 5 మైళ్లు/గంట.

భారతదేశ రైల్వే వ్యవస్థ

భారతదేశ రైల్వే పితామహుడిగా లార్డ్ డల్హౌసీని పేర్కొంటారు.

✦ భారత్‌లో మొదటి రైలు 1853 ఏప్రిల్ 16న గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వే ఆధ్వర్యంలో బొంబాయి నుంచి థానే వరకు 34 కిలోమీటర్లు ప్రయాణించింది. నాటి గవర్నర్ జనరల్‌గా లార్డ్ డల్హౌసీ ఉన్నారు.

✦ దేశంలో రెండో రైలు హౌరా, హుగ్లీల మధ్య నడిచింది.

రైలు గేజుల వర్గీకరణ, ముఖ్యమైన రైల్వే వంతెనలు, మెట్రోరైల్ లేదా మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్, భారతదేశంలోని రైల్వేజోన్లు మొదలైన అంశాలు సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

National Cancer Awareness Day observed on..

Current Affairs

1. Which organization empowered around 5 lakh rural households to earn over Rs.1 lakh annually in FY 2024-25?
   A) NABARD B) PRADAN
   C) SEWA D) NITI Aayog
2. According to Minister Manohar Lal, India ranks at which position globally in metro connectivity as of 2025?
   A) First B) Fourth
   C) Second D) Third
3. Who has been honoured with Fox Nation's 'Patriot of the Year' Award 2025 for her humanitarian and social contributions?
   A) Jill Biden B) Kamala Harris
   C) Melania Trump D) Nikki Haley
4. Who became the first Indian para-archer to be selected for an able-bodied international competition in November 2025?
   A) Sheetal Devi B) Harvinder Singh
   C) Deepa Malik D) Ekta Bhyan
5. In which Indian state were six new butterfly species recently discovered, highlighting the ecological link between Tibet's Yarlung Tsangpo and the Brahmaputra Valley?
   A) Sikkim B) Arunachal Pradesh
   C) Assam D) Meghalaya
6. When is National Cancer Awareness Day observed in India each year?
   A) February 4 B) November 7
   C) October 1 D) December 12

SSC Exams Special

General Awareness

7. Which state government launched the 'Sardh Shatabdi Mahotsav' on November 6, 2025, to commemorate 150 years of the national song 'Vande Mataram'?
   A) Gujarat B) Maharashtra
   C) West Bengal D) Uttar Pradesh

History

8. What was the original name of the famous musician Tansen, who served in the courts of King Ram Chand and later Akbar?
   A) Haridas Pandey B) Narayan Dev Sharma
   C) Vishnu Das Mishra
   D) Rama Tanu Pandey
9. Who among the following chaired the committee that drafted a constitution for India in 1928?
   A) Motilal Nehru B) Bal Gangadhar Tilak
   C) Jawaharlal Nehru D) Mahatma Gandhi
10. The Battle of Imphal (1944), a key event of World War II, was fought between which two forces?
    A) British and German Forces
    B) British Indian Army and Japanese Forces
    C) United States and Japanese Forces
    D) Allied Forces and Italian Army
11. Who introduced the Ryotwari System of land revenue in the Madras and Bombay presidencies during British rule?
    A) Lord Cornwallis and John Shore
    B) Charles Metcalfe and Henry Lawrence
    C) Thomas Munro and Alexander Read
    D) Lord Wellesley and Richard Wellesley

Geography

12. The Maithon Dam, which houses South-East Asia's first underground power station, is built on which river?
    A) Damodar River B) Barakar River
    C) Subarnarekha River D) Mahanadi River
13. The Purple Revolution, launched under the Aroma Mission in 2016, is associated with the cultivation of which plant?
    A) Lavender B) Tulsi
    C) Rosemary D) Chamomile
14. Which Indian state recorded a decline in the child sex ratio from 913 girls per 1,000 boys in 2001 to 894 girls per 1,000 boys in 2011, as per the Census data?
    A) Gujarat B) Maharashtra
    C) Haryana D) Punjab
15. Who introduced the concepts of food chain, food web, and ecological niche in his 1927 classic text "Animal Ecology"?
    A) Ernst Haeckel B) Raymond Lindeman
    C) Alfred Wallace D) Charles Elton

General Science

16. The release of which of the following into ponds and wells helps in controlling mosquitoes?
    A) Dogfish B) Snail
    C) Crab D) Gambusia fish
17. Who was the first person to describe the disease Kwashiorkor while working in Africa?
    A) Florence Nightingale
    B) Cicely Williams
    C) Marie Curie
    D) Virginia Apgar
18. What is the process called in which an egg develops into an embryo without fertilization by a sperm?
    A) Regeneration B) Binary Fission
    C) Parthenogenesis D) Budding
19. Which laboratory technique is used to separate a single chemical compound from a mixture dissolved in a fluid?
    A) Electrophoresis
    B) Column Chromatography
    C) Distillation
    D) Filtration

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

న్యాక్ గుర్తింపు లేకున్నా ఉన్నట్లు ప్రచారం

- అల్-ఫలా యూనివర్సిటీకి షోకాజ్ నోటీసు

ఈటీవీ భారత్: ఫరీదాబాద్‌లోని అల్-ఫలా యూనివర్సిటీకి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) షోకాజ్ నోటీసులిచ్చింది. గుర్తింపు గురించి వెబ్‌సైట్‌లో ఆ విద్యా సంస్థ తప్పుడు సమాచారం ప్రదర్శించినందుకుగాను ఈ నోటీసులిచ్చినట్లు న్యాక్ వెల్లడించింది. 'అల్-ఫలా వైద్య కళాశాల న్యాక్ గుర్తింపు పొందకుండానే వెబ్‌సైట్‌లో గుర్తింపు ఉందని బహిరంగంగా ప్రదర్శించింది. కనీసం అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఇది పూర్తిగా తప్పు. ప్రజలను, ముఖ్యంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, వాటాదారులను తప్పుదారి పట్టించడమే అవుతుంది' అని నోటీసుల్లో పేర్కొంది. ✦ మరోవైపు అల్-ఫలా వర్సిటీ రికార్డులను ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. నగదు లావాదేవీలపై దర్యాప్తు జరపాలని ఈడీకి సూచించింది. ✦ ఉగ్ర కుట్ర నేపథ్యంలో వివాదాస్పదంగా మారిన అల్-ఫలా విశ్వవిద్యాలయ సభ్యత్వాన్ని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) సస్పెండ్ చేసింది.

కశ్మీరీ డాక్టర్‌కు రెడ్ కార్నర్ నోటీసులు?

ఇంటర్నెట్ డెస్క్: దిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనతో ముడిపడి ఉన్న ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే టెర్రర్ మాడ్యూల్‌తో సంబంధమున్న, జమ్మూ కశ్మీర్‌లోని కాజీగుండ్‌కు చెందిన వైద్యుడు ముజఫర్‌పై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మంది అరెస్టయ్యారు. వారిలో అదీల్ ఒకరు. అతడి సోదరుడే ముజఫర్.

ఎర్రకోట వద్ద పేలుళ్లు కచ్చితంగా ఉగ్ర దాడే

- దిల్లీ ఘటనపై అమెరికా

న్యూయార్క్: దిల్లీలో ఎర్రకోటవద్ద పేలుడు కచ్చితంగా ఉగ్ర దాడేనని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. దర్యాప్తు నిర్వహించడంలో భారత అధికారులు ప్రదర్శించిన నైపుణ్యాన్ని ఆయన ప్రశంసించారు. బుధవారం కెనడాలో జరిగిన జీ7 సమావేశాల సందర్భంగా భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్, మార్కో రూబియోతో భేటీ అయ్యారు. పేలుడుపై దర్యాప్తులో సాయం చేసేందుకు తాము ముందుకొచ్చామని, కానీ ఆ అవసరం భారత్‌కు లేదని ఈ సందర్భంగా రూబియో వ్యాఖ్యానించారు. అలాగే ఇరువురు మంత్రులు అనేక ద్వైపాక్షిక, ప్రపంచ సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది.

పేలుళ్లను కొనియాడిన మరో 9 మంది అరెస్టు

గువాహటి: దిల్లీ పేలుడుపై అభ్యంతరకర, వివాదాస్పద సోషల్ మీడియా పోస్టులు పెట్టిన మరో 9 మందిని అసోం పోలీసులు అరెస్టు చేశారు. దీంతో రాష్ట్రంలో ఇలా అరెస్టయిన వారి సంఖ్య 17కు పెరిగింది. అసోంలో సోషల్ మీడియా పోస్టులు పెట్టిన 35 మందిపై దర్యాప్తు చేయించి, బంగ్లాదేశ్ లేదా ఏదైనా ఇతర దేశంతో సంబంధం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హిమంత బిశ్వశర్మ హెచ్చరించారు. కశ్మీర్ లోయలోని 13 ప్రాంతాల్లో పోలీసులు సోదాలు నిర్వహించి, ఉగ్రకుట్రలపై ప్రశ్నించే నిమిత్తం 15 మందిని అదుపులోకి తీసుకున్నారు.

కశ్మీర్‌లో 10 మంది అరెస్టు

- ఫరీదాబాద్ ఉగ్ర కుట్ర కేసులో అదుపులోకి..
- అందులో ముగ్గురు ప్రభుత్వోద్యోగులు

శ్రీనగర్: ఫరీదాబాద్ ఉగ్ర కుట్ర కేసుకు సంబంధించి జమ్మూ కశ్మీర్‌లో 10 మందిని దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకున్నాయి. అందులో ముగ్గురు ప్రభుత్వోద్యోగులున్నారు. అనంత్ నాగ్, పుల్వామా, కుల్గాం నుంచి వీరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు గురువారం వెల్లడించారు.

5 రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

దిల్లీ: అల్‌ఖైదా గుజరాత్ కుట్ర కేసుకు సంబంధించి 5 రాష్ట్రాల్లోని 10 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు జరిపింది. బంగ్లాదేశీ అక్రమ వలసదారులు ఈ కేసులో భాగస్వాములుగా ఉన్నారనే ఆరోపణలున్నాయి. పశ్చిమ బెంగాల్, త్రిపుర, మేఘాలయ, హరియాణా, గుజరాత్‌లలో బుధవారం ఈ సోదాలు జరిగాయని అధికారులు గురువారం వెల్లడించారు. పలు డిజిటల్ పరికరాలను దర్యాప్తు బృందాలు స్వాధీనం చేసుకున్నాయని, వాటిని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపాయని వివరించారు. 2023లో నకిలీ పత్రాలతో అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించిన నలుగురు బంగ్లాదేశీయులు పట్టుబడిన సందర్భంగా ఈ కేసు నమోదైంది.

ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం

- తుర్కియే స్పందన

ఇంటర్నెట్ డెస్క్: తుర్కియే కేంద్రంగా భారత్‌లో దాడులకు కుట్ర జరిగిందని భారత మీడియాలో వస్తున్న వార్తలపై ఆ దేశం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. ఆ దేశ డైరెక్టరేట్ ఆఫ్ కమ్యూనికేషన్స్ సెంటర్ ఫర్ కౌంటరింగ్ డిస్ఇన్ఫర్మేషన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్‌లో జరిగిన ఉగ్రవాద కార్యకలాపాలకు తుర్కియేతో సంబంధం ఉందని, తమ దేశం ఉగ్రవాద గ్రూపులకు ఆర్థిక, లాజిస్టిక్, ఇతర సాయం అందిస్తోందని వస్తున్న వార్తలు పూర్తిగా తప్పుడువని, దుష్ప్రచారమని స్పష్టం చేసింది. ఈ వార్తలు భారత్, తుర్కియే ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీసే ఉద్దేశంతో పన్నిన కుట్రని పేర్కొంది.

బలోచిస్థాన్‌లో ఇంటర్నెట్ నిలిపివేత

కరాచీ: పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్‌లో రాజధాని క్వెట్టా మినహా మిగిలిన ప్రావిన్సు అంతా ఇంటర్నెట్ సేవలను ఈ నెల 16 వరకూ నిలిపేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. క్వెట్టా కంటోన్మెంట్ ప్రాంతాల్లో ఈ నెల 16 వరకూ పాఠశాలలను మూసివేశారు. లోరలై డివిజన్‌లో జాతీయ రహదారి వెంబడి రవాణా సేవలను ఈ నెల 14 వరకూ నిలిపేశారు. ప్రస్తుతం బలోచిస్థాన్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

తాలిబన్ల ఇలాకాలో అమెరికా 'గమ్మత్తు' ఆపరేషన్ విఫలం!

ఇంటర్నెట్ డెస్క్: అఫ్గానిస్థాన్‌లోని బాగ్రాం వైమానిక స్థావరాన్ని మళ్లీ స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలకు తాలిబన్ ప్రభుత్వం బెదరడం లేదు. ఇదే కాదు.. వారిని తుడిచిపెట్టాలని చూసిన ఏ దేశానికైనా కొన్నాళ్ల తర్వాత వెనక్కి తగ్గాల్సిన పరిస్థితే వచ్చింది. రష్యా, అమెరికాకు తాలిబన్ల నుంచి అలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. వీరితో నేరుగా తలపడటం కంటే ఆర్థికంగా దెబ్బకొట్టడమే సరైందని భావించిన అమెరికా గతంలో 10ఏళ్లపాటు కోవర్టు ఆపరేషన్ నిర్వహించింది. వారి బిలియన్ డాలర్ల హెరాయిన్ వ్యాపారాన్ని ధ్వంసం చేసేందుకు సంకరం చేసిన గసగసాల విత్తనాలను రహస్యంగా రాత్రిపూట వారి పొలాల్లో వెదజల్లింది. అందుకోసం సరకు రవాణా విమానం సి-130ని ఉపయోగించిందని వాషింగ్టన్ పోస్టు కథనం వెల్లడించింది.

అఫ్గానిస్థాన్‌లో ఓపియంను పండిస్తున్న హెల్మండ్, నంగర్హర్ ప్రాంతాల్లో 2004 నుంచి 2015 వరకు అగ్రరాజ్యం ఈ కోవర్టు ఆపరేషన్ చేపట్టింది. హెరాయిన్ వ్యాపారంలో నష్టపోయేలా ఉత్పత్తి, సామర్థ్యాన్ని తగ్గిస్తూ పాపీసీడ్స్‌ను సంకరం చేసింది. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీకి (సీఐఏ) చెందిన క్రైమ్ అండ్ నార్కొటిక్స్ సెంటర్ ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహించిందని 14 మంది మాజీ అధికారులు ధ్రువీకరించినట్లు ఆ కథనం పేర్కొంది. 'క్షేత్ర స్థాయిలో సవాల్ విసురుతున్న సమస్యకు యుద్ధ రంగంలోకి దిగకుండానే పరిష్కరించే ప్రయత్నం ఇది' అని ఓ మాజీ అధికారి తెలిపారు.

గతంలో ప్రపంచంలోని 90 శాతం హెరాయిన్‌ను అఫ్గానిస్థాన్ ఉత్పత్తి చేసింది. దాంతో తాలిబన్లకు నిధులు వచ్చి పడ్డాయి. అందుకే హెరాయిన్‌లో కీలకమైన రసాయనం ఆల్కలైడ్ కంటెంట్‌ను తగ్గించేందుకు ఈ సంకరం చేసిన విత్తనాలను అమెరికా ఉపయోగించింది. రానురాను ఆ మొక్కలు స్థానిక జాతితో కలిసిపోతాయని అంచనా వేసింది. ఈ రహస్య కార్యక్రమం గురించి పెంటగాన్‌లోని కొందరు సీనియర్ అధికారులు, చివరకు అఫ్గాన్‌లోని హమీద్ కర్జాయ్ ప్రభుత్వానికీ తెలియకపోవడం గమనార్హం. ఇక కార్యక్రమం తాత్కాలిక విజయమే సాధించిందని, స్వల్ప ప్రభావాన్ని మాత్రమే చూపించిందని దాని గురించి తెలిసిన కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇది గొప్ప ఆలోచనే కానీ.. ఆచరణలో అనుకున్న ఫలితాన్ని పొందలేకపోయిందని పేర్కొన్నారు.


వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాదుల దాడి అమెరికా చరిత్రలో అత్యంత విషాద ఘటనగా మిగిలిన సంగతి తెలిసిందే. సెప్టెంబరు 11, 2001లో (9/11) అల్‌ఖైదా



జరిపిన మారణహోమంలో సుమారు 3వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు తాలిబన్ల అధీనంలో ఉన్న ప్రాంతాల్లోనే అల్‌ఖైదా తన కార్యకలాపాలు కొనసాగించింది. దీంతో ఆ ఉగ్ర సంస్థను మట్టుపెట్టేందుకు రంగంలోకి దిగిన అమెరికా.. 20ఏళ్ల పాటు అఫ్గానిస్థాన్‌లో తన సైన్యాన్ని ఉంచింది. తాలిబన్లతో జరిగిన ఒప్పందంతో 2021లో ఆ దేశం నుంచి తన బలగాలను ఉపసంహరించుకుంది. దాంతో రెండు దశాబ్దాల పాటు కొనసాగిన పౌర పాలన పోయి మళ్లీ తాలిబన్లు అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ దాడులకు సూత్రధారి, అల్‌ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్‌ను ఉత్తర పాకిస్థాన్‌లో ఉన్నట్లు గుర్తించిన అమెరికా.. 2011లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి అంతం చేసింది.

ఏబీవీపీ జాతీయాధ్యక్షుడిగా రఘురాజ్ కిశోర్

ఈనాడు, దిల్లీ: ఏబీవీపీ జాతీయాధ్యక్షుడిగా రఘురాజ్ కిశోర్ తివారీ, ప్రధాన కార్యదర్శిగా వీరేంద్ర సింగ్ సోలంకి ఎన్నికయ్యారు. వీరిద్దరూ మధ్యప్రదేశ్‌కు చెందినవారే. రఘురాజ్ కిశోర్ జబల్‌పుర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయంలో అగ్రానమీలో పీహెచ్‌డీ చేసి ప్రస్తుతం అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. ఆయన 1987 నుంచి ఏబీవీపీలో పని చేస్తున్నారు. ప్రధాన కార్యదర్శిగా వరుసగా రెండోసారి ఎన్నికైన వీరేంద్ర సింగ్ సోలంకి ఇండోర్‌లోని శ్రీఅరబిందో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ చదివారు. ప్రస్తుతం అదే నగరంలో వైద్యాధికారిగా సేవలందిస్తున్నారు. ఆయన 2014 నుంచి ఏబీవీపీలో పని చేస్తున్నారు.



లా కమిషన్ సభ్యుడి రాజీనామా

దిల్లీ: లా కమిషన్ పూర్తి స్థాయి సభ్యుడిగా ఉన్న న్యాయవాది హితేశ్ జైన్ రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారని, అది అక్టోబరు 29వ తేదీ నుంచే అమల్లోకి వచ్చిందని కేంద్ర న్యాయశాఖ గురువారం వెల్లడించింది. హితేశ్ జైన్‌ను సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ దినేశ్ మహేశ్వరీ నేతృత్వంలోని కమిటీ ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీన ఎంపిక చేసింది.




180 కి.మీ. వేగంతో వెళ్తున్నా గ్లాసులో నీళ్లు తొణకలేదు

- వందేభారత్ స్లీపర్ రైళ్ల వేగంపై పరీక్ష

ఇంటర్నెట్ డెస్క్: వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. వేగంతో వెళ్లినా గాజు గ్లాసులలో నీరు ఏమాత్రం తొణకలేదు. పశ్చిమ మధ్య రైల్వే పరిధిలోని కోట డివిజన్లో ఇటీవల దీని ప్రయోగాత్మక పరుగును పరీక్షించారు. రైలు స్థిరత్వం, బ్రేకింగ్, ప్రయాణ అనుభవాన్ని దీనిలో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జలపరీక్ష (వాటర్ టెస్ట్)ను కూడా నిర్వహించారు. రైలు గరిష్ఠ వేగంతో వెళుతున్నప్పుడు మూడు గాజు గ్లాసులతో నీటిని బల్లపై ఉంచినా అందులో నీరు ఏమాత్రం తొణకకపోవడం గమనార్హం. రెండు గ్లాసులపై మరోదానిని ఉంచినప్పుడు కూడా అవి కిందపడలేదు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. వందేభారత్ స్లీపర్ రైలులో ప్రయాణం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు నెటిజన్లు పేర్కొంటున్నారు.

పీపీపీ విధానంలో 100 సైనిక పాఠశాలలు

- అమిత్ షా వెల్లడి



బోరియావి: దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో (పీపీపీ) 100 సైనిక పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. ఇందులో భాగంగానే గుజరాత్‌లోని మెహసాణాలో శ్రీ మోతీభాయ్ ఆర్ చౌదరీ సాగర్ సైనిక్ స్కూల్‌ను (ఎంఆర్‌సీఎస్ఎస్ఎస్) ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.50 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించినట్లు వివరించారు. గురువారం ఈ స్కూల్ ప్రారంభం సందర్భంగా ఆయన వీడియో మాధ్యమం ద్వారా మాట్లాడారు. రైతులంతా సేంద్రియ వ్యవసాయంవైపు మళ్లాలని సాగర్ ఆర్గానిక్ ప్లాంట్‌ను ప్రారంభిస్తూ ఆయన సూచించారు.

17,000 మంది ప్రవాసుల డ్రైవింగ్ లైసెన్సులు రద్దు?

- కాలిఫోర్నియా ప్రభుత్వ యోచన

ఇంటర్నెట్ డెస్క్: విదేశీయులకు వీసాలు జారీ చేసే ప్రక్రియను కఠినతరం చేస్తున్న అమెరికా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రవాస డ్రైవర్లకు ఇచ్చిన 17,000 డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయాలని కాలిఫోర్నియా ప్రభుత్వం యోచిస్తోంది. సెమీ ట్రక్కులు, బస్సులను నడిపేందుకు వారు అక్రమంగా లైసెన్సులు పొందారని, కాలిఫోర్నియా అక్రమ వలసలకు అడ్డాగా మారుతోందని ట్రంప్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ వార్తలు రావడం గమనార్హం. అయితే కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ మాత్రం అది కారణం కాదని చెప్పారు. ఈ లైసెన్సుల కాల వ్యవధి ముగిసిందని అధికారులు గుర్తించారని తెలిపారు. మళ్లీ వాటిని పునఃసమీక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఫ్లోరిడాలో ఒక డ్రైవరు నిర్లక్ష్యంగా యూటర్న్ తీసుకోవడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో జాతీయ స్థాయిలో డ్రైవర్ల లైసెన్సులపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. టెక్సాస్, అలబామాలోనూ ఈ ఏడాది ప్రారంభంలో ఇదే తరహా ప్రమాదాలు జరిగాయి. ఇవన్నీ లైసెన్సుల విషయంలో పలు ప్రశ్నలు లేవనెత్తాయి. గత నెల కాలిఫోర్నియాలో ఒక ప్రవాస డ్రైవర్ మద్యం మత్తులో ప్రమాదానికి కారమణమయ్యాడు. అదీ తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే లైసెన్సుల రద్దుకు గవిన్ ప్రభుత్వం యోచిస్తోంది.



హురియత్ నేతతో శ్రీశ్రీ రవిశంకర్ భేటీ

శ్రీనగర్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ గురువారం హురియత్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ మీర్వాయిజ్ ఉమర్ ఫరూక్‌తో భేటీ అయ్యారు. ఫరూక్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో శాంతి, కరుణ, మతసామరస్యం ప్రాముఖ్యంపై ఇరువురు నేతలూ చర్చించారు. ఏడు సంవత్సరాల తర్వాత తిరిగి రవిశంకర్ కశ్మీర్‌లో పర్యటించడంపై మీర్వాయిజ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సమస్యలను, విభేదాలను పరిష్కరించడం, శాంతి మార్గాన నడవడం వంటి అంశాలకు తమ సంస్థ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఉమర్ వెల్లడించారు. అన్యాయం, నిరాకరణలే శాంతికి ముప్పు కలిగించే తీవ్రవాదం వైపు మనిషిని నడిపిస్తాయని ఇరువురు నేతలు అంగీకరించారు.



కండువాల సన్నాహం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో పట్నాలోని ఆర్జేడీ కార్యాలయంలో గురువారం పార్టీ కండువాలను సిద్ధం చేస్తున్న కార్యకర్త


ఆ నివేదికలో పైలట్‌ను నిందించలేదు

- ఎయిరిండియా ప్రమాదంపై సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

దిల్లీ: అహ్మదాబాద్‌లో కూలిపోయిన ఎయిరిండియా విమాన ప్రమాదంపై విడుదల చేసిన ప్రాథమిక నివేదికలో పైలట్‌ను నిందించలేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ఘటనపై 'విమాన ప్రమాదాల దర్యాప్తు మండలి' (ఏఏఐబీ)కి చెందిన బృందాన్ని అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదంలో మృతి చెందిన వారిలో విమానం కెప్టెన్ సుమీత్ సభర్వాల్, కో-పైలట్ క్లైవ్ కుందర్‌లు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై న్యాయస్థానం పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ సుమీత్ తండ్రి పుష్కరాజ్, ఒక న్యాయవిద్యార్థితో పాటు భారత పైలట్ల సమాఖ్య సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుమీత్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌కు స్పందన తెలియజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించగా ఆయన గురువారం న్యాయస్థానం దృష్టికి ఆయా విషయాలు తీసుకొచ్చారు. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

సారండా అభయారణ్యం చుట్టూ కిలోమీటరు దూరంలో గనులపై నిషేధం

సారండా అటవీ ప్రాంతంలోని వన్యజీవుల అభయారణ్యం చుట్టూ కిలోమీటరు దూరంలో గనుల తవ్వకాలపై సుప్రీంకోర్టు నిషేధం విధించింది. ఈ ప్రాంతంలో గనులకు సంబంధించి ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని ఝార్ఖండ్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ అడవిలో 31,468.25 హెక్టార్ల భూమిని సారండా వన్యజీవుల అభయారణ్య ప్రాంతంగా ప్రకటించాలని, మూడు నెలల్లోగా నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం గురువారం ఆదేశించింది. 1968లో వెలువడిన నోటిఫికేషన్ ప్రకారం 126 కంపార్ట్‌మెంట్ల పరిధిలోని భూమిని అభయారణ్యంగా ప్రకటించాలని తెలిపింది. మరో ఆరు కంపార్ట్‌మెంట్లకు (కెపి-2, 10, 11, 12, 13, 14) మినహాయింపునిచ్చింది.



వీధికుక్కలపై సుప్రీం తీర్పు ఆచరణయోగ్యం కాదు: మేనకా గాంధీ

దిల్లీ: జనసమ్మర్ద ప్రాంతాల నుంచి వీధికుక్కలు అన్నింటినీ షెల్టర్లకు తరలించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు ఆచరణయోగ్యం కాదని కేంద్ర మాజీ మంత్రి, జంతువుల హక్కుల ఉద్యమకారిణి మేనకా గాంధీ పేర్కొన్నారు. కోతులు, కుక్కలు, పిల్లుల వంటి జంతువుల వల్ల తలెత్తే సమస్యలు వాటిని షెల్టర్లకు తరలించడంతో పరిష్కారం కావని ఆమె తెలిపారు. దిల్లీలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మేనకా గాంధీ పాల్గొన్నారు. గతవారం వెలువడిన సుప్రీంకోర్టు తీర్పుపై స్పందిస్తూ... జంతువుల పట్ల జాలి, దయ చూపాలన్నారు. స్థానిక సంస్థల మధ్య సమన్వయం కొరవడటంపై ప్రశ్నించారు. ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలని పేర్కొన్నారు.

భారత ప్రభుత్వ డేటానే సందేహిస్తున్నారా?

- కొవిడ్ టీకాల దుష్ప్రభావంపై కేసులో పిటిషనర్లను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: కొవిడ్ టీకాల దుష్ప్రభావాల వల్ల దేశంలో మృతి చెందిన వారి సంఖ్యను భారత ప్రభుత్వం తక్కువగా చూపుతోందన్న పిటిషనర్లపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. ఈ అంశంలో బ్రిటన్ ప్రభుత్వం కచ్చితమైన సమాచారాన్ని వెలువరించిందని విశ్వసిస్తూ స్వదేశ ప్రభుత్వాన్ని పిటిషనర్లు అనుమానిస్తున్నట్లుగా ఉందని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం పేర్కొంది. కొవిడ్ టీకాలు తీసుకున్న వారిలో సంభవించిన మరణాలపై స్వతంత్ర దర్యాప్తు చేయించాలని పిటిషనర్లు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపించారు. భారతదేశ కొవిడ్ ప్రమాణాలను ప్రపంచ దేశాలన్నీ అనుసరిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఔషధం ఎంతోకొంత దుష్ప్రభావం చూపుతుందని, ఈ అంశంలో వ్యక్తుల మధ్య వ్యత్యాసం ఉంటుందని పేర్కొన్నారు. కొవిడ్ టీకాలను ప్రపంచ దేశాలన్నింటికీ భారత్ సరఫరా చేసిందని వివరించారు. ఇరుపక్షాలు తమ వాదనలను లిఖితపూర్వకంగా అందజేయాలని ధర్మాసనం ఆదేశించింది. తీర్పును రిజర్వు చేసింది.

'అఖిలపక్షం' నిర్వహించాలి

- పార్లమెంటు సమావేశాలను ముందుకు జరపాలి
- దిల్లీ పేలుడుపై కాంగ్రెస్ డిమాండ్

దిల్లీ: ఎర్రకోటవద్ద పేలుడుపై చర్చించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన వెంటనే అఖిలపక్షం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండు చేసింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలనూ ముందుకు జరపాలని కోరింది. పలు ఉగ్రదాడులు జరిగిన నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహిస్తారా అని కాంగ్రెస్ పార్టీ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేడా గురువారం ప్రశ్నించారు. యూపీఏ హయాంలో ముంబయిలో ఉగ్ర దాడి తర్వాత అప్పటి హోం మంత్రి శివరాజ్ పాటిల్ రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దాడి జరిగిన 48 గంటల తర్వాత అది ఉగ్ర దాడేనని క్యాబినెట్ ప్రకటించడం ఆశ్చర్యం కలిగించిందని వ్యాఖ్యానించారు.

ఛీ.. ఛీ.. ఉగ్రవాదానికి మద్దతా!

- చిదంబరంపై కేంద్ర మంత్రి అసహనం

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరంపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ అసహనం వ్యక్తం చేశారు. స్వదేశీ ఉగ్రవాదులని ఆయన వ్యాఖ్యానించడాన్ని తప్పుబట్టారు. వారికి అనుకూలంగా మాట్లాడటాన్ని ఎద్దేవా చేశారు. 'ఆయన ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తున్నారు. ఛీ.. ఛీ' అని గిరిరాజ్ వ్యాఖ్యానించారు.

జమ్మూ కశ్మీర్‌లోని పౌరులందరూ ఉగ్రవాదులు కారు: ఒమర్ అబ్దుల్లా

ఈటీవీ భారత్: కశ్మీర్‌లో నివసించే ప్రతి పౌరుడూ ఉగ్రవాది కాదని, కొంత మంది మాత్రమే శాంతికి విఘాతం కలిగిస్తున్నారని జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. దిల్లీ పేలుడు ఘటనను ఖండించిన ఆయన.. కశ్మీర్ ప్రాంతంలో కొంతమంది శాంతిని, సోదర భావాన్ని నాశనం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దిల్లీ పేలుడుకు భద్రతా వైఫల్యమే కారణమన్న ఆయన.. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

లాభం కోసం కొనుగోలు చేస్తే వినియోగదారుడని అనలేం: సుప్రీంకోర్టు

దిల్లీ: లాభార్జనకు వస్తువులను లేదా సేవలను కొనుగోలు చేసే వ్యక్తిని వినియోగదారుడిగా పరిగణించబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాంటి కొనుగోలుదారులు.. వినియోగదారుల రక్షణ చట్టం-1986 కిందకు రారని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం ఓ కేసులో పేర్కొంది. లాభంతో సంబంధం ఉండే లావాదేవీ.. వాణిజ్య ప్రయోజనాల కిందకు వస్తుందని, అప్పుడు చట్టంలోని సెక్షన్ 2(1)(డి) వర్తించదని తెలిపింది. ✦ దిల్లీలో వాయు కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో న్యాయవాదులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ కీలక సూచన చేశారు. న్యాయస్థానానికి నేరుగా వచ్చే బదులు వర్చువల్‌గానే వాదనలు వినిపించాలని పేర్కొన్నారు.

క్షయ వ్యాధి తగ్గుదలపై మోదీ హర్షం

దిల్లీ: దేశంలో 2015 నుంచి క్షయవ్యాధి(టీబీ) తగ్గుముఖం పడుతుండటంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. మనదేశంలో టీబీ కేసుల తగ్గుదల రేటు ప్రపంచ సగటుతో పోలిస్తే రెండింతలు తక్కువగా ఉంది. ఈ వ్యాధి నివారణకు దేశంలో చికిత్స సదుపాయాలను భారీగా విస్తరించడంతో ఫలితాలు మెరుగయ్యాయి. 2015లో లక్ష జనాభాకు 237 కొత్త టీబీ కేసులు నమోదయ్యేవి. 2014 నాటికి అది 187కు తగ్గింది. ఈ తగ్గుదల రేటు 21 శాతం. ప్రపంచ సగటు 12 శాతంగా ఉంది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రపంచ టీబీ నివేదిక-2025 పేర్కొంది.

బీడీఎల్‌కు రూ.2,095 కోట్ల కాంట్రాక్టు

దిల్లీ: భారత సైన్యానికి ట్యాంక్ విధ్వంసక క్షిపణుల సరఫరాకు ఉద్దేశించిన భారీ కాంట్రాక్టును ప్రభుత్వరంగ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) గురువారం దక్కించుకుంది. ఐఎన్‌ఈఏఆర్ యాంటీ-ట్యాంక్ మిస్సైళ్లుగా వ్యవహరించే ఈ క్షిపణుల సేకరణకు రూ.2,095.70 కోట్ల విలువైన ఈ ఒప్పందంపై రక్షణమంత్రిత్వశాఖ, బీడీఎల్ సంతకాలు చేశాయి. సైనిక పోరాట సామర్థ్యాలను ఉన్నతీకరించేందుకు ఈ క్షిపణులు దోహదపడతాయి.

ఒక్లహోమాలో అమ్మోనియా గ్యాస్ లీక్

వెదర్‌ఫోర్డ్: అమెరికాలోని ఒక్లహోమా నగరంలో ఓ హోటల్ వద్ద పార్కింగ్ చేసిన ట్యాంకర్ ట్రక్కు నుంచి అమ్మోనియా గ్యాస్ లీకైంది. దీంతో ఆ ప్రాంతం నుంచి వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గ్యాస్ బారిన పడి శ్వాసపర ఇబ్బందులకు గురైన సుమారు 36 మందిని స్థానిక ఆసుపత్రిలో చేర్చారు. ఈ మేరకు గురువారం అధికారులు వెల్లడించారు. బుధవారం రాత్రి 10 గంటలకు గ్యాస్ లీక్ ఘటన చోటుచేసుకుందన్నారు.

బంగ్లాలో మళ్లీ అల్లర్లు

ఢాకా: జులై తిరుగుబాటు సమయంలో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినందుకుగానూ మాజీ ప్రధాని షేక్ హసీనాపై నమోదైన కేసులపై బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఈ నెల 17న తీర్పు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో దేశంలో పలు చోట్ల దాడులు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వం భారీగా భద్రతా బలగాలను రంగంలోకి దింపింది. రాజధాని నగరం ఢాకాలో భద్రతను పెంచింది.

పాక్ లాబీయింగ్ సంస్థ సేవలు పొందిన ఆరెస్సెస్: కాంగ్రెస్

- తీవ్రంగా ఖండించిన సంఘ్

దిల్లీ: అమెరికాలో తన ప్రయోజనాలను కాపాడుకొనేందుకు 'పాకిస్థాన్ అధికారిక లాబీయింగ్ సంస్థ'లలో ఒకటైన అమెరికా న్యాయ సేవల సంస్థ స్క్వైర్ పాటన్ బోగ్స్(ఎస్పీబీ) సేవలను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)పొందిందని కాంగ్రెస్ గురువారం ఆరోపించింది. ఈ రకంగా జాతీయ ప్రయోజనాలను ఉల్లంఘించడం సంఘ్‌కు పరిపాటేనని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరోపణలను ఆరెస్సెస్ తీవ్రంగా ఖండించింది. సంఘ్ భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.. అమెరికాలోని ఏ లాబీయింగ్ సంస్థతోనూ సంబంధం కలిగిలేదు అని ఆరెస్సెస్ జాతీయ మీడియా ప్రచార విభాగాధిపతి సునీల్ అంబేకర్ స్పష్టం చేశారు.

జైలు నుంచి విడుదలైన సురేంద్ర కోలీ

నొయిడా: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిఠారీ హత్యల కేసులో ప్రధాన నిందితుడు సురేంద్ర కోలీ జైలు నుంచి విడదలయ్యారు. ఈ కేసులో కోలీని నిర్దోషిగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే అతడు నొయిడాలోని లుక్సర్ కారాగారం నుంచి విడుదలయ్యారని గురువారం సంబంధిత అధికారులు వెల్లడించారు. నొయిడాలోని నిఠారీ ప్రాంతంలో మోనిందర్ సింగ్ పంధేర్ నివాసం వెనక ఉన్న మురుగు కాలువలో 2006 డిసెంబరు 29న ఎనిమిది మంది చిన్నారుల అస్థిపంజరాలు బయటపడ్డాయి. ఆ సమయంలో పంధేర్ ఇంట్లో కోలీ పనిమనిషిగా ఉన్నాడు.

ఆత్మాహుతి దాడికి పాల్పడింది అఫ్గాన్‌వాసే: పాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన కారు పేలుడు ఘటనలో ఆత్మాహుతికి పాల్పడింది అఫ్గాన్ దేశస్థుడేనని హోంమంత్రి మోసిన్ నఖ్వీ వెల్లడించారు. జిల్లా కోర్టు సమీపంలో మంగళవారం జరిగిన పేలుడు ఘటనలో ప్రధాన నిందితుడితో పాటు అతడితో సంబంధం ఉన్న వారిని గుర్తించినట్లు తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు సమీపంలో జరిగిన పేలుడు కనీసం 12 మంది మృతిచెందారు.

ఇథియోపియా బోయింగ్ విమాన ప్రమాదం కేసు.. బాధిత కుటుంబానికి రూ.248 కోట్ల పరిహారం!

వాషింగ్టన్: ఆరేళ్ల క్రితం జరిగిన ఇథియోపియా బోయింగ్ 737 మ్యాక్స్ జెట్ లైనర్ విమాన ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఓ మహిళ కుటుంబానికి ఫెడరల్ కోర్టు భారీ పరిహారాన్ని ప్రకటించింది. సుమారు రూ.248 కోట్ల (28 మిలియన్ డాలర్లు) చెల్లించాలని ఆదేశించింది. ఈ ప్రమాదంలో ఐక్యరాజ్యసమితి కన్సల్టెంట్ శిఖా గార్గ్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో న్యాయం జరిపించాలంటూ ఆమె కుటుంబం కోర్టును ఆశ్రయించింది. మరోవైపు బోయింగ్ సంస్థ సైతం గార్గ్ కుటుంబానికి అదనంగా సుమారు రూ.30 కోట్ల (3.4 మిలియన్ డాలర్లు) పరిహారం అందించనుంది.

ఓర్వకల్ నోడ్‌లో సిగాచీ ఇండస్ట్రీస్‌కు 94.70 ఎకరాల కేటాయింపు

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలంలోని ఓర్వకల్ నోడ్‌లో ఉన్న గుట్టపాడు క్లస్టర్‌లో సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు 94.70 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంస్థ ఇక్కడ రూ.1,090 కోట్లతో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుండగా 1,250 మందికి ఉపాధి లభించనుంది.

బిర్లాను లిమిటెడ్‌కు 48.47 ఎకరాలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం బొడ్డువారిపాలెంలో ఫైబర్ సిమెంట్ బోర్డ్ షీట్ ప్లాంటు ఏర్పాటు కోసం బిర్లాను లిమిటెడ్‌కు 48.47 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఆ సంస్థ రూ.239.50 కోట్లు వెచ్చించనుండగా 588 మందికి ఉద్యోగాలు రానున్నాయి.

శ్రీవేద ఇన్నోవేషన్ లిమిటెడ్‌కు 27 ఎకరాలు

కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గ పరిధిలోని బాపులపాడు మండలం వేలూరులో ప్రైవేట్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు వీలుగా శ్రీవేద ఇన్నోవేషన్ లిమిటెడ్‌కు 27 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది.

బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్‌కు అదనంగా 18.70 ఎకరాలు

అనకాపల్లి జిల్లా రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లోని బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ లిమిటెడ్‌కు గతంలో రెండు దశల్లో కేటాయించిన 106.27 ఎకరాలకు అదనంగా 18.70 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది.

రూ.898 కోట్లతో నాన్ లెదర్ ఫుట్‌వేర్ యూనిట్

ఈనాడు, అమరావతి: కుప్పం నియోజకవర్గం గుడుపల్లెలో రూ.898.88 కోట్ల పెట్టుబడితో హ్వాసంగ్ కంపెనీ గ్రీన్‌ఫీల్డ్ నాన్‌లెదర్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం 100 ఎకరాలు కేటాయించింది. రెంట్ ఫ్రీ లీజు పద్ధతిలో 50 ఏళ్లపాటు ఇచ్చి, సెజ్ హోదా కల్పించనుంది. ఈ కంపెనీ ఏర్పాటుతో 17,645 మందికి ఉపాధి లభించనుంది.

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్‌కు 38.10 ఎకరాలు

ఈనాడు, అమరావతి: నంద్యాల జిల్లా నందిపాడు-తిమ్మనాయుడుపేట గ్రామాల పరిధిలో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 38.10 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టమ్ ద్వారా 600/1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం 30 ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన ఏటా ఎకరాకు రూ.31 వేలు చెల్లించేలా, ప్రతి రెండేళ్లకు 5% పెంపుతో అనుమతిచ్చింది.

పార్టీల కార్యాలయాలకు 66 ఏళ్లపాటు లీజుపై 30 సెంట్ల స్థలం

ఈనాడు, అమరావతి: జాతీయ పార్టీ లేదా గుర్తింపు పొందిన పార్టీలకు రాష్ట్రంలోని నియోజకవర్గాల కేంద్రాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు 30 సెంట్ల స్థలాన్ని 66 ఏళ్లపాటు లీజుకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2017లో జారీచేసిన 575 జీవోను సవరించారు. 575 జీఓలో స్థలాన్ని 33 ఏళ్లపాటు లీజుకు ఇస్తూ, తర్వాత 99 ఏళ్ల వరకు పొడిగించుకునేందుకు అవకాశమిచ్చారు. దీనికి సవరణ చేస్తూ గురువారం జీఓ 411ను జారీ చేసింది. ఈ జీఓ ప్రకారం మొదట 66 ఏళ్లకు లీజుకిస్తారు. తర్వాత దాన్ని ఆ పార్టీ సేవలను బట్టి 99 ఏళ్ల వరకు పొడిగించేందుకు అవకాశం కల్పించనున్నారు.

ఆరోపణలు నిరూపించండి లేదా క్షమాపణ కోరండి

వైకాపా ఎంపీ మిథున్ రెడ్డి

ఈనాడు, అమరావతి: మంగళంపేటలోని భూములపై మీరు చేసిన ఆరోపణలను నిరూపించండి లేదా క్షమాపణ చెప్పాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి వైకాపా ఎంపీ పీవీ మిథున్ రెడ్డి గురువారం 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 'హెలికాప్టర్ నుంచి మీరు షూట్ చేసిన భూమిని 2000 సంవత్సరంలో చట్టబద్ధంగా కొన్నాం. భూమి వివరాలు పబ్లిక్‌గానే ఉన్నాయి. అప్పుడు మేం అధికారంలో లేము' అని పేర్కొన్నారు.

వైకాపా హయాంలో జగన్ ఆదేశాలతో అరాచకం

వేమూరు ఎమ్మెల్యే ఆనంద్‌బాబు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జగన్ ఆదేశాలతోనే అరాచకం జరిగిందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడిన వ్యవహారంలో హైకమాండ్ ఆదేశాల మేరకే నిర్ణయం తీసుకున్నట్లు తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్ కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు.

రాష్ట్రాభివృద్ధి ముఖచిత్రం మార్చే వ్యూహం

- విశాఖ గ్రోత్ హబ్‌తో అభివృద్ధి ప్రణాళిక
- 9 జిల్లాల్లోనూ ప్రాజెక్టులు
- వందల ఎకరాల్లో పరిశ్రమలు

ఈనాడు, విశాఖపట్నం: నగరాల అభివృద్ధితో ప్రజల తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా నీతి ఆయోగ్ దేశంలో నాలుగు గ్రోత్ హబ్‌లను ప్రతిపాదించింది. ముంబయి, సూరత్, వారణాసి, విశాఖలను పైలట్ ప్రాజెక్టులుగా అభివృద్ధి చేయనుంది. విశాఖ గ్రోత్‌హబ్‌గా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, రాజమహేంద్రవరం జిల్లాలను కలుపుకొని విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)గా అభివృద్ధి చేయనున్నారు. దీని ముసాయిదా గురువారం సీఎం విడుదల చేశారు. అందులోని వివరాల ప్రకారం.. ఆయా ప్రాంతాలను ఇలా అభివృద్ధి చేయనున్నారు.

రూ.71 లక్షల కోట్లకు పెంచేలా..

2024 ఆర్థిక సంవత్సరం అంచనా లెక్కల ప్రకారం ఏపీ జీఎస్‌డీపీ రూ.15.27 లక్షల కోట్లయితే.. వీఈఆర్ వాటా అందులో రూ.4.61 లక్షల కోట్లు మాత్రమే. దీన్ని 2032 నాటికి రూ.11.10 లక్షల కోట్ల నుంచి రూ.11.98 లక్షల కోట్లకు, 2047 నాటికి రూ.66.57 లక్షల కోట్ల నుంచి రూ.71.01 లక్షల కోట్లకు పెంచేలా లక్ష్యం విధించారు. వీఈఆర్ తలసరి ఆదాయం 2024 లెక్కల ప్రకారం రూ.2,81,395గా ఉంటే 2047 నాటికి రూ.39,05,807గా పెంచడం, 2024లో 70లక్షల మందికి ఉపాధి కల్పిస్తే.. 2047 నాటికి 1.60 కోట్ల మందికి కల్పించేలా లక్ష్యాలు రూపొందించారు. వాటిని ఆయా రంగాలవారీగా సాధించుకునేలా ప్రణాళికలు తయారుచేశారు.

ఈ అభివృద్ధి ప్రాజెక్టులతో..

- ◆ కాకినాడ, విజయనగరంలో బహుళ ఉత్పత్తుల పార్కులు.
- ◆ నక్కపల్లి, విజయనగరం, శ్రీకాకుళంలో 200-400 ఎకరాల్లో తయారీరంగ యూనిట్లు
- ◆ అనకాపల్లిలో 500 ఎకరాల్లో అల్యూమినియం పార్క్. 500 ఎకరాల్లో మెడ్‌టెక్ జోన్.
- ◆ పూడిమడకలో హైడ్రోజన్ హబ్. 2వేల ఎకరాల్లో అనకాపల్లిలో బహుళ ఉత్పత్తుల పార్క్.
- ◆ శ్రీకాకుళంలో కెమికల్ హబ్, మూలపేటలో నౌకల మరమ్మతుల కేంద్రం. టైటానియం డైఆక్సైడ్ తయారీ యూనిట్. 3వేల ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ పార్క్.
- ◆ నక్కపల్లిలో 2వేల ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్క్. అనకాపల్లిలో 500 ఎకరాల్లో రక్షణ ఉత్పత్తుల తయారీ పార్క్.
- ◆ కాకినాడ-శ్రీకాకుళం గ్యాస్ పైపులైన్ పూర్తి.

రంగాల వారీగా..

◆ వ్యవసాయ, ఆహారశుద్ధి పరిశ్రమ, ఆక్వా రంగాలకు సంబంధించి.. ఈ తొమ్మిది జిల్లాల్లో 18 మేజర్ అగ్రికల్చర్ లొకేషన్లను గుర్తించారు. అందులో ఏడుచోట్ల భారీగా కొబ్బరి, జీడి, కాఫీ మొక్కల పెంపకం, ఒకచోట ప్రపంచశ్రేణి నర్సరీ, రెండు చోట్ల ఫుడ్ పార్కులు, ఒక ఆక్వా పార్క్, ఐదు చోట్ల ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేయనున్నారు.

◆ సేవా రంగంలో.. భోగాపురం వద్ద 300 ఎకరాల్లో ఏరో సిటీ. 800 ఎకరాల్లో సమీకృత అంతర్జాతీయ కేర్ హబ్. విశాఖలోని ఐఐఎంకు సమీపంలో 150 ఎకరాల్లో విద్య, నైపుణ్య, ఇన్నోవేషన్ హబ్. ఆనందపురంలో 300 ఎకరాల్లో డేటా సెంటర్ హబ్. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్. కాపులుప్పాడలోని 500 ఎకరాల్లో ఐటీ, జీసీసీ డేటా సెంటర్ హబ్. మధురవాడలో వెయ్యి ఎకరాల్లో ఐటీ పార్క్.

◆ పర్యాటకం కింద.. బౌద్ధవలయం, అరకు టూరిజం హబ్, కాకినాడ-యానాం-దిండి రివర్ క్రూజ్, ఏటికొప్పాక కల్చరల్ విలేజ్, వైజాగ్ బే సిటీ, క్రూజ్ టెర్మినల్ లాంటివి ప్రతిపాదించారు.

ఆవిష్కరణలకు జీవం పోస్తాం

- మార్కెటింగ్ చేయలేకపోతే ఆవిష్కర్తల కృషికి బహుమతి
- ఇన్నోవేషన్ సిటీ ఏర్పాటుకు ఏపీతో ఒప్పందం
- ఎఫ్‌వైఆర్ఎస్‌టీ జన్ సీఈఓ ఫిలిప్, చీఫ్ ఇంపాక్ట్ ఆఫీసర్ క్లిమెన్స్



ఫిలిప్ అస్మస్, క్లిమెన్స్

విశాఖపట్నం నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి: యువతలోని ఆలోచనలు, ఆవిష్కరణలకు జీవం పోస్తామని ఎఫ్‌వైఆర్ఎస్‌టీ జన్ యూకే సీఈఓ ఫిలిప్ అస్మస్, చీఫ్ ఇంపాక్ట్ ఆఫీసర్ క్లిమెన్స్ అన్నారు. సాంకేతికతను వినియోగించి తక్కువ వ్యయంతో వాటిని కంపెనీలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఇన్నోవేషన్ సిటీ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ప్రకటించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరైన వీరు 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

వ్యయాన్ని తగ్గించి..

మేం లండన్ కేంద్రంగా 30కి పైగా దేశాల్లో పనిచేస్తున్నాం. స్టార్టప్స్‌లో 3-4% మాత్రమే పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నాయి. ఇందులోనూ 90% వరకు విఫలమవుతున్నాయి. ప్రతిభావంతులు, గొప్ప ఆలోచనలున్నవారికి అవకాశాలు ఉండట్లేదు. వ్యాపారదశలోకి రాని ఆవిష్కరణలను తీసుకొని, వాటికి జీవం పోస్తాం. ప్రారంభదశలో వ్యాపారంలో సాధారణంగా 99% రిస్క్ ఉంటుంది. కానీ, మేం వ్యయాన్ని తగ్గించి, రిస్క్‌ను తగ్గిస్తాం. కంపెనీ ఏర్పాటు నుంచి ఆర్డర్ల వరకు అన్నీ ఆటోమేషన్‌తో నిర్వహిస్తాం. భవిష్యత్తులో ఒకేసారి లక్ష కంపెనీలు ఏర్పాటు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

ఏపీతో పని చేసేందుకు సిద్ధం

ఏపీతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు తోడ్పడాలని కోరుకుంటున్నాం.

ఆటోమేషన్, ఏఐతో వేగంగా పనిచేస్తాం: ఆవిష్కరణను తీసుకున్న తర్వాత మేమే ఆ ఇన్నోవేషన్‌పై కొత్త కంపెనీని నిర్మిస్తాం. కంపెనీ పేరు పెట్టడం నుంచి లోగో రూపొందించే వరకు అన్నీ మేమే చూస్తాం. ఆటోమేషన్, కృత్రిమ మేధను ఉపయోగించి పనిని ఎక్కువ వేగంగా చేస్తాం. ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలతో భాగస్వామి అవుతున్నాం. ఇప్పటి వరకు 200 వర్సిటీలతో పని చేస్తున్నాం. ఎక్కువ శాతం ఆవిష్కరణలు మార్కెట్‌లోకి రావడం లేదు. అందుకే మేం న్యుయాన్స్ సిస్టమ్ రూపొందించి, ఆ మేధోసంపత్తిని అంచనా వేస్తాం. ఇటీవల మేం యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ కాంపాక్ట్‌తో కలిశాం. దీంతో ప్రపంచవ్యాప్తంగా 900 వర్సిటీలతో పని చేసే అవకాశం లభించింది.

ఇన్నోవేషన్ మార్కెటింగ్ కాకపోతే..

ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న లక్షల ఉద్యోగాల కల్పన, వేల కంపెనీలను స్థాపించడంలో మేం తోడ్పాటు అందిస్తాం. ఫ్యాక్టరీ సిటీలను నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నాం. ఇక్కడే ఆవిష్కరణలను ఉత్పత్తి దశకు తీసుకొస్తాం. తద్వారా భారీగా ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. ఆవిష్కరణలు మార్కెటింగ్ కాకపోతే ఆ మేధోసంపత్తిని తిరిగి ఆ ఆవిష్కర్తకే అప్పగిస్తాం. వారి కృషికి మా ఆదాయం నుంచే భారీ బహుమతి అందజేస్తాం.

త్వరలో 'ఎన్టీఆర్ బేబీ కిట్లు'

- జోన్ల వారీగా సరఫరాకు టెండర్లు ఖరారు



ఎన్టీఆర్ బేబీ కిట్ నమూనా

ఈనాడు, అమరావతి: పుట్టిన బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులకు 'ఎన్టీఆర్ బేబీ కిట్లు' ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఇందుకు సంబంధించిన కసరత్తు కొలిక్కి తెచ్చింది. ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు- మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ద్వారా రెండేళ్ల పాటు 'రేట్ కాంట్రాక్ట్' పద్ధతిలో కిట్లు సరఫరా చేసేలా ఈ ఏడాది జూన్ 25న టెండర్లు పిలిచారు. కిట్‌లో అదనంగా ఫోల్డబుల్ బెడ్, బ్యాగు చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో ఆ టెండరు రద్దుచేసి.. సెప్టెంబరు 30న రెండోసారి టెండరు పిలిచారు. 3 జోన్లలో వేర్వేరు సంస్థలకు కిట్ల సరఫరా బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. టెండరులో 4 బిడ్లు వస్తే.. జోన్ల వారీగా 13 వస్తువుల కిట్ల సరఫరాకు మూడు బిడ్లు ఖరారు చేశారు. తెలంగాణలో ఒక్కో కిట్‌కు రూ.2,054.60, తమిళనాడులో రూ. 2,428.98 చొప్పున ఇస్తుంటే.. ఏపీలో ఎల్1గా ఎంపికైన కేంద్రీయ భాండార్ రూ.1,989.27కు సరఫరా చేసేందుకు అంగీకరించింది. దీంతో ఎల్2గా అనితా టెక్స్‌కాట్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్3గా శంకర్ ఎంటర్‌ప్రైజెస్ అదే ధరకు అందించేలా టెండరు ఖరారు చేశారు.

13 రకాల వస్తువులతో: రాష్ట్రంలో ఏటా సుమారు 3.50 లక్షల మందికి కిట్లు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కిట్‌లో బ్యాగు, దోమతెరతో కూడిన పరుపు, ఫోల్డబుల్ బెడ్, వాటర్‌ప్రూఫ్ షీట్, దుస్తులు (2), టవల్స్(2), నాప్కిన్లు (6), సబ్బులు (2), సబ్బుపెట్టె, పౌడర్, ఆయిల్, షాంపూ, బొమ్మ ఉంటాయి. బాలింత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలో కిట్ ఇస్తారు.

◆ తెదేపా ప్రభుత్వం 2016లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం కొన్నాళ్లు అమలుచేసి, ఆపేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక 'ఎన్టీఆర్ బేబీ కిట్' పేరుతో పథకాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించింది.

అనకాపల్లిలో బీడీఎల్‌కు 160 ఎకరాల కేటాయింపు

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా టి.సిర్లపల్లిలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ఏర్పాటుకు ఎకరా రూ.40 లక్షలతో ప్రభుత్వం 160 ఎకరాలు కేటాయించింది. ఈ మేరకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు వ్యయం రూ.489 కోట్లు కాగా 500 మందికి ఉపాధి లభించనుంది. 2029 ఏప్రిల్ నాటికి ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉంటుంది. ఇక్కడ రక్షణ పరికరాల తయారీ, నిర్వహణ, పరీక్ష, అండర్ వాటర్ వెపన్ సిస్టమ్స్, నౌకాదళానికి సంబంధించిన పరికరాలపై దృష్టి పెట్టనున్నారు.

మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై కేసు నమోదు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై గురువారం కేసు నమోదైంది. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా వైకాపా ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దానికి పోలీసుల నుంచి అనుమతి తీసుకోలేదు. ర్యాలీలో పాల్గొన్న మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైకాపా జిల్లా సమన్వయకర్త, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మరో 200 మంది నాయకులు, కార్యకర్తలపై నిబంధనల ఉల్లంఘన కేసు నమోదుచేసినట్లు ఎస్సై లక్ష్మి తెలిపారు.

నాకు తెలీదు.. జ్ఞాపకం లేదు..!

పోలీసుల విచారణలో మాజీ మంత్రి అప్పలరాజు సమాధానాలు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పలాసలో గత నెల 13న కల్తీ మద్యం పేరిట వైకాపా చేపట్టిన ధర్నాలో అనుమతి లేకుండా 200 మందికి పైగా ర్యాలీ నిర్వహించడంపై నమోదైన కేసులో మాజీమంత్రి సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. గురువారం మధ్యాహ్నం 3:30 నుంచి రాత్రి 9:45 గంటల వరకు విచారణ సాగింది. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రశ్నలన్నింటికీ తెలీదు.. జ్ఞాపకం లేదంటూ దాటవేస్తూ వచ్చారు. అనుమతులు లేకుండా ర్యాలీ ఎందుకు చేశారని ప్రశ్నించగా 'చట్టప్రకారం చేశాం' అంటూ బదులిచ్చినట్లు తెలిసింది. అనుమతి ఎందుకు తీసుకోలేదని అధికారులు అడగ్గా తెలీదని సమాధానమిచ్చినట్లు సమాచారం. ఆధారాలు ఉన్నాయని, వాటిని చూసి సమాధానాలు తెలపాలని కోరగా 'నాకేం తెలీదు.. జ్ఞాపకం లేదు' అంటూ దాటవేస్తూ వచ్చారని తెలిసింది. విచారణ అనంతరం అప్పలరాజు విలేకర్లతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక తనపై పది కేసులు నమోదు చేశారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతుండటంతో ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఆక్షేపించారు. కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తొక్కిసలాట జరిగి 9మంది మృతి చెందిన ఘటనపై మాట్లాడినందుకు కేసు నమోదు చేశారన్నారు.

నేటి బాలలే మన భవిష్యత్తు నిర్మాతలు: గవర్నర్



ఈనాడు, అమరావతి: రేపటి పౌరులుగా మాతృభూమిని కాపాడటం సహా మనందరి ఉజ్వల భవిష్యత్తును నిర్మించడం బాలల బాధ్యత అని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. 'నేటి బాలలే రేపటి భారత నిర్మాతలు, వారిని పెంచే విధానమే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది' అని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటలు అక్షర సత్యాలని గవర్నర్ గుర్తుచేశారు. శుక్రవారం నెహ్రూ జయంతి సందర్భంగా పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలను గురువారం ఓ సందేశంలో తెలిపారు. నెహ్రూకు పిల్లలపై ఉన్న అమితమైన ప్రేమ, ఆప్యాయతల వల్లనే ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని గవర్నర్ వివరించారు.

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాల నిబంధనల సవరణ

ఈనాడు, అమరావతి: భారత నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాల నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. 2025-26 నుంచి నీట్ నర్సింగ్ ప్రవేశపెట్టేవరకు ఏపీ నర్సింగ్ సెట్- 2025 ర్యాంకు/ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు జరుగుతాయని పేర్కొంది. జనరల్ విద్యార్థులకు 50 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 40, జనరల్- పీడబ్ల్యూడీలకు 45, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ క్యాటగిరీలకు చెందిన పీడబ్ల్యూడీలకు 40 పర్సంటైల్‌ను అర్హతగా నిర్ణయించింది. కన్వీనర్ కోటా 60 శాతానికి రిజర్వేషన్ వర్తిస్తుందని, మేనేజ్‌మెంట్ కోటా 40 శాతం వెబ్ కౌన్సిలింగ్ ద్వారా మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తామని పేర్కొంది. ఈ రెండు కోటాల ప్రవేశాలను డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని పేర్కొంది. మైనారిటీ కళాశాలల్లో సీట్లు ముందుగా ఆ వర్గం అభ్యర్థులతో నింపాలని, వారు లేకపోతే మెరిట్ ఆధారంగా ఇతరులకు కేటాయించాలని పేర్కొంది. ఎంపిక బాధ్యతను వీసీ నేతృత్వంలోని కమిటీకి అప్పగించింది.

ఎంబీబీఎస్/బీడీఎస్ 'స్ట్రే' విడత కౌన్సెలింగ్ గడువు పెంపు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రైవేటు, మైనారిటీ వైద్య కళాశాలల్లో మూడో విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన ఎంబీబీఎస్/బీడీఎస్ యాజమాన్య కోటా సీట్లకు 'స్ట్రే' (మిగులు) విడత కౌన్సెలింగ్ గడువును విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పొడిగించింది. గడువు గురువారం సాయంత్రం 5 గంటలకు పూర్తికావాల్సి ఉండగా పెంచింది. 14న మధ్యాహ్నం 2 గంటల్లోగా ఈ సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

3 లక్షల ఇళ్లలో ఒక్కటీ మీరు మంజూరు చేయలేదు

సీఎం చంద్రబాబుపై 'ఎక్స్'లో జగన్ విమర్శలు

ఈనాడు, అమరావతి: 'మీరు ప్రారంభించామని చెప్పుకొంటున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటికీ పట్టా మీరివ్వలేదు. ఒక్క ఇల్లూ మంజూరు చేయలేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ సీఎం జగన్ గురువారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. "వైకాపా హయాంలోనే ఆ 3,00,092 ఇళ్లలో 1,40,010 ఇళ్లు పూర్తయ్యేదశలో ఉన్నవే. మరో 87,380 ఇళ్లకు శ్లాబ్ కట్టించినవే. ఇంకో 66,845 ఇళ్లు నిర్మాణంలో ఉన్నవే. వాస్తవాలు ఇలా ఉన్నా వైకాపా ఏమీ చేయలేదని, అన్నీ మీరే చేసినట్టుగా ప్రచారం చేసుకోవడం హేయం. పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు 18 నెలల్లో ఒక్క గజం కూడా సేకరించలేదు. ఒక్కరికి ఒక సెంటు ఇవ్వకుండా, ఒక ఇల్లు మంజూరు చేయకుండానే.. వైకాపా ఇచ్చిన ఇళ్లను చూపించి మేమే కట్టేశాం అని చెబుతున్నారు. ఇంకొకరి క్రెడిట్‌ను కొట్టేయడంలో మీకు మీరే సాటి" అని జగన్ ఆరోపించారు.

మేజర్ మినరల్స్‌కు జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు

ఈనాడు, అమరావతి: మేజర్ మినరల్స్ బ్లాక్స్ వేలానికి ముందు, వాటికి అనుమతులు పొందేందుకు వీలుగా పలు శాఖలతో రాష్ట్ర, జిల్లాస్థాయిలో కమిటీలు ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వు జారీచేసింది. రాష్ట్రస్థాయి కమిటీకి ఛైర్మన్‌గా గనులశాఖ సంచాలకులు, సభ్య కార్యదర్శిగా సంయుక్త సంచాలకులు, రెవెన్యూ, అటవీశాఖల నుంచి సంయుక్త సంచాలకుల అధికారులను సభ్యులుగా నియమించింది. జిల్లా కమిటీకి సంయుక్త కలెక్టర్ ఛైర్మన్‌గా, జిల్లా గనులశాఖ అధికారి సభ్య కార్యదర్శిగా, రెవెన్యూ, అటవీశాఖల నుంచి ఒక్కో అధికారి, స్థానిక తహసీల్దార్లు సభ్యులుగా ఉంటారు. అవసరమైతే ఆయా భూములను బట్టి దేవాదాయ శాఖల అధికారులు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. జిల్లాస్థాయి కమిటీలు ప్రతినెలా సమావేశమై మేజర్ మినరల్స్ బ్లాక్స్‌గా ఎంపికైన భూములకు అన్ని అనుమతులు తీసుకునేలా చేస్తారు. ఈ ప్రతిపాదనలు రాష్ట్ర స్థాయి కమిటీకి పంపిస్తారు. ఈ కమిటీ రెండు నెలలకు ఒకసారి భేటీ నిర్వహించి తగిన నిర్ణయాలు తీసుకోనుంది.

సజ్జల శ్రీధర్‌రెడ్డి వ్యాజ్యం వాయిదా

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో డిఫాల్ట్ బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేలా విజయవాడ ఏసీబీ కోర్టును ఆదేశించాలంటూ నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. ఆ రోజు తగిన నిర్ణయం ప్రకటిస్తామని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. డిఫాల్ట్ బెయిలు మంజూరు చేయాలని వేసిన పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు రిటర్న్ చేయడాన్ని సవాలు చేస్తూ సజ్జల శ్రీధర్‌రెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. న్యాయవాది అభయ్ సిద్ధాంత్ వాదనలు వినిపిస్తూ.. రెగ్యులర్ బెయిలు పిటిషన్లను విచారించాలని, డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లపై కాదని సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో తన పిటిషన్‌పై విచారణ జరపలేమంటూ బెయిల్ పిటిషన్‌ను రిటర్న్ చేస్తూ ఏసీబీ కోర్టు గత నెల 29న డాకెట్ ఉత్తర్వులిచ్చిందన్నారు. ఏసీబీ కోర్టు ఏదో ఒక నిర్ణయం ప్రకటించాలి తప్ప.. విచారణ జరపలేమని పిటిషన్‌ను రిటర్న్ చేయడం తగదన్నారు. పిటిషన్‌కు నంబరు కేటాయించి, విచారణ జరిపేలా ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరారు.

ఆర్థికశాఖకు పల్నాడు జేసీ

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్ ధనంజయ్ గనోరేని ఆర్థికశాఖ ఉప కార్యదర్శిగా బదిలీ చేస్తూ సీఎస్ కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సెలవుపై వెళ్లేందుకు ఏడీబీ సీఈఓకు అనుమతి

ఏపీ ఆర్థికాభివృద్ధి మండలి (ఏపీఈడీబీ) సీఈఓ శ్రీకాంత్ వర్మ ఈ నెల 17 నుంచి 25 వరకు వ్యక్తిగత సెలవులో వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఆ సమయంలో ఈడీబీ ఇన్‌ఛార్జి సీఈఓగా పరిశ్రమలశాఖ డైరెక్టర్ శుభం బన్సల్ వ్యవహరిస్తారని సీఎస్ ఉత్తర్వుల్లో వెల్లడించారు.

సరళావందనం కొనసాగింపు

పోలవరం ప్రత్యేక కలెక్టర్‌గా సత్తెనపల్లి సరళా వందనంను కొనసాగిస్తూ సీఎస్ కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే ప్రాజెక్టులో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను గత నెల 17న ప్రభుత్వం బదిలీ చేసింది. ఇప్పుడు ప్రత్యేక కలెక్టర్‌గా అక్కడే కొనసాగేందుకు అనుమతించింది.

ఎంజేపీ గురుకులాల్లో జూనియర్ ప్రిన్సిపాళ్లకు పదోన్నతి

ఈనాడు, అమరావతి: మహాత్మ జ్యోతిబా పులే (ఎంజేపీ) బీసీ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న 11 మంది జూనియర్ ప్రిన్సిపాళ్లకు సీనియర్ ప్రిన్సిపాళ్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది

ప్లాట్లు క్రమబద్ధీకరించుకుంటే పాట్లు తీరినట్లే!

- ఎల్ఆర్ఎస్‌కి మిగిలింది 70 రోజులే
- వచ్చే జనవరి 23తో ముగియనున్న గడువు
- అనధికార లేఔట్లలో స్థలాలు కొన్న వారికి చక్కటి అవకాశం

ఈనాడు - అమరావతి



కృష్ణా జిల్లాలో అనధికార లేఔట్లలో కొలతలు తీస్తున్న పట్టణ ప్రణాళిక సిబ్బంది

విజయవాడ పటమటకు చెందిన సత్యనారాయణ తాడిగడప శివారులోని ఒక లేఔట్‌లో 300 గజాల స్థలాన్ని రెండున్నరేళ్ల క్రితం కొనుగోలు చేశారు. అందులో ఇంటి నిర్మాణం కోసం అనుమతులకు ఆయన ఇటీవల చేసిన దరఖాస్తు వెనక్కి వచ్చింది. అనధికార లేఔట్‌లో స్థలం కొన్నారన్న కారణంతో పట్టణ ప్రణాళిక అధికారులు తిరస్కరించారు. అప్పటికిగానీ సత్యనారాయణకు అసలు విషయం తెలియలేదు.

ఇతర లేఔట్ల కంటే తక్కువ ధరకు ఇస్తున్నారనో, వాయిదాల్లో డబ్బు చెల్లించే వెసులుబాటు ఉందనో అనధికార లేఔట్లలో ఇళ్ల స్థలాలు కొన్నవారంతా ప్రభుత్వం ప్రకటించిన లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) వినియోగించుకుని ఇలాంటి ఇబ్బందుల నుంచి బయటపడొచ్చు. 2025 జూన్ 30కి ముందు ప్లాట్లు కొన్నవారంతా వాటిని క్రమబద్ధీకరించుకోవచ్చు. ఈ ఏడాది అక్టోబరు 23తో ముగిసిన పథకం గడువును ప్రభుత్వం తాజాగా 2026 జనవరి 23 వరకు పొడిగించింది. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వం నిర్దేశించిన పీనలైజేషన్, ఇతరత్రా ఛార్జీలు చెల్లిస్తే చాలు.

అవసరమైన పత్రాలు

- ◆ 2025 జూన్ 30 నాటికి స్థలంపై యాజమాన్య హక్కులు కలిగినట్లుగా రిజిస్ట్రేషన్ దస్తావేజులు
- ◆ దస్తావేజులకు అనుబంధంగా లింక్ డాక్యుమెంట్
- ◆ ప్లాట్ కొలతలు, సరిహద్దు వివరాలు, ప్లాట్‌కి ఆనుకొని ఉన్న రోడ్ల వెడల్పు చూపిస్తూ సైట్ ప్లాన్
- ◆ సబ్‌రిజిస్ట్రార్ ధ్రువీకరించిన ఈసీ, మార్కెట్ విలువ సర్టిఫికెట్
- ◆ భూ వినియోగ మార్పిడి ధ్రువీకరణపత్రం
- ◆ ఇండెమ్నిటీ బాండ్, రోడ్డు విస్తరణ ఒప్పందపత్రం

ఖాళీ స్థలం ఛార్జీల్లోనూ 50% రాయితీ

◆ ఎల్ఆర్ఎస్‌లో ఇంటిస్థలాలు క్రమబద్ధీకరించునేవారికి ప్రభుత్వం ఖాళీస్థలం ఛార్జీల్లోనూ (ఓపెన్ స్పేస్ ఛార్జి) 50% రాయితీ కల్పించింది. ఖాళీ స్థలాలపై నిబంధనల ప్రకారం 14% ఛార్జీలు వసూలు చేస్తారు. ప్రస్తుతం 7% చెల్లిస్తే చాలు.

మరో 25,000 దరఖాస్తులు వస్తాయని అంచనా

2025 జులైలో ఎల్ఆర్ఎస్ ప్రకటించాక మూడు నెలల్లో 42,335 దరఖాస్తులు వచ్చాయి. గడువు పొడిగించడంతో మరో 25వేల దరఖాస్తులు వస్తాయని అధికారుల అంచనా. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరోసారి ఇలాంటి అవకాశం రాకపోవచ్చని చెబుతున్నారు.

క్రమబద్ధీకరించుకోకపోతే ఇబ్బందులివీ..

- ◆ అనుమతులు తీసుకోని లేఔట్లలో స్థలాల్లో (ప్లాట్లు) నిర్మాణాలకు అనుమతులే ఇవ్వరు.
- ◆ నిర్మాణాలు చేపట్టినా వాటిని చట్టవిరుద్ధమైనవిగా భావించి తొలగిస్తారు.
- ◆ ప్లాట్ల క్రయ విక్రయాలకు అవకాశం లేకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధిత భూముల జాబితాలో చేర్చుతారు.
- ◆ ఖాళీ స్థలాలకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) వేయరు.
- ◆ ఇళ్ల నిర్మాణాలకు బ్యాంకులు రుణాలు ఇవ్వవు.
- ◆ తాత్కాలిక నిర్మాణాలు చేపట్టినా ఇంటి నంబర్లు కేటాయించరు.
- ◆ లేఔట్లలో రోడ్లు, కాలువలు, నీటి సరఫరా, వీధిదీపాల వంటి మౌలిక సదుపాయాలను మున్సిపాల్టీలు కల్పించవు.



అప్పటివరకూ మీకు ఎదుగుదల ఉండదు

మీలోని లోపాలను అంగీకరించడానికి సిద్ధపడనంతవరకూ, వాటిని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించరు. అదే విధంగా మీ బలహీనతలను గుర్తించనంతవరకూ, వాటిని అధిగమించలేరు. మీ వ్యసనాలను, చెడు అలవాట్లను వదులుకోవడానికి నడుంబిగించనంతవరకూ, మీకు ఎదుగుదల ఉండదు.

– డాన్ మార్టిన్, బిజినెస్ కోచ్




మొకోలోడి నేచర్ రిజర్వ్‌లో చీతాలను విడిచిపెడుతున్న దృశ్యాన్ని వీక్షిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

బోట్స్‌వానాలో రాష్ట్రపతికి 8 చీతాల అందజేత

గబొరోనే: దక్షిణాఫ్రికా దేశం బోట్స్‌వానాలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఆ దేశ అధ్యక్షుడు డ్యూమా గిడియోన్ బోకో ఎనిమిది చీతాలను గురువారం అందజేశారు. గబొరోనేకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మొకోలోడి నేచర్ రిజర్వ్‌లో రెండు పెద్ద చీతాలను క్వారంటైన్ నుంచి విడిచిపెట్టి ప్రతీకాత్మక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణి సంరక్షణ కోసం బోట్స్‌వానా చేస్తున్న కృషికి ముర్ము కృతజ్ఞతలు తెలిపారు. అలానే భారత్ కూడా చీతాల రక్షణకు కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. చీతాల రాకతో భారత్‌లో వాటి పునరుత్పత్తికి దోహదపడుతుందని గిడియోన్ అభిప్రాయపడ్డారు. భారత్‌కు 8 చీతాలను అప్పగిస్తున్నట్లు ఆయన బుధవారం అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు దిల్లీ కారు బాంబు పేలుడు ఘటనలో మృతులకు బోట్స్‌వానాలోని భారత సమాజంతో కలిసి రాష్ట్రపతి ముర్ము నివాళులర్పించారు. సుమారు 10 వేల మంది భారత సమాజానికి చెందిన ప్రజలు బోట్స్‌వానాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు.

బోస్నియాలో సంపన్నుల అరాచకం.. రూ.కోట్లు ఇచ్చి మనుషుల వేట



మూడు దశాబ్దాల నాటి నరమేధంపై ఇటలీ దర్యాప్తు



ఇంటర్నెట్ డెస్క్: యుద్ధంతో అల్లాడుతున్న ప్రజలపై కనికరం చూపాల్సింది పోయి.. కొందరు సంపన్నులు వారిపై అరాచకాలకు పాల్పడ్డారు. కేవలం తమ సరదా కోసం భారీగా సొమ్ములు వెచ్చించి మరీ అమాయక పౌరులను వేటాడి చంపారు. మూడు దశాబ్దాల కిందట బోస్నియాలో జరిగిన ఈ నరమేధంపై ఇటలీ తాజాగా దర్యాప్తు చేపట్టింది. 1992 - 95 మధ్య బోస్నియాలో జరిగిన యుద్ధం రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఐరోపా చరిత్రలోనే అత్యంత హింసాత్మక సాయుధ ఘర్షణగా నిలిచింది. 1992 ఆరంభంలో బోస్నియా - హర్జెగోవినాను గణతంత్ర ప్రాంతంగా అంతర్జాతీయ సమాజం గుర్తించింది. దీన్ని వ్యతిరేకించిన 'బోస్నియా సెర్బ్స్' తమ దళాలతో కలిసి బోస్నియా రాజధాని సరాజెవో నగరాన్ని ఆక్రమించి నియంత్రణలోకి తీసుకుంది. మూడేళ్లకు పైగా జరిగిన ఈ యుద్ధంలో 11 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ యుద్ధ సమయంలో ఇటలీకి చెందిన కొందరు సంపన్నులు అత్యంత హేయమైన దారుణాలకు పాల్పడ్డారని తాజాగా పలు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. వీరు డబ్బులిచ్చి సరాజెవో వీధుల్లోని పౌరులను 'సరదాగా' కాల్చి చంపినట్లు పేర్కొన్నాయి. 'స్నైపర్ టూరిజం' పేరుతో జరిగిన ఈ అరాచకాన్ని బోస్నియా సెర్బ్స్ దళాలు వెనకుండి నడిపించాయి. ఇటలీ సంపన్నులను సరాజెవో చుట్టూ ఉన్న కొండల ప్రాంతాలకు ఈ దళాలే తరలించాయట. అక్కడ వీరు స్నైపర్ తుపాకులతో అమాయకులను వేటాడి చంపినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఇందుకోసం ఆ సంపన్నులు లక్ష యూరోల (దాదాపు రూ.కోటి) వరకు చెల్లించారట. ఈ వేటకు మనిషినిబట్టి రేటు నిర్ణయించారని, చిన్నారులైతే ఎక్కువ మొత్తం ఇచ్చేవారని మీడియా కథనాలు వెల్లడించాయి. వృద్ధులను ఉచితంగా వేటాడేందుకు దళాలు అనుమతించాయని తెలిపాయి.

● బోస్నియా యుద్ధ సమయంలో విదేశీయులు స్నైపర్ టూరిజానికి పాల్పడినట్లు గతంలో పలు కథనాలు వచ్చాయి. పరిశోధక పాత్రికేయుడైన ఎజియో గవాజెనీ కొన్నేళ్ల కిందట దీనిపై ఓ నివేదిక తయారుచేశారు. అందుకు తగిన ఆధారాలు చూపలేకపోవడంతో దాన్ని పక్కనపెట్టారు. ఈ క్రమంలో స్లోవేనియా దర్శకుడు ఒకరు 2022లో 'సరాజెవో సఫారీ' పేరుతో డాక్యుమెంటరీ చిత్రాన్ని విడుదల చేశారు. దీన్ని చూసిన అనంతరం ఎజియో గవాజెనీ తన పరిశోధనను మళ్లీ ప్రారంభించారు. బోస్నియా సెర్బ్ మిలిటరీ అధికారి సహా పలువురి వాంగ్మూలాలను సేకరించి వాటి ఆధారంగా రూపొందించిన నివేదికను ఇటలీ దర్యాప్తు అధికారులకు సమర్పించారు. దీనిపై ఇటలీ అధికారులు చేపట్టిన తాజా దర్యాప్తు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

స్మార్ట్ ఫోను వీడని కుమారుడు విసిగి వేసారిన తల్లి ఆత్మహత్య

ఝాన్సీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ నగర శివారులో గల రక్సా ప్రాంతంలో మంగళవారం రాత్రి ఓ మహిళ ఆత్మహత్య చేసుకొంది. స్మార్ట్ ఫోనులో ఆన్‌లైన్ ఆటలు, టీవీ చూడటానికి అలవాటుపడిన కుమారుడు (13) ఎంతచెప్పినా మాట వినకపోవడంతో సహనం నశించిన సుశీలాదేవి (38) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. భర్త రవీంద్ర ప్రజాపతి ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి. ఫోను వదిలేసి చదువుపై దృష్టి పెట్టాలని పదే పదే చెప్పినా తల్లి మాటను కుమారుడు నిర్లక్ష్యం చేయడంతో ఆమె ఈ తీవ్రమైన నిర్ణయం తీసుకొన్నారు. హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు స్టేషన్ అధికారి రూపేశ్ కుమార్ తెలిపారు.

భారత సీఓ2 ఉద్గారాల విడుదల్లో స్వల్ప పెరుగుదల

దిల్లీ: దేశంలో కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాల విడుదల 2025లో 1.4 శాతం మేర పెరగొచ్చని ఓ నివేదిక గురువారం పేర్కొంది. ఇది గతేడాది కంటే ఇది స్వల్ప పెరుగుదల. 130 వాతావరణ శాస్త్రవేత్తలు, పరిశోధన సంస్థలు రూపొందించిన ఈ నివేదికను బ్రెజిల్‌లోని బెలెంలో కాప్(సీఓపీ)30 సదస్సులో విడుదల చేశారు. దాని ప్రకారం.. ఈ ఏడాది భారత్‌లో ముందుగానే ప్రవేశించిన రుతుపవనాల కారణంగా ఏసీల వినియోగం తగ్గడం, గణనీయస్థాయిలో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి కారణంగా బొగ్గు వినియోగంలో వృద్ధి దాదాపు శూన్యంగా ఉంది. అయితే మొత్తం మీద భారత్‌లో ఉద్గారాల విడుదల్లో వృద్ధి కొనసాగుతుందని ఆ నివేదికలో పేర్కొన్నారు.

అల్జీమర్స్‌ను ముందే పసిగట్టే సాధనం

దిల్లీ: అల్జీమర్స్ వ్యాధితో ముడిపడిన రీతిలో ఎవరిలోనైనా జ్ఞాపకశక్తి, ఆలోచనల పరమైన సమస్యలు తలెత్తుతున్నట్టయితే ముందుగానే పసిగట్టే సాధనాన్ని పరిశోధకులు సృష్టించారు. లక్షణాలు కనిపించడానికి సుమారు పదేళ్ల ముందే సమస్యను గుర్తించేందుకు ఇది దోహదపడుతుంది. యాభై ఏళ్లు దాటిన 5,858 మందికి సంబంధించిన స్కానింగ్ నివేదికల్ని అమెరికా పరిశోధకులు పరిశీలించారు. ఒకని జీవితకాలంలో, లేదా మరో పదేళ్లలో మతిమరుపు వంటివి రావచ్చా లేదా అనేది పెట్ స్కాన్ లేనా గుర్తించేందుకు కొన్ని సాధనాలు వీలు కల్పించాయి. కొలెస్ట్రాల్ స్థాయిలతో గుండెపోటు ముప్పును ఎలా అంచనా వేయవచ్చో ఇవి కూడా అంతేనని, ముున్ముందు రక్త నమూనాలతోనూ గుర్తించే స్థాయికి ఎదగవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

మునీర్‌కు అనుకూలంగా సైనిక చట్టాలనూ సవరించిన పాక్ పార్లమెంటు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్‌కు త్రివిధ దళాల పగ్గాలు అప్పగించేందుకు వీలుగా ఆ దేశ పార్లమెంటు గురువారం సైనిక చట్టాలకు సవరణ చేసింది. ఇటీవల పార్లమెంటు ఆమోదించిన 27వ రాజ్యాంగ సవరణ బిల్లును పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ కూడా ఆమోదముద్ర వేసిన వెంటనే ఈ చట్టాల్లో మార్పులకు పార్లమెంటు అంగీకారం తెలపడం గమనార్హం. దీంతో ఇప్పటివరకు సైన్యాధిపతిగానే ఉన్న మునీర్.. త్రిదళాధిపతి(సీడీఎఫ్)గా కొనసాగడానికి ఉన్న చట్టపరమైన అడ్డంకులన్నీ తొలగిపోయినట్లే. సీడీఎఫ్ హోదాలో ఆయన నియామక తేదీ నుంచి ఐదేళ్లు కొనసాగుతారు.

● 27 రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా.. పాక్ సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు రాజీనామా చేశారు. సవరణ రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు విరుద్ధంగా ఉందని వారు పేర్కొన్నారు. సవరణ బిల్లుకు అధ్యక్షుడు జర్దారీ గురువారం ఆమోదం తెలిపిన వెంటనే జస్టిస్ మన్సూర్ అలీ, జస్టిస్ అతార్ మినాల్లాలు.. పదవుల నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. 27వ సవరణ ప్రకారం. . రాజ్యాంగానికి సంబంధించిన కేసులను విచారించేందుకు ఫెడరల్ రాజ్యాంగ న్యాయస్థానం ఏర్పాటు కానుంది. దీంతో సుప్రీంకోర్టు కేవలం సివిల్, క్రిమినల్ కేసులకే పరిమితం కానుంది.

ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపులు

దిల్లీలో సురక్షితంగా ల్యాండింగ్

దిల్లీ: టొరంటో నుంచి దిల్లీకి చేరుకోవాల్సిన ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. దిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల భారీ పేలుడు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కెనడాలోని టొరంటో నుంచి దిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా(ఏఐ188) విమానంలో బాంబు పెట్టినట్లు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి దిల్లీ పోలీసులకు గురువారం ఉదయం బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన అధికారులు సదరు విమాన సిబ్బందికి వెంటనే సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం 3.40 గంటలకు దిల్లీ విమానాశ్రయంలో ఆ విమానం సురక్షితంగా దిగింది. వెంటనే భద్రత తనిఖీలు చేపట్టి, ప్రయాణికులను, సిబ్బందిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు.

చెక్‌బౌన్స్ కేసులపై సుప్రీం అసంతృప్తి

దిల్లీ: చిన్న రుణగ్రస్థులపై చెక్‌బౌన్స్ కేసులను సుదూర ప్రాంతాల్లో నమోదు చేస్తూ ఆర్థిక సంస్థలు, బ్యాంకులు చట్టాన్ని దుర్వినియోగపరుస్తు వేధింపులకు గురిచేయటంపై సుప్రీంకోర్టు గురువారం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారాన్ని పరిశీలించి చట్టప్రకారం పరిష్కరిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ చెక్‌బౌన్స్ కేసుపై విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం పేర్కొంది.



త్రిశూల్ విన్యాసాల్లో భాగంగా మెకనైజ్డ్ ల్యాండింగ్ క్రాఫ్ట్ నుంచి కిందకు దిగుతున్న సైనికులు

30 వేల మంది సైనికులు.. 23 యుద్ధ నౌకలు

ముగిసిన త్రిశూల్ విన్యాసాలు

పోర్‌బందర్: రాజస్థాన్‌లో గత కొన్ని రోజులుగా త్రివిధ దళాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న త్రిశూల్ విన్యాసాలు గురువారం ముగిశాయి. ఇందులో 30 వేల మంది సైనికులు, పలు యుద్ధ విమానాలు, 25 నౌకలు, జలాంతర్గాములు పాల్గొన్నాయి. త్రివిధ దళాల సంయుక్త విన్యాసాలను విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్, వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, వాయుసేన ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్ పరిశీలించారు. ఈ విన్యాసాలు త్రివిధ దళాల సత్తాకు ప్రతీక అని వారు పేర్కొన్నారు. థార్ ఎడారి నుంచి కచ్ ప్రాంతం వరకు గత కొన్ని రోజులుగా త్రిశూల్‌లో భాగంగా పలు విన్యాసాలు జరిగాయి. అందులో భాగంగా గురువారం జరిగిన అఖండ్ ప్రహార్ విన్యాసాల్లో రుద్ర బ్రిగేడ్, భైరవ్ బెటాలియన్, అషాని యూనిట్లు పాలుపంచుకున్నాయి. చివరగా అంఫెక్స్ విన్యాసాలు అరేబియా సముద్రంలో జరిగాయి.

మహారాష్ట్రలో దళిత నాయకుడి హత్య

సాంగలీ: ఓ దళిత నాయకుడు తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంటుండగా ఎనిమిది మంది వ్యక్తులు కత్తులతో పొడిచి హత్య చేసిన ఘటన మహారాష్ట్రలోని సాంగలీ నగరంలో చోటుచేసుకుంది. ఇది ఒక వివాదం కారణంగా జరిగిన హత్య అని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుణ్ని దళిత మహాసంఘ్ వ్యవస్థాపకుడు ఉత్తమ్ మొహితే (38)గా గుర్తించారు. ఈ ఘర్షణలో దాడి చేసిన వారిలో ఒకడైన షారుఖ్ రఫీఖ్ షేక్ (26) కూడా తీవ్రంగా గాయపడి మరణించినట్లు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి మొహితే ఇంట్లో ఆయన పుట్టినరోజు వేడుకలు జరిగాయి. బంధువులంతా వెళ్లిపోయాక ఆయుధాలు కలిగిన ఎనిమిది మంది బృందం అక్కడికి వచ్చి మొహితేను దుర్భాషలాడటం ప్రారంభించింది. తన ప్రాణాలకు ముప్పు ఉందని గ్రహించిన బాధితుడు అక్కడి నుంచి ఇంట్లోకి పరిగెత్తాడు. అతణ్ని వెంబడించిన నిందితులు కడుపు, ఛాతిపై పలు మార్లు పొడిచారు. ఇనుప రాడ్లు, కర్రలతో తల, చేతులపై కొట్టారు. ఈ ఘర్షణలో నిందితుల్లో ఒకరైన షేక్ తొడపై పొరపాటున బలమైన కత్తిపోటు గాయమైంది. దీంతో అతను బుధవారం ఉదయం మరణించాడు. మొహితేను కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బెంగాల్‌లో 34 లక్షల ఆధార్ కార్డుదారులు మృతి చెందినట్లు గుర్తించాం: ఈసీకి వెల్లడించిన ఉడాయ్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఆధార్ ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 34 లక్షల మంది మరణించారని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఉడాయ్ అధికారులు ఎన్నికల సంఘానికి తెలిపారు. అలాగే 13లక్షల మంది ఆధార్‌కార్డు లేకుండానే మృతిచెందారని వివరించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతున్న నేపథ్యంలో ఉడాయ్ అధికారులు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ)మనోజ్ కుమార్ అగర్వాల్ మధ్య కీలక సమావేశం జరిగింది.

ఒక్క రోజులో 5కోట్ల ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ: ఈసీ

దిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ రెండో దశలో భాగంగా గురువారం ఒక్క రోజే తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 5 కోట్ల ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేసినట్లు ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. ఇప్పటివరకు 42 కోట్లకు పైగా పత్రాలను పంపిణీ చేస్తామని రోజువారి బులిటెన్‌లో ఈసీ పేర్కొంది.

కొండా సురేఖపై కేసు ఉపసంహరించుకున్న నాగార్జున

ఈనాడు, హైదరాబాద్: అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం కేసును ఉపసంహరించుకుంటున్నట్లు నటుడు నాగార్జున కోర్టుకు తెలిపారు. దీంతో విచారణ నిలిపివేస్తూ నాంపల్లి ప్రత్యేక కోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆమె కిందటేడాది తమ కుటుంబ గౌరవం, ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నాగార్జున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసు విచారణలో ఉండగా కొండా సురేఖ. . నాగార్జున కుటుంబంపై గతంలో చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తంచేస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే చింతిస్తున్నానని వాటిని ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.లక్షన్నర లంచం డిమాండ్

● ఆదిభట్ల టౌన్ ప్లానింగ్ అధికారిని అరెస్టు చేసిన అనిశా



ఒప్పంద ఉద్యోగి వంశీకృష్ణ, ఆదిభట్ల టౌన్ ప్లానింగ్ ఇన్‌ఛార్జి అధికారి వరప్రసాద్

ఆదిభట్ల, న్యూస్‌టుడే: భవన నిర్మాణ అనుమతి కోసం లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పురపాలిక టౌన్ ప్లానింగ్ అధికారిని, అతడి సహాయకుడిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. హైదరాబాద్ రేంజ్-2 డీఎస్పీ గంగసాని శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్.. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల, ఆమనగల్లు పురపాలికల్లో ఇన్‌ఛార్జి టౌన్ ప్లానింగ్ అధికారిగా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 6న ఆనంద్ ఆదిభట్లలో తనకు ఉన్న 400 గజాల్లో జీప్లస్4 ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ప్రక్రియలో జాప్యం కావడంతో వరప్రసాద్‌ను సంప్రదించారు. అనుమతి కోసం దస్త్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు పంపించడానికి లంచం డిమాండ్ చేశాడు. రూ. లక్షన్నరకు ఒప్పందం కుదిరింది. ముందుగా రూ.80 వేలు ఇస్తే ప్రక్రియను ప్రారంభిస్తారని.. అతడి సహాయకుడు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వంశీ కృష్ణ దరఖాస్తుదారుకి చెప్పాడు. దీంతో ఆనంద్ అనిశాను ఆశ్రయించారు. ఆయన గురువారం ఉదయం ఆదిభట్ల కార్యాలయానికి రూ.75 వేలు తీసుకువెళ్లగా, వరప్రసాద్ అందుబాటులో లేడు. ముందస్తుగా మాట్లాడిన మేరకు వంశీ కృష్ణ డబ్బులు తీసుకుంటూ అనిశా అధికారులకు చిక్కాడు. వెంటనే జిల్లెలగూడలో నివాసం ఉంటున్న వరప్రసాద్‌ను సైతం అదుపులోకి తీసుకొన్న అధికారులు ఆదిభట్ల కార్యాలయానికి తీసుకొచ్చారు. అనంతరం పురపాలిక కార్యాలయంలో సుమారు గంట పాటు సోదాలు నిర్వహించారు. వారిని అరెస్టు చేశామని, కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు.

కోత పెట్టిన నిధులూ ఇవ్వండి

● పోలవరం కోసం కేంద్రాన్ని మరో రూ.1,275 కోట్లు అభ్యర్థిస్తున్న రాష్ట్రం

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు తొలిదశలో భూసేకరణ, పునరావాసం పకడ్బందీగా, ఏ ఇబ్బందులు లేకుండా పూర్తిచేయాలంటే మరో రూ.1,274.93 కోట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కోరుతోంది. పోలవరం రివైజ్డ్ కాస్ట్ కమిటీకి (ఆర్‌సీసీ) ఈ మేరకు పునరావాస భూసేకరణ అధికారులు అభ్యర్థన పంపారు. పోలవరంలో తొలిదశలో +41.15 మీటర్ల స్థాయికి నీరు నింపేలా మొత్తం రూ.30,436.95 కోట్లకు 2024 ఆగస్టులో కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

● నిజానికి పోలవరం తొలిదశ వరకు పూర్తిచేసేందుకు భూసేకరణ, పునరావాసాలకు 2023 ధరల ప్రకారం రూ.13,545.35 కోట్లు అవసరమని గతంలోనే జలవనరులశాఖ కేంద్రానికి ప్రతిపాదించింది.

● కేంద్ర జలసంఘం ఈ ప్రతిపాదనలను పరిశీలించి దాన్ని రూ.12,824.84 కోట్లకు కుదించింది.

● సవరించిన అంచనాల కమిటీ (ఆర్‌సీసీ) రూ.12,270.42 కోట్లకే (5604.47+6665.95) ఆమోదం తెలిపింది.

● ఇప్పుడు రాష్ట్రం ప్రతిపాదించిన మొత్తానికి, ఆర్‌సీసీ ఆమోదించిన మొత్తానికి మధ్య తేడా రూ.1,274.93 కోట్లు ఉంది. అదికూడా ఇస్తే ఈ ప్రక్రియ సులభమవుతుందని రాష్ట్రం అభ్యర్థిస్తోంది.

దీంతోపాటు పోలవరం భూసేకరణ, పునరావాసంలో ఇతర సవాళ్ల అంశాన్నీ కేంద్రం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. కేవలం భూమి ధర, పునరావాసం ప్యాకేజీ మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే కష్టమని, ఇతర ఖర్చులనూ పరిగణనలోకి తీసుకోవాలని అధికారులు తెలియజేశారు.

● సేకరించాల్సిన వాటిలో 5,426.09 ఎకరాలు పట్టా భూములు. పేదలకు ఆ భూముల్లో పట్టాలు ఇచ్చిన విషయం తర్వాత గుర్తించారు. మరో 6,944.79 ఎకరాలు పేదలు ఆక్రమించుకున్నవి. వారికి పరిహారం రూపంలో రూ.32.44 కోట్లు ఖర్చుచేయాల్సి వచ్చింది. పోలవరం అథారిటీ ఈ మొత్తాన్ని ఇచ్చేందుకు తిరస్కరించింది.

● న్యాయవివాదాల వల్ల చట్ట ప్రకారం భూసేకరణ అవార్డు సొమ్ములు కోర్టులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అలా రూ.63.83 కోట్లు ఇంతవరకు న్యాయస్థానాల్లో డిపాజిట్ చేశారు. పోలవరం అథారిటీ ఆ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కోత పెట్టింది.

● కుడి, ఎడమ కాలువల కోసం సేకరించిన భూమికి చెల్లించిన రూ.62.33 కోట్లకు కూడా అథారిటీ కోత పెడుతోంది.

● ఈ అంశాల్లోని లోతైన కారణాలను విశ్లేషించి మిగిలిన మొత్తం నిధులు ఇవ్వాలని రాష్ట్రం అభ్యర్థిస్తోంది.

ఆ ప్రకారం నిధుల కేటాయింపు ఇలా... (రూ.కోట్లలో)

డ్యాం నిర్మాణం, ఎడమ, కుడి కాలువల నిర్మాణానికి	17,790.87
భూసేకరణకు	5,604.47
పునరావాసం	6665.95
పోలవరం అథారిటీ నిర్వహణ	375.66
మొత్తం	30,436.95

వ్యాపారం పేరుతో ఎస్‌బీఐ రుణం దారి మళ్లింపు

● రూ.111.57 కోట్ల ఆస్తిని జప్తు చేసిన ఈడీ

ఈనాడు, హైదరాబాద్: వ్యాపారం పేరుతో ఎస్‌బీఐ నుంచి రుణం తీసుకొని దారి మళ్లించుకున్న కేసులో హ్యాక్‌బ్రిడ్జ్-హ్యూయిటిక్ అండ్ ఈసన్ లిమిటెడ్ సంస్థలకు చెందిన రూ.111.57 కోట్ల విలువైన స్థిరాస్తిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) హైదరాబాద్ విభాగం ప్రాథమికంగా జప్తు చేసింది. ఈమేరకు ఈడీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. విక్టరీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(వీఈఎల్), విక్టరీ ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ స్విచ్‌గేర్స్ లిమిటెడ్(వీటీఎస్ఎల్) సంస్థల డైరెక్టర్లు మహేంద్రకుమార్ వద్దినేని, మనోజ్‌కుమార్ వద్దినేని, వెంకటప్పయ్యానాయుడు వద్దినేని తదితరులు వ్యాపార అవసరాల పేరుతో తప్పుడు పత్రాలు, బ్యాలెన్స్ షీట్లు చూపి... హైదరాబాద్‌లోని ఎస్‌బీఐ స్ట్రెస్డ్ ఎసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ నుంచి రుణం తీసుకున్నారు. తొలుత డొల్ల కంపెనీల్లోకి, తర్వాత సొంత ఖాతాల్లోకి మళ్లించుకోవడంతో రూ.136.50 కోట్ల నష్టం వచ్చిందని ఎస్‌బీఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేసింది. తర్వాత న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేసింది. నిధుల మళ్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టింది.

మోసానికి పాల్పడ్డారిలా...

బ్యాంకు నుంచి తీసుకున్న రుణంలోని రూ.88.93 కోట్లను వీఈఎల్, వీటీఎస్ఎల్ సంస్థలను నిర్వహిస్తున్న మహేంద్రకుమార్ వద్దినేని, మరో నిందితుడు నవీన్ ఖత్రీ ఆధ్వర్యంలో దిల్లీ కేంద్రంగా నడుస్తున్న డొల్ల కంపెనీల్లోకి బదిలీ చేశారు. తర్వాత వీఈఎల్, వీటీఎస్ఎల్‌లకు చెందిన ఇతర ఖాతాల్లోకి మళ్లించారు. మరో వైపు ఒక విదేశీ సంస్థకు ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరాకు వీఈఎల్ సంస్థకు ఎస్‌బీఐ 50 లక్షల డాలర్ల(సుమారు రూ.45 కోట్లు) బ్యాంకు గ్యారంటీ ఇచ్చింది. విదేశాలకు ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయకుండా... గ్యారంటీ సొమ్మును షార్జాలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాలో వీఈఎల్ జమ చేయించుకుంది. దీంతో ఎస్‌బీఐకి వడ్డీతో కలిపి రూ.189.04 కోట్ల నష్టం వచ్చినట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఇందులో రూ.77.47 కోట్లు మాత్రమే రికవరీ అయింది. వీఈఎల్, వీటీఎస్ఎల్ సంస్థలకు చెందిన రూ.111.57 కోట్ల విలువైన స్థలాన్ని ఈడీ ప్రాథమికంగా జప్తు చేసింది.

బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అండతో భూకబ్జా

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా నేత, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి అండతో కొందరు వ్యక్తులు తన స్థలాన్ని ఆక్రమించుకొన్నారని నంద్యాల జిల్లా బేతంచర్లకు చెందిన నాగరాజు అనే బాధితుడు వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, ఏపీ హౌసింగ్‌బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన కుమార్తె చావుకు కారణమైన అల్లుడు, అతడి స్నేహితుడిపై చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలేనికి చెందిన దశరథరామయ్య ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దారు పొరపాటుతో తన భూమి నిషేధిత జాబితాలో చేరిందని... దీన్ని సరిచేయాలని విజయనగరం జిల్లా రేగిడి ఆముదాలవలసకు చెందిన అన్నపూర్ణ వినతిపత్రం సమర్పించారు.

బాధ్యత మరచిన తండ్రికి పిల్లల విదేశీ ప్రయాణాన్ని అడ్డుకునే హక్కు లేదు

● తండ్రి సంతకం లేకుండానే వారికి పాస్‌పోర్టు జారీ చేయండి: తెలంగాణ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: తల్లి చనిపోయిన మైనర్ పిల్లల బాధ్యత మరచిన తండ్రికి వారి విదేశీ ప్రయాణాన్ని అడ్డుకునే హక్కు లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. కుమార్తె పిల్లలకు వారి తండ్రి అనుమతి లేకుండా పాస్‌పోర్టు జారీ చేసేందుకు అధికారులు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ తాజుద్దీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది అంబేడ్కర్ వాదనలు వినిపిస్తూ...తాత, అమ్మమ్మల సంరక్షణలో ఉన్న పిల్లలిద్దరికీ నిర్వహణ ఖర్చుల కింద నెలకు రూ.12 వేలు ఇవ్వాలంటూ కింది కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీనిపై వారి తండ్రి హైకోర్టును ఆశ్రయించి... రెండో పెళ్లి చేసుకున్నందువల్ల కుటుంబ భారం ఉందంటూ నిర్వహణ ఖర్చులను రూ.8 వేలకు తగ్గించుకున్నారన్నారు. దాన్నీ సక్రమంగా చెల్లించడం లేదని తెలిపారు. పాస్‌పోర్టు దరఖాస్తుపై సంతకం చేయాలని అడిగితే వారి తల్లి పేరుమీద ఉన్న ఆస్తి, బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. పిల్లల తండ్రి సయ్యద్ అహ్మద్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... సంరక్షణ హక్కులపై పిటిషన్ కింది కోర్టులో పెండింగ్‌లో ఉందని, ఆ కోర్టు ఉత్తర్వులు జారీ అయ్యేదాకా పిల్లలకు పాస్‌పోర్టు ఇవ్వొద్దన్నారు. తల్లి చనిపోయిన తర్వాత పిల్లలు తాత, అమ్మమ్మల సంరక్షణలోనే ఉన్నారని, తండ్రి తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేదని తెలుస్తోందన్నారు. అందువల్ల వారి ప్రయాణాన్ని అడ్డుకోవడానికి వీల్లేదన్నారు. తండ్రి సంతకం లేకుండా పాస్‌పోర్టు జారీ చేయాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గోదావరి పుష్కరాలకు రైల్వే సన్నాహాలు

● రాజమహేంద్రవరం స్టేషన్‌లో రూ.286 కోట్లతో పనులు

● లిఫ్టులు, ఎస్కలేటర్లు, వంతెనలు, అదనపు కౌంటర్లు

● 1,012 ప్రత్యేక రైళ్లు నడిపేలా ప్రణాళిక

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2027లో జరిగే గోదావరి పుష్కరాల కోసం రైల్వేశాఖ పెద్దఎత్తున పనులు చేపట్టేందుకు సిద్ధమైంది. భారీగా తరలివచ్చే ప్రయాణికుల కోసం రాజమహేంద్రవరం స్టేషన్‌లో పలు కొత్త నిర్మాణాలు, ఉన్నవాటి విస్తరణకు రూ.286.30 కోట్లతో పనులు చేపట్టేందుకు సన్నద్ధమైంది. లిఫ్టులు, ఎస్కలేటర్లతో మూడు అదనపు కాలినడక వంతెనలు నిర్మించనున్నారు. ప్లాట్‌ఫామ్‌లు మొత్తం కవర్ అయ్యేలా షెల్టర్లను విస్తరిస్తారు. ఈ స్టేషన్‌కు రెండో ప్రవేశ ద్వారమైన తూర్పువైపు కొత్త భవనం నిర్మిస్తారు. ఇవన్నీ 2027 ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రద్దీ తట్టుకునేలా 34 బుకింగ్ కౌంటర్లు, 11 విచారణ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. 11 ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్లు (ఏటీవీఎంలు) అందుబాటులో ఉంచుతారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు వీలుగా అదనంగా 10 షెడ్లు సిద్ధం చేస్తారు. ప్రయాణికులు స్టేషన్‌లోకి వచ్చేందుకు, బయటకు వెళ్లేందుకు అదనంగా 8 గేట్లు ఏర్పాటు చేస్తారు.

రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లు

● గతంలో 2003లో జరిగిన పుష్కరాలకు 726, తర్వాత 2015లో 823 ప్రత్యేక రైళ్లు నడపగా.. ఈసారి 1,012 ప్రత్యేక రైళ్లు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. రెగ్యులర్‌గా నడిచే రైళ్లకు 2,370 అదనపు కోచ్‌లను జతచేసి నడపనున్నారు.

● ప్రయాణికుల రద్దీ మేరకు తిరుపతి, విశాఖపట్నం, సికింద్రాబాద్, చెన్నై, బెంగళూరుల నుంచి.. రాజమహేంద్రవరం, కాకినాడ, నరసాపురం వరకు రైళ్లు నడుపుతారు.

● రెగ్యులర్ రైళ్లలో రాజమహేంద్రవరం, గోదావరి, కొవ్వూరు స్టేషన్ల వద్ద స్టాపులు లేనివాటికి పుష్కరాల రోజుల్లో.. అదనపు స్టాపేజీలకు ఆదేశించి, వాటిని ఆయా స్టేషన్లలో ఆగివెళ్లేలా చూడనున్నారు.

● విశాఖపట్నం, విజయవాడల నుంచి రాజమహేంద్రవరానికి మెము రైళ్లు నడుపుతారు. ఆకస్మికంగా ప్రయాణికులు తరలివస్తే వారి కోసం అదనపు కోచ్‌లను రాజమహేంద్రవరం సమీప స్టేషన్లలో అందుబాటులో ఉంచనున్నారు. రైళ్ల రాకపోకల పర్యవేక్షణకు స్పెషల్ కంట్రోల్ సెల్ ఏర్పాటుచేస్తారు.

● భక్తుల రద్దీపై రైల్వే శాఖకు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు వీలుగా కోఆర్డినేటర్‌ను నియమించాలని ఏపీ ప్రభుత్వాన్ని రైల్వేశాఖ కోరింది.

ఫ్యూచర్ సిటీలో బస్ టెర్మినల్‌పై అధ్యయనం

● ఆర్టీసీపై సమీక్షలో తెలంగాణ మంత్రి పొన్నం

ఈనాడు, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫ్యూచర్‌సిటీలో బస్‌టెర్మినల్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారుల్ని ఆదేశించారు. మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ 150 బస్సులు నడిపిస్తుండగా, ఒప్పందం మేరకు మరో 450 బస్సులను తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రి గురువారమిక్కడ సచివాలయంలో ఆర్టీసీపై సమీక్షించారు. రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి సహా ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు ఇతర ఉద్యోగులతో త్వరలో జూమ్ సమావేశం నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. డిసెంబరు చివరిలోపు 84 ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ, 114 సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుందని వెల్లడించారు. మహిళలు 237 కోట్ల ప్రయాణాలు చేయగా, ప్రభుత్వం ఇప్పటివరకు రూ.7,980 కోట్లు ఆర్టీసీకి చెల్లించిందన్నారు. ప్రస్తుతం నష్టాల్లో ఉన్న తాండూరు, వికారాబాద్ సహా పలు డిపోల్ని లాభాల బాట పట్టించడానికి ఆర్టీసీ ఎండీ ప్రత్యేక కమిటీ వేయాలని సూచించారు. హైదరాబాద్‌లో పెరుగుతున్న ప్రయాణికులకు, కాలనీలకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలన్నారు. జేబీఎస్ మాదిరి ఆరాంఘర్‌లో అధునాతన బస్సు టెర్మినల్ నిర్మాణానికి పోలీస్ శాఖ భూమి బదలాయింపు ప్రక్రియను పూర్తిచేయాలని చెప్పారు.